


సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

'ప్రజల జీవన ప్రమాణాలు ఇంకా మెరుగు పడాలి. అందుకు అధికారులు నిబద్ధత, పారదర్శకత, కార్యదీక్షతో పనిచేయాలి.'

పేజీలు: 14+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 7.00 | సంపుటి: 17 | సంచిక: 148

SUNDAY Special | ఆదివారం 18-8-2024

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | MUMBAI | BANGALORE | CHENNAI | DELHI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



బ్రదర్ అంటే బెస్ట్ ఫ్రెండ్

బహుమతులు ఆనందాన్నిస్తాయి... అయితే వస్తువుల రూపంలో కన్నా మాటల రూపంలో ప్రేమను వ్యక్తపరిస్తే ఆ ఫీలింగ్ హృదయంలో నిలిచిపోతుంది. అన్నయ్య గౌతమ్ నుంచి అలాంటి ప్రేమనే ఎక్కువగా కోరుకుంటున్నానని చిన్నారి సితార అంటోంది. సూపర్ స్టార్ మహేశ్‌బాబు, నమ్రతల కుమార్తెగా పన్నెండేళ్ల సితార పాపులర్. ఓ జ్యువెల్లరీ బ్రాండ్ అంబాసిడర్‌గా తనకంటూ పాపులార్టీ తెచ్చుకుంది. సోమవారం రాఖీ పండుగ సందర్భంగా 'సాక్షి'కి సితార చెప్పిన ప్రత్యేకమైన ముచ్చట్లు..

11లో



దసరా నుంచి స్కిల్స్ వర్సిటీ

యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీలో తరగతులను దసరా నుంచి ప్రారంభిస్తున్నట్లు సీఎస్ శాంతికుమారి వెల్లడించారు.

- వివరాలు 3లో



రాణాను భారత్‌కు అప్పగించొచ్చు

ముంబై దాడుల కేసులో ప్రధాన నిందితుడైన రాణాను విచారణ కోసం భారత్‌కు అప్పగించొచ్చని అమెరికా కోర్టు స్పష్టం చేసింది.

- వివరాలు 6లో



కలిసి పనిచేద్దాం..

ఆహార, ఇంధన భద్రతపై సంక్షోభాలను ఎదుర్కోవడానికి కలిసి పనిచేద్దామని గ్లోబల్ సౌత్ దేశాలకు ప్రధాని మోదీ పిలుపునిచ్చారు.

- వివరాలు 6లో



సిద్ధూ మెడకు 'ముడా' ఉచ్చు

'ముడా' భూముల స్కాంలో కర్ణాటక సీఎం సిద్ధరామయ్యపై విచారణకు ఆ రాష్ట్ర గవర్నర్ గెహ్లోత్ అనుమతించారు.

- వివరాలు 6లో

ఆ డిపాజిట్లు చట్టవిరుద్ధం

ఆర్‌బీఐ చట్టం సెక్షన్ 45 ఎస్‌ను మార్గదర్శి ఉల్లంఘించింది

అందుకు మార్గదర్శి, రామోజీరావులను ప్రాసిక్యూట్ చేయాలి

- నేరం చేశారనేందుకు ప్రాథమిక ఆధారాలున్నాయి
- మార్గదర్శి సేకరించిన రూ.2,600 కోట్లకుపైగా డిపాజిట్లన్నీ చట్ట విరుద్ధమే
- తెలంగాణ హైకోర్టులో కౌంటర్ దాఖలు చేసిన ఆర్‌బీఐ
- చట్ట ఉల్లంఘనకు రెండేళ్ల జైలు లేదా రెండింతల జరిమానా విధించొచ్చు
- మార్గదర్శి ఫైనాన్షియర్స్ వ్యక్తుల సమూహం పరిధిలోకే వస్తుంది
- వ్యక్తుల డిపాజిట్ల వసూలు నిరోధానికే చట్ట సవరణ
- అందువల్ల వారు దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను కొట్టేయండి
- రామోజీ మరణంతో కిరణ్‌ను హెచ్‌యూఎఫ్ కర్తగా చేరుస్తూ అనుబంధ పిటిషన్
- 20న తదుపరి విచారణ



సాక్షి, హైదరాబాద్: మార్గదర్శి ఫైనాన్షియర్స్‌ను అడ్డు పెట్టుకుని రామోజీరావు సాగించిన ఆర్థిక అక్రమాలను రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ఎట్టకేలకు బహిర్గతం చేసింది. రామోజీ నిస్సందేహంగా ఆర్థిక ఉగ్రవాదేనని రుజువైంది. చట్ట విరుద్ధంగా దశాబ్దాల తరబడి ఆర్థిక దోపిడీకి తెగించారని తేటతెల్లమైంది. 1997 నుంచి 2006 వరకు మార్గదర్శి ఫైనాన్షియర్స్ ప్రజల నుంచి చట్ట విరుద్ధంగా డిపాజిట్లు సేకరించినట్లు తెలంగాణ హైకోర్టుకు ఆర్బీఐ తాజాగా నివేదించింది. ఆర్బీఐ చట్టం సెక్షన్ 45 (ఎస్)ను మార్గదర్శి యథేచ్ఛగా ఉల్లంఘించిందని తెలిపింది. చట్ట ఉల్లంఘనలకు పాల్పడినందుకు రామోజీరావు, మార్గదర్శి ఫైనాన్షియర్స్‌ను ప్రాసిక్యూట్ చేయాలని స్పష్టం చేసింది. సుప్రీం కోర్టు, హైకోర్టు తీర్పుల ప్రకారం సీఆర్‌పీసీ సెక్షన్ 482 కింద క్వాష్ పిటిషన్ దాఖలు చేసిన ప్పుడు ఆరోపిత నేరాలకు ప్రాథమిక ఆధారాలను మాత్రమే పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుందని పేర్కొంది. ఆర్బీఐ చట్టాన్ని ఉల్లంఘించారనేందుకు ప్రాథమిక ఆధారాలున్న నేపథ్యంలో తమపై దాఖలైన కేసు కొట్టివేయాలంటూ మార్గదర్శి, రామోజీ దాఖలు చేసిన పిటిషన్లను కొట్టివేయాలని హైకోర్టును ఆర్బీఐ అభ్యర్థించింది.

సుప్రీం ఆదేశాల మేరకు తెలంగాణ హైకోర్టు పునర్విచారణ...

చట్ట నిబంధనలను ఉల్లంఘించినందుకు మార్గదర్శి, దాని కర్త రామోజీరావులపై డిపాజిటర్ల పరిరక్షణ చట్టం కింద చర్యలు తీసుకోవాలని కోరుతూ ఈ కేసులో అధీకృత అధికారి నాంపల్లి కోర్టులో దాఖలు చేసిన ఫిర్యాదును కొట్టి వేస్తూ ఉమ్మడి హైకోర్టు 2018 డిసెంబర్ 31న తీర్పు వెలువరించింది. అయితే ఈ తీర్పును సవాల్ చేస్తూ మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. అంతకు ముందు హైకోర్టు తీర్పులో కొంతభాగంపై అభ్యంతరం వ్యక్తంచేస్తూ మార్గదర్శి, రామోజీరావు సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలన్నింటిపై ఈ ఏడాది ఏప్రిల్ 9న విచారణ జరిపిన సుప్రీంకోర్టు ధర్మాసనం.. హైకోర్టు తీర్పును రద్దు చేసింది. హైకోర్టు తీర్పును తప్పుబట్టింది. డిపాజిట్ల సేకరణకు సంబంధించిన వాస్తవాలను నిగ్గు తేల్చాల్సిందేనని స్పష్టం చేసింది. కేసు లోతుల్లోకి వెళ్లి అందరి వాదనలు వినాలని తెలంగాణ హైకోర్టుకు స్పష్టం చేసింది. సీనియర్ న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం ఈ కేసును విచారించాలని స్పష్టం చేసింది. పునర్విచారణను ఆరు నెలల్లో ముగించాలని సూచించింది. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు తెలంగాణ హైకోర్టు ఇటీవల ఈ విచారణ మొదలు పెట్టింది. హైకోర్టులో నెంబర్ టూ స్థానంలో ఉన్న సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్ పాల్ నేతృత్వంలోని ధర్మాసనం దీనిపై విచారణ చేపట్టింది. ఇందులో తెలంగాణ ప్రభుత్వాన్ని, ఆర్బీఐని ప్రతివాదులుగా

మిగతా 5వ పేజీలో ▶



త్వరలో జీవో 59 దరఖాస్తుల పరిష్కారం

జీవో 59 కింద అక్రమంగా భూములను క్రమబద్ధీకరించుకున్నారు. నానక్‌రాంగూడలో రూ.3 వేల కోట్ల ఖరీదైన 32 ఎకరాలను రెగ్యులరైజ్ చేసుకున్నారు. మేం రాగానే వాటిని వెనక్కు తీసుకున్నాం. అర్హులకు న్యాయం జరిగేలా త్వరలో జీవో 59 దరఖాస్తులను పరిష్కరిస్తాం.

ప్రజాభిప్రాయ సేకరణ ముగిసిన 45 రోజుల్లోగా

కొత్త రెవెన్యూ చట్టం

- ముసాయిదా చట్టంపై ఈ నెలాఖరు వరకు ప్రజల నుంచి సలహాలు, సూచనలు
- సామాన్య రైతు నుంచి దొరవారు ఇచ్చే సూచనలదాకా అన్నీ పరిగణనలోకి..
- రాజ్యాంగం కల్పించిన హక్కులను ధరణి హరించింది
- ఇకపై 33 కాదు.. ఒక్కటే మాడ్యూల్
- సాదాబైనామాలకు మరోమారు దరఖాస్తుల స్వీకరణ
- ప్రతి గ్రామంలో రెవెన్యూ కాపలాదారుడిని పెడతాం

'సాక్షి' ప్రత్యేక ఇంటర్వ్యూలో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: రికార్డ్ ఆఫ్ రైట్స్ (ఆర్‌వోఆర్)–2020 స్థానంలో త్వరలో కొత్త చట్టాన్ని అమల్లోకి తెస్తామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. వీలైతే అసెంబ్లీలో పెట్టి లేదంటే ఆర్డినెన్స్ రూపంలో తీసుకురానున్నట్లు స్పష్టం చేశారు. ఇప్పటికే రూపొందించిన ముసాయిదా చట్టంపై ప్రజల నుంచి సలహాలు, సూచనలు వస్తున్నాయన్నారు. సూచనలు తీసుకునే గడువును ఈనెల 23నుంచి మరో వారం పొడిగిస్తామని చెప్పారు. గడువు ముగిసిన 45 రోజుల్లోగా కొత్త చట్టం అందుబాటులోకి వస్తుందని తెలిపారు. కొత్త ఆర్‌వోఆర్ చట్టంపై రాష్ట్ర వ్యాప్తంగా విస్తృత చర్చ జరుగుతున్న నేపథ్యంలో పలు రెవెన్యూ సంబంధిత అంశాలపై ఆయన శనివారం 'సాక్షి'కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. కొత్త చట్టం, ధరణి పోర్టల్‌లో తెస్తున్న మార్పులు, సాదాబైనామాలు, అసైన్డ్ భూములకు హక్కుల కల్పన, భూముల విలువల సవరణ, జీవో 59 దరఖాస్తులు వంటి అంశాలపై పొంగులేటి మాట్లాడారు. ముఖ్యాంశాలు ఆయన మాటల్లోనే..

ధరణితో ప్రజలు కుదేలు: గత ప్రభుత్వం భూసమస్యలను శాశ్వతంగా పరిష్కరిస్తామని చెప్పి రాష్ట్రంలోని 1.50 కోట్ల ఎకరాల భూమి డేటాను విదేశీ కంపెనీకి అప్పగించినందుకే మేం ధరణి

మిగతా 3వ పేజీలో ▶

కౌన్సెలింగ్ తర్వాతే క్లాసులు

- కొత్తగా చేరే విద్యార్థులను మానసికంగా సిద్ధం చేయాలి
- ఐఐటీలు, ఎన్‌ఐటీలకు కేంద్ర విద్యాశాఖ సూచన
- ఏటేటా పెరుగుతున్న విద్యార్థుల ఆత్మహత్యలు
- విద్యార్థుల్లో న్యూన్యతభావాన్ని పసిగట్టాలి... వారిలో ధైర్యం నింపాలి

3లో

రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేశాం



22,37,848 ఖాతాలకు రూ.17,933.19 కోట్ల నిధులు విడుదల చేశామన్న మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు

- ఏదైనా కారణంతో మాఫీకాని రైతుల వివరాలు సేకరిస్తాం
- అలాంటివారు వ్యవసాయ అధికారులకు తగిన రికార్డులు సమర్పించాలి
- ఫిర్యాదులను నెల రోజుల్లో పరిశీలించి అర్హులకు రుణమాఫీ వర్తింపజేస్తాం
- రాజకీయ నేతల తప్పుడు ప్రచారం నమ్మొద్దని వ్యాఖ్య

సాక్షి, హైదరాబాద్/ నల్లగొండ టౌన్: తాము ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్రంలో రూ.2 లక్షలలోపు రుణాలున్న రైతులందరికీ రుణమాఫీ చేశామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు తెలిపారు. రాష్ట్రంలోని 3,292 బ్యాంకుల బ్రాంచీలు, 909 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల నుంచి సేకరించిన పంట రుణాల వివరాలతో.. డిసెంబర్ 9వ తేదీని కటాఫ్‌గా తీసుకుని రుణమాఫీ అమలు చేశామని వివరించారు. ఈ మేరకు శనివారం మంత్రి తుమ్మల ఒక ప్రకటన విడుదల చేశారు. రుణమాఫీ విధివిధానాలను ప్రకటించిన మూడు రోజుల్లోనే తొలివిడత కింద రూ.లక్ష లోపు రుణాలున్న 11.50లక్షల మంది రైతులకు రూ.6,098.93 కోట్లు, రెండో విడతలో రూ.1.50 లక్షల లోపు రుణాలున్న 6,40,823 ఖాతాదారులకు రూ.6190.01 కోట్లు, పంద్రాగస్టు నాడు రూ.2లక్షలలోపు రుణాలున్న 4,46,832 ఖాతాల్లో రూ.5,644.24 కోట్లు.. కలిపి మొత్తంగా 22.37 లక్షల ఖాతాల్లో రూ.17,933.19 కోట్లను

మిగతా 3వ పేజీలో ▶

రుణమాఫీపై అర్థం లేని విమర్శలు

కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న రుణమాఫీ విషయంలో ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలు అర్థంలేనివని మంత్రి తుమ్మల మండిపడ్డారు. శనివారం నల్లగొండలోని ఎన్‌జీ కళాశాల మైదానంలో రైతుబడి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'అగ్రిషో'ను శనివారం ఆయన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు.



మాకేదీ రుణమాఫీ?

రుణమాఫీ కాలేదంటూ నిరసనలు -2లో

ఆదిలాబాద్ జిల్లా తలమడుగులో దప్పుచప్పుళ్ల మధ్య రైతుల నిరసన



అబ్బే అదేం లేదయ్యా! మా పార్టీలోకే కాంగ్రెస్, బీజేపీ విలీనమవుతున్నాయి!!

శనివారం కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న వైద్యులు, వైద్య విద్యార్థులు



వైద్యుల భద్రతపై కమిటీ

- రాష్ట్ర ప్రభుత్వాలు, వైద్య సంఘాలు సలహాలు సూచనలు ఇవ్వొచ్చు: కేంద్ర ఆరోగ్య శాఖ
- డిమాండ్ల సాధనకు దేశవ్యాప్తంగా ఆందోళన కొనసాగించిన వైద్య సిబ్బంది - 6లో

రాష్ట్రమంతా ఓపీ బంద్..

ఐఎంఏ ఆధ్వర్యంలో ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద వైద్యుల ఆందోళన

రాష్ట్రవ్యాప్తంగా వివిధ రూపాల్లో నిరసన

10లో

ఫ్యూచర్ సిటీలో స్పోర్ట్స్ యూనివర్సిటీ



- భావి ఒలింపిక్స్ క్రీడాకారులకు శిక్షణ.. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం
- ఎయిర్‌పోర్టు మీదుగా ఫ్యూచర్ సిటీకి మెట్రో: సీఎం

సాక్షి, హైదరాబాద్: ప్రతిపాదిత ఫ్యూచర్ సిటీ (నాలుగో నగరం)లో 'యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ' పేరిట సమీకృత క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రంలో క్రీడల వాతావరణం పెంపొందించేందుకు ఈ యూనివర్సిటీ దోహదపడుతుంది. ఇందులో భాగంగా సుమారు డజనుకు పైగా క్రీడలకు సంబంధించిన ఆధునిక మౌలిక వసతులతో పాటు స్పోర్ట్స్ అకాడమీలను నెలకొల్పుతారు. క్రీడా విజ్ఞాన శాస్త్రం, క్రీడల వైద్యానికి సంబంధించిన కేంద్రాలు కూడా ఇందులో ఉంటాయి. ఈ యూనివర్సిటీని వెంటనే ఏర్పాటు చేసేందుకు వీలుగా ప్రస్తుతం హకీంపేటలో ఉన్న స్పోర్ట్స్ స్కూల్, గచ్చిబౌలిలోని క్రీడా ప్రాంగణాన్ని రాష్ట్ర ప్రభుత్వం పరిశీలిస్తోంది. ఇటీవల

మిగతా 3వ పేజీలో ▶

నువ్వూ వర్కింగ్ ప్రెసిడెంట్‌వే.. నేనూ వర్కింగ్ ప్రెసిడెంట్‌నే


సిరిసిల్ల, సిద్దిపేటలో ఎక్కడికైనా వెళ్దాం.. కేటీఆర్‌కు జగ్గారెడ్డి సవాల్



సాక్షి, హైదరాబాద్: 'నువ్వూ వర్కింగ్ ప్రెసిడెంట్‌వి.. నేనూ వర్కింగ్ ప్రెసిడెంట్‌నే. రుణమాఫీపై మీ పార్టీ పక్షాన చేసిన సవాల్‌ను మా పార్టీ తరఫున నేను స్వీకరిస్తున్నా. సిరిసిల్ల, సిద్దిపేటలో ఎక్కడకు వెళ్దామో రా. రైతు రుణమాఫీ మీద చర్చిద్దాం. ఆ తర్వాత కొడంగల్ పోదాం' అని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే టి.జగ్గారెడ్డి సవాలు విసిరారు. శనివారం గాంధీభవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాకుండా సీఎం రేవంత్‌రెడ్డికి ఆ పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ సవాల్ చేస్తే బాగుండేదని అభిప్రాయపడ్డారు. ఒకవేళ తాను రావడం కేటీఆర్‌కు నచ్చకపోతే మంత్రులు శ్రీధర్‌బాబు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలో ఒకరిని నచ్చజెప్పి తాను తీసుకువస్తానని, కేటీఆర్ కూడా రావాలని చెప్పారు. సిద్దిపేటలో కాంగ్రెస్ కార్యకర్తలను చిత్రహింసలు చేసిన సంగతి హరీశ్ మర్చిపోయాడా? అని ప్రశ్నించారు. సాంకేతిక సమస్యలతో ఎవరికైనా రుణమాఫీ కాకపోతే ప్రత్యేకంగా దరఖాస్తులు చేసుకునే అవకాశం ప్రభుత్వం కల్పించిందని జగ్గారెడ్డి గుర్తుచేశారు.

ప్రజలను రెచ్చగొడుతున్న కేటీఆర్

హరీశ్‌రావు మంత్రిగా పని చేసి చిల్లరగా మాట్లాడుతుండు: కోదండరెడ్డి



సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు రాజకీయ పరిజ్ఞానం లేకుండా మాట్లాడుతూ ప్రజలను రెచ్చగొడుతున్నారని కిసాన్ కాంగ్రెస్ జాతీయ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి విమర్శించారు. గాంధీభవన్‌లో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... హరీశ్‌రావు మంత్రిగా పని చేసి కూడా చిల్లరగా మాట్లాడుతున్నారన్నారు. హరీశ్‌రావు, కేటీఆర్ రైతులను ఏం చేయాలనుకుంటున్నారో అర్థం కావడం లేదని, రైతులకు రుణమాఫీ చేయడం వీరికి ఇష్టం లేనట్టుందని మండిపడ్డారు. అధికారంలోకి వచ్చాక అప్పుల బాధ్యత తీసుకుంటామని రైతులకు కాంగ్రెస్ ఇచ్చిన మాట ప్రకారం రూ.2 లక్షల వరకు రుణమాఫీని మూడు విడతల్లో చేశామని, ఇంకా ఆ ప్రక్రియ పూర్తి కాలేదని వెల్లడించారు. రుణమాఫీ జరగని రైతులు జిల్లాల్లోని నోడల్ అధికారికి దరఖాస్తుపెట్టుకోవాలని సీఎం రేవంత్ కేబినెట్ మీటింగ్‌లో చెప్పినట్లు కోదండరెడ్డి తెలిపారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం 2018లో రూ. 20,480 కోట్లు రుణమాఫీ చేస్తామని చెప్పి, రూ. 13,300 కోట్లు మాత్రమే రుణమాఫీ చేశారని విమర్శించారు. నాడు రుణమాఫీని ఆలస్యం చేయడంతో రాష్ట్రంలో ఎంతోమంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని గుర్తు చేశారు.

కాంగ్రెస్ ఆదరణను తట్టుకోలేకే బీఆర్‌ఎస్, బీజేపీ విమర్శలు

మీడియా సమావేశంలో ఎంపీ చామల



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ప్రజా సంక్షేమం కోసం కాంగ్రెస్ అమలు చేస్తున్న పథకాలను చూసి జీర్ణించుకోలేకనే బీఆర్‌ఎస్, బీజేపీ విమర్శలకు దిగుతున్నాయని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. గాంధీభవన్‌లో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ బండి సంజయ్ కేంద్రమంత్రిగా ఉండి మతిస్థిమితం లేకుండా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. బీఆర్‌ఎస్ కాంగ్రెస్‌లో విలీనం అవుతుందని బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలకు కేటీఆర్ చేతనైతే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పదేళ్ల పాలన సాగించి ప్రజల ఉసురు పోసుకున్న కేటీఆర్, బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్ ప్రజాపాలన చూసి ఓర్వలేక పోతున్నారన్నారు. ఈ ఆగస్టు నుంచి వచ్చే సంవత్సరం ఆగస్టు వరకు కాంగ్రెస్ పాలనను ప్రతిపక్ష పార్టీగా పరిశీలించి అప్పుడు మాట్లాడాలని హితవు పలికారు.

ట్యాంక్ బండ్‌పై పాపన్నగౌడ్ విగ్రహాన్ని ప్రతిష్టించాలి

మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్

సాక్షి, హైదరాబాద్: ట్యాంక్ బండ్‌పై సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహ ప్రతిష్ట కోసం స్థలం కేటాయించడంతో పాటు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.3 కోట్లు విడుదల చేసిందని, అక్కడ వెంటనే విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. తెలంగాణ భవన్‌లో శనివారం బీఆర్‌ఎస్ నేతలు పల్లె రవికుమార్ గౌడ్, రాంచందర్ నాయక్, గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వీరమళ్ల రాంనర్సింహగౌడ్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో గౌడలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. జనగామ జి ల్లాకు సర్వాయి పాపన్నగౌడ్ పేరు పెట్టాలని శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశా రు. వైన్ షాపుల్లో గౌడ కులస్తుల రిజర్వేషన్లు 15 నుంచి 25 శాతానికి పెంచాలని, వృత్తిదారులందరికీ కాటమయ్య మోకులు అందజేయాలన్నారు.



మంచిర్యాల జిల్లా కవ్వాల్‌లో జక్కుల లచ్చన్న నుంచి విష గుళికల ప్యాకెట్‌ను లాక్కుంటున్న రైతు



కరీంనగర్ జిల్లా ఆసిఫ్‌నగర్ శాఖ ఇండియన్ బ్యాంక్ వద్ద ఆందోళన చేస్తున్న రైతులు



కారేపల్లి వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఏఈఓను నిలదీస్తున్న రైతులు

మాకేదీ రుణమాఫీ?

రుణమాఫీ కాలేదంటూ రాష్ట్రవ్యాప్తంగా అన్నదాతల నిరసనలు

బ్యాంకుల వద్ద బైఠాయించిన రైతులు.. కొన్నిచోట్ల బ్యాంకులకు తాళం

మంచిర్యాల జిల్లాలో మాఫీ వర్తించలేదని ఆత్మహత్యాయత్నం

సాక్షి, నెట్‌వర్క్: రాష్ట్రంలోని రైతులందరికీ రుణమాఫీ కాలేదంటూ అన్నదాతలు రోడ్డెక్కారు. సర్కారు తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ శనివారం రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేశారు. ప్రభుత్వం మూడో విడత రుణమాఫీ ప్రకటించిన తర్వాత కూడా తమకు రుణాలు మాఫీ కాలేదంటూ పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. సర్కారుకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ చాలాచోట్ల రహదారులపై రాకపోకలను అడ్డుకున్నారు.

- ఆదిలాబాద్ జిల్లాలోని తలమడుగు, జైనథ్, బోథ్, భీంపూర్ మండలాల్లో పెద్దఎత్తున ఆందోళనలు చేశారు. తలమడుగులో 500మందికి పైగా రైతులు సీఎం దిష్టిబొమ్మతో డప్పుచప్పుళ్ల మధ్య శవయాత్ర నిర్వహించారు. కర్మకాండ కుండలతోనే మహారాష్ట్ర బ్యాంకులోనికి వెళ్లారు. సీఎం డౌన్‌డౌన్ అంటూ నినదించారు. జైనథ్ మండలం గిమ్మలో రైతులు బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రకు తాళం వేసి నిరసన వ్యక్తంచేశారు. తర్వాత బ్యాంకు అధికారుల వినతిమేరకు తాళాలు తొలగించారు. మంచిర్యాల జిల్లా జన్నారం మండలం కవ్వాల్‌లో రైతు జక్కుల లచ్చన్న పంచాయతీ కార్యాలయం వద్ద విషగుళికలు తిని ఆత్మహత్యకు యత్నించగా, అక్కడ ఉన్న మరో రైతు అడ్డుకున్నాడు. ఈ వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది.
- నిజామాబాద్ జిల్లా 63 నంబరు జాతీయ రహదారి వేల్పూర్ క్రాస్‌రోడ్డు వద్ద రైతులు ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్మూర్, మోర్తాడ్ వైపు భారీగా వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు భారీ సంఖ్యలో బందోబస్తు నిర్వహించారు.
- తమకు రుణమాఫీ కాలేదంటూ కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలంలోని ఆసిఫ్‌నగర్ శాఖ ఇండియన్ బ్యాంక్‌ను ముట్టడించి రైతులు షట్టర్‌ను మూసివేశారు. తర్వాత అధికారులు, పోలీసులు రైతులకు నచ్చజెప్పి ఈ నెల 20న రైతు వేదికలో చర్చిస్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు. ఆ బ్యాంక్ పరిధిలోని ఆరు గ్రామాలకు సంబంధించి సుమారు 1,250 మంది రైతులకు ఖాతాలుండగా కేవలం 430 మందికే రుణమాఫీ జరిగిందన్నారు.
- కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం మొలంగూర్ క్రాస్‌రోడ్డు వద్ద కరీంనగర్–వరంగల్ జాతీయ రహదారిపై ధర్నా చేశారు. రుణమాఫీ జాబితాలో తమ పేర్లులేవంటూ సుమారు 500 మంది రైతులు బ్యాంక్ ఎదుట ఆందోళన చేపట్టారు.
- జగిత్యాల జిల్లా మల్లాపూర్‌లోని రైతువేదికలో వ్యవసాయశాఖ, లీడ్ బ్యాంక్ అధికారులతో నిర్వహించిన రుణమాఫీ అవగాహన సమావేశం రసాభాసగా ముగిసింది. మూడో విడతలో కూడా తన పేరు లేకపోవడంతో ఏలేటి రాజారెడ్డి అనే రైతు పురుగుల మందు డబ్బాతో వచ్చి అధికారులతో వాగ్వాదానికి దిగాడు.
- బౌరంపేట్‌లోని బ్యాంక్‌లో 632 మంది రైతులు రుణం పొందితే కేవలం 14 మందికే రుణమాఫీ అయ్యిందని, మిగతా రైతులకు ఎందుకు మాఫీ చేయలేదంటూ రైతులు ఆందోళన వ్యక్తంచేశారు.
- ఖమ్మం రూరల్, కొనిజర్ల, వైరా, రఘునాథపాలెం తదితర మండలాల రైతులు కలెక్టర్ కార్యాలయం ఎదుట రాస్తారోకో చేపట్టారు. అనంతరం వ్యవసాయ శాఖ అధికారులకు వినతిపత్రం ఇచ్చారు.

రుణమాఫీ రూ.83



తిమ్మాపూర్: కేవలం రూ.83 మాత్రమే రుణమాఫీ కావడంతో ఓ రైతు కంగుతిన్నాడు. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం రామకృష్ణ కాలనీ గ్రామానికి చెందిన రైతు వేల్పుల మల్లయ్యకు రూ.83 మాఫీ అయినట్టు మొబైల్‌కు సందేశం వచ్చింది. గత డిసెంబర్‌లో ఎల్‌ఎండీలోని ఎస్‌బీఐ బ్రాంచ్‌లో రూ.1.50 లక్షల పంటరుణం తీసుకున్న మల్లయ్య మూడో విడతలో మాఫీ అవుతుందని సంతోషించాడు. కానీ.. రూ.83 రుణఖాతాలో జమ అయినట్లు ఇటీవల మెసేజ్ వచ్చింది. షాక్‌కు గురైన ఆయన శనివారం వ్యవసాయాధికారులను సంప్రదించగా, వారు బ్యాంకు స్టేట్‌మెంట్ తీసుకురావాలని సూచించారు. అయితే అప్పటికే బ్యాంక్ టైం అయిపోవడంతో చేసేదేమీలేక వెనుదిరిగాడు. మాఫీకి ప్రభుత్వం విధించిన నిబంధనలకు తాను అర్హుడినని, తనకు న్యాయం చేయాలని వేడుకున్నాడు.

నీ గాడ్ ఫాదర్‌కే భయపడలేదు

తాటాకు చప్పుళ్లకు బెదిరేది లేదు

- రుణమాఫీపై ఎక్కడికి రమ్మంటావో చెప్పు
- సీఎం రేవంత్‌రెడ్డికి హరీశ్‌రావు సవాల్
- రైతులందరికీ రుణమాఫీ ఇచ్చేంత వరకు వదిలిపెట్టబోమని హెచ్చరిక



'సాక్షి' ప్రచురించిన కథనాన్ని చూపిస్తూ మాట్లాడుతున్న హరీశ్‌రావు

సాక్షి, హైదరాబాద్: 'రైతు రుణమాఫీని పాక్షికంగా అమలు చేసి లక్షలాది మంది రైతులకు ఎగనామం పెట్టి.. సీఎం నోరు పెద్దగా చేసుకుని మాట్లాడితే లాభం ఉండదు. బూతులు తిడితే రుణమాఫీ జరిగి రైతుల ఖాతాల్లో డబ్బులు పడతాయా. దమ్ముంటే ఎంతమంది రైతులకు రుణమాఫీ జరిగిందో శ్వేతపత్రం విడుదల చేయి. తప్పు జరిగిందని రైతులకు క్షమాపణ చెప్పి ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయి' అని సీఎం రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే టి.హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. పార్టీ ఎమ్మెల్యేలతో కలిసి ఆయన శనివారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. 'రుణమాఫీలో కోతలపై ప్రశ్నిస్తే మేము చావాలని రోత మాటలు మాట్లాడుతున్నాడు. నీ గాడ్ ఫాదర్‌కే భయపడలేదు. తాటాకు చప్పుళ్లకు బెదిరేది లేదు. రైతులందరికీ రుణమాఫీ వర్తించేంత వరకు కాంగ్రెస్ ప్రభుత్వం, రేవంత్‌ను వదిలి పెట్టం. బీఆర్‌ఎస్ పక్షాన మరో రైతాంగ ఉద్యమానికి త్వరలో కార్యాచరణ ప్రకటించి పోరాటం చేస్తాం' అని హరీశ్‌రావు ప్రకటించారు. సిద్దిపేటలో తన క్యాంపు ఆఫీసుపై జరిగిన దాడిని ప్రస్తావిస్తూ ఇలాంటి దాడులకు భయపడేది లేదని, ఇది ఇలాగే కొనసాగితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు.

ఎక్కడికి రమ్మంటావో దమ్ముంటే చెప్పు

'రైతులందరికీ రుణమాఫీ జరిగిందని మభ్యపెడుతూ మోసగిస్తున్న రేవంత్‌రెడ్డి సిద్దిపేట, కొడంగల్ సహా ఏ నియోజకవర్గానికి ఏ తేదీన, ఏ టైమ్‌కు రావాలో దమ్ముంటే చెప్పాలి. రైతులందరికీ రుణమాఫీ జరిగిందని నిరూపించాలి. ఆగస్టు 15లోపు రూ.2లక్షల రుణమాఫీ, ఆరు గ్యారంటీల సంపూర్ణ అమలు చేయాలనే నా డిమాండ్‌ను పక్కన పెట్టి నేను రాజీనామా చేయాలని రంకెలు వేస్తున్నవు. రుణమాఫీ జరగని రైతులు కన్నీళ్లు పెట్టుకుంటూ వ్యవసాయ కార్యాలయాలు, బ్యాంకుల చుట్టూ చెప్పులు అరిగేలా తిరుగుతూ అధికారుల కాళ్ల మీద పడుతున్నరు. అయినా ప్రభుత్వం కళ్లు, చెవులు, నోరు లేనట్లు వ్యవహరిస్తోంది' అని హరీశ్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. 'పరిపాలన ఫ్లాప్.. తొండి చేయడంలో తోప్.. బూతులు మాట్లాడ్డంలో టాప్ అన్నట్లుగా రేవంత్ పనితీరు ఉంది. 25 లక్షల మంది రైతులకు రుణమాఫీ ఎగవేసినట్లు ప్రభుత్వ రికార్డులే చెప్తున్నాయి. పార్లమెంట్ ఎన్నికల సమయంలో రుణమాఫీ అర్హుల సంఖ్య 47 లక్షలుగా చూపి, మూడు విడతల్లో 22 లక్షల మందికే వర్తింప చేశారు' అని చెప్పారు.

ప్రజలకు కీడు చేయొద్దని వేడుకుంటా..

'ఆగస్టు 15లోపు రైతు రుణమాఫీ చేస్తానంటూ గుడులు, చర్చి, మసీదు సాక్షిగా హిందూ, క్రిస్టియన్లు, ముస్లింలు నమ్ముకున్న దేవుళ్లపై రేవంత్ ఒట్లు వేసి మాట తప్పి రైతు, దైవద్రోహానికి పాల్పడ్డాడు. దేవుళ్ల మీద ఒట్టు పెట్టి మాట తప్పిన పాపం ఊరికే పోదు. అది రాష్ట్రానికి చుట్టుకుంటుందని ప్రజలు భయపడుతున్నారు. ప్రాయశ్చిత్తం చేసుకునే ఉద్దేశం సీఎంకు లేదు కాబట్టి ఆయన చేసిన పాపం ప్రజలకు శాపం కావద్దని మా పార్టీ నేతలతో కలిసి నేను తీర్థయాత్రకు బయలుదేరుతా. ఈ పాపాత్ముడు చేసిన తప్పులకు ప్రజలకు కీడు చేయొద్దని ముక్కోటి దేవతలతోపాటు అల్లా, జీసస్‌ను వేడుకుంటా. త్వరలో పర్యటన షెడ్యూలు ప్రకటిస్తా' అని హరీశ్ చెప్పారు. మీడియా సమావేశంలో ఎమ్మెల్యేలు కొత్త ప్రభాకర్‌రెడ్డి, కాలేరు వెంకటేశ్, మాణిక్‌రావు, కేపీ వివేకానంద, చింతా ప్రభాకర్, పాడి కౌశిక్‌రెడ్డి, బండారు లక్ష్మారెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

100% రుణమాఫీ నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటా

- లేదంటే సీఎం రేవంత్ రాజీనామా చేస్తారా?
- రుణమాఫీపై రైతుల సమక్షంలో చర్చకు సిద్ధమా?
- బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి సవాల్



సాక్షి, హైదరాబాద్: రైతులకు వందశాతం రుణమాఫీ అయినట్లు నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటానని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, సీఎం రేవంత్‌రెడ్డికి సవాల్ విసిరారు. రాష్ట్రంలో ఏ ప్రాంతానికైనా వెళ్లి రైతుల సమక్షంలోనే చర్చ పెట్టి, పూర్తిగా రుణమాఫీ జరిగిందంటే తాను దేనికైనా సిద్ధమేనన్నారు. అందరికీ రుణమాఫీ జరగలేదని రైతులు చెబితే, రేవంత్‌రెడ్డి రాజ కీయాల నుంచి తప్పుకోవడమో, రాజీనామా చేయడమో.. ఏది చేస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. శనివారం ఆయన అసెంబ్లీ మీడియా హాల్‌లో మాట్లాడుతూ రుణమాఫీ పేరుతో రేవంత్ ప్రభుత్వం రైతులను మరోసారి మోసం చేసిందన్నారు. మొత్తం 60 లక్షల మంది అర్హులుండగా.. 22 లక్షల మంది రైతులకే రుణమాఫీ జరిగిందన్నారు. రుణమాఫీకి రూ.49 వేల కోట్లు ఇవ్వాల్సిఉండగా.. కేవలం రూ.17 వేల కోట్లే ఇచ్చారని తెలిపారు. సీఎం, మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు దమ్ముంటే గ్రామాలకు వెళ్లి రైతులకు రుణాలు మాఫీ అయ్యాయో లేదో ఆరా తీయాలన్నారు. దీనిపై రైతుల సమక్షంలో చర్చకు సిద్ధమని పేర్కొన్నారు. రుణమాఫీ జరిగిన రైతుల వివరాలను వారంరోజు ల్లోగా ప్రభుత్వం వెల్లడించాలన్నారు. పెండింగులో ఉన్న రైతుల రుణాలను ఈ నెలాఖరులోగా మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రైతు భరోసా పథకం మార్గదర్శకాలపై ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని సూచించారు. ఆ నివేదికపై చర్చించి, రైతు భరోసా పథకానికి మార్గదర్శ కాలు ఖరారు చేసేందుకు అసెంబ్లీని సమావేశ పరచాలన్నారు. రైతు భరోసాకు ఇవ్వాల్సిన నిధులనే రుణమాఫీకి మళ్లించారని ఆరోపించారు. రైతు భరోసా ఖరీఫ్ సీజన్ డబ్బులను ఈ నెలాఖరులోగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. రుణమాఫీ కాని రైతులు రోడ్లెక్కి ఆందోళనలు చేస్తుంటే ఈ అంశాన్ని పక్కదారి పట్టించేందుకు రేవంత్ కొత్త విషయాలను తెరపైకి తెస్తున్నారని మండిపడ్డారు. ఇందులో భాగంగానే బీజేపీలో బీఆర్‌ఎస్ విలీనం అని రేవంత్ ప్రచారం చేస్తున్నారన్నారు.

వారంలో ఢిల్లీకి సీఎం రేవంత్

సోనియా, రాహుల్‌తో భేటీ.. టీపీసీసీ, ఇతర పదవుల భర్తీపై చర్చ

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్‌కు కొత్త అధ్యక్షుడి నియామకం సహా మంత్రివర్గ విస్తరణ, నామినేటెడ్ పదవులపై కొనసాగుతున్న ఉత్కంఠకు మరో వారం రోజుల్లో తెరపడే అవకాశముంది. వచ్చే శుక్ర లేదా శనివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మరోసారి ఢిల్లీకి రానున్నారు. తాజా ఢిల్లీ పర్యటనలో ఆయన ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌లతో భేటీ అయ్యారు. కొత్త పీసీసీ అధ్యక్షుడు, మంత్రివర్గ విస్తరణ.. తదితర అంశాలపై ఆయన చర్చించారు. అధిష్టానం పెద్దలతో జరిగిన మంతనాల్లో పదవుల భర్తీపై నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. సమయాభావం వల్ల సోనియా, రాహుల్ గాంధీ లతో భేటీ కాకుండానే రేవంత్ హైదరాబాద్‌కు తిరిగి వెళ్లారు. ఈ నేపథ్యంలో మరో వారంరోజుల్లో ఆయన మరోసారి ఢిల్లీకి వచ్చి సోనియా, రాహుల్ గాంధీలతో భేటీ అయి కొత్త పీసీసీ అధ్యక్షుడితోపాటు మంత్రివర్గ విస్తరణ, నామినేటెడ్ పదవుల విషయంలో వారి ఆమోదం కోరనున్నట్లు సమాచారం. ఇప్పటికే బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల నుంచి పీసీసీ అధ్యక్ష పదవిని పలువురు నేతలు ఆశిస్తున్న విషయం తెలిసిందే. ఆ పదవిని ఎవరికి ఇచ్చినా తనకు అభ్యంతరం లేదని ఖర్గే, కేసీ వేణుగోపాల్‌లకు సీఎం రేవంత్ స్పష్టం చేసినట్లు తెలిసింది.

సిద్దిపేటలో ఫ్లెక్సీ వార్

- కేసీఆర్, హరీశ్‌రావుల ఫ్లెక్సీని చించేసిన కాంగ్రెస్ శ్రేణులు
- హరీశ్ క్యాంప్ ఆఫీసువైపు చొచ్చుకొచ్చే యత్నం
- హరీశ్ రాజీనామాను డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పెట్టిన ఫ్లెక్సీని దగ్ధం చేసిన బీఆర్‌ఎస్



సిద్దిపేట బీజేఆర్ చౌరస్తాలో హరీశ్ రావు రాజీనామా చేయాలంటూ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని చించుతున్న బీఆర్‌ఎస్ యువజన నాయకులు

సాక్షి, సిద్దిపేట: కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నేతల మధ్య సిద్దిపేటలో మొదలైన ఫ్లెక్సీ వివాదం చినికిచినికి గాలివానలా మారింది. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నేతలు చేపట్టిన నిరసన కార్యక్రమాలు, సవాళ్లతో సిద్దిపేట శనివారం రణరంగంగా మారింది. పరిస్థితులను అదుపులోకి తెచ్చేందుకు పోలీసులు స్వల్ప లాఠీచార్జి చేయాల్సి వచ్చింది. ఇరుపార్టీలకు చెందిన నేతలను అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

బీఆర్‌ఎస్ నిరసన ర్యాలీ: రైతులకు రూ.2 లక్షల రుణమాఫీని ఆగస్టు 15 కల్లా పూర్తి చేసినందున ఎమ్మెల్యే పదవికి హరీశ్‌రావు రాజీనామా చేయాలంటూ సిద్దిపేటలో కాంగ్రెస్ కార్యకర్తలు పలుచోట్ల ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. వీటిని తొలగించాలంటూ బీఆర్‌ఎస్ నాయకులు శుక్రవారం రాత్రి నిరసన చేపట్టారు. దీంతో పోలీసులు వారిని అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించి, తెల్లవారుజామున వదిలి పెట్టారు. మరోవైపు శుక్రవారం అర్ధరాత్రి కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు అత్తు ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు ఎమ్మెల్యే హరీశ్ క్యాంప్ కార్యాలయంలోకి చొరబడ్డాయి. అక్కడ కేసీఆర్, హరీశ్‌రావు చిత్రాలతో ఉన్న ఫ్లెక్సీని చించేశాయి. దీంతో శనివారం సిద్దిపేటలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ విషయం తెలిసిన వెంటనే బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు అక్కడికి చేరుకున్నారు. అక్కడి నుంచి పాత బస్టాండ్ చౌరస్తా వరకు నిరసన ర్యాలీని నిర్వహించారు. హరీశ్ రాజీనామాను డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని దగ్ధం చేశారు. తర్వాత బీజేఆర్ చౌరస్తాలో ఉన్న ఫ్లెక్సీలను బీఆర్‌ఎస్ నాయకులు చించివేసేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో బీఆర్‌ఎస్ కార్యకర్తలు, పోలీసుల మధ్య తోపులాట జరిగింది. పోలీసులు లాఠీలను ఝుళిపించారు. బీఆర్‌ఎస్ నాయకులను అదుపులోకి తీసుకుని వారిపై కేసు నమోదు చేశారు.

ర్యాలీగా కాంగ్రెస్: ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సీఎం రేవంత్ ఫ్లెక్సీని ఏర్పాటు చేసేందుకు నియోజకవర్గ ఇన్‌చార్జి హరికృష్ణ కార్యాలయం నుంచి ర్యాలీగా బయల్దేరిన కాంగ్రెస్ శ్రేణులను బీజేఆర్ చౌరస్తాలో పోలీసులు అడ్డుకున్నారు. పోలీసుల కన్నుగప్పి క్యాంప్ ఆఫీస్ వైపు చొచ్చుకొచ్చేందుకు కాంగ్రెస్ కార్యకర్తలు యత్నించారు. క్యాంప్ ఆఫీస్ గేట్ వద్దకు చేరుకున్న కాంగ్రెస్ నాయకుడు మహేందర్‌పై బీఆర్‌ఎస్ కార్యకర్తలు దాడి చేయడంతో పరిస్థితి చేయిదాటిపోతుందనే ఆందోళన నెలకొంది. పోలీసులు కాంగ్రెస్ కార్యకర్తలను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఇరుపార్టీలు పరస్పర ఫిర్యాదులతో పోలీసులు కేసులు నమోదు చేశారు.

ఇదేనా ప్రజాపాలన?

బీఆర్‌ఎస్ నేతలు సబిత, సునీత, సత్యవతి

సాక్షి, హైదరాబాద్: మహిళలపై పొరపాటుగా మాట్లాడిన మాటలకు తమ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారక రామారావు క్షమాపణ చెప్పినా, కొందరు కాంగ్రెస్ నేతలు ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని బీఆర్‌ఎస్ పార్టీ మహిళా నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. కేటీఆర్ వ్యాఖ్యలపై స్పందించిన రాష్ట్ర మహిళా కమిషన్.. మహిళలపై జరుగుతున్న దాడుల విషయంలో ఎందుకు స్పందించడంలేదని ప్రశ్నించారు. ఇదేనా ప్రజాపాలనా? ఇదేం సంస్కృతి? అని నిలదీశారు. శనివారం తెలంగాణ భవన్‌లో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ సురభివాణి దేవి, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మరో నేత సుశీలారెడ్డి మీడియాతో మాట్లాడారు. ఎనిమిది నెలలుగా రాష్ట్రంలో మహిళలపై జరిగిన అకృత్యాలు, దౌర్జన్యాలపై ఎందుకు మాట్లాడటంలేదని ప్రశ్నించారు. అత్యాచారాల బారిన పడిన మహిళలను మంత్రులు, మహిళా కమిషన్ సభ్యులు ఎప్పుడైనా పరామర్శించారా అని నిలదీశారు. అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి అనకూడని మాటలు అన్నప్పుడు ఈ మహిళా కమిషన్ ఎక్కడికి వెళ్లిందని నిప్పులు చెరిగారు. మాజీ మంత్రి హరీశ్‌రావు క్యాంపు కార్యాలయంపై కాంగ్రెస్ కార్యకర్తల దాడిని ఖండిస్తున్నామని, ఇలాంటి ఘటనలతో రాష్ట్రానికి పెట్టుబడులు ఎలా వస్తాయని ప్రశ్నించారు.

రేవంత్ తదుపరి మజిలీ బీజేపీయే!

బీజేపీ జెండా కప్పుకుని చనిపోతానని మోదీకి హామీ ఇచ్చారు: కేటీఆర్

- రేవంత్ ప్రస్థానమే ఏబీవీపీలో కాషాయ జెండాతో మొదలైంది
- ప్రభుత్వం స్పందించకుంటే రైతుల కోసం ఉద్యమ బాట
- నోటీసులు అందాయి.. 24న మహిళా కమిషన్ ముందు స్వయంగా హాజరవుతానని వెల్లడి



సమావేశంలో కేటీఆర్‌తో మాట్లాడుతున్న పల్లా. చిత్రంలో హరీశ్, దేశపతి, వివేకానంద, సునీత, సత్యవతి తదితరులు

సాక్షి, హైదరాబాద్: ''రాష్ట్రానికి అన్ని విధాలా అన్యాయం చేస్తున్న ప్రధాని మోదీని సీఎం రేవంత్‌రెడ్డి పల్లెత్తు మాట అనడం లేదు. అంతేకాదు తన రాజకీయ ప్రస్థానం బీజేపీ అనుబంధ విద్యార్థి సంఘం ఏబీవీపీలో కాషాయ జెండాతోనే ప్రారంభమైందని మోదీకి రేవంత్ చెప్పారు. బీజేపీ కాషాయ జెండా కప్పుకుని చనిపోవాలన్నదే తన కోరిక అని కూడా మోదీకి రేవంత్ చెప్పినట్లు మాకు సమాచారం. ప్రధానితో ఆ మాట ఎందుకు చెప్పాల్సి వచ్చిందో రేవంత్ వెల్లడించాలి. రేవంత్ తదుపరి మజిలీ బీజేపీయే..'' అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీ రామారావు వ్యాఖ్యానించారు. శనివారం బీఆర్‌ఎస్ కార్యాలయం తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. బీజేపీలో బీఆర్‌ఎస్ విలీనం అవుతుందంటూ రేవంత్ తమకు పదవులు కూడా పంచుతున్నారని ఎద్దేవా చేశారు. త్వరలోనే తన బృందంతో కలిసి రేవంత్ బీజేపీలో చేరడం ఖాయమన్నారు.

రుణమాఫీ వైఫల్యాలపై గ్రామాలకు..: ''రాష్ట్రంలో రైతు రుణమాఫీ డొల్ల. వంద శాతం రైతు రుణమాఫీ జరిగిందని సీఎం రేవంత్ చెప్తుంటే.. మరోవైపు రుణమాఫీ కాని వారికోసం ప్రత్యేక కౌంటర్లు పెడతామని ప్రభుత్వం అంటోంది. రుణమాఫీ కాని రైతుల వివరాలను గ్రామస్థాయి నుంచి సేకరించి రాష్ట్ర ప్రభుత్వానికి అందిస్తాం..'' అని కేటీఆర్ చెప్పారు. సోమవారం నుంచి బీఆర్‌ఎస్ శ్రేణులు గ్రామాల వారీగా ప్రతీ గడపకు వెళ్లి వివరాలు సేకరిస్తాయన్నారు. రైతు పేరు, కుటుంబ వివరాలు, తీసు కున్న రుణం, బ్యాంకు పేరు తదితర వివరాలతో ఒక ప్రొఫార్మా తయారు చేసి కార్యకర్తలకు ఇస్తామని చెప్పారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు లేదా నియో జకవర్గ ఇన్‌చార్జులు ఈ కార్యక్రమాన్ని సమన్వయం చేస్తారని వివరించారు. జిల్లా కలెక్టర్ స్థాయి నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దాకా ఈ వివరాలను అందజేసి రైతులకు న్యాయం చేయాలని కోరుతామని... మాఫీ చేయని పక్షంలో గ్రామస్థాయి నుంచీ ప్రత్యక్ష నిరసన కార్యక్రమాలతో ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు.

దృష్టి మళ్లించేందుకు కాంగ్రెస్ దాడులు: సర్కారు రుణమాఫీలో విఫలం కావడంతో దాని నుంచి దృష్టి మళ్లించేలా కాంగ్రెస్ పార్టీ దాడులకు దిగుతోందని కేటీఆర్ ఆరోపించారు. సిద్దిపేటలో ఎమ్మెల్యే హరీశ్‌రావు క్యాంప్ ఆఫీసుపై దాడి చేసిన వారిపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కమలాసన్‌రెడ్డి వంటి సీనియర్ ఐపీఎస్ అధికారులపై సీఎం సొంత మీడియా దాడి చేస్తుంటే.. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై సీఎం రేవంత్, ప్రభుత్వ ఆస్తులపై కాంగ్రెస్ కార్యకర్తలు దాడి చేస్తున్నారని ఆరోపించారు.

24న మహిళా కమిషన్ ముందుకు..: మహిళా కమిషన్ ముందు హాజరుకావాలంటూ తనకు నోటీసులు అందాయని కేటీఆర్ ధ్రువీకరించారు. 24న ఉదయం 11 గంటలకు మహిళా కమిషన్ ముందు తాను స్వయంగా హాజరై 8 నెలల కాంగ్రెస్ పాలనలో మహిళలపై జరిగిన దురాగతాల వివరాలను అందజేస్తానని చెప్పారు. కొల్లాపూర్, షాద్‌నగర్ తదితర చోట్ల మహిళలపై జరిగిన దాడులు, అఘా యిత్యాలను గుర్తుచేస్తానని తెలిపారు. అసెంబ్లీలో మహిళా ఎమ్మెల్యేలను సీఎం దూషించినా ఆయ నపై చర్యలు లేవని చెప్పారు. ఆర్టీసీలో మహిళల ప్రయాణానికి సంబంధించి తాను చేసిన వ్యాఖ్యలపై క్షమాపణ చెప్పానని గుర్తు చేశారు.

రుణం తీరలే.. రైతు బతుకు మారలే

'సాక్షి' కథనాన్ని ట్యాగ్ చేస్తూ 'ఎక్స్'లో కేటీఆర్ పోస్ట్



సాక్షి, హైదరాబాద్: ''రైతు రుణం తీరలేదు, రైతు బతుకు మారలేదు. ఒకే విడతలో రూ. రెండు లక్షల రైతు రుణమాఫీపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే కాంగ్రెస్ పార్టీ దాడులు చేస్తూ.. నిలదీస్తే బెదిరింపులకు దిగుతోంది. అయినా తగ్గేదే లేదు. నిగ్గదీసి అడుగు తాం, నిజాలే చెబుతాం. కాంగ్రెస్ డొల్లమాటల గుట్టు విప్పుతూనే ఉంటాం..'' అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు పేర్కొన్నారు. 'రుణం తీరలే' శీర్షికన సాక్షి ప్రధాన సంచికలో శనివారం ప్రచురితమైన కథనాన్ని సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్'లో ట్యాగ్ చేస్తూ కేటీఆర్ పలు వ్యాఖ్యలు చేశారు. ''రైతు రుణమాఫీకి రూ.49,500 కోట్లు అవసరమని స్టేట్ లెవెల్ బ్యాంకర్స్ కమిటీలో లెక్కవేశారు. కానీ కేబినెట్ సమావేశంలో రూ.31 వేల కోట్లు అని చెప్పి, బడ్జెట్‌లో రూ.26 వేల కోట్లు మాత్రమే కేటాయించారు. కానీ మూడు విడతల్లో రుణమాఫీ కింద రైతులకు ఇచ్చింది రూ.17,933 కోట్లు మాత్రమే'' అని పేర్కొన్నారు.

రేపు రాజ్యసభ అభ్యర్థిగా సింఘ్వీ నామినేషన్

నేడు సీఎల్పీ సమావేశం..
సింఘ్వీ నామినేషన్ ప్రక్రియనే ఎజెండా

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ నుంచి రాజ్యసభ అభ్యర్థిగా సీనియర్ కాంగ్రెస్ నేత అభిషేక్ మను సింఘ్వీ సోమవారం తన నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఇందుకోసం ఆయన ఆదివారం మధ్యాహ్నం హైదరాబాద్‌కు రానున్నారు. శంషాబాద్ విమానాశ్రయం నుంచి సీఎం రేవంత్ నివాసానికి వెళ్లనున్న ఆయన అక్కడి నుంచి సాయంత్రం జరిగే కాంగ్రెస్ శాసనసభాపక్షం సమావేశానికి హాజరవుతారు. సాయంత్రం ఏడు గంటలకు మాదాపూర్ సమీపంలోని ఓ హోటల్‌లో జరగనున్న ఈ సమావేశానికి పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరు కానున్నారు. అభిషేక్ సింఘ్వీ నామినేషన్ ప్రక్రియ గురించి చర్చించేందుకే సీఎల్పీ సమావేశం నిర్వహిస్తున్నట్టు గాంధీభవన్‌వర్గాలు వెల్లడించాయి. సోమవారం నామినేషన్ వేశాక సాయంత్రం ఆయన ఢిల్లీ తిరిగి వెళ్లనున్నట్టు సమాచారం. కాగా, సింఘ్వీని ఏఐసీసీ న్యాయ విభాగం చైర్మన్‌గా నియమిస్తూ అధిష్టానం ఉత్తర్వులు జారీ చేసింది.

కౌన్సెలింగ్ తర్వాతే క్లాసులు



కొత్తగా చేరే విద్యార్థులను మానసికంగా సిద్ధం చేయాలి
ఐఐటీలు, ఎన్ఐటీలకు కేంద్ర విద్యాశాఖ సూచన
ఏటేటా పెరుగుతున్న విద్యార్థుల ఆత్మహత్యలు
విద్యార్థుల్లో న్యూనతాభావాన్ని పసిగట్టాలి... వారిలో ధైర్యం నింపాలి

సాక్షి, హైదరాబాద్ : ఐఐటీలు, జాతీయ ఇంజనీరింగ్ కాలేజీల్లో క్లాసుల నిర్వహణకు సన్నాహాలు జరుగుతున్నాయి. అయితే విద్యార్థులను ముందుగా మానసికంగా బలోపేతం చేయాలని కేంద్ర విద్యాశాఖ అన్ని విద్యాసంస్థలను ఆదేశించింది. బోధన ప్రారంభించేముందే వారికి కౌన్సెలింగ్ ఇవ్వాలని సూచించింది. కాలేజీ పరిస్థితులు, తోటి విద్యార్థులతో సమన్వయం, అధ్యాపకులతో సాన్నిహిత్యం ఇందులో కీలకాంశాలుగా తీసుకోవాలని పేర్కొంది. ప్రతీ విద్యార్థిని సీనియర్ ఫ్యాకల్టీ దగ్గరగా పరిశీలించాలని, వారిలో భయం పోగొట్టాల్సిన అవసరముందని చెప్పింది. విద్యార్థి పూర్వచరిత్ర, అతనిలో ఉన్న భయం, ఆందోళనను గుర్తించి అవసరమైన ధైర్యం ఇచ్చే ప్రయత్నం చేయాలని కోరింది. ప్రతీ కాలేజీలోనూ కౌన్సెలింగ్ కేంద్రాల ఏర్పాటును గత ఏడాది కూడా సూచించింది.

విశ్వాసమే బలం

అత్యుత్తమ ర్యాంకులు వచ్చిన వారికే ఐఐటీలు, జాతీయ ఇంజనీరింగ్ కాలేజీల్లో సీట్లు వస్తాయి. ఇలా ప్రతిభ ఉన్న విద్యార్థులు చిన్న సమస్యలకే బెంబేలెత్తుతున్నారు. భయంకరమైన డిప్రెషన్‌లోకి వెళుతున్నారు. ఇవి బలవన్మరణాలకు కారణమవుతున్నాయనేది కేంద్ర ఆరోగ్యశాఖతో పాటు ఐఐటీలు జరిపిన పలు అధ్యయనాల్లో తేలింది. దేశంలోని ఐఐటీల్లో 2005- 2024 సంవత్సరాల మధ్య 115 మంది విద్యార్థులు తనువు చాలించారు. ఒక్క మద్రాస్ ఐఐటీలోనే 26 మంది విద్యార్థులు చనిపోయారు. ఐఐటీ కాన్పూర్‌లో 18 మంది, ఖరగ్‌పూర్ ఐఐటీలో 10 మంది, ఐఐటీ బాంబేలో 10 మంది విద్యార్థులు చనిపోయారు. గడచిన తొమ్మిదేళ్ల కాలంలో ఐఐటీ క్యాంపస్‌లోనే 98 మంది విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. 17 మంది క్యాంపస్ వెలుపల ఆత్మహత్య చేసుకున్నారు. ఇంత భయంకరమైన నిర్ణయాలు తీసుకోవడానికి వారి మానసిక పరిస్థితులే కారణమని నిపుణుల అధ్యయనాల్లో తేలింది. వారిలో విశ్వాసం సన్నగిల్లడమే కారణమని గుర్తించారు. ఇలాంటి వారిని ముందే తెలుసుకొని కౌన్సెలింగ్ ఇవ్వడంలో నిర్లక్ష్యం జరుగుతోందని కేంద్ర విద్యాశాఖ భావిస్తోంది. అందుకే ముందుగా విశ్వాసం పెంచే ప్రయత్నం చేయాలని సూచించింది.

తొలి ఏడాదే కీలకం

ఇప్పటి వరకూ జరిగిన బలవన్మరణాల్లో ఎక్కువమంది తొలి ఏడాది ఇంజనీరింగ్ విద్యార్థులే ఉన్నారు. అన్ని రాష్ట్రాల్లోనూ ఇంటర్‌విద్యలో బట్టీ పట్టే విధానం ఉంది. కార్పొరేట్ కాలేజీలు ర్యాంకుల కోసం ఈ మార్గాన్నే అనుసరిస్తున్నాయి. ఈ క్రమంలో విద్యార్థులు జేఈఈలో మంచి ర్యాంకులు పొందుతున్నారు. అయితే జాతీయ ఇంజనీరింగ్ కాలేజీలు, ఐఐటీల్లో విద్యాబోధన, ప్రాక్టికల్ వర్క్ ఇందుకు భిన్నంగా ఉంటుంది. విద్యార్థులు తమ స్వీయ ప్రావీణ్యాన్ని వెలికితీయాలి. సొంతంగా ఆలోచించడం, కొత్తదాన్ని అన్వేషించేలా సిలబస్ ఉంటుంది. ఇదంతా కొంతమంది విద్యార్థులకు అర్థం కావడం లేదు. మొదటి సంవత్సరంలో ఈ లక్ష్యాన్ని చేరుకునే క్రమంలో మానసిక ఒత్తిడికి గురవుతున్నారని మద్రాస్ ఐఐటీ అధ్యయన నివేదికలో పేర్కొంది. వీటిని పరిగణనలోనికి తీసుకొని, తొలి ఏడాది సిలబస్‌లో మార్పు చేయాలని అన్ని ఐఐటీలు భావించాయి. ఏదేమైనా కాలేజీలో చేరిన విద్యార్థికి ముందుగా పూర్తిస్థాయి కౌన్సెలింగ్ చేసి, మానసికంగా సిద్ధం చేసిన తర్వాతే క్లాసులు నిర్వహించాలని జాతీయ విద్యా సంస్థలు నిర్ణయించాయి. రాష్ట్ర ఇంజనీరింగ్ కాలేజీల్లోనూ ఇదే విధంగా చేయాలని, ప్రత్యేక కౌన్సెలింగ్ కేంద్రాలు ఉండాలని అఖిల భారత సాంకేతిక విద్యా మండలి ఇంజనీరింగ్ కాలేజీలకు సూచించింది.

ప్రజాభిప్రాయ సేకరణ ముగిసిన 45 రోజుల్లోగా
కొత్త రెవెన్యూ చట్టం

▶ మొదటి పేజీ తరువాయి

పోర్టల్‌ను తప్పుపడుతున్నాం. ఇది రైతుల మెడలో పెద్ద గుదిబండ. ఈ పోర్టల్ కారణంగా ప్రజలు కుదేలయ్యారు.. తీవ్ర నష్టం జరిగింది. ఇద్దరు వ్యక్తులు నాలుగు గోడల మధ్య కూర్చుని తెచ్చిన చట్టం ఇది. ప్రజలు తమ భూమి తమకు రావాలని దేవుళ్లకు దండం పెట్టారో లేదో తెలియదు కానీ, దొరకు, కలెక్టర్లకు మాత్రం పొర్లు దండాలు పెట్టాల్సి వచ్చింది. భారత రాజ్యాంగం కల్పించిన హక్కులను ధరణి హరించింది. తినీతినక కూడబెట్టుకున్న కష్టార్జితాన్ని అమ్ముకునే హక్కును కాలరాసింది.

పుట్టలో పాముల్లా అక్రమాలు

మేం అధికారంలోకి వచ్చాక పరిశీలిస్తే పుట్టలో పాముల్లాగా ధరణిలో వందలాది అక్రమాలు బయటకు వస్తున్నాయి. రెండు నిమిషాల్లో రిజిస్ట్రేషన్, మూడు నిమిషాల్లో మ్యుటేషన్ అని చెప్పి భూముల రిజిస్ట్రేషన్లలో అవకతవకలకు ఆస్కారం కల్పించారు. అర్ధరాత్రి 12 గంటల నుంచి తెల్లవారుజామున 4 గంటల వరకు నిషేధిత జాబితాలోని భూములను రిజిస్ట్రేషన్లు చేసుకుని తాళాలు వేసుకున్నారు. వాళ్లేం చేశారో కలెక్టర్లకు కూడా తెలియదు. హెడ్ ఆఫీస్, విదేశీ కంపెనీకి మాత్రమే తెలుసు. మేం అధికారంలోకి వచ్చిన 15 రోజుల్లో అన్ని వివరాలు ప్రజా బాహుళ్యంలో పెట్టించాం

లొసుగులు సవరించేందుకే చట్టం

ధరణిని బంగాళాఖాతంలో వేస్తామన్నామంటే.. తెలివి తక్కువ నిర్ణయాలు తీసుకోవడం కాదు. ఆత్రుతగా తప్పులు చేయడం కాదు. పేరు మార్చడం వల్ల ప్రజల సమస్యలు పరిష్కారం కావు. మన నిర్ణయాలతో తరతరాలు ముందుకెళ్లాలి. అందుకే భేషజాలకు పోకుండా ధరణి పోర్టల్‌ను మాత్రమే కాదు. చట్టంలోని లొసుగులను సవరించాలనే ప్రయత్నం చేస్తున్నాం. అందుకే కొత్త చట్టం తెస్తున్నాం. ఆర్‌వోఆర్ చట్టం-2020 కారణంగానే సమస్యలన్నీ వచ్చాయి.

80-85 వేల దరఖాస్తులు పెండింగ్‌లో..

మేం అధికారంలోకి వచ్చాక ధరణి పోర్టల్ ద్వారా సమస్యలు పరిష్కరించే అధికారాలను వికేంద్రీకరించాం. అప్పటికే 2.45 లక్షల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రతిరోజూ 3-5 వేల కొత్త దరఖాస్తులు వస్తున్నాయి. స్పెషల్ డ్రైవ్ పెట్టి 1.28 లక్షల దరఖాస్తులు పరిష్కరించాం. అంతేకాదు రోజూ పరిష్కరిస్తూనే ఉన్నాం. ఇప్పుడు పోర్టల్‌లో 80-85 వేల దరఖాస్తులు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయి. రైతుల దరఖాస్తులను తిరస్కరిస్తే అందుకు గల కారణాలను కూడా నమోదు చేయిస్తున్నాం.

అభిప్రాయ సేకరణకు జిల్లా స్థాయిలో సదస్సులు

కొత్త చట్టం ముసాయిదాపై చెట్టుకింద కూర్చునే సామాన్య రైతు నుంచి దొర వారు ఇచ్చే సూచనలు కూడా పరిగణనలోకి తీసుకుంటాం. జిల్లా స్థాయిలో సదస్సులు నిర్వహించి అభిప్రాయ సేకరణ జరుపుతాం. దేశంలోనే రోల్‌మోడల్ చట్టంగా రూపొందిస్తాం. దీని ద్వారా ధరణి దరఖాస్తుల పరిష్కారానికి మార్గదర్శకాలు రూపొందుతాయి. పోర్టల్‌లోని దరఖాస్తు పద్ధతిని మార్చేస్తాం. ఇప్పటివరకు ఉన్న 33 మాడ్యూళ్ల స్థానంలో ఒకటే మాడ్యూల్ తెస్తాం. రైతుల ఏ సమస్యపై అయినా ఈ మాడ్యూల్‌లోనే దరఖాస్తు చేసుకోవచ్చు. పాత పహాణీలో 35 కాలమ్‌లు ఉండేవి. 100 ఏళ్ల చరిత్ర ఉండేది. ఇప్పుడు ఒక్కటే కాలమ్ ఉంది. దీని స్థానంలో 14-16 కాలమ్‌లతో కొత్త పహాణీ అందుబాటులోకి తెస్తాం. సీసీఎల్ఏ స్థాయిలో కూడా ధరణి దరఖాస్తుల పరిష్కారానికి కటాఫ్ డేట్ నిర్ణయిస్తున్నాం. సీసీఎల్ఏకు వచ్చిన దరఖాస్తులు వారం రోజుల్లోగా పరిష్కారం కావాలని ఆదేశిస్తా.

ఎలుక వచ్చిందని ఇంటిని తగులబెట్టుకోలేం కదా?

దొరగారు చెపితే వినలేదని 23 వేల మందిని అర్ధరాత్రి వేరే శాఖకు బదిలీ చేశారు. వీఆర్‌వో, వీఆర్ఏల వ్యవస్థను లేకుండా చేయడం ద్వారా



గ్రామ స్థాయిలో రెవెన్యూకు సాక్ష్యాలు లేకుండా చేశారు. మేం రాష్ట్రంలోని 10,945 గ్రామాల్లో రెవెన్యూ వ్యవస్థకు కాపలాదారులను నియమించాలన్న కృతనిశ్చయంతో ఉన్నాం. ఇంట్లోకి ఎలుక వచ్చిందని ఇంటిని తగులబెట్టుకోలేం కదా?

పేదోళ్ల భూములు వారికే పంచుతాం

పేదలకు ఇందిరమ్మ పంచిన భూములు లాగేసుకున్నారు. అలాంటి భూములు గుర్తించాం. వ్యవసాయ యోగ్యమైన భూములన్నింటినీ తిరిగి పేదలకు పంచుతాం. పేదోడి భూమి ధనికుల చేతికి వెళ్లనివ్వం. ఆ కోణంలోనే అసైన్డ్ భూములపై అమ్మకపు హక్కు కల్పిస్తాం. కొత్త చట్టం ఏర్పాటు కాగానే మళ్లీ సాదాబైనామాల దరఖాస్తులు స్వీకరిస్తాం. ఇప్పటివరకు పెండింగ్‌లో ఉన్న 9 లక్షల దరఖాస్తులకు తోడు కొత్తగా వచ్చే వాటిని ఏకకాలంలో శాశ్వతంగా పరిష్కరిస్తాం. గత ప్రభుత్వం భూముల విలువల సవరణలో శాస్త్రీయత పాటించలేదు. మేం అధికారులు, థర్డ్ పార్టీ నుంచి వివరాలు సేకరించాం. రెండింటినీ క్రోడీకరించి త్వరలోనే నిర్ణయం తీసుకుంటాం.

పార్టీ ఆస్తులు ఏం చేయాలా అని దొర ఆలోచిస్తున్నాడు



'బీజేపీలో బీఆర్ఎస్ విలీనం 100 శాతం ఖాయం. అయితే బీఆర్ఎస్ పేరిట ఉన్న ఆస్తులు, డబ్బులు ఏం చేయాలనేదానిపై దొర ఆలోచిస్తున్నాడు. పార్టీని విలీనం చేయకుండా కవితకు బెయిల్ రాదు. మేం కేంద్రంలో అధికారంలో లేము కనుక ఆ కేసులు తప్పించడం మాతో కాదు. అందుకే ఆయన కాంగ్రెస్ జోలికి రాడు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరికకు బ్రేక్ మాత్రమే పడింది. ప్రతి దానికీ ఆషాఢాలు, శ్రావణాలు ఉంటాయి కదా! జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలిచ్చేందుకు కట్టుబడి ఉన్నాం. నెలాఖరులోనే జేఎన్‌జే సొసైటీకి భూమిని సీఎం చేతుల మీదుగా అప్పగిస్తాం. ఈ సొసైటీలో లేని మిగిలిన వారికి ఎలా ఇవ్వాలన్న దానిపైనా ఆలోచిస్తున్నాం. ఇతర సొసైటీల సభ్యత్వాలను పరిగణనలోకి తీసుకుని నిర్ణయం తీసుకుంటాం.

రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేశాం

▶ మొదటి పేజీ తరువాయి

జమ చేయడం ద్వారా వారందర్నీ రుణవిముక్తులను చేశామని తెలిపారు.

తగిన రికార్డులిస్తే మాఫీ చేస్తాం..

రేషన్‌కార్డు కేవలం కుటుంబ నిర్ధారణ కోసమే పరిగణనలోకి తీసుకున్నామని, అది మాఫీకి ప్రామాణికం కాదని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. ఆధార్‌కార్డులో తప్పులు, రేషన్‌కార్డు లేనివారు, ఇతర కారణాలతో రూ.2 లక్షల్లోపు రుణమాఫీ కాని వారు దగ్గరలోని వ్యవసాయ అధికారిని సంప్రదించి, తగిన రికార్డులు సమర్పిస్తే త్వరలో రుణమాఫీ వర్తింపజేస్తామని వివరించారు. రూ.2 లక్షల కంటే అధికంగా రుణాలున్నవారు.. సదరు అధిక మొత్తాన్ని బ్యాంకులో జమచేస్తే, వారికి రుణమాఫీ చేయడానికి సిద్ధమవుతున్నామని తెలిపారు. కానీ రైతులను అయోమయానికి గురిచేసేలా ప్రతిపక్ష నాయకులు ప్రవర్తించడం దురదృష్టకరమని మండిపడ్డారు. తొలి, రెండో విడతలలో తప్పులు దొర్లిన 7,925 ఖాతాలను సరిచేసి, వాటికి సంబంధించిన 44.95 కోట్ల నిధులను ఇప్పటికే విడుదల చేశామని మంత్రి పేర్కొన్నారు. ఇక కొన్ని బ్యాంకుల నుంచి సాంకేతిక సమస్యల కారణంగా రాష్ట్రవ్యాప్తంగా దాదాపు రూ.70,000 నుండి రూ.80,000లోపు రుణాలున్న ఖాతాలకు సంబంధించిన వివరాలు కూడా తెప్పించుకుంటున్నట్టు వివరించారు. ప్రతిపక్ష నేతలు నిజంగా రైతు సంక్షేమాన్ని కోరేవారే అయితే.. ముందుగా వారు గత పదేళ్లలో చెల్లించకుండా వదిలేసిన రుణాల వివరాలు తెప్పించుకొని చెల్లించాలని వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వం చెల్లించని పలు పథకాల బకాయిలను తాము చెల్లించామని తెలిపారు.



రైతుబడి-'అగ్రి షో' వేదికపై మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు. చిత్రంలో మంత్రి కోమటిరెడ్డి, మండలి చైర్మన్ గుత్తా తదితరులు

రూ.2 లక్షలకు మించి ఉంటే ముందు కట్టండి

ఆ తర్వాత రుణమాఫీ చేస్తామంటూ రైతులకు వ్యవసాయ శాఖ సూచన

సాక్షి, హైదరాబాద్: రూ.2 లక్షలకు మించి రుణాలున్న రైతులు.. అదనపు సొమ్మును బ్యాంకులో కట్టాలని, మిగతా రెండు లక్షలను ప్రభుత్వం మాఫీ చేస్తుందని వ్యవసాయ శాఖ పేర్కొంది. ఉదాహరణకు ఒక రైతుకు రూ.2.10 లక్షల రుణముంటే.. అదనంగా ఉన్న రూ.10 వేలు బ్యాంకులో జమ చేస్తే, తర్వాత ప్రభుత్వం రూ.2 లక్షలను బ్యాంకులో జమ చేస్తుందని తెలిపింది. ఈ మేరకు శనివారం రాత్రి ఒక ప్రకటన జారీ చేసింది. ఆధార్, పాస్‌బుక్, రేషన్‌కార్డు తదితర వివరాలు సరిగా లేనివారి రుణమాఫీ పెండింగ్‌లో ఉందని తెలిపింది. రైతులు మండల వ్యవసాయ అధికారిని కలిసి, వివరాలను సరిచేసుకుంటే వారి ఖాతాల్లో రుణమాఫీ సొమ్ము జమ అవుతుందని ప్రకటించింది. బ్యాంకులు, ఖాతాల్లో పలు సాంకేతిక పొరపాట్ల వల్ల దాదాపు 22 వేల ఖాతాల్లో వేసిన డబ్బులు వెనక్కి వచ్చాయని... ఆ తప్పులను సరిచేసి, ఇప్పటికే 8 వేల ఖాతాలకు తిరిగి నిధులు పంపిస్తున్నామని తెలిపింది. అందువల్ల రూ.2 లక్షలలోపు రుణాలుండి ఇప్పటికీ మాఫీ కాని రైతులు మండల వ్యవసాయ అధికారిని కలిసి, అందుకు కారణం తెలుసుకోవాలని సూచించింది. కుటుంబ నిర్ధారణ జరగని కారణంగా రుణమాఫీ కాలేదని ఫిర్యాదు ఉంటే అధికారులు క్షేత్రస్థాయిలో వెరిఫికేషన్ చేస్తారని.. ఆ రైతు కుటుంబంలోని వారి ఆధార్ కార్డులు, ఇతర వివరాలను తీసుకుని పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తారని వివరించింది. రైతుల నుంచి వచ్చిన ఫిర్యాదులను నెలరోజుల్లోగా పరిశీలించి, అర్హులైన వారికి రుణమాఫీ వర్తింపజేస్తామని ప్రకటించింది.

సీఎంకు పొన్నం శుభాకాంక్షలు



సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డితో రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ శనివారం భేటీ అయ్యారు. అమెరికా, కొరియా పర్యటనలను దిగ్విజయంగా ముగించుకుని రూ.వేలకోట్ల పెట్టుబడులతో రాష్ట్రానికి వచ్చినందుకు సీఎంను అభినందించారు. మంత్రి పొన్నం వెంట సీనియర్ ఐఏఎస్ అధికారి బుర్రా వెంకటేశం కూడా ఉన్నారు.

సీఎం అభినందన సభ నేడు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల క్షత్రియ సేవా సమితి ఆధ్వర్యంలో తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డికి అభినందన సభను నిర్వహిస్తున్నట్టు నిర్వాహకుడు మధుసూదనరాజు తెలిపారు. గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి ఇండోర్ స్టేడియంలో ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు సభ నిర్వహించనున్నట్టు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమంలో కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, కర్ణాటక రాష్ట్ర చిన్న నీటిపారుదల, సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రి నడింపల్లి బోసురాజు, పారిశ్రామికవేత్త అల్లూరి సీతారామరాజులు ముఖ్య అతిథులుగా పాల్గొంటారని చెప్పారు.

దసరా నుంచి స్కిల్స్ వర్సిటీ షురూ

- మొత్తం 20 కోర్సులు.. తొలుత 6 కోర్సుల్లో తరగతులు
- కలసి పనిచేసేందుకు 140 కంపెనీల ఆసక్తి: సీఎస్ శాంతికుమారి

సాక్షి, హైదరాబాద్: యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీలో తరగతులను దసరా నుంచి ప్రారంభిస్తున్నట్టు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి వెల్లడించారు. స్కిల్స్ యూనివర్సిటీలో 20 కోర్సులను నిర్వహించనున్నామని.. అందులో దసరా నుంచి ప్రాథమికంగా ఆరు కోర్సులను ప్రారంభించాలని నిర్ణయించామని తెలిపారు. స్కిల్స్ యూనివర్సిటీ ప్రారంభం, విధి విధానాల ఖరారు, కోర్సుల ప్రారంభం తదితరాలపై శనివారం ఆమె సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ముచ్చర్ల వద్ద కేటాయించిన 57 ఎకరాల స్థలంలో స్కిల్స్ వర్సిటీ భవనాల నిర్మాణం పూర్తయ్యేదాకా.. తాత్కాలిక భవనంలో వర్సిటీని నిర్వహించనున్నట్టు తెలిపారు. ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా/ న్యాక్/ నిథమ్ భవనాల్లో తరగతులు నిర్వహిస్తామన్నారు. వర్సిటీ చైర్‌పర్సన్‌గా ఆనంద్ మహీంద్రా, కో-చైర్మన్‌గా శ్రీనివాస సి రాజును నియమించినట్టు వెల్లడించారు. స్కిల్స్ యూనివర్సిటీలో 140 కంపెనీలు భాగస్వామ్యం కావడానికి ఆసక్తి చూపుతున్నాయని తెలిపారు. తొలుత స్కూల్ ఆఫ్ ఈ-కామర్స్, లాజిస్టిక్స్ రిటైల్ విభాగంలో సర్టిఫికెట్ కోర్సులు, డిప్లొమా కోర్సులను ప్రారంభిస్తున్నామన్నారు. వివిధ విభాగాల్లో శిక్షణ నిమిత్తం దేశంలోని ప్రముఖ కార్పొరేట్ సంస్థలైన ఎస్‌బీఐ, న్యాక్, డాక్టర్ రెడ్డీస్, టీవీఏజీఏ, అదానీ కంపెనీలు భాగస్వాములుగా ఉండేందుకు అంగీకరించాయన్నారు. సీఐఐ కూడా ముందుకు వచ్చిందని చెప్పారు. యూనివర్సిటీ లోగో, వెబ్‌సైట్‌ను ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కోర్సు పూర్తి చేసిన వారికి ఆకర్షణీయమైన వేతనంతో కూడిన ఉద్యోగ కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

ఫ్యూచర్ సిటీలో స్పోర్ట్స్ యూనివర్సిటీ

▶ మొదటి పేజీ తరువాయి

దక్షిణ కొరియా పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సియోల్‌లోని కొరియన్ నేషనల్ స్పోర్ట్స్ యూనివర్సిటీని సందర్శించిన విషయం తెలిసిందే. ప్రపంచ క్రీడా రంగంలో ఇది అగ్రస్థానంలో ఉంది. 1976లో ఏర్పాటైన ఈ వర్సిటీలో అథ్లెటిక్స్‌కు సంబంధించిన అనేక కోర్సులు అందిస్తున్నారు. ఇటీవల ముగిసిన పారిస్ ఒలింపిక్స్‌లో దక్షిణ కొరియా సాధించిన 32 పతకాల్లో 16 పతకాలు కొరియన్ నేషనల్ స్పోర్ట్స్ యూనివర్సిటీలో శిక్షణ పొందిన అథ్లెట్లు సాధించినవే కావడం గమనార్హం. కాగా యూనివర్సిటీ సందర్శన సందర్భంగా పారిస్ ఒలింపిక్స్‌లో విలువిద్య పోటీల్లో మూడు బంగారు పతకాలు సాధించిన లిమ్ సి హైయోన్‌తోనూ సీఎం భేటీ అయ్యారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీలో కొరియన్ నేషనల్ స్పోర్ట్స్ యూనివర్సిటీ వంటి ప్రతిష్టాత్మక సంస్థలను సాంకేతిక భాగస్వాములుగా చేర్చుకుని భవిష్యత్తు ఒలింపిక్స్ విజేతలకు శిక్షణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది.

ఫ్యూచర్ సిటీ ప్రణాళికలపై సీఎం సమీక్ష

కొత్త హైకోర్టు నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టు మీదుగా ఫ్యూచర్ సిటీకి మెట్రో మార్గం ఉండేలా ప్రణాళికలు రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఫ్యూచర్ సిటీలో రేడియల్ రహదారులు అభివృద్ధి చేసే విధంగా ప్రణాళికలు ఉండాలని స్పష్టం చేశారు. ఫ్యూచర్ సిటీ అభివృద్ధి ప్రణాళికలపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిషోర్, మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి, సీఎంవో అదనపు కార్యదర్శి అజిత్‌రెడ్డి, హెచ్ఎండీఏ మెట్రోపాలిటన్ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, రంగారెడ్డి కలెక్టర్ శశాంక్‌లతో తన నివాసంలో సీఎం సమీక్షించారు. రోడ్లు, మెట్రో మార్గాలకు సంబంధించి భూసేకరణ, ఇతర అంశాలపై అధికారులు సమన్వయంతో పని చేయాలని చెప్పారు. పూర్తి స్థాయి ప్రణాళిక, రూట్ మ్యాప్ త్వరగా సిద్ధం చేయాలని, యుద్ధ ప్రాతిపదికన పనులు ప్రారంభించేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.



దుష్టుల ఆలోచన చొప్పున నడువక, పాపుల మార్గమున నిలువక యెహోవా ధర్మశాస్త్రమునందు ఆనందించుచు, దివారాత్రము దానిని ధ్యానించువాడు ధన్యుడు.

– క్రైస్తవ ధర్మం

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, శ్రావణ మాసం,
తిథి: శు.చతుర్దశి రా.2.38 వరకు తదుపరి పౌర్ణమి, **నక్షత్రం:** ఉత్తరాషాఢ ఉ.9.52 వరకు, తదుపరి శ్రవణం,
వర్జ్యం: ప.1.45 నుండి 3.17 వరకు,
దుర్ముహూర్తం: సా.4.43 నుండి 5.31 వరకు, **అమృతఘడియలు:** రా.11.02 నుండి 12.34 వరకు.

సూర్యోదయం : 5.46
సూర్యాస్తమయం : 6.21
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

అజిత్ పవార్ (డిప్యూటీ సీఎం)

రాయని డైరీ

మాధవ్ శింగరాజు

యాత్ర ఎక్కడి వరకు వచ్చి ఆగిందో సరిగా తెలియటం లేదు! ఆగస్టు 7న నాసిక్ దగ్గరి దిండోరీలో మొదలైంది. సెప్టెంబర్ 6న మరాఠ్వాడాలో ముగియాలి. ఉత్తర మహారాష్ట్ర, పశ్చిమ మహారాష్ట్ర, ముంబై, ముంబై మెట్రో రీజియన్, విదర్భ... ఇదీ రూట్ మ్యాప్.

ప్రజాభిమానం ఈ మ్యాప్‌ని అలికేసింది! దారులు కనిపించటం లేదు. ప్రదేశాలు తెలియటం లేదు. గుత్తులు గుత్తులుగా ద్రాక్ష రైతులు ర్యాలీకి కదిలి రావటాన్ని బట్టి నేనున్నది నాసిక్, పుణె, అహ్మద్‌నగర్, సాంగ్లీ, ఉస్మానాబాద్, సోలాపూర్, సతారా ప్రాంతాలలో ఒకటి అయియుంటుందని అనుకోవటమే! పంచవటిలోనైతే కాలారామ్ ఆలయం దగ్గర కాలమే ఆగిపోయినట్లుగా అశేష జనవాహిని మధ్య బస్సు యాత్ర అలా నిలబడిపోయింది. "అజిత్‌జీ! మీరే మా నాయకుడు" – దిక్కుల్లో ప్రతిధ్వని! "అజిత్ భయ్యాజీ! మీరే మా నాయకుడు" – దేవ్‌లాలీ పట్టణంలో మహిళలదీ, ఆరోగ్య కార్యకర్తలదీ అదే నినాదం. వాళ్లందరి చేతుల్లో రాఖీలు!

"భయ్యాజీ! మీరు సుప్రియా బెహన్ చేత రాఖీ కట్టించుకుంటారా?" గుంపులోంచి ఒక సోదరి ఎంతో ఆసక్తిగా అడిగారు.



రాజకీయాలు ఆసక్తినీ రేకెత్తిస్తాయి. అనుమానాలనూ రాజేస్తాయి. బారామతిలో నా సోదరి సుప్రియకు పోటీగా, నా భార్య సునేత్రను నిలబెట్టినందుకే కావచ్చు... "భయ్యాజీ! సుప్రియతో రాఖీ కట్టించుకుంటారా?" అని ఇప్పుడీ ప్రశ్న! నా సోదరి, నా భార్యను ఓడించి ఎంపీగా గెలిచారు. ఆ నిస్పృహ నాలో ఉండకపోతుందా అని వారి అనుమానం.

"కట్టించుకుంటాను. నా సోదరి సుప్రియ నాకు రాఖీ కట్టటానికి వస్తే తప్పకుండా కట్టించుకుంటాను..." అన్నాను. అంతటా హర్షధ్వానాలు.

"ఎంతైనా సోదరుడు సోదరుడే" అన్నారొక మహిళ.

"అవును ఇల్లు ఇల్లే! రాజకీయాలు రాజకీయాలే! నేను ఇంట్లోంచి బయటికి వచ్చినా కూడా, మా ఇంటిపెద్ద ఎప్పటికీ శరద్ పవార్‌జీ...నే" అన్నాను. వారికి ఆ మాట ఎంతో సంతృప్తిని కలిగించటం నేను గమనించాను!

"రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో మహిళల ఓట్ల కోసమే కదా మీరు మీ యాత్రకు పింక్ కలర్‌ను థీమ్‌గా ఎంచుకున్నారు?!"... అని ఓ జర్నలిస్టు సందేహం!

"అలా ఎందుకవుతుంది?!" అన్నాను.

"ఎందుకంటే... యాత్రలో మీ బస్సు రంగు పింక్. కుర్తా–పైజామా మీదకు మీరు వేసుకున్న హాఫ్ జాకెట్ రంగు పింక్. మహిళలతో కనెక్ట్ అవటానికి మీరు పింక్ కలర్‌ను ఎంచుకున్నట్లుగా ఉంది..." అని ఆ జర్నలిస్టు!

"అలాగైతే మీరు బ్లూ షర్ట్ వేసుకున్నది కూడా ఎవరితోనైనా కనెక్ట్ అవటానికేనా?!" అని అడిగాను, అతడి ఒంటి మీద ఉన్న నీలం రంగు చొక్కాను చూస్తూ.

అప్పటికి గానీ అతడు ప్రశ్నలు వేయటం ఆపలేదు.

ఎంతమందినని ఇలా ఆపుకుంటూ వెళ్లటం! యాత్ర కొల్హాపూర్ చేరుకున్నప్పుడు.. ప్రజల్ని తోసుకుంటూ స్థానిక పోలీసులు నా దగ్గరికి వచ్చారు.

"మాలెగావ్, ధూలే, జల్‌గావ్‌లలో మీపై ఎటాక్ జరగొచ్చని ఇంటెలిజెన్స్ రిపోర్ట్. మిగతా చోట్ల కూడా అలా జరిగే ప్రమాదం ఉండొచ్చని సెక్యూరిటీని టైట్ చేశాం" అన్నారు.

"ప్రజల మధ్య ఉన్నవాళ్లకు ప్రజల నుంచి సెక్యూరిటీ ఏమిటి!" అన్నాను.

"ప్రజల్లో ప్రజలొక్కరే ఉండకపోవచ్చు కదా అజిత్‌జీ! పైగా ఎన్నికలు కూడా దగ్గరపడుతున్నాయి. మీరు మరింత జాగ్రత్తగా ఉండాలి" అన్నారు ఎస్పీ.

నవ్వాన్నేను.

లక్షలాది మంది రైతులు, మహిళలు, యువజనులు, ఆదివాసీలు నాకోసం కదిలి వస్తుంటే... వారి ఆశీర్వచనాలు, వారి ప్రేమ, వారి భావోద్వేగాలను మించిన రక్షా బంధన్ నా ప్రజా యాత్రకు వేరే ఏముంటుంది?!

మహిళలకు 'అభయ'ం ఇవ్వలేరా?

కోల్‌కతాలోని ఆర్.జి. కర్ మెడికల్ కాలేజీలో ఒక యువ వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఉదంతం దేశాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. అసలు ఘటన జరిగిన తీరు, దాని పట్ల మౌనంగా ఉన్నవారి తీరు ఎన్నో అనుమానాలను రేకెత్తిస్తున్నాయి. ఆ నీచాన్ని వ్యతిరేకిస్తూ వైద్యులతో సహా దేశవ్యాప్తంగా అన్ని వర్గాల నుంచి నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. ఈ 'అభయ' ఘటన పనిప్రదేశాల్లో మహిళల భద్రత అంశాన్ని మరోసారి లేవనెత్తడమే కాకుండా, సంస్థాగతంగా, రాజకీయంగా ఉన్న వైఫల్యాలకు జవాబులను డిమాండ్ చేస్తోంది.

ఏ వాస్తవాలు దాచడానికి?

సందర్భం



బర్ఖా దత్

లక్షలాది మంది భారతీయ మహిళల లాగే, నేను ఆగ్రహంతో రగిలిపోయాను, విచారంతో కుంగిపోయాను. ఒక యువతిని తన పని ప్రదేశంలో బహుశా ఆమెకు తెలిసిన పురుషులే క్రూరంగా హింసించి చంపారనే ఆలోచన నన్ను వెంటాడుతోంది. కోల్‌కతా యువ వైద్యురాలిపై లైంగిక దాడి ఘటనలో, ఆమె శవం గురించి ఇప్పుడు మనకు తెలిసిన భయానక వివరాలను నేను చెప్పలేను. అర్ధనగ్నంగా కనిపించింది. ఆమె కాళ్లు విరిగిపోయాయి. ఆమె జననాంగాలు, రెండు కళ్ల నుంచి విపరీతంగా రక్తస్రావం అయ్యింది. తల నుంచి పాదాల వరకు రక్త సిక్త గాయాలయ్యాయి. ఈ సాక్ష్యం సామూహిక అత్యాచారం అని వైద్యులు నమ్ముతున్నారు. తన కుమార్తె మృతదేహాన్ని చూడటానికి మూడు గంటలు వేచిచూడాల్సి వచ్చిన తండ్రి ఈ వివరాలను పంచుకున్నారు. ఆ తండ్రిగా మిమ్మల్ని ఊహించుకోండి. అది మీ బిడ్డ గురించి మీకు ఉన్న చివరి జ్ఞాపకం అని ఆలోచించండి.

కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ మెడికల్ కాలేజీ ఘటన, సంస్థాగతంగా స్త్రీల పట్ల ఉన్న ద్వేషానికీ, దుర్మార్గానికీ భయంకరమైన ఉదాహరణ. అత్యాచారం తర్వాత ఏమి జరిగిందనేది మరింత అసహ్యకరమైనది. జరిగిన ఘటనను కప్పిపుచ్చే ప్రయత్నాలు నేరాన్ని మరింతగా పెంచాయి.

ఈ కేసును అర్థం చేసుకోవాలంటే, మనం వైద్య కళాశాల ప్రిన్సిపల్, ఇప్పుడు తొలగించబడిన సందీప్ ఘోష్ అనే వ్యక్తి గురించి మాట్లాడాలి. మొదట, మెడికల్ కాలేజీ అధిపతిగా, దాడి జరగడానికి ఆయనే జవాబుదారీగా ఉంటాడు. ప్రత్యేకించి ఇది బయటి వ్యక్తి చేసిన పని కాదనీ, కాలేజీ లోపలి వారు చేసిన పనేననీ వైద్యులు చెబుతున్నారు. 36 గంటల షిఫ్ట్ ముగించుకున్న తర్వాత బాధితురాలు విశ్రాంతి తీసుకుంటున్న సెమినార్ హాల్ ఎక్కడ ఉందో బయటి వ్యక్తికి తెలిసే అవకాశం లేదని వైద్యులు సూచిస్తున్నారు. లైంగిక దాడికి, హత్యకు గురైన రాత్రి బాధితురాలి కారును కూడా ధ్వంసం చేశారని నిరసన తెలిపిన వైద్యులు చెబుతున్నారు.

ఆమెకు ఏదో తెలిసివుండటం వల్ల ఆమె నోటిని శాశ్వతంగా మూసివేశారా? సందీప్ ఘోష్ మొదట తన వ్యాఖ్యలలో ఆమెను నిందించాడు. ఆ రాత్రి సమయంలో సెమినార్ హాల్‌లో ఆమె ఉండటాన్ని తప్పు పట్టాడు. ఆ నిర్లిప్తత సరిపోనట్లు, ఆర్‌జీ కర్ మెడికల్ కాలేజీ అధికారులు ఆమె కుటుంబానికి తమ కుమార్తె ఆత్మహత్యతో చనిపోయిందని చెప్పారు. ఇది ఏ మాత్రం ఆమోదయోగ్యం కాని నయవంచన. అసలు ఆమె కుటుంబంతో ఘోష్ వ్యక్తిగతంగా ఎందుకు సమాచారం పంచుకోలేదు? పైగా మౌనంగా ఉండేందుకు పోలీసులు తమకు డబ్బు ఇవ్వజూపారని కుటుంబ సభ్యులు వైద్యులకు తెలిపారు.

దిగ్భ్రాంతికరమైన విషయం ఏమిటంటే, యువ వైద్యురాలు తన కుమార్తె లాంటిదని ఆయన ఆ తర్వాత పేర్కొన్నప్పటికీ, ఈ అంశంపై ఘోష్ కనీసం ఫిర్యాదు కూడా చేయలేదు. వెంటనే ఆయన పోలీసులను ఎందుకు పిలిపించలేదు? కోల్‌కతా హైకోర్టు కూడా ఇప్పుడు ఆయన ప్రవర్తనపై ఈ ప్రశ్ననే లేవనెత్తింది.

ఈ విచిత్రమైన ప్రతిస్పందనలు సాక్ష్యాలను తారుమారు చేశాయనే అనుమానాలను మరింతగా పెంచాయి. నేరం జరిగిన స్థలానికి చాలా సమీపంలో సాధారణ నిర్మాణపని, మరమ్మత్తు పనులు జరుగుతున్నట్లు చూపించే వీడియో కనిపించింది. ఫోరెన్సిక్స్ కోసం ఆ ప్రాంతాన్ని రింగ్ ఫెన్స్ చేయాలని ఘోష్ అనుకోలేదా? తన మొత్తం ఆలోచన అంతా సాక్ష్యం ఎట్టి పరిస్థితుల్లోనూ దొరకకూడదనే కోణంలో ఉండిందా?

ఇంత దారుణ ఘటన నేపథ్యంలో ఘోష్‌ను కనీసం పదవి నుండి తొలగిస్తారని మీరు అనుకుంటారు. బదులుగా ఏమి జరిగిందో ఊహించండి. ఆయన మరొక మెడికల్ కాలేజీకి అధిపతిగా బదిలీ చేయబడ్డారు. అయితే ఈ కలకత్తా నేషనల్ మెడికల్ కాలేజ్ విద్యార్థులు ఆయన కార్యాలయానికి తాళం వేసి ఉంచడమే కాకుండా, అతగాడి కొత్త మాయవేషాలను ప్రారంభించడానికి అనుమతించబోమని తేల్చి చెప్పారు. రాజీనామా చేసిన కొన్ని గంటల్లోనే ఆయనకు మరో ఉద్యోగం ఎందుకిచ్చారు? అంతే కాదు, ఇద్దరు తృణమూల్ కాంగ్రెస్ రాజకీయ నాయకులు... ఒక శాసనసభ్యుడు, ఒక మంత్రి... విద్యార్థులతో మాట్లాడటానికి కలకత్తా నేషనల్ మెడికల్ కాలేజీకి వచ్చి ఘోష్‌కు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనలను నిలిపివేయమని కోరినట్లు పశ్చిమ బెంగాల్ మీడియా నివేదించింది.

ఘోష్‌ను అంత శక్తిమంతంగా మార్చింది ఏమిటి? ఆయన గతంలో వివాదాల మధ్యనే మూడుసార్లు బదిలీ చేయబడ్డాడు. విద్యార్థులు, వైద్యులు ఆయన్ని ఒక విధమైన స్థానిక మాఫియాగా పేర్కొంటారు. ఎట్టకేలకు అతడిని హైకోర్టు తొలగించింది. అతని పక్షాన వాదించడానికి ప్రభుత్వ న్యాయవాదిని ఎందుకు పంపారని న్యాయస్థానం ప్రశ్నించింది. దీనికి సంబంధించి ఇతర ప్రశ్నలు కూడా పెరుగుతున్నాయి. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆర్‌జీ కర్ మెడికల్ కాలేజీ వద్ద నిరసన తెలుపుతున్న వైద్యులపై దాడికి దుండగులను ఎవరు పంపారు?

బాధితురాలి పట్ల వ్యవహరించిన విధంగానే తమపై కూడా అత్యాచారం చేస్తామని ఆకతాయిలు బెదిరించారని నర్సింగ్ సిబ్బంది నాతో అన్నారు. పోలీసులు అక్కడి నుంచి వెళ్లిపోయారనీ, దీంతో తమను తామే రక్షించుకోవలసి వచ్చిందనీ నేను మాట్లాడిన యువ మహిళా వైద్యులు చెప్పారు. ఆకతాయిలు ఎమర్జెన్సీ గదిని ధ్వంసం చేయడంతో సహా కనుచూపు మేరలో ఉన్నవన్నీ ధ్వంసం చేయడాన్ని వాళ్లు చూశారు. బోల్తా పడిన అంబులెన్స్‌ని చూశారు. హాస్టల్‌లోకి ప్రవేశించడానికి పురుషులు పైపులు, గోడల మీదుగా పైకి ఎగబాకటం చూశారు.

ఈ ఆకతాయిలు ఎవరనేది బయటపడినప్పటికీ, ఈ దాడి ఘటనలో పోలీసుల వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోంది. వృత్తిపరమైన కలల కోసం స్త్రీలు వెయ్యిమంది రాక్షసులతో యుద్ధం చేయాల్సి ఉంటుంది. వారి పని ప్రదేశం కూడా సురక్షితంగా లేకపోతే, ఉద్యోగాల్లో చేరేలా అది మహిళలకు ప్రేరణనివ్వలేదు.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్
('ది హిందుస్థాన్ టైమ్స్' సౌజన్యంతో)



లాపతా (తృణమూల్) లేడీస్!

'లాపతా లేడీస్'... ఈ మధ్య వచ్చిన పాపులర్ హిందీ సినిమా టైటిల్ ఇది. కనిపించకుండా పోయిన మహిళలు అని అర్థం. కోల్‌కతా వైద్యురాలి హత్యాచారం కేసులో 'లాపతా లేడీస్'గా ఉండిపోయిన పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఎట్టకేలకు ఒక ప్రదర్శనలో దర్శనమైతే ఇచ్చారు. తృణమూల్ కాంగ్రెస్ నేతలు నిర్వహించిన ఈ ప్రదర్శనలో మహువా మొయిత్రా, సాయోనీ ఘోష్, డోలా సేన్, శతాబ్ది రాయ్, షర్మిలా సర్కార్, కాకోలీ ఘోష్ దస్తిదార్, జూన్ మలయ్యా వంటి పార్లమెంటు సభ్యులతోపాటు శశి పంజా వంటి మంత్రులు కూడా 'దీదీ'తో పాటు ప్రదర్శనలో పాల్గొన్నారు. ప్రదర్శన భారీగానే సాగింది కానీ, దేశంలోని ఒకే ఒక్క మహిళా ముఖ్యమంత్రి రికార్డు కలిగిన మమత రాజకీయంగా వెనుకబడిపోయారనే చెప్పాలి. ఆ దారుణ ఘటనకు సంబంధించిన సమాచారాన్ని సమర్థంగా పంపిణీ చేయడంలో ఏర్పడ్డ వెలితిని కాస్తా ప్రతిపక్ష బీజేపీ ఠక్కున అందుకోవడమే కాకుండా... తనదైన బాణీని వ్యాప్తి చేయడంలో విజయం సాధించింది కూడా!

చాలా ఏళ్ల తరువాత, బహుశా మొట్టమొదటిసారేమో... 'దీదీ' పెద్ద సవాలునే ఎదుర్కొంటున్నారు. వైద్యురాలి హత్యాచార ఘటన విషయంలో తప్పు చేశానని దీదీకి కూడా తెలుసు. సంఘటన జరిగిన తరువాత పార్టీకి చెందిన 11 మంది పార్లమెంటు సభ్యులు బాధితురాలి పక్షాన నిలబడేలా తమ గొంతు వినిపించేందుకు గంటలు, రోజుల సమయం తీసుకున్నారు. రాజ్యసభ సభ్యులు, మాజీ జర్నలిస్టు సాగరికా ఘోష్ ఒక్కరు దీనికి మినహాయింపు. పార్లమెంట్, కోల్‌కతా రెండింటిలోనూ బీజేపీకి శాపంగా మారిన ఈ తెలివైన తృణమూల్ పార్లమెంటు సభ్యులు తమ భావాలను స్వేచ్ఛగా వ్యక్తీకరించేందుకు సమయం తీసుకున్నారో... కోల్‌కతా పోలీసులు విచారణ సమర్థంగా పూర్తి చేస్తారని అనుకున్నారో... ఈ ఘటనపై పార్టీ సుప్రీం మమత ముందుగా మాట్లాడితే బాగుండనుకున్నారో తెలియదు కానీ, పుణ్యకాలం కాస్తా గడిచిపోయింది. ఫలితంగా ప్రజల్లో నేతల పట్ల ఉండాల్సిన నమ్మకం సడలిపోయేందుకు కారణమైంది. ఓ దశాబ్ద కాలంలో మొదటిసారి పశ్చిమ బెంగాల్ ప్రజల్లో అనుమానపు ఛాయలు కమ్ముకున్నాయి.

ఆర్‌జీ కర్ ఆసుపత్రిలో జరిగిన దారుణ ఘటన తాలూకూ వివరాలు స్థూలంగా చూద్దాం. ఈ హత్యాచారం ఆగస్టు తొమ్మిది తెల్లవారుజామున మూడు నుంచి ఐదు గంటల మధ్య జరిగింది. సుమారు 36 గంటలపాటు ఏకబిగిన పని చేసి వచ్చిన ఆ యువ డాక్టర్ సెమినార్ రూములో కాస్త విశ్రాంతి తీసుకుందామని అనుకుంది. పోస్ట్‌మార్టమ్ తెలిపిన వివరాలు దారుణంగా ఉన్నాయి. గొంతు నులిమి చంపేశారు. ఈ క్రమంలో థైరాయిడ్ కణజాలం ముక్కలైనట్టుగా తెలుస్తోంది. జననాంగాల్లోనూ కనిపించిన లోతైన గాయాలు

సందర్భం



జ్యోతీ మల్హోత్రా

వికృత కామచేష్టల ఫలితంగా ఏర్పడి ఉంటాయి. కళ్లు, నోట్లోంచి కూడా రక్తం కారుతున్నట్లు వైద్యులు గుర్తించారు. సోషల్ మీడియాలో చలామణిలో ఉన్న చిత్రాలను చూస్తే ఆ వైద్యురాలి కాళ్లు అసహజ రీతిలో కనిపిస్తాయి. తుంటి భాగంలోని ఎముకల చట్రం ముక్కలైతేగానీ కాళ్లు అలా ఉండవని అంటున్నారు.

ఆగస్టు 9న ఈ ఘటన చోటు చేసుకుంటే... తరువాతి ఆరు రోజుల పాటు తృణమూల్ కాంగ్రెస్ ఎంపీలు, మమతా బెనర్జీ మేనల్లుడు అభిషేక్ బెనర్జీ రకరకాల వ్యవహారాల్లో మునిగి తేలారు కానీ దీని విషయంపై కిమ్మనలేదు. ప్యారిస్‌లో వినేశ్ ఫోగట్ పతకం రద్దు కావడంపై కొందరు మాట్లాడారు. మమత బెనర్జీ లాంటి వారైతే బంగ్లాదేశ్ ఘటన లపై వ్యాఖ్యానించినట్లు సమాచారం. వీళ్లందరూ మేల్కొనే లోపు... ఆర్‌జీ కర్ ఆసుపత్రి ప్రిన్సిపల్ రాజీనామా చేయడం... కొన్ని గంటల్లోనే ఆయనకు ఇంకో మంచి పోస్టు లభించడం జరిగిపోయాయి. బాధితురాలిది ఆత్మహత్య అని పోలీసులు చెప్పారనీ (వాస్తవానికి వారలా చెప్పలేదు)... తల్లిదండ్రులకు చెప్పకుండానే దహన సంస్కారాలు చేశారనీ (తల్లిదండ్రులే అంతిమ క్రియలు నిర్వహించారు) వదంతులు వేగంగా వ్యాపించాయి. అయినా మహిళా ఎంపీల 'ఎక్స్' ఖాతాలు మౌనంగానే ఉండిపోయాయి. ఆగస్టు 14 రాత్రి కోల్‌కతా నగరంలో జరిగిన భారీ ర్యాలీలో వేలాది మంది మహిళలు న్యాయం కోసం నినదించినా... తృణమూల్ నేతలు, ఎంపీలు కనుచూపు మేరలో ఎక్కడా కనిపించలేదు.

బాధితురాలికి ఓ టెలివిజన్ ఛానల్ 'అభయ' అని పేరు పెట్టింది. పన్నెండేళ్ల క్రితం జరిగిన 'నిర్భయ' ఘటనను గుర్తు చేస్తూ అన్నమాట. ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండగా జరిగిన ఈ దారుణకాండలో ముఖ్యమంత్రి షీలా దీక్షిత్ ఎలాగోలా ఆ అమ్మాయిని బతికించే ప్రయత్నం చేశారు కానీ ఫలించలేదు. రెండేళ్ల తరువాత జరిగిన ఎన్నికల్లో మన్మోహన్ సింగ్ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఓడిపోయింది. బీజేపీ గద్దెనెక్కింది. నిర్భయ ఒక రాజకీయ పార్టీకి గద్దెనెక్కే సువర్ణ అవకాశం కల్పించిందని చాలామంది అంటారు. 'అభయ' కూడా అలాంటిదేనని బీజేపీ బలంగా విశ్వసిస్తోంది. ఎన్నికలు దగ్గరలో లేనందున కనీసం కొంతమందినైనా తమవైపు తిప్పుకోవచ్చునని ఆశిస్తోంది. అమేథీలో ఓడిపోయిన స్మృతీ ఇరానీ వంటివారు అజ్ఞాతవాసం వీడి తొలిసారి టీవీలపై ప్రత్యక్షమైంది కూడా ఇందుకే.

అయితే యూపీ, బిహార్ వంటి హిందీ రాష్ట్రాలు... బెంగాల్ ఒక్కటి కాదని బీజేపీ ఇప్పటికే గుర్తించి ఉండాలి. హిందుత్వకు కొంత ఆదరణ పెరుగుతున్నప్పటికీ 'అభయ'పై జనాగ్రహం తృణమూల్‌పై వ్యతిరేకత నుంచి పుట్టుకొచ్చిందే కానీ, బీజేపీపై మక్కువతో కాదు. ప్రస్తుతానికి మమత ఈ జనాగ్రహాన్ని చల్లార్చడం ఎలా అన్నదానిపై దృష్టి పెట్టారు. నిరసన ప్రదర్శనలు కోల్‌కతాలో కొత్త కాకపోయినా... ప్రజల మాటలను, ఆగ్రహాన్ని పట్టించుకోకపోవడం మమతను దెబ్బతీసేవే. అందుకేనేమో... తమ ఎంపీలు, ఎమ్మెల్యేలు వెంటరాగా మమత స్వయంగా ర్యాలీలో పాల్గొన్నారు. బెంగాల్ కోసం మరోసారి పోరాడాల్సిందేనని ఎంపీలకు కూడా అర్థమై ఉంటుంది. లేదంటే, వాళ్లు కూడా బెంగాల్ 'లాపతా లేడీస్'గా మిగిలిపోతారు!

వ్యాసకర్త సీనియర్ సంపాదకురాలు
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

కశ్మీర్ ప్రజలు ఏమంటున్నారంటే...

విశ్లేషణ



జి. మురళీకృష్ణ

'జమ్మూ–కశ్మీర్ విభిన్న జాతులు, మతాలు, భాషలు, నైసర్గిక స్వరూపాలు కలిగిన ప్రాంతాల సమాహారం. ఏదో ఒక కారణంగా కశ్మీర్ రోజూ వార్తల్లో ఉంటోంది. పార్టీలు, నాయకులు, మేధావులు, జాతీయవాదులు ఏదో ఒక సందర్భంలో కశ్మీరు గురించి మాట్లాడుకుంటూనే ఉంటారు. దేశమంతా కశ్మీరు గురించి చర్చిస్తున్న విషయాల్నే కశ్మీరీలు మాట్లాడుకుంటున్నారా? అక్కడ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ అసలు కశ్మీరీల మనసుల్లో ఏముంది? అని అన్వేషించడానికి 'పీపుల్స్ పల్స్' బృందం క్షేత్రస్థాయిలో పర్యటించింది. కశ్మీరు లోయ నుంచి జమ్మూ మైదాన ప్రాంతాల వరకు... ఎందరో సామాన్య కశ్మీరీలతో మాట్లాడి, వారి మనసులో ఏముందో పసిగట్టే ప్రయత్నం చేసింది.

1977లో మొరార్జీ దేశాయ్ ప్రధానమంత్రి అయిన తర్వాత కశ్మీరులో జరిగిన అసెంబ్లీ ఎన్నిక ఒక్కటే ఈ 78 ఏళ్ల స్వతంత్ర భారతదేశ చరిత్రలో స్వేచ్ఛగా, న్యాయంగా జరిగిన ఎన్నిక అని కశ్మీరీలు అంటారు. అంతకు ముందు, ఆ తర్వాత జరిగిన ఎన్నికలన్నీ ఢిల్లీ పాలకులకు అనుకూలంగా జరిగిన ఎన్నికలేనని వారు భావిస్తున్నారు. జమ్మూ– కశ్మీరులో ఏ మూలకు వెళ్లి ఎవ్వరితో మాట్లాడినా... చాలా సమస్యలపై వారికి ఏకాభిప్రాయం లేనప్పటికీ, ఉమ్మడి అభిప్రాయం ఉన్నది ఒక విషయంలోనే: ఆ రెండు ప్రాంతాల్లోనూ ఎన్నికలు రావాలని బలంగా కోరుకుంటున్నారు.

2019 ఆగస్టు 5న ఎన్డీయే ప్రభుత్వం ఆర్టికల్ 370ని రద్దు చేయడంతో జమ్మూ–కశ్మీర్‌కు ఉన్న స్వయం ప్రతిపత్తి హోదా తొలగిపోయింది. రాష్ట్రాన్ని కశ్మీర్, లద్దాఖ్ అని రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజించింది. ఆ తర్వాత అక్కడ ఎన్నికలు జరగలేదు. 2023 డిసెంబరు 11న సుప్రీంకోర్టు, పూర్వ జమ్మూ–కశ్మీర్‌కి లభిస్తున్న స్వయంప్రతిపత్తి రద్దు నిర్ణయాన్ని సమర్థించింది. అయితే, రాష్ట్ర హోదాను పునరుద్ధరించి, ఈ సెప్టెంబర్ 30 నాటికి అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించాలని ఆదేశించింది. "ఇప్పుడు సుప్రీం కోర్టు ఆదేశాలతో ఎన్నికలు జరిగినా... మహా అయితే ఢిల్లీలో ఉన్న ప్రభుత్వం లాంటిది ఏర్పడవచ్చు. అక్కడ అన్ని కేంద్ర ప్రభుత్వమే నిర్ణయిస్తుంది. అలాంటి ప్రభుత్వం మాకొద్దు" అని శ్రీనగర్‌లో ఒక వ్యాపారి చెప్పాడు. ఇంచుమించు ఇదే అభిప్రాయం చాలా చోట్ల వినపడింది.

రాష్ట్ర హోదాపాలన విషయంలో ఢిల్లీ మోడల్‌ని, సామాన్య స్థానికులతో పాటు గతంలో బీజేపీకి ఓటేసిన వాళ్లే వ్యతిరేకిస్తున్నారు. బీజేపీకి బలమైన మద్దతుదారులుగా ఉన్న గుజ్జర్ సామాజిక వర్గం బీజేపీకి ఇప్పుడు దూరం జరిగింది. స్థానిక బీజేపీ నాయకులు కూడా జమ్మూ–కశ్మీర్‌కు పూర్తి స్థాయి రాష్ట్ర హోదాను పునరుద్ధరించాలని, ఢిల్లీ ప్రభుత్వం లాంటిది వద్దని చెప్తున్నారు. కశ్మీర్ విషయంలో తమది చరిత్రాత్మక నిర్ణయమని బీజేపీ దేశమంతా ప్రచారం చేసుకుంటోంది. కానీ, కశ్మీరులో స్థానిక బీజేపీ నాయకులు కూడా ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సరైనదే అని ధైర్యంగా చెప్పలేకపోతున్నారు. అందుకే, లోక్‌సభ ఎన్నికల్లో కశ్మీర్‌లో బీజేపీ తమ పార్టీ నుంచి అభ్యర్థిని నిలబెట్టలేదు. దీంతో రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ పరిస్థితిపై కొంత అనిశ్చితి నెలకొంది.

కశ్మీర్‌లో లెఫ్టినెంట్ గవర్నర్ (ఎల్జీ) మనోజ్ సిన్హా పాలన పట్ల



ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వంలో కొన్ని లోపాలు, వైఫల్యాలు ఉంటాయి. కానీ, అది మిలిటరీ సాయంతో ఇష్టారీతిన వ్యవహరిస్తున్న ఎల్జీ పాలన కంటే ఏ విధంగా చూసినా మెరుగ్గానే ఉంటుందని ప్రజలు భావిస్తున్నారు. "ఎల్జీకి, ప్రజలకు మధ్య సంబంధాలు తెగిపోయాయి. ఎన్నికలు లేకుండా వచ్చిన ఎల్జీ, అతని బ్యూరోక్రాట్ల బృందం నుంచి ప్రజాస్వామిక పరిపాలనను ఆశించలేం అని జమ్మూ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఒకరు అన్నారు.

ప్రజలకు, అధికారులకు మధ్య అంతరం పెరిగిపోయింది. మీడియాలో చూపించే వంతెనలు, అండర్ పాస్‌లను పక్కన పెడితే, స్థానిక ప్రాంతాలను కలిపే రోడ్లు అధ్వాన్నంగా తయారయ్యాయి. కొత్త రోడ్లు వేయడం, రోడ్లను రిపేర్ చేయడం పూర్తిగా ఆపేశారని ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మొత్తంగా పరిస్థితి చూస్తే, ఇప్పుడున్న దాని కన్నా 2019కి కంటే ముందే బాగుండేదని అనేక ఉదాహరణలు చెబుతున్నారు.

జమ్మూ, శ్రీనగర్‌లు గవర్నమెంట్ ప్రకటనల్లో మాత్రమే పేరుకు స్మార్ట్ సిటీలనీ, తగిన మౌలిక వసతులు లేక తమ వ్యాపారాలన్నీ దెబ్బతిన్నాయనీ స్థానిక వ్యాపారులు చెబుతున్నారు. బయటి రాష్ట్రాల నుంచి వచ్చిన వ్యాపారులు అక్రమ మైనింగ్ చేస్తున్నారనీ, బయట నుంచి వచ్చిన వాళ్లే మద్యం వ్యాపారం చేస్తున్నారనీ, ముఖ్యమైన స్థానాలన్నింటిలో బయటి రాష్ట్రాల నుంచి వచ్చిన అధికారులే ఉంటున్నారనీ, ఇది తమకు న్యాయం చేయడం లేదనీ ప్రజలు ఏకాభిప్రాయంతో ఆరోపిస్తున్నారు. "ఐఐఎం, ఐఐటీల్లో కూడా ముఖ్యమైన పదవుల్లో బయటి వాళ్లనే ఎందుకు నియమిస్తున్నారు? ఎందుకు అంత భయం?" అని అడ్వకేట్‌గా పనిచేస్తున్న షేక్ షకీల్ ప్రశ్నించారు.

"మాకు ఉద్యోగాలు లేవు, పెద్ద ఎత్తున రాష్ట్రానికి పెట్టుబడులు రావాల్సిన అవసరం ఉంది. మేం ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే దేశ ద్రోహుల కింద నేరం మోపుతున్నారు. గత 5 ఏళ్లుగా మేం ఎన్నుకోని ప్రభుత్వంలో ఉన్నాం" అనేది కశ్మీరీ యువత అభిప్రాయం.

చలికాలంలో జమ్మూ, వేసవికాలంలో శ్రీనగర్ నుంచి జరిగే దర్బార్ పాలనకు 2019లో ఎన్డీయే ప్రభుత్వం చెక్ పెట్టింది. దీనికి అనవసర ఖర్చు అవుతోందనీ, ఇది కూడా చరిత్రాత్మక నిర్ణయమనీ బీజేపీ ప్రచారం చేసుకుంది. కానీ, 5 ఏళ్ల తర్వాత చూస్తే దర్బార్‌ని పునరుద్ధరించాలని ప్రజలు కోరుకోవడం గమనార్హం. "దర్బార్ ఉన్నప్పుడు అధికారులు, వాళ్ల కుటుంబాలు ఇక్కడే బస చేసేవి. వారు జమ్మూలో ఐదారు నెలలు పెట్టే ఖర్చే మాకు ఆదాయం అయ్యేది. కానీ, ఇప్పుడు ఆ దారులన్నీ మూసుకుపోయాయ"ని జమ్మూ వ్యాపారి వికాస్ శర్మ చెప్పాడు. జనం కోరుతున్నట్టు దర్బార్‌ను పునరుద్ధరిస్తే, కేంద్ర ప్రభుత్వం ఇంకా చాలా నిర్ణయాలు వెనక్కి తీసుకోవాల్సి వస్తుందనీ, అందుకే తాము అడిగినా నాయకత్వం పట్టించుకోవడం లేదని స్థానిక బీజేపీ నాయకులు చెబుతున్నారు.

35 ఏళ్లలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో జమ్మూ–కశ్మీరులో 58.58 శాతం ఓటింగ్ నమోదైంది. గతంలో ఎన్నికలను బహిష్కరించిన ఈ ప్రాంతంలో, ప్రభుత్వాన్ని ఎన్నుకోవడానికి తపిస్తున్న ప్రజల గాఢమైన కోరికకు ఈ ఓటింగ్ శాతం అద్దం పడుతోంది. ప్రజాస్వామ్యాన్ని పునరిద్ధరించాలనీ, 'దిగుమతి' సర్కారు కాకుండా సామాన్యులకు అందుబాటులో ఉండే ప్రభుత్వం రావాలనీ కోరుకుంటున్న కశ్మీరీల కల నెరవేరుతుందా, లేదా అనేది ఇంకో నెలన్నరలో తేలనుంది.

వ్యాసకర్త పీపుల్స్‌పల్స్ రీసెర్చ్ సంస్థలో పరిశోధకులు

తెలుసుకొనవె యువతీ!

తమ సోదరులకూ, సోదరులుగా భావించేవారికీ రాఖీలు కొంటూ బిజీ అయిపోతున్నారు ఆడపడుచులు. రాఖీ కడితే అన్న తమ్ముళ్లు రక్షగా ఉంటారనే భరోసా వారిది. అయితే రాఖీ బంధం ఉన్నప్పటికీ చాలామంది పురుషులు తమ తోబుట్టువుల పైనా, సోదరీ సమానులపైనా అత్యాచారాలకు పాల్పడడం, హింసించడం గుర్తించాల్సిన వాస్తవం.

పరువు, ప్రతిష్ఠ అంటూ చేసే ప్రతి పరువు హత్యలో సోదరుల హస్తం లేకపోలేదు. భార్యాబిడ్డలు అంటూ... సొంత తల్లిదండ్రులనే కాక తమ తోడ పుట్టిన వారిని సైతం మరిచే సోదరులూ మనకు తెలుసు. తల్లితండ్రులు, విద్యావ్యవస్థలు నైతిక విలువలు నేర్పకపోవడం ఇందుకు ఒక కారణంగా చెప్పవచ్చు. ఆడపిల్లలు ముఖ్యంగా ఒంటరి యువతులు, మహిళలు, తల్లిదండ్రుల ప్రేమకు నోచుకోని వారు, సోదర ప్రేమ తెలియని వారు, నిస్సహాయులు, మానసికంగా బలహీనులు... సోదరులు అనుకున్న వారిని నమ్మి మోసపోతుంటారు. ఫలితంగా మానసిక రుగ్మతలకు లోనై, శారీరక అనారోగ్యానికి కూడా గురవుతూ ప్రాణాల మీదకు తెచ్చుకున్న ఉదాహరణలూ లేకపోలేదు.



అవతలి వారు తోడపుట్టిన వారైనా, అక్కున చేర్చుకున్న వారైనా... వారిని, వారి స్వభావాలను, పరిస్థితులను గమనిస్తూ జాగ్రత్తగా ఉండడం మంచిది. ఏ వ్యక్తినైనా నమ్మి ఆధారపడడం కన్నా ముందుగా ప్రతి ఆడపిల్ల తనను తాను స్వతంత్ర భావాలు కలిగిన దానిగా, అవసరం వచ్చినప్పుడు తనకు తాను నిలబడి, ఎవరి కోసం చేయి చాచని వనితగా మలచుకోవాలి. పరిధి దాటి ప్రవర్తిస్తే అది ఎవరయినా... అపర కాళికలా నిలబడి తనని తాను కాపాడుకోగలగాలి. కాదు, వద్దు, లేదు అన్న పదాలను... తన భావోద్వేగాలను గెలిచి ప్రకటించేలా, తనను తాను నిర్మించుకోవాలి. పురుషులూ తమ తోడబుట్టిన వాళ్లు, సోదరులని భావించిన వాళ్లనే కాక ప్రతి ఆడపిల్ల పట్ల బాధ్యతగా వ్యవహరించాలి, ప్రవర్తించాలి.

తన చేతి వేలు తెగినప్పుడు చెంగు చించి కట్టుకట్టినందుకు బదులుగా ఆపదలో ఉన్న ద్రౌపదికి తానే దైవమై ఆదుకున్నాడు కనుక శ్రీకృష్ణుడు ఆదర్శమైన అన్న అయ్యాడు. అలాగే అందరూ అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్లు–బంధం ఏదైనా బాధ్యతగా, ఒకరికొకరు రక్షకులుగా ఉంటూ, ఒక సురక్షిత సమాజాన్ని నెలకొల్పి, భావితరాలకు రక్షాబంధన్ విలువను అందించాలని ఆశిద్దాం.

– ఒ. ప్రణతి; రీసెర్చ్ స్కాలర్ – సెస్, హైదరాబాద్

క్లుప్తంగా...

ఆస్తుల నిరూపణ బాధ్యత నిందితులదే: హైకోర్టు



సాక్షి, హైదరాబాద్: అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ)కు సంబంధించిన కేసులలో ఆస్తులు ఎలా వచ్చాయో నిరూపించుకునే బాధ్యత నిందితులదేనని హైకోర్టు స్పష్టం చేసింది. నిందితులు ఆస్తులు ఎలా సంపాదించారో తేల్చాల్సిన అవసరం ప్రాసిక్యూషన్‌కు ఉండదని పేర్కొంది. ఈ మేరకు అప్పీల్‌కు వచ్చిన ఓ మాజీ పోస్ట్‌మ్యాన్‌కు తేల్చి చెబుతూ... ట్రయల్ కోర్టు విధించిన శిక్షా కాలాన్ని తగ్గించింది. హైదరాబాద్‌లోని ముషీరాబాద్ పోస్టాఫీస్‌లో పోస్టుమ్యాన్‌గా పనిచేసిన సురేందర్‌కు ఆదాయానికి మించి ఆస్తులున్నట్లు గుర్తించి 2005లో ఏసీబీ కేసు నమోదు చేసింది. ఈ కేసు విచారణ జరిపిన ఏసీబీ కోర్టు మూడేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ 2012లో తీర్పునిచ్చింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ సురేందర్...హైకోర్టులో 2012లో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ కె.సురేందర్ విచారణ చేపట్టారు. వాదనల అనంతరం మూడేళ్ల శిక్షను ఏడాదికి తగ్గిస్తూ తీర్పునిచ్చింది. దీంతోపాటు బెయిల్‌పై ఉన్న పిటిషనర్‌ను వెంటనే జైలుకు పంపాలని..గతంలో జైలులో ఉన్న రోజులను శిక్షాకాలం నుంచి తగ్గించాలని ఆదేశించింది.

త్వరలో స్వస్థలానికి రాజేశ్ మృతదేహం

- అధికారులతో మాట్లాడిన ఎమ్మెల్యే 'రేవూరి'

ఆత్మకూరు: అమెరికాలో మృతి చెందిన హనుమకొండ జిల్లా ఆత్మకూర్‌కు చెందిన ఏరుకొండ రాజేశ్ మృతదేహాన్ని స్వస్థలానికి తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నట్టు పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి తెలిపారు. బిడ్డ మృతదేహాన్ని తీసుకురావాలని తల్లి నీలమ్మ వేడుకున్న నేపథ్యంలో ఆయన స్పందించారు. ఎమ్మెల్యే శనివారం మృతుని కుటుంబ సభ్యులతో మాట్లాడి భరోసా ఇచ్చారు. కలెక్టర్ ప్రావీణ్యతో కూడా మాట్లాడి రాజేశ్ మృతదేహాన్ని భారత్‌కు తీసుకొచ్చే విషయమై చర్యలు చేపట్టాలని సూచించారు. సీఎం రేవంత్‌రెడ్డితో కూడా మాట్లాడి మృతదేహాన్ని తీసుకొచ్చే ప్రయత్నాలు చేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు.

సుంకిశాల ఘటనలో మరొకరిపై బదిలీ వేటు

సాక్షి, హైదరాబాద్: సుంకిశాల ఘటనలో మరొకరిపై బదిలీ వేటు పడింది. సుంకిశాల ప్రాజెక్టు ఇన్‌టేక్ వెల్ రక్షణ గోడ కుప్పకూలిన ఘటనపై సమాచారం అందించడంలో నిర్లక్ష్యం వహించిన జలమండలి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సత్యనారాయణను బదిలీ చేస్తూ ప్రభుత్వం శనివారం ఆదేశాలు జారీ చేసింది. సత్యనారాయణ పదవీ విరమణ చేసినప్పటికీ తొమ్మిదేళ్లుగా ఈడీగా కొనసాగుతున్నారు. ఇటీవల ఆయన పదవీకాలం మరో ఏడాది పొడిగించిన విషయం తెలిసిందే. తాజాగా మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు బదిలీ చేస్తూ మున్సిపల్ కార్యదర్శి దాన కిశోర్ ఉత్తర్వులు జారీ చేశారు.

ఉచిత బస్సులతో మహిళలు ఆర్థికంగా బలోపేతం

- కాంగ్రెస్ వార్‌రూమ్ చైర్మన్ పవన్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ఆర్టీసీ బస్సుల్లో ఉచిత బస్సు ప్రయాణ పథకం వల్ల మహిళలు ఆర్థికంగా బలోపేతం అవుతున్నారని కాంగ్రెస్ వార్‌రూమ్ చైర్మన్ పవన్ మల్లాది పేర్కొన్నారు. గాంధీభవన్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉచిత బస్సు ప్రయాణంపై తాము సర్వే నిర్వహించామని, ఎక్కువగా మహిళా రైతులే ఈ ఉచిత సౌకర్యాన్ని వినియోగించుకుంటున్నట్లు తమ సర్వేలో తేలిందని చెప్పారు. వారి తర్వాత విద్యార్థినులు ఎక్కువగా ప్రయాణిస్తున్నారని, ఆ తర్వాత స్థానంలో మహిళా కూలీలున్నారని వెల్లడించారు. మహిళలకు ఇంత ప్రయోజనం కల్పిస్తున్న ఆర్టీసీ బస్సు ఉచిత ప్రయాణంపై బీఆర్‌ఎస్ నేతలు అడ్డగోలుగా మాట్లాడటం సరికాదన్నారు.

సోదరుడితో భూ తగాదా.. రైతు ఆత్మహత్య

షాద్‌నగర్ రూరల్: భూ తగాదాతో మనస్తాపం చెందిన రైతు నడిరోడ్డుపై పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన శనివారం సాయంత్రం రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణంలోని హాజిపల్లి రోడ్డులో చోటు చేసుకుంది. బాధితుని కుమారుడి కథనం ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా లింగాలకు చెందిన నాగయ్య, తిరుపతయ్య (58) అన్నదమ్ములు. ప్రస్తుతం షాద్‌నగర్‌లో ఉంటున్న ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగి అయిన నాగయ్య.. తండ్రి పేరున ఉన్న భూమిని కొంత అమ్ముకున్నాడు. మిగిలిన భూమిని తిరుపతయ్య తన పేరుపై విరాసత్ చేసుకున్నాడు. అందులో తనకూ వాటా వస్తుందంటూ నాగయ్య కోర్టుకెళ్లి స్టే తెచ్చుకున్నాడు. ఇటీవల తిరుపతయ్య అప్పులు తీర్చుకునేందుకు కొంత భూమిని విక్రయించాలనుకున్నాడు. విషయం కోర్టులో ఉండటంతో అది సాధ్యం కాలేదు. ఈ క్రమంలో శనివారం నాగయ్యతో భూమి విషయం మాట్లాడేందుకు తిరుపతయ్య లింగాల నుంచి షాద్‌నగర్ వచ్చాడు. వివాదం ఎటూ తేలకపోవడంతో మనస్తాపానికి గురై హాజిపల్లి రోడ్డుపై పురుగుమందు తాగగా, స్పృహ కోల్పోయి అక్కడే మృతిచెందాడు. పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

రామోజీ ఆర్థిక నేరగాడే

ఆర్‌బీఐ నివేదికను బట్టి సుస్పష్టం
'మార్గదర్శి' సేకరించిన రూ.2,600 కోట్లకు పైగా డిపాజిట్లన్నీ చట్ట విరుద్ధమే
45 ఎస్ నిబంధన ఉల్లంఘన.. బాధ్యులను ప్రాసిక్యూట్ చేయాల్సిందేనని తేల్చిన ఆర్‌బీఐ



సాక్షి, అమరావతి: మార్గదర్శి ఫైనాన్సియర్స్ నిర్భీతిగా నిబంధనలను ఉల్లంఘించి ఆర్థిక దోపిడీకి పాల్పడినట్లు స్పష్టమైంది. మార్గదర్శి ఫైనాన్సియర్స్‌కు కూడా చైర్మన్‌గా వ్యవహరించిన ఈనాడు అధిపతి చెరుకూరి రామోజీరావు (ఇటీవల మరణించారు) ఆర్థిక ఉగ్రవాదేనని తేటతెల్లమైంది. చట్టానికి తాను అతీతమన్నట్టుగా దశాబ్దాలుగా ఆర్థిక ఉగ్రవాదానికి పాల్పడి భారీగా దోపిడీకి తెగించినట్లు నిగ్గు తేలింది. మార్గదర్శి ఫైనాన్సియర్స్ నిబంధనలకు విరుద్ధంగా ప్రజల నుంచి అక్రమ డిపాజిట్లు వసూలు చేసినట్లు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) మరోసారి విస్పష్టంగా ప్రకటించింది. ఈ మేరకు తాజాగా తెలంగాణ హైకోర్టుకు ఈ నెల 13న లిఖితపూర్వకంగా కౌంటర్‌లో నివేదించింది. ఈ నేపథ్యంలో మార్గదర్శి ఫైనాన్సియర్స్ అక్రమ డిపాజిట్ల దందా పూర్వాపరాలివి.

ఆర్‌బీఐకి తెలియకుండానే....

హిందూ అవిభాజ్య కుటుంబం (హెచ్‌యూఎఫ్) కింద మార్గదర్శి ఫైనాన్సియర్స్ ఏర్పాటైంది. ఈ హెచ్‌యూఎఫ్‌కు రామోజీరావు కర్త. డిపాజిట్లు వసూలు చేసేందుకు హెచ్‌యూఎఫ్‌లకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అనుమతివ్వదు. ఇక్కడ ఆసక్తికర విషయం ఏమిటంటే అసలు మార్గదర్శి ఫైనాన్సియర్స్ అనే సంస్థ ఉన్నట్లు రిజర్వ్ బ్యాంకుకే తెలియదు. ఎందుకంటే రిజర్వ్ బ్యాంకు అనుమతి లేకుండానే రామోజీరావు నేతృత్వంలోని మార్గదర్శి ఫైనాన్సియర్స్ తన కార్యకలాపాలను కొనసాగించింది. ఆర్‌బీఐ చట్ట నిబంధనలకు విరుద్ధంగా 2006 మార్చి నాటికి దాదాపు 2.75 లక్షల మంది డిపాజిటర్ల నుంచి రూ.2,610.38 కోట్లను డిపాజిట్లుగా సేకరించింది. ఇంత భారీ మొత్తాల్లో డిపాజిట్లు వసూలు చేసిన మార్గదర్శి అప్పట్లో ప్రతీ సంవత్సరం వందల కోట్ల రూపాయల్లో నష్టాలు చూపింది. 2000 మార్చి 30వ తేదీ నాటికి 619.25 కోట్లను డిపాజిట్ల రూపంలో వసూలు చేయగా, 2006 మార్చి 30 నాటికి వసూలు చేసిన డిపాజిట్ల మొత్తాన్ని రూ.2,610.38 కోట్లుగా చూపింది. ఇంత పెద్ద మొత్తంలో డిపాజిట్లు వసూలు చేసినప్పటికీ 2006 మార్చి నాటికి రూ.1,369.47 కోట్లను వృద్ధి చెందుతున్న నష్టాలుగా చూపింది. అంటే 50 శాతం డిపాజిటర్లకు డిపాజిట్లు చెల్లించలేని పరిస్థితికి మార్గదర్శి ఫైనాన్సియర్స్ చేరింది. డిపాజిటర్లకు వడ్డీలు, మెచ్యూరిటీ మొత్తాలు చెల్లించేందుకు మళ్లీ డిపాజిట్లు తీసుకోవడం మొదలు పెట్టింది. ఇలా మార్గదర్శి ఆర్థికంగా మనుగడ సాగించింది.

ఉండవల్లి ఫిర్యాదుతో కదిలిన పునాదులు...

మార్గదర్శి ఫైనాన్సియర్స్ చట్ట ఉల్లంఘనలపై 2006లో అప్పటి కాంగ్రెస్ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఫిర్యాదు చేయడంతో ఈ అక్రమ డిపాజిట్ల కథ వెలుగులోకి వచ్చింది. ఉండవల్లి ఫిర్యాదును కేంద్ర ప్రభుత్వం ఆర్‌బీఐకి పంపింది. దీంతో ఆర్‌బీఐ మార్గదర్శి ఫైనాన్సియర్స్ వివరణ కోరింది. ఆర్‌బీఐ చట్టంలోని సెక్షన్ 45(ఎస్) హిందూ అవిభక్త కుటుంబం (హెచ్‌యూఎఫ్)కు వర్తించదని మార్గదర్శి ఆర్‌బీఐకి రాతపూర్వకంగా తెలిపింది. అందులో ఎక్కడా కూడా డిపాజిట్లు వసూలు చేయలేదని మాత్రం చెప్పలేదు. అంతేకాక 2006 సెప్టెంబర్ 16 నుంచి రూ.లక్ష అంతకన్నా తక్కువ మొత్తాలను డిపాజిట్లుగా స్వీకరించడాన్ని నిలిపేశామని ఆర్‌బీఐకి చెప్పింది. ఈ వివరాలను ఆర్‌బీఐ అప్పటి రాష్ట్ర ప్రభుత్వానికి పంపింది. డిపాజిటర్ల పరిరక్షణ చట్టం కింద చర్యలు తీసుకునే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి మాత్రమే ఉందని ఆర్‌బీఐ స్పష్టంగా చెప్పింది.

అక్రమాల నిగ్గు తేల్చే బాధ్యత రంగాచారికి...

ఆర్‌బీఐ సూచన మేరకు అప్పటి రాష్ట్ర ప్రభుత్వం డిపాజిటర్ల ప్రయోజనాల పరిరక్షణపై దృష్టిపెట్టింది. ఇందులో భాగంగా డిపాజిటర్ల ప్రయోజనాలను పరిరక్షించడంతోపాటు మార్గదర్శి ఫైనాన్సియర్స్ అక్రమాలను, అవకతవకలను నిగ్గు తేల్చి నివేదిక ఇచ్చేందుకు అప్పటి ప్రభుత్వ సలహాదారు (ఫైనాన్స్) ఎన్.రంగాచారిని నియమిస్తూ 2006 డిసెంబర్ 19న జీవో జారీ చేసింది. అలాగే మార్గదర్శి ఫైనాన్సియర్స్‌పై చట్ట ప్రకారం న్యాయస్థానాల్లో ఫిర్యాదు చేసేందుకు, తదనుగుణంగా చర్యలు తీసుకునేందుకు ఐపీఎస్ అధికారి టి.కృష్ణరాజును అధీకృత అధికారిగా నియమించింది. దీంతో ఉలిక్కిపడ్డ రామోజీరావు... మార్గదర్శి ఫైనాన్సియర్స్ ద్వారా అటు రంగాచారి, ఇటు కృష్ణరాజు నియామకాలను సవాలు చేస్తూ 2006లో హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేయించారు. ఈ పిటిషన్లపై విచారణ జరిపిన హైకోర్టు వారి నియామకాలను రద్దు చేసేందుకు తిరస్కరిస్తూ మార్గదర్శి ఫైనాన్సియర్స్ పిటిషన్లను కొట్టేసింది.

రంగాచారి నివేదికలోని కీలక అంశాలు

- రంగాచారి విచారణకు రామోజీరావు, మార్గదర్శి ఎంతమాత్రం సహకరించలేదు. కార్యాలయాల్లో తనిఖీలకు అడ్డుపడ్డారు. కావాల్సిన డాక్యుమెంట్లు ఇవ్వకుండా ముప్పుతిప్పలు పెట్టారు. తమ పిటిషన్లు కోర్టుల ముందు పెండింగ్‌లో ఉన్నాయని, అందువల్ల డాక్యుమెంట్లు ఇచ్చేది లేదన్నారు. చివరకు ఆదాయపు పన్ను శాఖ ఇచ్చిన అన్నీ డాక్యుమెంట్లను పరిశీలించిన రంగాచారి 2007 ఫిబ్రవరి 19న తన నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించారు.
- ఆర్‌బీఐ చట్టంలోని సెక్షన్ 45(ఎస్)కు విరుద్ధంగా మార్గదర్శి ఫైనాన్సియర్స్ డిపాజిట్లు సేకరించిందని రంగాచారి తేల్చారు.
- డిపాజిటర్లకు వడ్డీ చెల్లించే అలవాటే మార్గదర్శికి లేదని, ఒత్తిడి చేస్తేనే చెల్లిస్తుందంటూ ఓ డిపాజిటర్ హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌లో పేర్కొన్న విషయాన్ని రంగాచారి తన నివేదికలో పొందుపరిచారు.
- డిపాజిట్లను తిరిగి చెల్లించే స్థితిలో మార్గదర్శి ఫైనాన్సియర్స్ లేదని, దాని ఆర్థిక పరిస్థితి దారుణంగా ఉందని ఆయన తన నివేదికలో పేర్కొన్నారు. మార్గదర్శి ఫైనాన్సియర్స్ తీవ్ర నష్టాల్లో ఉండటమే అందుకు కారణమని స్పష్టంచేశారు.
- రామోజీరావు తన అనుబంధ కంపెనీలకు మార్గదర్శి ఫైనాన్సియర్స్ నిధులను మళ్లించడమే నష్టాలకు ప్రధాన కారణమని రంగాచారి తేల్చారు. క్రియాశీలకంగా లేని అనేక కంపెనీలకు మార్గదర్శి నిధులను బదలాయించినట్లు వారు సమర్పించిన డాక్యుమెంట్లే స్పష్టంగా చెబుతున్నాయని పేర్కొన్నారు.
- రామోజీ గ్రూపులోని ఇతర కంపెనీల్లో కూడా ఇలాగే ఒక గ్రూపు నిధులను మరో గ్రూపునకు బదలాయించడం జరిగిందని పేర్కొన్నారు.
- 2000, ఆ తర్వాత సంవత్సరాల్లోని బ్యాలెన్స్ షీట్‌లను గమనిస్తే మార్గదర్శి ఫైనాన్సియర్స్‌లో రామోజీ ఒక్క రూపాయి కూడా పెట్టుబడి పెట్టలేదని నివేదికలో స్పష్టంచేశారు. మొత్తం ప్రజల నుంచి వసూలు చేసిన డిపాజిట్లతోనే మార్గదర్శిని నడిపారని తెలిపారు.
- ఉషోదయ ఎంటర్‌ప్రైజెస్ తప్ప మిగిలిన అన్నీ కంపెనీలు నష్టాల్లో ఉన్నట్లు బ్యాలెన్స్ షీట్ల పరిశీలన ద్వారా తెలిసిందని రంగాచారి తన నివేదికలో వివరించారు. డిపాజిటర్ల ప్రయోజనాలను కాపాడేందుకు మార్గదర్శి ఏం చేయాలో కూడా రంగాచారి తన నివేదికలో చెప్పారు.

ప్రాసిక్యూషన్ కోసం కృష్ణరాజు ఫిర్యాదు

చట్ట ఉల్లంఘనలకు పాల్పడినందుకు మార్గదర్శి ఫైనాన్సియర్స్, హెచ్‌యూఎఫ్ కర్త రామోజీరావులను ప్రాసిక్యూట్ చేయాలని కోరుతూ అధీకృత అధికారి టి.కృష్ణరాజు 2008, జనవరి 23న నాంపల్లి మొదటి అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టులో క్రిమినల్ ఫిర్యాదు (సీసీ నెంబర్ 540) దాఖలు చేశారు. ఆర్‌బీఐ చట్టంలోని సెక్షన్ 45(ఎస్)కు విరుద్ధంగా ప్రజల నుంచి డిపాజిట్లు స్వీకరించడం నిషిద్ధమని, అయితే మార్గదర్శి ఫైనాన్సియర్స్ ఇందుకు విరుద్ధంగా డిపాజిట్లు సేకరించి నేరం చేసిందని ఆయన తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇది ఆర్‌బీఐ చట్టంలోని సెక్షన్ 58ఈ కింద శిక్షార్హమని తెలిపారు. ఈ ఫిర్యాదును కొట్టేయాలని కోరుతూ మార్గదర్శి 2008లో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. విచారణ జరిపిన హైకోర్టు ధర్మాసనం, మార్గదర్శిపై కృష్ణరాజు దాఖలు చేసిన ఫిర్యాదును కొట్టేసేందుకు నిరాకరించింది.

మార్గదర్శిపై చర్యల నిలిపివేతకు సుప్రీంకోర్టు తిరస్కృతి

కృష్ణరాజు దాఖలు చేసిన ఫిర్యాదులో రామోజీరావు 2010లో ఓ అనుబంధ పిటిషన్ దాఖలు చేశారు. ఫిర్యాదులో విచారణను సెక్షన్ 45(ఎస్)(1), 45(ఎస్)(2), 58బీ(5ఏ) రెడ్ విత్ సెక్షన్ 58(ఈ)లకే పరిమితం చేసేలా ఆదేశాలు ఇవ్వాలని నాంపల్లి కోర్టును కోరారు. ఈ అభ్యర్థనను నాంపల్లి కోర్టు తోసిపుచ్చుతూ 2011లో ఉత్తర్వులిచ్చింది. ఈ ఉత్తర్వులపై మార్గదర్శి, రామోజీరావు హైకోర్టును ఆశ్రయించారు. హెచ్‌యూఎఫ్ అయిన మార్గదర్శి ఫైనాన్సియర్స్ ఆర్‌బీఐ చట్టంలోని సెక్షన్ 45ఎస్ పరిధిలోకి రాదంటూ వాదించారు. ఈ వ్యాజ్యంపై విచారణ జరిపిన అప్పటి న్యాయమూర్తి జస్టిస్ తేలప్రోలు రజనీ... మార్గదర్శిపై కృష్ణరాజు దాఖలు చేసిన ఫిర్యాదులో తదుపరి చర్యలన్నీ నిలిపేస్తూ 2011లో మధ్యంతర ఉత్తర్వులిచ్చారు. ఆ తర్వాత ఈ వ్యవహారం సుప్రీంకోర్టుకు చేరింది. సుప్రీంకోర్టు నాంపల్లి కోర్టు ముందున్న ఫిర్యాదు (సీసీ 540)లో తదుపరి చర్యలను నిలిపేసేందుకు నిరాకరించింది. అలాగే హైకోర్టు ఇచ్చిన స్టే ఉత్తర్వులను కొనసాగించేందుకు సైతం నిరాకరించింది.

ఉమ్మడి హైకోర్టుకు చివరి రోజున..

ఆ తర్వాత 2019, జనవరి ఒకటో తేదీన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు విభజన జరిగింది. అంటే 31.12.2018న ఉమ్మడి హైకోర్టుకు చివరి రోజు. అందరూ విభజన పనుల్లో నిమగ్నమయ్యారు. అటు న్యాయవాదులు, ఇటు న్యాయమూర్తులు అందరూ భావోద్వేగ వాతావరణంలో ఉన్నారు. కేసుల విచారణపై ఎవరూ దృష్టి సారించలేని పరిస్థితి. ఇదే అదనుగా భావించిన రామోజీరావు నాంపల్లి కోర్టులో కృష్ణరాజు ఫిర్యాదును కొట్టేయాలంటూ 2011లో దాఖలు చేసిన తన వ్యాజ్యాలను 2018, డిసెంబర్ 31వ తేదీన విచారణకు తెప్పించారు. ఈ వ్యాజ్యాలపై న్యాయమూర్తి జస్టిస్ తేలప్రోలు రజనీ విచారణ జరిపారు. రామోజీరావు తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా వాదనలు విన్న జస్టిస్ రజనీ అదే రోజున... అంటే 2018, డిసెంబర్ 31న తీర్పు కూడా ఇచ్చేశారు. హెచ్‌యూఎఫ్ ఆర్‌బీఐ చట్టంలోని సెక్షన్ 45ఎస్ పరిధిలోకి రాదని జస్టిస్ రజనీ తన తీర్పులో తేల్చేశారు. మార్గదర్శి, రామోజీరావులను ప్రాసిక్యూట్ చేయాలని కోరుతూ నాంపల్లి కోర్టులో కృష్ణరాజు దాఖలు చేసిన ఫిర్యాదును కొట్టేస్తూ తీర్పునిచ్చారు.

మార్గదర్శి, రామోజీకి క్లీన్‌చిట్ ఇచ్చేసిన జడ్జి...

డిపాజిట్ల సేకరణ విషయంలో మార్గదర్శి ఫైనాన్సియర్స్, రామోజీరావులకు అసలు ఎలాంటి దురుద్దేశాలు లేవంటూ న్యాయమూర్తి సర్టిఫికెట్ ఇచ్చేయడం ఈ తీర్పులో ఆసక్తికర విషయం. అంతేకాక డిపాజిట్లను తిరిగి చెల్లించే ప్రక్రియను మొదలుపెట్టారని చెప్పిన హైకోర్టు, పరోక్షంగా మార్గదర్శి, రామోజీరావు చట్ట విరుద్ధంగా డిపాజిట్లు సేకరించిన విషయాన్ని నిర్ధారించినట్లు అయింది. ఇంత పెద్ద కేసులో ఒకే రోజు విచారణ జరిపి తీర్పునివ్వడం విశేషం. అసలు ఈ కేసు విచారణకు వచ్చినట్లు గానీ, న్యాయమూర్తి ఈ విధంగా తీర్పునిచ్చినట్లు గానీ ఎవరూ గుర్తించలేదు. ఆ తర్వాత కొద్ది నెలలకు ఈ తీర్పు వెలుగు చూసింది. దీంతో మార్గదర్శి ఫైనాన్సియర్స్ కుంభకోణాన్ని బయటపెట్టిన మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ అప్రమత్తమై హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2019లో ఇంప్లీడ్ అయింది.

హైకోర్టు తీర్పును కొట్టేసిన సుప్రీంకోర్టు..

హైకోర్టు తీర్పుపై ఉండవల్లి అరుణ్‌కుమార్, మార్గదర్శి, రామోజీరావు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం వేర్వేరుగా దాఖలు చేసిన వ్యాజ్యాలపై సుప్రీంకోర్టు 2020 నుంచి విచారిస్తూ వచ్చింది. ఆ తర్వాత ఈ వ్యాజ్యాల్లో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాను కూడా ప్రతివాదిగా చేర్చింది. విచారణ సందర్భంగా ఆర్‌బీఐ తరఫు న్యాయవాది కూడా మార్గదర్శి, రామోజీరావు చట్ట ఉల్లంఘనలకు పాల్పడ్డారని మౌఖికంగా కోర్టుకు తెలిపారు. చివరగా ఈ ఏడాది ఏప్రిల్ 9న సుప్రీంకోర్టు ఈ వ్యాజ్యాలన్నింటిపై విచారణ జరిపింది. చట్ట ఉల్లంఘనలకు పాల్పడినందుకు రామోజీరావు, మార్గదర్శి ఫైనాన్సియర్స్‌ను ప్రాసిక్యూట్ చేయాలని కోరుతూ కృష్ణరాజు నాంపల్లి కోర్టులో దాఖలు చేసిన ఫిర్యాదును కొట్టేస్తూ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తేలప్రోలు రజనీ ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు రద్దు చేసింది. డిపాజిట్లు తిరిగి ఇచ్చేశామని, తమపై కేసులు కొట్టేయాలంటూ రామోజీ, మార్గదర్శి ఫైనాన్సియర్స్ చేసిన అభ్యర్థనలను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. మార్గదర్శి ఫైనాన్సియర్స్ చట్ట విరుద్ధంగా డిపాజిట్ల సేకరణపై నిగ్గు తేలాల్సిందేనని చెప్పింది. మార్గదర్శి, రామోజీరావులకు అనుకూలంగా హైకోర్టు ఏకపక్షంగా ఇచ్చిన తీర్పును పక్కనపెడుతున్నామని సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. కేసు లోతుల్లోకి వెళ్లి అందరి వాదనలు వినాలని తెలంగాణ హైకోర్టుకు స్పష్టం చేసింది. సీనియర్ న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం ఈ కేసు విచారించాలని స్పష్టంచేసింది. తాజాగా విచారణ జరిపి ఆరు నెలల్లో విచారణను ముగించాలని హైకోర్టుకు సూచించింది.

కేసును నిలబెట్టిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం

2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఈ కేసు విషయంలో బాధ్యతాయుతంగా వ్యవహరించింది. మార్గదర్శి ఫైనాన్సియర్స్‌కు వ్యతిరేకంగా ఉండవల్లి అరుణ్‌కుమార్ సుప్రీంకోర్టులో వేసిన పిటిషన్‌లో ఏపీ ప్రభుత్వం ఇంప్లీడ్ కావడం ద్వారా కేసు నీరుగారిపోకుండా చూడగలిగింది. పత్రికా స్వేచ్ఛ ముసుగులో ఈ కేసు నుంచి బయటపడేందుకు నాడు రామోజీరావు వేసిన ఎత్తుగడ బెడిసికొట్టింది. ఈనాడు పత్రికకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వ్యతిరేకం కాబట్టే ఈ కేసు విషయంలో పట్టుబడుతోందని రామోజీరావు తరఫున ప్రముఖ న్యాయవాదులు వినిపించిన వాదనలను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది.

యావజ్జీవ ఖైదు... రెండింతల జరిమానా

ఈ అక్రమ డిపాజిట్ల కేసులో నేరం నిరూపితమైతే భారీ జరిమానాతోపాటు ఆ సంస్థ బాధ్యులకు రెండేళ్ల నుంచి యావజ్జీవ జైలు శిక్ష వరకు పడే అవకాశం ఉందని ఈ ఏడాది ఏప్రిల్‌లో న్యాయ నిపుణులు అభిప్రాయపడ్డారు. ఆ సంస్థ చైర్మన్ రామోజీరావు ఇటీవల మృతిచెందారు. కానీ నేరం రుజువైతే నేరంగానే పరిగణిస్తారు. ఆ సంస్థ నిర్వాహకులు అందుకు బాధ్యత వహించక తప్పదు. ఇక సేకరించిన అక్రమ డిపాజిట్లు రూ.రూ.2,610.38కోట్లకు రెట్టింపు జరిమానా విధించే అవకాశం ఉంది.

మరిన్ని వివరాలకు, వార్తలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

ఆ డిపాజిట్లు చట్టవిరుద్ధం

▶ మొదటి పేజీ తరువాయి

చేర్చి కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశించింది. ఈ మేరకు ఆర్బీఐ పూర్తి వివరాలతో తాజాగా కౌంటర్ దాఖలు చేసింది.

ఆర్బీఐ కౌంటర్‌లో ముఖ్యాంశాలివీ...

సెక్షన్ 45 ఎస్‌ను సుప్రీంకోర్టు గతంలోనే సమర్థించింది...

'1997లో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చట్ట సవరణలో భాగంగా సెక్షన్ 45 ఎస్‌ను కూడా సవరించాం. ఓ వ్యక్తి వ్యక్తిగతంగా, సంస్థగా, వ్యక్తుల సమూహంతో కూడిన అన్ ఇన్‌కార్పొరేటెడ్‌లు ప్రజల నుంచి డిపాజిట్లు వసూలు చేయడాన్ని పూర్తిగా నిషేధించాం. చట్ట సవరణ వల్ల నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీల వ్యాపారాన్ని సమర్థంగా నియంత్రించేందుకు మాకు అధికారం లభించింది. కంపెనీలు నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ లావాదేవీలు చేపట్టాలంటే మా నుంచి తప్పనిసరిగా అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. సెక్షన్ 45 ఎస్ చట్టబద్ధతను సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో 2000లో పిటిషన్ దాఖలైంది. దీనిపై విచారణ జరిపిన సుప్రీంకోర్టు సెక్షన్ 45 ఎస్‌ను సమర్థించింది. చట్ట ప్రకారం వ్యక్తులు, అన్ ఇన్ కార్పొరేటెడ్ కంపెనీలు చేసే వ్యాపారాన్ని సెక్షన్ 45 ఎస్ కింద ఆర్‌బీఐ నిషేధించలేదని సుప్రీంకోర్టు స్పష్టంగా చెప్పింది. అన్ ఇన్ కార్పొరేటెడ్ సంస్థలు తమ స్వీయ నిధులతో లేదా బంధువుల వద్ద రుణంగా తీసుకున్న నిధులతో లేదా ఆర్థిక సంస్థల నుంచి తీసుకున్న నిధులతో వ్యాపారం చేసుకోవచ్చు. అంతేగానీ ప్రజల నుంచి డిపాజిట్లు వసూలు చేసి వాటి ద్వారా వ్యాపారం చేయడానికి వీల్లేదు' అని ఆర్బీఐ తన కౌంటర్‌లో తేల్చి చెప్పింది.

రెండేళ్ల జైలు.. రెండింతల జరిమానా

'చట్ట విరుద్ధంగా డిపాజిట్లు వసూలు చేశారని భావించినప్పుడు ఆర్బీఐ లేదా రాష్ట్ర ప్రభుత్వం సంబంధిత కోర్టు నుంచి సెర్చ్ వారెంట్లు పొంది ఆ డిపాజిట్ల వసూలు తాలూకా డాక్యుమెంట్లన్నింటినీ తనిఖీ చేసే అధికారాన్ని సెక్షన్ 45 టీ కట్టబెడుతోంది. సెక్షన్ 45 ఎస్‌కు విరుద్ధంగా డిపాజిట్లు సేకరించినట్లు తేలితే ఆ వ్యక్తికి రెండేళ్ల వరకు జైలు శిక్ష విధించవచ్చు లేదా వసూలు చేసిన డిపాజిట్ల మొత్తానికి రెండింతల జరిమానా విధించవచ్చు. చట్టవిరుద్ధంగా డిపాజిట్ల సేకరణకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం నియమించిన అధీకృత అధికారి సంబంధిత కోర్టులో ఫిర్యాదు దాఖలు చేయాల్సి ఉంటుంది. మార్గదర్శి వ్యవహారంలో కూడా అధీకృత అధికారి అలాగే ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదునే గతంలో హైకోర్టు కొట్టేసింది. దానిపైనే ఇప్పుడు హైకోర్టు విచారణ జరుపుతోంది' అని ఆర్‌బీఐ పేర్కొంది.

హెచ్‌యూఎఫ్‌కు సెక్షన్ 45 ఎస్ వర్తిస్తుంది...

హిందూ అవిభాజ్య కుటుంబం (హెచ్‌యూఎఫ్) లీగల్ పర్సన్ కాదు. ఇది కొందరు వ్యక్తుల సమూహం. కర్త ద్వారా ఈ హెచ్‌యూఎఫ్ పని చేస్తుంటుంది. దీన్ని వ్యక్తుల సమూహంగానే పరిగణించాల్సి ఉంటుంది. అందువల్ల హెచ్‌యూఎఫ్‌కు ఆర్‌బీఐ చట్టంలోని సెక్షన్ 45 ఎస్ వర్తిస్తుంది. వ్యక్తి లేదా వ్యక్తుల సమూహం ఏ రకమైన వ్యాపారం, కార్యకలాపాలు నిర్వహిస్తున్నారన్న దానిపై సెక్షన్ 45 ఎస్ వర్తింపు ఆధారపడి ఉంటుంది. వ్యాపారం చేసేందుకు ప్రజల నుంచి డిపాజిట్లు వసూలు చేయడం ఈ సెక్షన్ కింద నిషిద్ధం. హెచ్‌యూఎఫ్ ఇలా డిపాజిట్లు వసూలు చేస్తే అది ఆర్‌బీఐ చట్ట నిబంధనలను ఉల్లంఘించినట్లే అవుతుంది. ఈ కేసులో మొదటి ప్రతివాది అయిన మార్గదర్శి ఫైనాన్సియర్స్ హెచ్‌యూఎఫ్‌గా ఆర్‌బీఐ చట్ట నిబంధనలకు తిలోదకాలు ఇచ్చింది. సెక్షన్ 45 ఎస్‌లో హెచ్‌యూఎఫ్‌ను చేర్చలేదని, తాము ఆ సెక్షన్ పరిధిలోకి రామని చెప్పడం సరికాదు. ప్రజల నుంచి డిపాజిట్ల స్వీకరణ నిషేధాన్ని ఆర్‌బీఐ పరిధిలోకి తేవడమే శాసనకర్తల ప్రధాన ఉద్దేశం. అందుకే ఆర్‌బీఐ చట్టంలో చాప్టర్ 3 బీ, 3 సీలను చేర్చింది' అని రిజర్వ్ బ్యాంక్ తన కౌంటర్‌లో తెలిపింది.

చట్ట విరుద్ధమన్న విషయాన్ని గతంలో హైకోర్టు పట్టించుకోలేదు

' హెచ్‌యూఎఫ్‌గా ప్రజల నుంచి డిపాజిట్లు స్వీకరించడం చట్ట విరుద్ధమన్న విషయాన్ని హైకోర్టు గతంలో పట్టించుకోలేదు. హెచ్‌యూఎఫ్ వ్యక్తుల సమూహం పరిధిలోకి వస్తుందన్న విషయాన్ని కూడా విస్మరించింది. ఇవన్నీ మార్గదర్శి, రామోజీరావు సెక్షన్ 45 ఎస్‌కు విరుద్ధంగా ప్రజల నుంచి డిపాజిట్లు స్వీకరించారన్న విషయాన్ని రూఢీ చేస్తున్నాయి. చట్ట విరుద్ధంగా ప్రజల నుంచి డిపాజిట్లు వసూలు చేసినందుకు వీరికి సెక్షన్ 45ఎస్ (1), 45 ఎస్ (2) వర్తిస్తాయి. చట్టవిరుద్ధంగా వ్యవహరించారనేందుకు ఇవన్నీ ప్రాథమిక ఆధారాలే. సెక్షన్ 45 ఎస్‌కు విరుద్ధంగా వ్యవహరించినందుకు వారిని ప్రాసిక్యూట్ చేయాలి. ఈ వివరాలన్నింటినీ పరిగణనలోకి తీసుకుని మార్గదర్శి, రామోజీరావు దాఖలు చేసిన ఈ క్వాష్ పిటిషన్‌ను కొట్టివేయాలి' అని ఆర్‌బీఐ కౌంటర్‌లో అభ్యర్థించింది. కాగా రామోజీరావు ఇటీవల మరణించిన నేపథ్యంలో హెచ్‌యూఎఫ్ కర్తగా ఆ స్థానంలో ఆయన కుమారుడు చెరుకూరి కిరణ్‌ను చేర్చాలని (సబ్‌స్టిట్యూట్) కోరుతూ మార్గదర్శి ఓ అనుబంధ పిటిషన్ దాఖలు చేసింది. ఈ కేసులో తదుపరి విచారణను ఈ నెల 20న చేపట్టనున్నట్లు తెలంగాణ హైకోర్టు ప్రకటించింది.

ప్రభుత్వ భూముల రక్షణకు జియో రెఫరెన్సింగ్ విధానం

- రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి
- రాష్ట్రంలో ఏటా పెరుగుతున్న పంటల సాగు విస్తీర్ణం
- అయితే ఈ లెక్కలపై అనుమానాలున్నాయి
- వాటిని నివృత్తి చేయడానికే జియో రెఫరెన్సింగ్ వాడుతాం



సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ భూముల సంరక్షణకు జియో రెఫరెన్సింగ్ మ్యాపింగ్ విధానాన్ని వినియోగించాలని నిర్ణయించినట్లు రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డి తెలిపారు. శనివారం ఖైరతాబాద్‌లోని తెలంగాణ రిమోట్ సెన్సింగ్ అప్లికేషన్స్ సెంటర్ (టీజీ రాక్) సంస్థ కార్యక్రమాలను చిన్నారెడ్డి ఉన్నతాధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ శాఖల భూములు, ఇతర స్థిరాస్తులు ఆక్రమణలకు గురవుతున్న నేపథ్యంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. ప్రభుత్వ భూముల సంరక్షణ లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా పైలెట్ ప్రాజెక్టు కింద పోలీసు శాఖ, రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఆర్టీసీ) భూముల రక్షణ కోసం జియో రెఫరెన్సింగ్ మ్యాపింగ్ పద్ధతిని అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో పంటల సాగు విస్తీర్ణం ఏటా పెరుగుతోందని, ఈ లెక్కలపై పలు అనుమానాలున్నాయని చిన్నారెడ్డి అన్నారు. ఈ అనుమానాలను నివృత్తి చేసేందుకు కూడా క్షేత్రస్థాయిలో జియో రెఫరెన్సింగ్ విధానాన్ని ఉపయోగించి పక్కా సాగు లెక్కలు సేకరించాలని ఆయన అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో రిమోట్ సెన్సింగ్ సెంటర్ అదనపు డైరెక్టర్ జనరల్ మనోహర్, అర్థగణాంక శాఖ డైరెక్టర్ రుఫస్ దత్తం, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మంత్రి జూపల్లి కాన్వాయ్ అడ్డగింత

- గద్వాల కాంగ్రెస్‌లో బహిర్గతమైన వర్గపోరు


గద్వాలలో మంత్రి జూపల్లి కాన్వాయ్‌ను అడ్డుకున్న కాంగ్రెస్ కార్యకర్తలను నెట్టివేస్తున్న పోలీసులు

గద్వాల: జోగుళాంబ గద్వాల జిల్లా కాంగ్రెస్ పార్టీలో వర్గ విభేదాలు భగ్గుమన్నాయి. మంత్రి జూపల్లి కృష్ణారావు కాన్వాయ్‌ను జిల్లాకు చెందిన మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ సరిత వర్గీయులు అడ్డుకుని రాళ్లు రువ్వారు. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. స్థానిక ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరడాన్ని మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ సరిత మొదటి నుంచి వ్యతిరేకిస్తున్నారు. జూరాల ప్రాజెక్టు సందర్శనకు శనివారం బండ్ల కృష్ణమోహన్‌రెడ్డితో కలసి మంత్రి జూపల్లి రావడంతో సరిత వర్గీయులు ఆందోళన చేపట్టారు. సరితను కూడా కలుపుకుని ప్రాజెక్టు సందర్శనకు వెళ్లాలని వారు జూపల్లిని కోరగా...తర్వాత మాట్లాడదామని చెబుతూ ముందుకు కదిలిపోయారు. దీంతో కోపోద్రిక్తులైన సరిత వర్గీయులు జూపల్లి కాన్వాయ్‌ను అడ్డుకుని రోడ్డుపై బైఠాయించారు. జూపల్లి గోబ్యాక్ అంటూ నినాదాలు చేశారు. ఈ క్రమంలోనే కొంతమంది మంత్రి కారుపై రాళ్లు రువ్వారు. దీంతో పోలీసులు, సరిత వర్గీయులకు మధ్య తీవ్ర వాగ్వాదం, తోపులాట చోటుచేసుకుంది. పరిస్థితి అదుపు తప్పడంతో మంత్రి జూపల్లి...సరిత ఇంటికి వెళ్లి ఆమెతో చర్చించారు. దీంతో అసహనానికి గురైన ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి మధ్యలోనే కాన్వాయ్ దిగిపోయి తన వర్గీయులతో కలసి ర్యాలంపాడు రిజర్వాయర్ సందర్శనకు వెళ్లారు. అనంతరం మంత్రి జూపల్లి కృష్ణారావు తన వాహనంలో సరితను తీసుకుని సాగునీటి ప్రాజెక్టులను సందర్శించారు. ప్రాజెక్టుల సందర్శనలో భాగంగా గట్టు మండలం రాయపురం గ్రామ సమీపంలో మంత్రి జూపల్లి, ఎమ్మెల్యే కృష్ణమోహన్ వర్గీయుల కాన్వాయ్ పోటీ పడటంతో రెండు వాహనాలు ఢీకొన్నాయి. ఇక్కడ మరోసారి కార్యకర్తలు ఘర్షణ పడ్డారు. మొత్తం మీద మంత్రి జూపల్లి ప్రాజెక్టుల సందర్శన నిరసన, నినాదాలు, వివాదాల మధ్య కొనసాగింది.

కలెక్టరేట్‌లో మాజీ సర్పంచ్ నిరసన

- బిల్లులు విడుదల చేయాలని విన్నపం
- కుటుంబసభ్యులతో కలిసి ఆందోళన

పెద్దపల్లిరూరల్: తన హయాంలో గ్రామాభివృద్ధి కోసం వెచ్చించిన దాదాపు రూ.30లక్షల బిల్లులు వెంటనే విడుదల చేయాలని కోరుతూ పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం ఖమ్మంపల్లి గ్రామ మాజీ సర్పంచ్ సముద్రాల రమేశ్ తన కుటుంబసభ్యులతో కలసి కలెక్టరేట్ వద్ద ఆందోళనకు దిగారు. ఈ మేరకు తన భార్య వాణి, అత్త పుష్పతో కలసి శనివారం కలెక్టరేట్‌కు వచ్చిన రమేశ్ అధికారుల తీరుపై నిరసన వ్యక్తం చేశారు. గ్రామాభివృద్ధి పనులకు వెచ్చించిన నిధులు ఎంబీ రికార్డు రాయాల్సిన అధికారులు నానాఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. బిల్లులు విడుదల చేయకుంటే తన కుటుంబంతో కలసి ఆత్మహత్య చేసుకోవడమే శరణ్యమని కన్నీటిపర్యంతమయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు కలెక్టరేట్‌కు చేరుకుని వారిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం కొద్దిసేపటి తర్వాత విడిచిపెట్టారు.

కలిసి పనిచేద్దాం.. సవాళ్లను ఎదిరిద్దాం

గ్లోబల్ సౌత్ దేశాలకు ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు ● 'సోషల్ ఇంపాక్ట్ ఫండ్'కు 25 మిలియన్ డాలర్లు ఇస్తామని వెల్లడి

న్యూఢిల్లీ/ఢాకా: ప్రపంచవ్యాప్తంగా అనిశ్చిత పరిస్థితులు ఏర్పడుతుండడం పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆందోళన వ్యక్తం చేశారు. ఆహార, ఇంధన భద్రత విషయంలో సంక్షోభాలను ఎదుర్కోవడానికి కలిసికట్టుగా పనిచేద్దామని గ్లోబల్ సౌత్ దేశాలకు పిలుపునిచ్చారు. ఉమ్మడి శత్రువైన ఉగ్రవాదాన్ని అరికట్టడానికి చేతులు కలుపుదామని సూచించారు. శనివారం వర్చువల్‌గా నిర్వహించిన 'వాయిస్ ఆఫ్ గ్లోబల్ సౌత్ శిఖరాగ్ర సదస్సు'లో ప్రధాని మోదీ ప్రసంగించారు. గ్లోబల్ సౌత్ దేశాల్లో డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధి కోసం 'సోషల్ ఇంపాక్ట్ ఫండ్'కు 25 మిలియన్ డాలర్లు అందజేయబోతున్నట్లు ప్రకటించారు. పరస్పర వాణిజ్యం, సమగ్రాభివృద్ధిని ప్రోత్సహించడంతోపాటు సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు సాధించడమే లక్ష్యంగా తమ శక్తిసామర్థ్యాలను అభివృద్ధి చెందుతున్న దేశాలతో పంచుకోవడానికి సిద్ధంగా ఉన్నామని పునరుద్ఘాటించారు.



ఐకమత్యంతోనే మన బలం

కోవిడ్‌–19 మహమ్మారి ప్రభావం నుంచి ప్రపంచ దేశాలు ఇంకా పూర్తిగా బయటపడలేదని, ఇంతలో యుద్ధాలు ముంచుకొచ్చాయని మోదీ విచారం వ్యక్తంచేశారు. అభివృద్ధికి కొత్త సవాళ్లు ఎదురవుతున్నాయని చెప్పారు. వాతావరణ మార్పులు, ఆరోగ్య భద్రత, ఆహార భద్రత, ఇంధన భద్రత వంటి సవాళ్లు ఇప్పటికే ఉండగా, టెక్నాలజీకి సంబంధించి కొత్తగా ఆర్థిక, సామాజిక సవాళ్లు మొదలయ్యాయని తెలిపారు. గత శతాబ్దంలో ఏర్పాటైన పాలనా వ్యవస్థలు, ఆర్థిక వ్యవస్థలు ఈ శతాబ్దపు సవాళ్లను పరిష్కరించలేకపోతున్నాయని వివరించారు. ఇలాంటి పరిస్థితుల్లో అభివృద్ధి చెందుతున్న దేశాలన్నీ ఒక్కటి కావాలన్నారు. ఒకే గళం వినిపించాలని, ఒకరికొకరు తోడుగా నిలవాలని సూచించారు. ఒకరి అనుభవాలను మరొకరు పాఠాలు నేర్చుకోవాలన్నారు. మన ఐకమత్యంలోనే మన బలం దాగి ఉందన్నారు. ఈ ఐకమత్య బలంతో నూతన దశలో ప్రయాణం సాగించాలని పిలుపునిచ్చారు.

'గ్లోబల్ డెవలప్‌మెంట్ కాంపాక్ట్'

గ్లోబల్ సౌత్ దేశాల ప్రగతి కోసం మానవ కేంద్రీకృత 'గ్లోబల్ డెవలప్‌మెంట్ కాంపాక్ట్' ఏర్పాటు చేద్దామని ప్రధాని మోదీ ప్రతిపాదించారు. భారతదేశ అభివృద్ధి యాత్ర, అభివృద్ధి భాగస్వామ్య అనుభవాలను స్ఫూర్తిగా తీసుకొని వ్యాపారం–వాణిజ్యంతోపాటు సాంకేతికతను పంచుకోవడానికి, అభివృద్ధి ప్రాజెక్టులకు ఆర్థిక సాయం అందించుకోవడానికి ఈ వేదిక దోహదపడుతుందని వెల్లడించారు. భాగస్వామ్య దేశాల సమతుల, సుస్థిరాభివృద్ధికి ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు. ఆర్థిక సంక్షోభంలో ఉన్న దేశాలపై మరింత అప్పుల భారం పడకుండా ఇలాంటి చర్యలు అవసరమని పేర్కొన్నారు. ట్రేడ్ ప్రమోషన్ కార్యకలాపాలను బలోపేతం చేయడానికి 2.5 మిలియన్ డాలర్లతో ప్రత్యేక నిధి ఏర్పాటు చేయబోతున్నామని నరేంద్ర మోదీ ప్రకటించారు. అంతర్జాతీయంగా నెలకొన్న పలు సంఘర్షణలు, ఉద్రిక్తతలకు పరిష్కార మార్గాలు సమగ్ర ప్రపంచాభివృద్ధి, సుస్థిర పాలనలోనే ఉన్నాయని తేల్చిచెప్పారు.

15 వేల అడుగుల ఎత్తు నుంచి..
పోర్టబుల్ ఆస్పత్రి పారా–డ్రాప్

న్యూఢిల్లీ: భారత ఆర్మీ, వైమానిక దళం కలిసి అరుదైన ఘనతను సాధించాయి. పోర్టబుల్ ఆస్పత్రి 'ఆరోగ్య మైత్రి హెల్త్ క్యూబ్'ను 15 వేల అడుగుల ఎత్తు నుంచి విజయవంతంగా లక్షిత ప్రాంతంలో నేలపైకి దింపాయి. అత్యంత ఎత్తులో నుంచి విజయవంతంగా పూర్తి చేసిన ఈ పారా–డ్రాప్ ప్రాజెక్టు ప్రపంచంలోనే మొట్టమొదటిదని రక్షణ శాఖ తెలిపింది. ఇందులోని క్రిటికల్ ట్రామాకేర్ క్యూబ్‌లను భీష్మ(భారత్ హెల్త్ ఇనిషియేటివ్ ఫర్ సహయోగ్ హిత అండ్ మైత్రి)ప్రాజెక్టులో భాగంగా దేశీయంగానే రూపొందించినట్లు వెల్లడించింది. మారుమూల, అటవీ కొండ ప్రాంతాల్లో వరదలు వంటి ప్రకృతి విపత్తులు, అత్యవసర సమయాల్లో బాధితులకు అత్యంత వేగంగా, సమర్థమైన వైద్యసేవలను అందించే లక్ష్యంతో ప్రధాని మోదీ ఆదేశాల మేరకు పోర్టబుల్ ఆస్పత్రికి రూపకల్పన జరిగిందని వివరించింది. ఇందులోనున్న వసతులతో 200 మందికి వైద్య సేవలందించొచ్చని తెలిపింది. ఈ క్యూబ్‌ను అధునాతన రవాణా విమానం సీ–130జే సూపర్ హెర్క్యులస్ ద్వారా అనుకున్న చోట అనుకున్న విధంగా నేలపైకి సురక్షితంగా పారాడ్రాప్ చేసినట్లు రక్షణ శాఖ పేర్కొంది. ఆర్మీ ఇందుకోసం అత్యాధునిక ప్రెసిషన్ డ్రాప్ సాంకేతికతను వినియోగించుకుందని తెలిపింది.





శనివారం ప్రయాగ్‌రాజ్‌లో వైద్యుల నిరసన ర్యాలీ

వైద్యుల భద్రతపై కమిటీ

- రాష్ట్ర ప్రభుత్వాలు, వైద్య సంఘాలు సలహాలు సూచనలు ఇవ్వొచ్చు
- కేంద్ర ఆరోగ్య శాఖ ప్రకటన

న్యూఢిల్లీ: కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం, హత్య.. తదనంతరం దేశవ్యాప్తంగా వైద్య సిబ్బంది ఆందోళన, నిరసన కార్యక్రమాల ఉధృతం అవుతుండడం, ఆసుపత్రుల్లో వైద్య సేవలు నిలిచిపోతుండడంతో కేంద్ర ప్రభుత్వం దిగొచ్చింది. డాక్టర్లు, నర్సులు, ఇతర వైద్య సిబ్బందికి తగిన భద్రత కల్పించడానికి కట్టుబడి ఉన్నామని స్పష్టంచేసింది. వారి భద్రతకు ఎలాంటి చర్యలు చేపట్టాలన్న దానిపై సిఫార్సులు చేయడానికి ఒక కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు కేంద్ర ఆరోగ్య శాఖ శనివారం ఒక ప్రకటన విడుదల చేసింది. రాష్ట్ర ప్రభుత్వాలు, వైద్య సంఘాలు, ఇతర భాగస్వామ్య పక్షాలన్నీ ఈ కమిటీకి సలహాలు సూచనలు ఇవ్వొచ్చని, అభిప్రాయాలు తెలియజేయవచ్చని వెల్లడించింది. వైద్య సిబ్బంది వెంటనే విధుల్లో చేరాలని, రోగులకు చికిత్స అందించాలని కేంద్ర ఆరోగ్య శాఖ విజ్ఞప్తి చేసింది. దేశవ్యాప్తంగా డెంగ్యూ కేసులు పెరిగిపోతున్న సమయంలో డాక్టర్లు అందుబాటులో వైద్య సేవలు నిలిపివేయడం సరైంది కాదని సూచించింది.

ప్రధాని మోదీ జోక్యం చేసుకోవాలి: ఐఎంఏ

కేంద్ర ఆరోగ్య శాఖ ప్రకటనను నిశితంగా పరిశీలిస్తున్నామని ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) తెలియజేసింది. అన్ని రాష్ట్రాల్లోని తమ ప్రతినిధులతో చర్చించి, తమ నిర్ణయం వెల్లడిస్తామని స్పష్టంచేసింది. హాస్పిటల్స్‌ను సేఫ్ జోన్లుగా ప్రకటించాలని, తగిన భద్రతా ఏర్పాట్లు చేయాలని, వైద్య సిబ్బందిపై హింస జరగకుండా ఒక చట్టం తీసుకురావాలని ఐఎంఏ డిమాండ్ చేసింది. తమ డిమాండ్ల విషయంలో ప్రధాని నరేంద్ర మోదీ జోక్యం చేసుకోవాలని కోరింది.

రెండో రోజు విచారణకు హాజరైన సందీప్ ఘోష్

జూనియర్ డాక్టర్ పట్ల జరిగిన అమానవీయ ఘటనపై సీబీఐ దర్యాప్తు కొనసాగిస్తోంది. అనుమానితులను పిలిపించి ప్రశ్నిస్తోంది. ఘాతుకం జరిగిన ఆర్‌జీ కార్ మెడికల్ కాలేజీ, హాస్పిటల్ మాజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సందీప్ ఘోష్ వరుసగా రెండో రోజు శనివారం కూడా సీబీఐ ఎదుట హాజరయ్యారు. సీబీఐ అధికారుల ప్రశ్నలకు సమాధానమిచ్చారు. జూనియర్ డాక్టర్ హత్య కేసులో అరెస్టయిన సంజయ్ రాయ్‌కి సైకలాజికల్ పరీక్షలు నిర్వహించాలని సీబీఐ అధికారులు నిర్ణయించారు. ఈ పరీక్షల కోసం ఢిల్లీ సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబోరేటరీ బృందం కోల్‌కతాకు చేరుకుంది.

దేశవ్యాప్తంగా స్తంభించిన వైద్య సేవలు

ఐఎంఏ పిలుపు మేరకు దేశవ్యాప్తంగా వైద్యులు, వైద్య సిబ్బంది శనివారం రోడ్డెక్కారు. తమకు భద్రత కల్పించాలని, తమ డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నిరసన ప్రదర్శనలు చేపట్టారు. అత్యవసరం కాని ఇతర వైద్య సేవలను నిలిపివేశారు. ఢిల్లీ, పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్, పంజాబ్, మహారాష్ట్ర, హరియాణా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, ఛత్తీస్‌గఢ్, గుజరాత్, ఒడిశా తదితర రాష్ట్రాల్లో ఆందోళన కార్యక్రమాలు జరిగాయి. ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో వైద్య సేవలు చాలావరకు నిలిచిపోయాయి.



కోల్‌కతాలోని ఓ ఆస్పత్రిలో బోసిపోయిన ఓపీడీ

సిద్ధూ మెడకు 'ముడా' ఉచ్చు

- సిద్ధరామయ్యపై విచారణకు ఆదేశించిన కర్ణాటక గవర్నర్ గెహ్లోత్
- నైతిక బాధ్యతగా రాజీనామా చేయాలన్న విపక్ష బీజేపీ
- రాజీనామా చేసేంత తప్పేమీ చేయలేదన్న ముఖ్యమంత్రి

సాక్షి, బెంగళూరు: మైసూరు పట్టణాభివృద్ధి ప్రాధికార సంస్థ(ముడా) భూముల కేటాయింపుల వివాదం చివరకు కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మెడకు చుట్టుకుంటోంది. ఖరీదైన భూములు భార్య పార్వతికి దక్కేలా సిద్ధరామయ్య కుట్ర చేశారని సమాచార హక్కు చట్టం కార్యకర్తలు టీజే అబ్రహాం, ఎస్పీ ప్రదీప్, స్నేహమయి కృష్ణ చేసిన అభ్యర్థనపై రాష్ట్ర గవర్నర్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఏకంగా ముఖ్యమంత్రిపై విచారణ చేపట్టేందుకు గవర్నర్ థావర్ చంద్ గెహ్లోత్ శనివారం అనుమతి ఇచ్చినట్లు రాజ్‌భవన్ ప్రకటించింది. దీంతో సిద్ధూపై కేసు నమోదుచేసి పోలీసులు దర్యాప్తు మొదలుపెట్టే అవకాశముంది. '' నాకు అందిన పిటిషన్ ప్రకారం భూకేటాయింపుల్లో అక్రమాలపై ప్రాథమిక ఆధారాలున్నాయి. మీపై విచారణకు ఎందుకు ఆదేశించకూడదో 7 రోజుల్లోగా వివరణ ఇవ్వాలని సీఎంకు గత నెల 26న షోకాజ్ నోటీసు ఇచ్చా. దాన్ని వ్యతిరేకిస్తూ రాష్ట్ర మంత్రి మండలి చేసిన తీర్మానంలో హేతుబద్ధత లేదు. కేసు విచారణ పారదర్శకంగా జరగాలి. హడావిడిగా మాజీ ఐఏఎస్ వెంకటాచలపతి ఆధ్వర్యంలో విచారణ కమిటీ, హైకోర్టు విశ్రాంత జడ్జి పీఎస్ దేశాయ్ ఆధ్వర్యంలో విచారణ కమిషన్‌ను ఏర్పాటుచేయడం చూస్తుంటే ఇందులో భారీ అవకతవకలు జరిగినట్లు భావించవచ్చు'' అని గవర్నర్ గెహ్లోత్ వ్యాఖ్యానించారు. అయితే గవర్నర్ ఉత్తర్వులను రద్దుచేయాలంటూ సిద్ధరామయ్య హైకోర్టును ఆశ్రయిస్తే ఆ కేసు విచారణ సందర్భంగా తమ వాదనలు సైతం వినాలంటూ ఫిర్యాదుదారుల్లో ఒకరైన ప్రదీప్ శనివారం కర్ణాటక హైకోర్టులో కెవియట్ పిటిషన్ దాఖలుచేశారు. 21వ తేదీన ప్రజా ప్రతినిధుల ప్రత్యేక కోర్టులోనూ కేసు వేస్తానని టీజే అబ్రహాం చెప్పారు.

తీవ్రంగా తప్పుబట్టిన సిద్ధరామయ్య

తనపై దర్యాప్తునకు గవర్నర్ ఆదేశించడాన్ని సీఎం తీవ్రంగా తప్పుబట్టారు. నైతిక బాధ్యతగా రాజీనామా చేయాలన్న బీజేపీ డిమాండ్‌పై స్పందించారు. ''గవర్నర్ కేంద్రప్రభుత్వం చేతిలో కీలుబొమ్మగా మారారు. చట్టవ్యతిరేక ఉత్తర్వులిచ్చి రాజ్యాంగబద్ధ పదవిని ఆయన దుర్వినియోగం చేస్తున్నారు. ఉత్తర్వులపై చట్టప్రకారం పోరాడతా. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూలదోసేందుకు కుట్ర పన్నారు. కేంద్రం, బీజేపీ, జేడీ(ఎస్) ఇందులో కీలక పాత్రధారులు. మంత్రులు, పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, లోక్‌సభ, రాజ్యసభ సభ్యుల మద్దతు నాకు ఉంది. నేను రాజీనామా చేయాల్సినంత తప్పేమీ చేయలేదు. మైనింగ్ లైసెన్స్‌ల కుంభకోణంలో జేడీఎస్ నేత, ప్రస్తుత కేంద్ర మంత్రి హెచ్‌డీ కుమారస్వామిపై లోకాయుక్త దర్యాప్తునకు కోరితే ఆయనపై విచారణకు ఆదేశించలేదుగానీ నాపై ఆగమేఘాల మీద విచారణకు ఆదేశించారు. ఫిర్యాదులున్నా బీజేపీ మాజీ కేంద్ర మంత్రులు శశికళ జోశి, మురుగేశ్ నీలాని, జనార్దన్ రెడ్డిలపై దర్యాప్తునకు ఎందుకు ఆదేశాలివ్వలేదు?'' అని సీఎం అన్నారు.

విమర్శలు ఎక్కుపెట్టిన బీజేపీ

విచారణను ఎదుర్కొంటున్న సిద్ధరామయ్యకు సీఎంగా కొనసాగే అర్హత లేదని, రాజీనామా చేయాలని రాష్ట్రంలో విపక్ష బీజేపీ డిమాండ్‌చేసింది. ఆయన దిగిపోతేనే దర్యాప్తు పారదర్శకంగా సాగుతుందని కర్ణాటక బీజేపీ చీఫ్ బీవై విజయేంద్ర అన్నారు. ''కాంగ్రెస్ వంచనకు, కుటుంబ రాజకీయాలకు ఈ స్కామ్ మరో మచ్చుతునక. దళితులకు అండగా ఉంటామనే సీఎం స్వయంగా దళితుల భూములను లాక్కున్నారు'' అని బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా వ్యాఖ్యానించారు. దాదాపు రూ.4,000–5,000 కోట్ల భూకుంభకోణానికి పాల్పడ్డారని బీజేపీ నేతలు ఆరోపించారు.

బీజేపీయేతర ప్రభుత్వాలను వేధిస్తున్నారు: ఖర్గే

ప్రతిపక్షాలపాలిత రాష్ట్రాలను మోదీ సర్కార్ నియమించిన గవర్నర్లు తీవ్రంగా వేధిస్తున్నారని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే వ్యాఖ్యానించారు. ''ఏకంగా సీఎం మీదనే విచారణకు ఆదేశించేంత తప్పు ఏం జరిగింది?. ఏ కారణాలు చెప్పి దర్యాప్తునకు అనుమతి ఇచ్చారు?. పశ్చిమబెంగాల్, కర్ణాటక, తమిళనాడు ఇలా బీజేపీయేతర ప్రభుత్వాలు ఉన్న చోట్ల గవర్నర్లు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలను ఇబ్బందుల పాల్జేస్తున్నారు'' అని ఖర్గే అన్నారు.



ఏమిటీ ముడా భూవివాదం?

సిటీ ఇంప్రూవ్‌మెంట్ ట్రస్ట్ బోర్డ్‌గా 1904లో ఏర్పాటై తదనంతరకాలంలో మైసూర్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(ముడా)గా అవతరించిన సంస్థ ఇప్పుడు భూకేటాయింపుల వివాదంలో కేంద్రబిందువుగా నిలిచింది. కెసెరె గ్రామంలో సీఎం సిద్ధరామయ్య భార్య పార్వతికి 3 ఎకరాల 16 గుంటల భూమి ఉంది. ఈ గ్రామంలో దేవనార్ 3ఫేజ్ లేఅవుట్ కోసం ముడా ఈ భూమిని సేకరించింది. నష్టపరిహారంగా 2021లో మైసూర్‌లోని విజయనగర మూడో, నాలుగో ఫేజ్ లేఅవుట్లలో 38,284 చదరపు అడుగుల విస్తీర్ణంలో 14 ప్లాట్లను కేటాయించింది. అయితే పార్వతి నుంచి తీసుకున్న భూముల కంటే కేటాయించిన ప్లాట్ల విలువ రూ.45 కోట్లు ఎక్కువ అని ఆర్టీఐ కార్యకర్త అబ్రహాం లోకాయుక్త పోలీసులకు ఫిర్యాదుచేయడంతో కేటాయింపుల అంశం వార్తల్లోకెక్కింది. కెసెరె భూమిని పార్వతికి ఆమె సోదరుడు మల్లిఖార్జున స్వామి 2010 అక్టోబర్‌లో బహుమతిగా ఇచ్చాడు. ప్రభుత్వం సేకరించాక 2014 జూన్‌లో నష్టపరిహారం కోసం పార్వతి దరఖాస్తు చేసుకున్నారు. ప్లాట్ల కేటాయింపుపై సిద్ధూ గతంలోనే స్పష్టతనిచ్చారు. ''2014లో నేను సీఎంగా ఉన్నప్పుడు పరిహారం కోసం దరఖాస్తు చేసుకుంటే సీఎంగా ఉన్నంతకాలం ఆ పరిహారం ఇవ్వడం కష్టమని అధికారులు చెప్పారు. బీజేపీ అధికారంలో ఉన్నప్పుడు 2021లో మళ్లీ దరఖాస్తు చేసుకుంటే ఈ ప్లాట్లను కేటాయించారు'' అని సిద్ధూ అన్నారు. అయితే గతంలో ముడా 50: 50 పేరిట ఒక పథకాన్ని అమలుచేసింది. నిరుపయోగ భూమి తీసుకుంటే వేరే చోట 'అభివృద్ధి చేసిన' స్థలాన్ని కేటాయిస్తారు. ప్రతీ కేటాయింపు ముడా బోర్డు దృష్టికి తేవాలి. అయితే కొందరు ముడా అధికారులతో చేతులు కలిపి, బోర్డు దృష్టికి రాకుండా, పథకంలోని లోపాలను వాడుకుని సిద్ధరామయ్య కుటుంబం ఎక్కువ ప్లాట్లను రాయించుకుందని విపక్షాలు ఆరోపిస్తున్నాయి. లోపాలున్న పథకాన్ని 2023 అక్టోబర్‌లో రద్దుచేశారు. అయితే తన భూమికి ఎక్కువ విలువ ఉంటుందని రూ.62 కోట్ల నష్టపరిహారం కావాలని సిద్ధరామయ్య ఈఏడాది జూలై నాలుగున డిమాండ్ చేయడం విశేషం. అయితే అసలు ఈ భూమి పార్వతి సోదరుడు మల్లికార్జున స్వామిది కాదని, అక్రమంగా ఫోర్జరీ పత్రాలు సృష్టించి 2004లో తన పేరిట రాయించుకున్నాడని ఆరోపణలున్నాయి.

– సాక్షి, నేషనల్ డెస్క్

అదనంగా 14.8 కోట్ల ఉద్యోగాలు


2030 నాటికి సృష్టించాల్సిన అవసరం ఉంది: గీతా గోపీనాథ్

న్యూఢిల్లీ: 'ఉపాధి కల్పనలో భారత్ జీ20 దేశాలలో వెనుకబడి ఉంది. జనాభా పెరుగుదల దృష్ట్యా 2030 నాటికి దేశం అదనంగా 14.8 కోట్ల ఉద్యోగాలను సృష్టించాల్సిన అవసరం ఉంది' అని అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్) ఫస్ట్ డెప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ గీతా గోపీనాథ్ శనివారం తెలిపారు. 2010–20 మధ్య భారత్ సగటున 6.6 శాతం వృద్ధిని సాధించిందని, అయితే ఉపాధి రేటు 2 శాతం కంటే తక్కువగా ఉందని ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎకనమిక్స్ వజ్రోత్సవంలో పాల్గొన్న సందర్భంగా గీత చెప్పారు. మరిన్ని ఉద్యోగాలను సృష్టించేందుకు ప్రైవేట్ పెట్టుబడులు పెరగాల్సిన అవసరం ఉందని అన్నారు. వ్యాపారాన్ని మరింత సులభతరం చేయడం, నియంత్రణ వాతావరణాన్ని మెరుగుపరచడం, ట్యాక్స్ బేస్‌ను విస్తృతం చేయడం అవసరమని తెలిపారు. ప్రపంచ సరఫరా వ్యవస్థలో భారత్ ఒక కీలక దేశంగా ఉండాలనుకుంటే దిగుమతి సుంకాలను తగ్గించాల్సిందేనని స్పష్టం చేశారు.



ప్రజా పద్దుల కమిటీ చైర్మన్‌గా వేణుగోపాల్

న్యూఢిల్లీ: ప్రభుత్వ ఖర్చులను క్షుణ్ణంగా అధ్యయనం చేసే కీలకమైన ప్రజాపద్దుల కమిటీ(పీఏసీ) చైర్మన్‌గా కాంగ్రెస్ సభ్యుడు కేసీ వేణుగోపాల్‌ను నియమించినట్లు లోక్‌సభ సచివాలయం శుక్రవారం పేర్కొంది. అంచనాలు, ప్రభుత్వ సంస్థల కమిటీలుసహా 4 కొత్త కమిటీలకు చైర్మన్లుగా బీజేపీ నేతలను నియమిస్తూ లోక్‌సభ స్పీకర్ బిర్లా నిర్ణయం తీసుకున్నారు. ఆర్థికసంబంధాలకు సంబంధించి పీఏసీ, అంచనాలు, ప్రభుత్వ సంస్థల కమిటీలను ముఖ్యమైనవిగా పరిగణిస్తారు. ప్రభుత్వ చేస్తున్న ఖర్చులు, ప్రభుత్వరంగ సంస్థల సమర్థ నిర్వహణ వ్యవహారాలను ఈ కమిటీలు అధ్యయనం చేస్తాయి. ఓబీసీల సంక్షేమ కమిటీకి బీజేపీ నేత గణేశ్ సింగ్, ఎస్సీఎస్టీల సంక్షేమ కమిటీకి బీజేపీ నేత ఫగాన్ సింగ్ కులస్తే చైర్మన్‌గా వ్యవహరించనున్నారు. అంచనా కమిటీకి బీజేపీ నేత సంజయ్ జైశ్వాల్, ప్రభుత్వ సంస్థల కమిటీకి చైర్మన్‌గా బీజేపీ నేత బైజయంతీ పాండాను నియమించారు.



ఉమ్మడి పౌరస్మృతి ఆమోదయోగ్యం కాదు

ముస్లిం పర్సనల్ లా బోర్డు

న్యూఢిల్లీ: ఉమ్మడి పౌరస్మృతి ముస్లింలకు ఎట్టి పరిస్థితుల్లోనూ ఆమోదయోగ్యం కాదని ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు పేర్కొంది. ముస్లిం పర్సనల్ లా విషయంలో తాము రాజీపడే ప్రసక్తే లేదని తేల్చిచెప్పింది. ప్రధాని మోదీ ఎర్రకోట నుంచి మాట్లాడుతూ 'లౌకిక పౌరస్మృతి' తేవాల్సిన అవసరం ఉందన్న విషయం తెలిసిందే. మతపరమైన పౌరస్మృతిగా పర్సనల్ చట్టాలను మోదీ అభివర్ణించడంపై ముస్లిం బోర్డు అభ్యంతరం వ్యక్తం చేసింది. లౌకిక పౌరస్మృతి పక్కా ప్రణాళికతో కూడిన కుట్రని, తీవ్ర విపరిణామాలుంటాయని ముస్లిం బోర్డు అధికార ప్రతినిధి ఎస్.క్యూ.ఆర్. ఇలియాస్ అన్నారు.

భారత సంతతి వ్యాపారి కాల్చివేత

వాషింగ్టన్: దోపిడీకి యత్నించిన దుండగుడు భారతసంతతికి చెందిన దుకాణదారును కాల్చిచంపాడు. ఈ ఘటన అమెరికాలోని నార్త్ కరోలినా రాష్ట్రం రొవాన్ కౌంటీలో చోటుచేసుకుంది. మైనాంక్ పటేల్(36) టొబాకో హౌస్ స్టోర్ పేరుతో దుకాణం నడుపుతున్నారు. మంగళవారం ఉదయం షాట్‌గన్‌తో దుకాణంలోకి ప్రవేశించిన శ్వేతజాతీయుడైన బాలుడు మైనాంక్‌పై విచక్షణారహితంగా కాల్పులు జరిపాడు. బాలుడిని కొద్ది గంటల్లోనే అదుపులోకి తీసుకున్నారు.



పట్టాలు తప్పిన సబర్మతి ఎక్స్‌ప్రెస్

ప్రయాణికులంతా సురక్షితం

కాన్పూర్/న్యూఢిల్లీ: వారణాసి–అహ్మదాబాద్ మధ్య నడిచే సబర్మతి ఎక్స్‌ప్రెస్ శనివారం యూపీలో పట్టాలు తప్పింది. పట్టాలపైనున్న ఒక వస్తువు రైలింజిన్‌ను బలంగా తాకడంతో 20 బోగీలు పట్టాలు తప్పాయి. కాన్పూర్–భీమ్‌సేన్ రైల్వే స్టేషన్ల మధ్య తెల్లవారు జామున 2.35 గంటల సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. పెద్ద శబ్దంతో బోగీలు ఊగుతూ, రైలు నిలిచిపోవడంతో నిద్రలో ఉన్న ప్రయాణికులంతా ఉలిక్కిపడి లేచారు. ఘటనలో ఎవరికీ ఎటువంటి అపాయం వాటిల్లలేదని రైల్వే అధికారులు తెలిపారు. ఘటన అనంతరం ప్రయాణికులందరినీ బస్సుల్లో కాన్పూర్ రైల్వే స్టేషన్‌కు, అక్కడికి నుంచి వేరే రైళ్లలో గమ్యస్థానాలకు చేరుకునేందుకు ఏర్పాట్లు చేశారు.




కుట్ర కోణంలో దర్యాప్తు

'రైలు పట్టాలపైనున్న ఓ వస్తువు ఇంజిన్‌ను తాకినట్లు ఆనవాళ్లున్నాయి. అన్ని ఆధారాలను అధికారులు సేకరిస్తున్నారు. యూపీ పోలీసులతోపాటు ఇంటెలిజెన్స్ బ్యూరో అధికారులు దర్యాప్తు చేపట్టారు'అని రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ 'ఎక్స్'లో పేర్కొన్నారు. 'బండరాయి వంటిదేదో గట్టిగా గుద్దుకోవడంతో ఇంజిన్ ముందు భాగం తీవ్రంగా దెబ్బతిని, వంగిపోయినట్లు లోకో పైలట్ చెబుతున్నారు. 16వ బోగీ సమీపంలో మాకు దొరికిన వస్తువే ఇంజిన్ దెబ్బతినేందుకు కారణమై ఉండొచ్చు. ఇది సంఘ వ్యతిరేక శక్తుల పని'గా అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

రాణాను భారత్‌కు అప్పగించవచ్చు

అమెరికా కోర్టు ఆఫ్ అప్పీల్స్ తీర్పు

వాషింగ్టన్: 2008 నాటి ముంబై ఉగ్రవాద దాడుల కేసులో ప్రధాన నిందితుడైన తహవ్వుర్ హుస్సేన్ రాణా విషయంలో అమెరికా కోర్టులో భారత అనుకూల తీర్పు వెలువడింది. ఆయనను విచారణ నిమిత్తం భారత్‌కు అప్పగించవచ్చని అమెరికాలోని కాలిఫోర్నియా కోర్టు ఆఫ్ అప్పీల్స్ స్పష్టం చేసింది. రాణాను భారత్‌కు అప్పగించేందుకు భారత్, అమెరికా దేశాల మధ్య అమల్లో ఉన్న నేరగాళ్ల అప్పగింత ఒప్పందం అనుమతి ఇస్తోందని తేల్చిచెబుతూ ఈ నెల 15వ తేదీన న్యాయస్థానం తీర్పు వెలువరించింది. ఈ ఒప్పందం కింద తనను భారత్‌కు అప్పగించడం సాధ్యం కాదంటూ రాణా చేసిన వాదనను న్యాయస్థానం తిరస్కరించింది. 2008 నవంబర్ 26వ తేదీన ముంబైలో 10 మంది పాకిస్తాన్ ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో ఆరుగురు అమెరికన్ పౌరులు సహా మొత్తం 166 మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఈ దాడులకు నిధులు సమకూర్చినట్లు పాకిస్తాన్ జాతీయుడైన తహవ్వుర్ రాణాపై పలు ఆరోపణలున్నాయి. ఉగ్రవాద దాడులకు ప్రధాన సూత్రధారి అయిన లష్కరే తోయిబా ఉగ్రవాది డేవిడ్ కోల్‌మన్ హెడ్లీతో ఇతడికి సన్నిహిత సంబంధాలున్నాయి. ముంబై ఉగ్రవాద దాడుల కేసులో రాణా ప్రస్తుతం అమెరికాలోని లాస్ ఏంజెలెస్ జైలులో ఉన్నాడు. రాణాను తమకు అప్పగించాలని భారత దర్యాప్తు సంస్థలు చాలా సంవత్సరాలుగా కోరుతున్నాయి. అయితే, కోర్టు ఆఫ్ అప్పీల్స్ తీర్పుపై ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించేందుకు అతడికి వెసులుబాటు ఉందని చెబుతున్నారు.



కమలా హారిస్‌పై తులసి అస్త్రం!

డిబేట్ కోసం ట్రంప్‌కు తర్ఫీదు

వాషింగ్టన్: ఒక డిబేట్‌తో బైడెన్‌ను అధ్యక్ష రేసు నుంచే వైదొలిగేలా చేసిన రిపబ్లికన్ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ కొత్త ప్రత్యర్థిపై పైచేయి సాధించేందుకు పెద్ద కసరత్తే చేస్తున్నారు. సెప్టెంబరు 10న ట్రంప్, డెమొక్రాటిక్ పార్టీ అభ్యర్థి కమలా హారిస్ మధ్య ఏబీసీ ఛానల్‌లో అధ్యక్ష చర్చ జరగనున్న విషయం తెలిసిందే. దీంట్లో కమలను ఏయే అంశాల్లో ఇరుకున పెట్టొచ్చనే అంశంలో తనకు మార్గనిర్దేశనం చేయడానికి మాజీ డెమొక్రాట్ (ప్రతినిధుల సభ మాజీ సభ్యురాలు), హిందూ– అమెరికన్ తులసి గబార్డ్ సహాయం తీసుకుంటున్నారు ట్రంప్. ఫ్లోరిడాలోని ట్రంప్‌కు చెందిన గోల్ఫ్ రిసార్ట్‌లో తులసి ఆయనకు సహాయపడుతున్నారు. 'రాజకీయ చరిత్రలోనే మంచి డిబేటర్లలో ఒకరిగా ట్రంప్ పేరుగాంచారు. జో బైడెన్‌ను నాకౌట్ చేశారు. చర్చకు సన్నద్ధం కావాల్సిన అవసరం ట్రంప్‌కు లేదు. అయితే విధానపరమైన సలహాదారులను, తులసి గబార్డ్ లాంటి సమర్థులైన వక్తలను కలుస్తూనే ఉంటారు' అని ట్రంప్ ప్రతినిధి కరోలిన్ లీవిట్ తెలిపారు. అయితే 2016, 2020ల కంటే ఈసారి డిబేట్‌లకు సిద్ధమవడానికి ట్రంప్ అధిక సమయం వెచ్చిస్తున్నారని న్యూయార్క్ టైమ్స్ పత్రిక తెలిపింది. 2020 డెమొక్రాటిక్ పార్టీ అధ్యక్ష అభ్యర్థిత్వానికి బైడెన్‌తో పోటీపడిన వాళ్లలో కమలా హారిస్, తులసి గబార్డ్‌లు కూడా ఉన్నారు. ప్రైమరీల్లో భాగంగా 2019 జూలైలో హారిస్, తులసిల మధ్య డిబేట్ జరిగింది. దీంట్లో కమలా హారిస్‌ను తులసి తీవ్రంగా ఇరుకున పెట్టి పైచేయి సాధించారు.



సూడాన్‌లో 85 మంది ఊచకోత

ఖార్టూమ్: సూడాన్‌లో పారా మిలటరీ మూకలు గురువారం సిన్నార్ రాష్ట్రంలోని జల్‌క్ని గ్రామంపై దాడిచేసి బాలికలను కిడ్నాప్ చేసేందుకు యత్నించగా గ్రామస్థులు ప్రతిఘటించారు. దీంతో మూకలు గ్రామాన్ని ఐదు రోజులపాటు ముట్టడించి 85 మందిని చంపేశారని మీడియా తెలిపింది. సిన్నార్ కోసం సైన్యం, మూకల మధ్య సాగుతున్న పోరుతో ఇన్నేళ్లలో 7.25 లక్షల మంది ప్రజలు వలస వెళ్లారు.

రక్తమోడుతున్న గాజా
ఒకే కుటుంబంలో 18 మంది మృతి

డెయిర్ అల్ బలాహ్: ఇజ్రాయెల్ సైన్యం యథేచ్ఛగా జరుపుతున్న దాడులతో గాజా ప్రాంతం రక్తమోడుతోంది. శనివారం ఉదయం జవైదా పట్టణంలోని ఓ నివాసంతోపాటు పక్కనే ఉన్న శరణార్థులు తలదాచుకున్న భవనంపై ఇజ్రాయెల్ ఆర్మీ జరిపిన దాడిలో సమీ జవాద్ అల్ ఎజ్లా, అతడి కుటుంబంలోని 18 మంది మృత్యువాతపగా, మరో వ్యక్తి గాయపడ్డారు. మృతులను సమీ ఇద్దరు భార్యలు, 2 నుంచి 22 ఏళ్ల వయస్సున్న 11 మంది సంతానం, వారి అమ్మమ్మ, మరో ముగ్గురు బంధువులు ఉన్నట్లు స్థానికులు తెలిపారు. ఇజ్రాయెల్ నుంచి గాజాలోకి చేపలు, మాంసం తరలించే ప్రక్రియకు సమీ సమన్వయకర్తగా వ్యవహరించేవాడని, చాలా మంచి వ్యక్తని చెప్పారు. ఘటన సమయంలో రెండు భవనాల్లో కలిపి 40 మంది వరకు ఉన్నట్లు వివరించారు. ఇలా ఉండగా, సెంట్రల్ గాజాలోని మఘాజీ శరణార్థి శిబిరం చుట్టుపక్కల ప్రాంతాలను ఖాళీ చేయాల్సిందిగా ఇజ్రాయెల్ ఆర్మీ శనివారం పాలస్తీనియన్లను హెచ్చరించింది. ఆ ప్రాంతం వైపు నుంచే తమ భూభాగం మీదికి మిలిటెంట్లు రాకెట్లు ప్రయోగిస్తున్నారని పేర్కొంది.

లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడి
10 మంది మృతి

బీరూట్: లెబనాన్‌పై ఇజ్రాయెల్ వైమానిక దాడిలో 10 మంది సిరియన్ దేశస్తులు ప్రాణాలు కోల్పోయారు. నబాటియే ప్రావిన్స్‌లోని వదీ అల్–కెఫొర్‌పై ఈ దాడి జరిగింది. మిలిటెంట్ సంస్థ హెజ్బొల్లా ఆయుధ డిపో లక్ష్యంగా దాడి చేపట్టినట్లు ఇజ్రాయెల్ తెలిపింది. ఆ ప్రాంతంలో సామగ్రి తయారీ యూనిట్ ఉందని స్థానికులు తెలిపారు. బాధితులంతా సిరియా నుంచి వచ్చి ఆశ్రయం పొందుతున్నవారేనన్నారు.

సాక్షి
కరీంనగర్
ఆదివారం । 18 । ఆగస్టు । 2024




కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న జూనియర్ డాక్టర్లు, మెడికల్ విద్యార్థులు

దోషులను కఠినంగా శిక్షించాలి

- ధర్నాకు పెద్దఎత్తున తరలివచ్చిన డాక్టర్లు, మెడికోలు
- ఆస్పత్రుల బంద్ సంపూర్ణం



నిరసన తెలుపుతున్న సీనియర్ డాక్టర్లు, ఐఎంఏ బాధ్యులు

కరీంనగర్‌టౌన్: కోల్‌కతాలో యువ పీజీ డాక్టర్‌పై లైంగికదాడి, హత్యను ఖండిస్తూ శనివారం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ పిలుపుమేరకు జిల్లాలో 24గంటలపాటు ఓపీ సేవలు నిలిపివేశారు. జిల్లా ఆసుపత్రిలో గంటపాటు వైద్యసేవలు నిలిపివేసిన డాక్టర్లు, సిబ్బంది నిరసన వ్యక్తం చేశారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో మాత్రం ఓపీ సేవలు సంపూర్ణంగా నిలిచిపోయాయి. అందులో భాగంగా కరీంనగర్ ఐఎంఏ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని డాక్టర్లతోపాటు, మెడికల్ స్టూడెంట్లు, పీజీ డాక్టర్లు పెద్ద ఎత్తున తరలివచ్చి సుమారు 3 గంటలపాటు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ రాంకిరణ్, కార్యదర్శి డాక్టర్ వెంకటరెడ్డి మాట్లాడుతూ, కోల్‌కతా ఘటన దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కేసును సీబీఐకి అప్పగించాలని కోరారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఆసుపత్రులు, క్యాంపసుల్లో వైద్యులకు భద్రత కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని, అధికారుల ఉదాసీనత కారణంగానే మహిళా డాక్టర్లు, నర్సింగ్, ఇతర ఆరోగ్య సిబ్బందిపై భౌతికదాడులు, నేరాలు జరుగుతున్నాయన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నిరసన తెలిపిన విద్యార్థులపై గూండాయిజానికి పాల్పడ్డారన్నారు. ఈ సంఘటలన్నింటికీ నిరసనగా, పునరావృతం కాకూడదని వైద్య సేవలు నిలిపివేసినట్లు వివరించారు. ధర్నాలో వైద్యులు బీఎస్.రావు, రఘురామన్, విజయ్‌మోహన్‌రెడ్డి రమణాచారి, శ్రీలత, రజనీప్రియదర్శిని, నయని, ఎనమల్ల శ్రీదేవి, ఆది శ్రీదేవి, ప్రభాకర్, రఘునాథరావు, లక్ష్మణ్‌కుమార్, ప్రదీప్, వెంకటేశ్వర్లు, విజేంద్రరెడ్డి, చల్మెడ, ప్రతిమ మెడికల్ కళాశాలల వైద్యులు, పీజీ విద్యార్థులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

ఎల్‌ఆర్‌ఎస్ హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయాలి

- నిబంధనల ప్రకారం దరఖాస్తులు పరిష్కరించాలి
- సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి


అధికారులతో మాట్లాడుతున్న సుడా చైర్మన్ నరేందర్‌రెడ్డి

కరీంనగర్ కార్పొరేషన్: ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలన, పరిష్కార ప్రక్రియలో భాగంగా కార్యాలయంలో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయాలని శాతవాహన అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (సుడా) చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. శనివారం నగరంలోని సుడా కార్యాలయంలో సంబంధిత అధికారులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుడా పరిధిలో 22వేల ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులకు సంబంధించిన పూర్తి వివరాలు సేకరించాలని సూచించారు. దరఖాస్తుదారులను సంప్రదించి ఆ స్థలాలను పరిశీలించాలన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని సూచించారు. టీఎస్ బీపాస్ ద్వారా పొందిన అనుమతుల్లో అవకతవకలు ఉంటే నోటీసులు జారీ చేసి సరిచేయాలని ఆదేశించారు. సుడాకు రావాల్సిన రెవెన్యూ విషయంలో ఎక్కడా నిర్లక్ష్యం వహించొద్దని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సుడా వైస్‌చైర్మన్ ప్రఫుల్‌దేశాయ్, డీపీవో రవీందర్, సీపీవో కోటేశ్వరావు, డీటీసీపీ ఆంజనేయులు,ఎస్‌ఈ రాజ్ కుమార్,ఈఈ రొడ్డ యాదగిరి,ఏఈ రమేశ్ పాల్గొన్నారు.


నూతన చట్టాలపై పట్టు సాధించాలి


సమావేశమైన పబ్లిక్ ప్రాసిక్యూటర్లు

కరీంనగర్‌క్రైం: కొత్త చట్టాలపై పట్టు సాధించాలని ఉమ్మడి కరీంనగర్ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ లక్ష్మీ ప్రసాద్ తెలిపారు. తెలంగాణ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ ఆదేశాలతో ఉమ్మడి జిల్లా అడిషనల్, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో శనివారం జిల్లాకోర్టు ఆవరణలో సమావేశమయ్యారు. కేసుల విచారణలో న్యాయమూర్తులతో సమన్వయంతో ముందుకెళ్లాలని సూచించారు. జిల్లా కోర్టు పీపీ శరత్ నూతనచట్టాల గురించి వివరించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన లక్ష్మీప్రసాద్‌ను సత్కరించారు. ఏపీపీలు జ్యోతిరెడ్డి, నర్సింగరావు, పవన్‌కుమార్, ఆరెల్లి రాములు, జూలూరి శ్రీరాములు, గడ్డం లక్ష్మణ్, పెంట శ్రీనివాస్, కాసారం మల్లేశం, జంగిలి మల్లికార్జున్, సీనియర్ ఏపీపీ మురళీధర్‌రావు, వసంత పాల్గొన్నారు.

ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి

- వర్షాలు పడుతున్నా తగ్గట్లే..
- తేమశాతం పెరగడమే కారణమంటున్న అధికారులు
- 22వ తేదీ వరకు ఉమ్మడి జిల్లాకు వర్ష సూచన ఉందన్న ఐఎండీ



సాక్షి ప్రతినిధి, కరీంనగర్:

కొన్ని రోజులుగా ఉమ్మడి జిల్లా వాతావరణంలో అనూహ్య మార్పులు వస్తున్నాయి. ఓవైపు వానలు, మరోవైపు ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. సాధారణంగా రోజూ వర్షం కురుస్తుంటే.. వాతావరణం దానంతట అదే చల్లబడుతుంది. కానీ, ఎంత వాన పడుతున్నా ఉక్కపోత మాత్రం తగ్గడం లేదు. ఫ్యాన్ టాప్ స్పీడ్‌లో పెట్టినా, కూలర్లు తిరుగుతున్నా, ఏసీలు పని చేస్తున్నా ఫలితం ఉండటం లేదు. రోజంతా చెమటతో ప్రజలు చికాకు పడుతున్నారు. మరోవైపు వాతావరణంలో మార్పుల వల్ల రోగనిరోధక శక్తి దెబ్బతిని, జ్వరాల బారిన పడుతున్నారు.

19న అల్పపీడనం ఏర్పడే అవకాశాలు

బంగాళాఖాతంలో షియర్ జోన్ ఏర్పడిందని, దాని వల్ల తెలంగాణలో వరుసగా వర్షాలు కురుస్తున్నాయని భారత వాతావరణ శాఖ(ఐఎండీ) శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. కొన్ని రోజులుగా రాష్ట్రంలో కురుస్తున్న వర్షాలకు కారణం ఇదేనని పేర్కొంది. ఈ నెల 19వ తేదీన బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశాలున్నాయని వెల్లడించింది. దీని ప్రభావంతో 18, 19, 20, 21, 22వ తేదీల్లో ఉమ్మడి జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన సాధారణం నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయంది. వాస్తవానికి వానల వల్ల వాతావరణంలో తేమశాతం సహజంగానే పెరుగుతుందని, దానివల్లే శరీర ఉష్ణోగ్రతలు పెరిగి, చెమటలు పడతాయని అధికారులు పేర్కొన్నారు.

ఆరోగ్యానికి ముప్పు



వరుసగా కురుస్తున్న వర్షాలతో ప్రజల ఆరోగ్యానికి ముప్పు పొంచి ఉంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు, నీటిగుంటల్లో నీరు చేరి, దోమలకు ఆవాసాలుగా మారుతున్నాయి. సూర్యుడు కూడా రోజుల తరబడి రాకపోవడంతో దోమలు, వాటి సంతతి ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోతోంది. ఫలితంగా చికున్ గన్యా, మలేరియా, డెంగీ, వైరల్ ఫీవర్స్ పెరిగిపోతున్నాయి. విషజ్వరాలన్నీ పగలు కుట్టే దోమల వల్లే వస్తున్నాయి. వాతావరణంలో మార్పుల వల్ల శ్వాసకోస సంబంధిత న్యూమోనియాను నిర్మూలించేందుకు బలవర్ధక ఆహారం తీసుకోవాలి. రోజూ గుడ్డు తినాలి. వ్యాయామం చేయడం, పరిశుభ్రత పాటించడం, మాస్కులు ధరించడం చేయాలి. – డాక్టర్ సాయిని నరేందర్, సివిల్ సర్జన్, పల్మనాలజిస్టు

అర్హత ఉన్నవారికి ఓటుహక్కు

- ఈ నెల 20 నుంచి ఇంటింటి సర్వే
- వీసీలో రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సి.సుదర్శన్‌రెడ్డి


వీసీలో కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్లు ప్రఫుల్‌దేశాయ్, లక్ష్మీకిరణ్

కరీంనగర్ అర్బన్: 2025 జనవరి 1నాటికి 18ఏళ్లు నిండే ప్రతీ ఒక్కరిని ఓటరు జాబితాలో నమోదు చేయాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సి.సుదర్శన్‌రెడ్డి ఆదేశించారు. శనివారం హైదరాబాద్ నుంచి అదనపు సీఈవో లోకేశ్‌కుమార్‌తో కలిసి ఓటరు జాబితా సవరణ–2025పై కలెక్టర్లతో వీసీ ద్వారా సమీక్షించారు. ఈ నెల 20నుంచి అక్టోబర్ 28వరకు ప్రీ రివిజన్ నిర్వహించి, అక్టోబర్ 29న ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేయాలని, నవంబర్ 28, 2024 వరకు సదరు జాబితాపై ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరించాలని, రెండు శనివారాలు, ఆదివారాలు ప్రత్యేక క్యాంపులు నిర్వహించాలని తెలిపారు. డిసెంబర్ 24, 2024లోగా అభ్యంతరాలు, ఓటర్ క్లెయిమ్స్‌ను పూర్తి స్థాయిలో పరిష్కరించి, జనవరి 6, 2025న తుది ఓటరు జాబితా ప్రకటించాలని ఆదేశించారు. ఈ నెల 20 నుంచి అక్టోబర్ 18 వరకు పోలింగ్ అధికారులు ఇంటింటికీ తిరుగుతూ ఓటరు ధ్రువీకరణ చేపట్టాలని సూచించారు. కలెక్టర్ పమేలా సత్పతి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, అదనపు కలెక్టర్ రెవెన్యూ లక్ష్మీకిరణ్, శిక్షణ కలెక్టర్ అజయ్‌యాదవ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

విజిబుల్ పోలీసింగ్‌కు ప్రాధాన్యం

- గంజాయిపై ఉక్కుపాదం
- రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా
- నేర సమీక్షలో సీపీ అభిషేక్ మహంతి


మాట్లాడుతున్న సీపీ అభిషేక్ మహంతి

కరీంనగర్‌క్రైం: కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో విజిబుల్ పోలీసింగ్‌కు ప్రాధాన్యం ఇవ్వాలని సీపీ అభిషేక్ మహంతి సూచించారు. కమిషనరేట్ కాన్ఫరెన్స్‌హాల్‌లో శనివారం అన్ని పోలీసుస్టేషన్ల అధికారులతో నేర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. ఆయా పోలీసుస్టేషన్ల అధికారులు స్థానిక ప్రజలతో సత్సంబంధాలు పెంచుకోవాలని సూచించారు. శాంతి భద్రతల సమస్య తలెత్తితే వెంటనే సమాచారం అందేలా చూసుకోవాలన్నారు. డయల్ 100కు వచ్చే ప్రతీ ఫిర్యాదులో వాస్తవాన్ని తెలుసుకుని సమస్యను పరిష్కరించాలన్నారు. రౌడీ, హిస్టరీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నారు. గంజాయిని అరికట్టేందుకు నార్కోటిక్ కంట్రోల్ సెల్ ఏర్పాటు చేశామని, సైబర్ వారియర్లు అప్రమత్తంగా ఉండాలని, ఫిర్యాదు అందిన వెంటనే 1930కు సమాచారం అందించి సొత్తు రికవరీకి చొరవ చూపాలన్నారు. పెండింగ్ కేసులపై ఆరా తీశారు. ఇసుక, రేషన్ బియ్యం అక్రమ రవాణా, పేకాట స్థావరాలను నిరోధించాలన్నారు. ఏసీపీలు శ్రీనివాస్, నరేందర్, వెంకటరమణ, విజయ్‌కుమార్, కాశయ్య, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.



- సోదరసోదరీమణుల అనుబంధానికి ప్రతీక
- పుట్టింటికి చేరనున్న ఆడబిడ్డలు
- అన్నదమ్ములకు రాఖీ కట్టి, మురిసిపోయే పండుగ

అనురాగ వారధి.. రాఖీ

అనురాగ వారధి రాఖీ పండుగ. జన్మనిచ్చిన అమ్మ.. జీవితాన్ని ఇచ్చిన నాన్నను తమ సోదరుల్లో చూసుకుంటూ సోదరీమణులు సంబరపడతారు. ఏటా శ్రావణమాసంలో పౌర్ణమి రోజు రాఖీని జరుపుకుంటారు. ఎంత దూరంలో ఉన్నా అన్నాదమ్ములను కలిసేందుకు ఆడబిడ్డలు పుట్టింటికి చేరి, రాఖీ కట్టి, తమకు రక్షణగా నిలవాలని కోరుతారు. సోదరులు వారికి అభయంతోపాటు చీరసారెలు, కానుకలు ఇస్తారు. విదేశాల్లో ఉన్నవారు కొరియర్ ద్వారా ఇక్కడికి, ఇక్కడివారు విదేశాలకు, ఇతర ప్రాంతాలకు రాఖీలను పంపుతారు. ఉమ్మడి జిల్లాలో పలు రాఖీ తయారీ కేంద్రాల్లో వివిధ డిజైన్లు అందుబాటులో ఉండగా.. గిరాకీ బాగుందని వ్యాపారులు చెబుతున్నారు. రేపు రాఖీ పండుగ సందర్భంగా ప్రత్యేక కథనం!!

ఏడాది పొడవునా రాఖీల తయారీ


రాఖీలు కొంటున్న వినియోగదారులు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి రాఖీ తయారీ కేంద్రంలో ఏడాది పొడవునా రాఖీలు తయారు చేస్తున్నారు. ఇందుకు అవసరమయ్యే ముడిసరుకును పలు రాష్ట్రాల నుంచి తెప్పిస్తున్నట్లు యజమాని ఇల్లందుల కృష్ణమూర్తి తెలిపారు. దేశంలోని 15 రాష్ట్రాలతో పాటు అమెరికా, బ్రిటన్ వంటి దేశాలకు రాఖీలు ఎగుమతి చేస్తున్నారు. జరీ, స్పాంజ్, ఫ్యాన్సీ, కిడ్స్, స్టోన్, సిల్వర్, టాయ్, డోరీ తదితర రకాల రాఖీలు తయారు చేస్తున్నారు. పొరుగు రాష్ట్రాల వ్యాపారులు వచ్చి కొనుగోలు చేస్తున్నారు. ఇక్కడ పది పైసల నుంచి రూ.150 వరకు రాఖీలు అందుబాటులో ఉన్నాయి. రూ.10 వేలకు మించి విలువ చేసే రాఖీలు కొనుగోలు చేస్తే ఫ్రీ డెలివరీ చేస్తున్నారు.

4 వేల మందికి ఉపాధి



మాది మంథని. 36 ఏళ్ల క్రితం గుమాస్తాగా పనిచేసి, పెద్దపల్లికి వచ్చి స్థిరపడ్డాను. తొలుత చిన్న చిన్న వ్యాపారాలు చేశాను. తర్వాత రాఖీ తయారీ కేంద్రాన్ని నెలకొల్పి, 4 వేల మందికి ఉపాధి కల్పిస్తున్నాను. ఈ వ్యాపారం నాకు ఎంతో తృప్తినిస్తోంది.
– ఇల్లందుల కృష్ణమూర్తి, రాఖీ కేంద్రం నిర్వాహకుడు

హైదరాబాద్ నుంచి వచ్చా



నేను పెద్దపల్లిలో రాఖీ తయారీ కేంద్రం ఉందని తెలుసుకొని, హైదరాబాద్ నుంచి వచ్చాను. రాఖీలు రకరకాల డిజైన్లలో ఉన్నాయి. గతంలో కోల్‌కతా నుంచి తెప్పించేవాన్ని. ఇప్పుడు ఇక్కడి నుంచే తీసుకెళ్తున్న. – మోతీలాల్, వ్యాపారి

బీడీ పరిశ్రమకు ప్రత్యామ్నాయంగా..


సిరిసిల్లలో తయారైన రాఖీలు

సిరిసిల్లటౌన్: దశాబ్ద కాలంగా సిరిసిల్లలో రాఖీ పరిశ్రమ విస్తరించి ఉంది. తొలుత ఒక్కరు పరిశ్రమను స్థాపించగా ప్రస్తుతం పదుల సంఖ్యలో చిరు వ్యాపారులు రాఖీలను తయారు చేస్తున్నారు. జిల్లాతోపాటు కరీంనగర్, ఆదిలాబాద్, వరంగల్ జిల్లాలకు, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు తదితర రాష్ట్రాలకు ఎగుమతి అవుతున్నాయి. రాఖీల తయారీకి అవసరమైన ముడి సరుకును వ్యాపారులు ముంబయిలోని మల్లాడ్ ప్రాంతం నుంచి తీసుకువస్తున్నారు. రంగురాళ్లు, సిల్వర్, గోల్డెన్, దేవుళ్ల బొమ్మలు, వివిధ పార్టీల గుర్తులతో రాఖీలు తయారు చేయిస్తున్నారు. రూ.2 నుంచి రూ.100 వరకు ధరల్లో విక్రయిస్తున్నారు. ఒకరకంగా చెప్పాలంటే ఇక్కడ బీడీ పరిశ్రమకు ప్రత్యామ్నాయంగా రాఖీ పరిశ్రమ నడుస్తోంది.

ఎనిమిదేళ్లుగా నిర్వహిస్తున్న



మేము ఎనిమిదేళ్లుగా సిరిసిల్లలో రాఖీ పరిశ్రమ నిర్వహిస్తున్నం. ఇతర జిల్లాలు, రాష్ట్రాలకు రాఖీలను ఎగుమతి చేస్తున్నాం. బ్రాండెడ్ రాఖీలతో పోల్చితే తక్కువ రేట్లు ఉండటంతో ఆదరణ లభిస్తోంది. – అవదూత శ్రీహరి, రాఖీ పరిశ్రమ నిర్వాహకుడు

విత్తన రాఖీలు..

సిరిసిల్ల టౌన్: సిరిసిల్ల గణేశ్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో మూడేళ్లుగా విత్తనాలతో రాఖీలు తయారు చేస్తున్నారు. వాటిని పిల్లలతో కట్టిస్తున్నామని టీచర్ వింధ్యారాణి తెలిపారు. సాధారణ రాఖీలను ప్లాస్టిక్‌తో తయారు చేస్తుండటంతో పర్యావరణం దెబ్బతింటుందని పేర్కొన్నారు.


విత్తన రాఖీలు ఇస్తున్న టీచర్ వింధ్యారాణి

తమ్ముడికి 79 ఏళ్లుగా కడుతున్న



ఇల్లంతకుంట(సిరిసిల్ల): నా పేరు రామవ్వ. వయసు 83ఏళ్లు. నాకు ఊహ తెలిసినప్పటి నుంచి 79 ఏళ్లుగా తమ్ముడు సాదుల ఆగయ్యకు రాఖీ కడుతున్న. ప్రతీ సంవత్సరం నా తల్లిగారి ఊరు ఇల్లంతకుంటకు నా కొడుకు శ్రీనివాస్ బండిపై తీస్కపోతడు. భర్త స్వాతంత్ర్య సమరయోధుడు వెంకటరాములు. నాకు ఇద్దరు తమ్ముళ్లయితే ఒకడు చనిపోయిండు. ఉన్న ఒక్క తమ్మునికి రాఖీ కడితే సంతోషంగా ఉంటది.

70 ఏళ్ల వయసు.. 5 కి.మీ. నడిచి వెళ్తూ



మల్యాల(చొప్పదండి): మండలంలోని సర్వాపూర్‌కు చెందిన సామల భాగ్యవ్వకు ఒక చెల్లెలు, తమ్ముడు ఉన్నారు. తల్లిగారి ఊరు గంగాధర మండలంలోని కొండయ్యపల్లె. భర్త గణపతి గతంలోనే చనిపోయాడు. కొండయ్యపల్లెలో ఉంటున్న తమ్ముడు గౌడ మల్లేశంకు ఏటా రాఖీ కడుతోంది. చాలా ఏళ్లుగా ఆ ఊరికి బస్సు నడవడం లేదని, ఏటా పండుగకు 5 కి.మీ. నడుచుకుంటూ వెళ్తున్నట్లు తెలిపింది. ఇప్పుడు ఆమె వయసు 70 ఏళ్లు. ఆదివారం నడుస్తూ వెళ్లి, తమ్ముడికి రాఖీ కడతానని పేర్కొంది.

రాఖీల బట్వాడా



బోయినపల్లి(చొప్పదండి): సుదూర ప్రాంతాల్లో ఉన్న తమ సోదరులకు ఆడబిడ్డలు పోస్టు ద్వారా రాఖీలు పంపి, సంతోషిస్తారు. ఎక్కువ శాతం హైదరాబాద్, బెంగళూరు, ముంబయి తదితర ప్రాంతాలకు పోస్టల్ సేవలు అందుబాటులో ఉన్నాయని కరీంనగర్ పోస్టల్ సూపరింటెండెంట్ కె.శివాజీ తెలిపారు. కరీంనగర్ పోస్టల్ డివిజన్ పరిధిలో ఇప్పటివరకు 700కు పైగా రాఖీలను పంపించామని పేర్కొన్నారు.

చెల్లి రాక కోసం ఎదురుచూస్తా



వేములవాడ: అన్నాచెల్లెలి అనుబంధాన్ని బలోపేతం చేసే పండుగ రాఖీ. ఏటా ఎన్ని కార్యక్రమాలు ఉన్నా నా చెల్లి రాక కోసం ఎదురుచూస్తా. చిన్నప్పుడు తనతో ఆడుకున్న ఆటలు మరిచిపోలేను. ప్రజల ఆశీస్సులతో ఈసారి వేములవాడ ఎమ్మెల్యేగా గెలుపొందాను. జిల్లాలోని మహిళామణులకు పండుగ శుభాకాంక్షలు. – ఆది శ్రీనివాస్, ప్రభుత్వ విప్

30 ఏళ్లుగా విక్రయాలు



వేములవాడ: 30 ఏళ్లుగా వేములవాడలో బుక్‌స్టాల్ నిర్వహిస్తున్నాం. ఏటా రాఖీ పౌర్ణమికి నెల రోజుల ముందుగానే రాఖీలు తెప్పిస్తాం. అక్కాచెల్లెళ్లు దూర ప్రాంతాల్లో ఉన్న తమ సోదరులకు సకాలంలో పంపించే వీలుంటుంది. మాకు అదనపు ఆదాయం సమకూరుతోంది. – పైడ శ్రీనివాస్–స్వప్న

క్లుప్తంగా

రక్తకణాలు తగ్గి మహిళ మృతి


ఇందిర (ఫైల్‌)

కోనరావుపేట(వేములవాడ): జ్వరంతో బాధపడుతున్న ఓ మహిళ చికిత్స పొందుతూ మృతి చెందింది. గ్రామస్తుల వివరాలు.. రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం మామిడిపల్లి గ్రామానికి చెందిన బడుగు ఇందిర (43) నాలుగు రోజులుగా జ్వరంతో బాధపడింది. స్థానికంగా మాత్రలు వేసుకున్నా తగ్గకపోవడంతో శుక్రవారం వేములవాడలోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షలు నిర్వహించగా రక్త కణాలు 33 వేలకు పడిపోయాయి. రక్తం కూడా తక్కువగా ఉండడంతో కరీంనగర్‌కు రెఫర్‌ చేశారు. కరీంనగర్‌లోని ఆస్పత్రికి చేరకముందే ఇందిర మృతి చెందింది. మృతురాలికి భర్త భూమయ్య, కూతుళ్లు శ్వేత, వైష్ణవి, కుమారుడు రాహుల్‌ ఉన్నారు.

విద్యుదాఘాతంతో రైతు..


రంగయ్య మృతదేహం

ఇల్లంతకుంట(మానకొండూర్‌): మండలంలోని రేపాక గ్రామానికి చెందిన రైతు మొగులోజి రంగయ్య(70) శనివారం విద్యుదాఘాతంతో మృతిచెందాడు. ఎస్సై శ్రీకాంత్‌ వివరాల ప్రకారం.. రంగయ్య రోజువారి మాదిరిగానే వ్యవసాయ బావి వద్దకు కరెంటు పెట్టేందుకు వెళ్లి విద్యుత్‌ స్తంభానికి ఉన్న సపోర్టు వైరు పట్టుకోగానే షాక్‌తో మృతిచెందాడు. మృతుని భార్య సత్తవ్వ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

చికిత్సపొందుతూ వ్యక్తి..

రాయికల్‌(జగిత్యాల): రాయికల్‌ మండలం ఇటిక్యాల గ్రామానికి చెందిన కండ్లి పోచయ్య (76) చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. ఎస్సై అశోక్‌ వివరాలు.. ఈనెల 16న పోచయ్య సైకిల్‌పై వెళ్తుండగా అదే గ్రామానికి చెందిన గుండ సచిన్‌ ద్విచక్ర వాహనంపై అతివేగంగా వచ్చి ఢీకొట్టాడు. పోచయ్య తలకు తీవ్రగాయాలు కావడంతో జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి మనుమడు దుర్గప్రసాద్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

20న బీటెక్‌ సీట్ల కౌన్సెలింగ్‌

రామగిరి(మంథని): సెంటనరీకాలనీలోని మంథని జేఎన్టీయూలో 2024–25 సంవత్సరానికి కేటాయించిన సూపర్‌ న్యూమరరీ బీటెక్‌ సీట్ల కౌన్సెలింగ్‌ ఈనెల 20న చేపడతామని ఆర్జీ–3, ఏపీఏ జీఎంలు సుధాకర్‌రావు, కె.వెంకటేశ్వర్లు తెలిపారు. తొలిదశలో మిగిలిన 25 సీట్లు, కొత్తగూడెంలోని కాకతీయ యూనివర్సిటీ ఇంజినీరింగ్‌ కళాశాలలో మిగిలిన 10 సూపర్‌ న్యూమరరీ సీట్లకు ఈనెల 22న అక్కడే ఉదయం 10 గంటలకు కౌన్సెలింగ్‌ ఉంటుందన్నారు. మెరిట్‌ ప్రతిపాదికన సింగరేణి అధికారులు, ఎన్‌సీడబ్ల్యూఏ ఉద్యోగుల పిల్లలకు కేటాయిస్తారని వివరించారు. అర్హత గలవారు ధ్రువీకరణపత్రాలతో నిర్దేశిత సమయానికి కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని వారు సూచించారు.

మోటార్‌ స్టార్టర్‌ బాక్సులు చోరీ

ఫెర్టిలైజర్‌సిటీ(రామగుండం): పాలకుర్తి మండలం ఎల్కలపల్లి గ్రామంలో బండారి ప్రసాద్‌కు చెందిన వ్యవసాయ పంపుసెట్‌ మోటార్‌ స్టార్టర్‌ బాక్సులను దొంగలు చోరీ చేశారు. శనివారం బాధితుడు ఎన్టీపీసీ పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

దివ్యమైన ఉపాధి

- అంగవైకల్యాన్ని జయించిన ఆత్మవిశ్వాసం
- వారసంతల్లో కూరగాయలు విక్రయిస్తూ ఉపాధి
- 'దివ్య'ంగా శ్రమిస్తున్న దంపతులు
- ఇది గిరిజనుడి విజయగాథ

సిరిసిల్ల: చదువుకున్నా ఉద్యోగం రాలేదని దిగులు చెందే యువతకు అతనో మార్గదర్శి. అవయవాలు సక్రమంగా ఉన్నా నాతోని ఆ పని కాదు అనే సోమరులకు అతనో స్ఫూర్తి. దివ్యాంగుడైనా దిగులు చెందకుండా మనోధైర్యంతో ముందడుగు వేసిన అతని ధైర్యం అనుసరణీయం. ఉద్యోగం రాలేదు.. ఏ పని దొరకడం లేదు.. అని ఉసూరుమనే యువతకు ఆదర్శంగా నిలుస్తున్నాడు గిరిజన వ్యక్తి. ఆత్మవిశ్వాసంతో అంగవైకల్యాన్ని జయించి.. ధైర్యంగా బతుకుదెరువు బాటను వేసుకున్న దివ్యాంగుడు పీర్యానాయక్‌ విజయగాథ ఇదీ..

అడవితల్లి ఒడిలో..

అది జిల్లా సరిహద్దు గ్రామం. రాజన్నసిరిసిల్ల జిల్లా, నిజామాబాద్‌ జిల్లా సరిహద్దులోని గిరిజనపల్లెలో పుట్టాడు. వీర్నపల్లి మండలం వన్‌పల్లికి చెందిన మాలోత్‌ పీర్యానాయక్‌(45)కు చిన్నప్పుడే పోలియోతో కాళ్లువంకర్లు పోయాయి. 90 శాతం వైకల్యంతో పదోతరగతి వరకు చదువుకున్నాడు. హెచ్‌పీటీ, విద్వాన్‌ భూషణ్‌ చేశాడు. ప్రభుత్వ ఉద్యోగాల కోసం అన్వేషించినా రాకపోవడంతో దిగులు పడలేదు. ఉన్న ఎకరం భూమిలో వ్యవసాయం చేశాడు. నిజామాబాద్‌ జిల్లా సిరికొండ మండలం చీమన్‌పల్లికి చెందిన మూగ, చెవిటి అమ్మాయి కౌసల్యను పెళ్లి చేసుకున్నాడు. ఆ దంపతులకు ఇద్దరు పిల్లలు మౌనిక(23), ముఖేశ్‌(21). కూతురు నంద్యాలలో బ్యాంకు ఉద్యోగం కోసం కోచింగ్‌ తీసుకుంటుండగా, కొడుకు కరీంనగర్‌లో డిగ్రీ చదువుతున్నాడు. సొంతిల్లు లేకపోయినా వన్‌పల్లిలో అద్దె ఇంట్లో ఉంటున్నారు. భార్య కౌసల్య పీర్యానాయక్‌కు అండగా నిలిచింది. ఆమెకు మాటలు రాకున్నా.. చెవులు వినిపించకపోయినా భర్తకు తోడుగా నిలిచింది.

కేటీఆర్‌ చేయూతతో ఉపాధి బాటలో..

రెండేళ్ల క్రితం సిరిసిల్ల ఎమ్మెల్యే, అప్పటి రాష్ట్ర మంత్రి కె.తారక రామారావు తన పుట్టిన రోజు సందర్భంగా దివ్యాంగులకు త్రీవీలర్‌ వాహనాలు అందించారు. అందులో భాగంగా పీర్యానాయక్‌కు త్రీవీలర్‌ వాహనం వచ్చింది. దీంతో ఆ బండిపై ఖాళీగా ఉండకుండా స్థానికంగా వారసంతల్లో కూరగాయలు అమ్మే వ్యాపారం ప్రారంభించాడు. సిరిసిల్ల కూరగాయల మార్కెట్‌కు నిత్యం వెళ్లి హోల్‌సేల్‌గా కూరగాయలు కొనుగోలు చేసి.. వీర్నపల్లి, గర్జనపల్లి, కోనరావుపేట మండలం మరిమడ్ల, నిజామాబాద్‌ జిల్లా సిరికొండ మండలం చీమన్‌పల్లిల్లో జరిగే వారసంతల్లో విక్రయిస్తున్నాడు. ఆరోజు ఏమైనా కూరగాయలు మిగిలితే మరసటి రోజు ఇంటివద్ద వన్‌పల్లిలో అమ్ముతున్నాడు. ఇంకా మిగిలితే ఊరిలో బండిపై తిరుగుతూ విక్రయిస్తున్నాడు. ఇలా వారంలో మూడు రోజులు సంతల్లో కూరగాయలు విక్రయిస్తున్నాడు.


త్రీవీలర్‌పై కూరగాయలు తీసుకెళ్తున్న మాలోత్‌ పీర్యానాయక్‌

నిత్యం తెల్లవారుజామునే 5 గంటలకు వన్‌పల్లి నుంచి 45 కిలోమీటర్లు ప్రయాణించి సిరిసిల్లకు వెళ్లి కూరగాయలు హోల్‌సేల్‌గా కొనుగోలు చేసి, మళ్లీ 45 కిలోమీటర్లు వన్‌పల్లి వరకు వెళ్తున్నాడు. ఇంటి వద్ద భోజనం చేసి.. మధ్యాహ్నం వారసంతల్లో కూరగాయలు అమ్ముతుంటాడు. ఇలా వ్యాపారం చేస్తూ బండికి పెట్రోల్‌ ఖర్చులు పోను సగటున నిత్యం రూ.500 వరకు సంపాదిస్తూ కుటుంబాన్ని వెల్లదీస్తున్నాడు.

బతకడానికి అనేక మార్గాలు



అనేక ఉద్యోగాలు దరఖాస్తు చేసినా రాలేదు. బతకడానికి అనేక మార్గాలు ఉన్నాయి. వ్యవసాయం చేసిన. నా భార్యకు మాటలు రావు, చెవులు వినబడవు. మా ఇద్దరికి ప్రభుత్వం ద్వారా పెన్షన్‌ వస్తుంది. చిన్న పెట్టుబడితో కూరగాయలు కొని అమ్ముతున్న. ఆర్థిక ఇబ్బందులు లేకుండా వ్యాపారం చేస్తున్న. మా పిల్లలకు ఉద్యోగాలు వచ్చి సెటిల్‌ అయ్యేంత వరకు నేను శ్రమించాల్సిందే.

– మాలోత్‌ పీర్యానాయక్‌, దివ్యాంగుడు

అగ్ని ప్రమాదంలో రూ.కోటి 80 లక్షల నష్టం

పెద్దపల్లిరూరల్‌: పెద్దపల్లి మండలం భోజన్నపేట గ్రామంలోని త్రివేణి రైస్‌మిల్లులో శుక్రవారం జరిగిన అగ్ని ప్రమాదంలో రూ.కోటి 80లక్షల విలువగల ధాన్యం, బియ్యం నిల్వలు మంటల్లో కాలిపోయాయని యజమాని కాసనగొట్టు శ్రీనివాస్‌ తెలిపారు. ప్రమాదస్థలాన్ని శనివారం ఎమ్మెల్యే విజయరమణారావు పరిశీలించారు. జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి ప్రేమ్‌కుమార్‌ మిల్లును సందర్శించి వివరాలు తెలుసుకున్నారు.

'పిన్‌' లేక పని చేయని జనరేటర్‌!

అత్యవసర పరిస్థితుల్లో సేవలందించేందుకు అవసరమయ్యే పరికరాలు మొరాయిస్తే.. సమయానికి పనికి రాక సేవలందని పరిస్థితి నెలకొంటుంది. భోజన్నపేట రైస్‌మిల్లులో చెలరేగిన మంటలను అదుపు చేసేందుకు వచ్చిన పెద్దపల్లి ఫైరింజన్‌ వద్ద శుక్రవారం రాత్రి ఇదే పరిస్థితి ఎదురైంది. ఫైరింజన్‌లో నీళ్లు అయిపోవడంతో సమీపంలోని చెరువు నుంచి నీరు తోడేందుకు జనరేటర్‌ సాయంతో ఫైర్‌ సిబ్బంది యత్నించారు. అయితే జనరేటర్‌కు పిన్‌ లేకపోవడం తో నీరు నిండడం లేదని గోదావరిఖనిలో ఉన్న పెద్దపల్లి ఫైర్‌ ఆఫీసర్‌ రాజేందర్‌కు సిబ్బంది సమాచారం అందించారు. అప్పటికే మిల్లులో కొంతమేర మంటలు అదుపులోకి వచ్చినా సకాలంలో నీరందక మళ్లీ ఎక్కువ కావడంతో యజమానితో పాటు స్థానికులు హైరానా పడ్డారు. గోదావరిఖని నుంచి మరో ఫైరింజన్‌ను తెప్పించగా.. ఆ యంత్రానికి సంబంధించిన జనరేటర్‌ సాయంతో నీరు నింపి రెండు ఫైరింజన్ల సాయంతో మంటలు అదుపు చేశారు. యంత్రాల్లో సాంకేతిక లోపాలు తలెత్తడం సహజమని, వాటికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి నష్టం కలగకుండా చర్యలు తీసుకున్నామని పెద్దపల్లి అగ్నిమాపక శాఖ అధికారి రాజేందర్‌ తెలిపారు.



వారం వ్యవధిలో తండ్రీ కొడుకు మృతి

- గంభీర్‌పూర్‌లో విషాదం


రాజం(ఫైల్‌)


రమేశ్‌(ఫైల్‌)

కథలాపూర్‌(వేములవాడ): జగిత్యాల జిల్లా కథలాపూర్‌ మండలం గంభీర్‌పూర్‌ గ్రామంలో వారం రోజుల వ్యవధిలోనే తండ్రీకొడుకు మృతిచెందడంతో బాధిత కుటుంబం కన్నీటిపర్యంతం కాగా.. శనివారం గ్రామంలో విషాదం నెలకొంది. గ్రామస్తుల వివరాల ప్రకారం.. గంభీర్‌పూర్‌కు చెందిన గండిగ రాజం(68)కు ముగ్గురు కుమారులు. రాజం ఈనెల 10న అనారోగ్యంతో మృతిచెందాడు. దీంతో దుబాయిలో ఉంటున్న అతని రెండో కుమారుడు గండిగ రమేశ్‌కు సమాచారం అందించారు. ఈక్రమంలో రమేశ్‌ హుటాహుటిన స్వగ్రామానికి చేరుకొని తండ్రి అంత్యక్రియలకు హాజరయ్యాడు. ఆప్యాయంగా పెంచి పోషించిన తండ్రిని కోల్పోయానని రమేశ్‌ బంధువులతో చెబుతూ బాధపడ్డాడు. ఈనెల 16న సాయంత్రం రమేశ్‌ ఛాతిలో నొప్పి ఉందని కుటుంబసభ్యులకు చెప్పాడు. చికిత్స నిమిత్తం కోరుట్ల ఆసుపత్రికి తరలించారు. రమేశ్‌కు గుండె సంబంధిత సమస్య ఉన్నట్లు గుర్తించిన వైద్యులు కరీంనగర్‌కు తరలించాలని కుటుంబసభ్యులకు సూచించారు. చికిత్స నిమిత్తం తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు.

అనర్హులకు 'ఆసరా'పై సర్వే

ఇల్లందకుంట(హుజూరాబాద్‌): అనర్హులకు ఆసరా పెన్షన్‌ రావడంపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విజిలెన్స్‌ అండ్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ అధికారులు మండలంలోని పలు గ్రామాల్లో సర్వే నిర్వహిస్తున్నారు. శనివారం భోగంపాడు, మల్లివానిపల్లి, మల్యాల గ్రామాల్లో కరీంనగర్‌ విజిలెన్స్‌ అండ్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ సీఐ వరుణ్‌ప్రసాద్‌ ఆధ్వర్యంలో రెండు బృందాలుగా ఏర్పడి క్షేత్రస్థాయిలో పెన్షన్‌ పొందేవారి వివరాలు సేకరించారు. కాగా, ఓ గ్రామంలోని ఒక కుటుంబంలో పిల్లలకు అంగవైకల్యం ఉన్నట్లు నకిలీ సదరన్‌ సర్టిఫికెట్స్‌ పొంది, ఆధార్‌కార్డులో వయస్సు ఎక్కువగా వేయించి ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు కొన్నేళ్లుగా అక్రమంగా పెన్షన్‌ తీసుకుంటున్నారని సమాచారం. గ్రామాల్లో కొందరు ఏమి జరుగుతుందోనని భయంతో ఇళ్లకు తాళాలు వేశారు. మరికొందరు వేరే ఊరికి వెళ్లామని చెబుతున్నట్లు తెలిసింది.


భోగంపాడులో సర్వే చేస్తున్న విజిలెన్స్‌ అండ్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ అధికారులు

ఎక్కువ సంఖ్యలో వికలాంగులు కాకున్నా ఫేక్‌ సర్టిఫికెట్స్‌తో అక్రమంగా పెన్షన్‌ పొందుతున్న వారిని గుర్తించినట్లు సమాచారం. సర్వేలో మూడు గ్రామాల్లో అనర్హులకు పెన్షన్‌ వస్తున్నట్లు, కొందరు అర్హులకు రానట్లు గుర్తించారు. కార్యక్రమంలో విజిలెన్స్‌ అండ్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ ఎస్సై నారాయణబాబు, కానిస్టేబుల్స్‌ అనిల్‌, సంపత్‌ పాల్గొన్నారు.





వేములవాడ: వేములవాడ రాజన్నకు వీకెండ్‌ తాకిడి పెరిగింది. శ్రావణమాసంలో శని త్రయోదశి కలిసి రావడంతో వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు శనివారం వేలాదిగా తరలివచ్చారు. మధ్యాహ్నం 2.30 గంటలకు స్వామివారికి నివేదన ఉండటంతో అభిషేకాలు చేసే అవకాశం లభించింది.

గోవు పాలు తల్లి పాలతో సమానం

- హిందూ మహాసభ జాతీయ ప్రధాన కార్యదర్శి యోగి మహారాజ్‌

తిమ్మాపూర్‌(మానకొండూర్‌): గోవులను కాపాడేందుకు చర్యలు తీసుకుంటూ, గోరక్షకులకు అండగా ఉండాలని హిందూ మహాసభ జాతీయ ప్రధాన కార్యదర్శి యోగి మహారాజ్‌ ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. శ్రావణమాసం సందర్భంగా మండలంలోని రామకృష్ణకాలనీ మిషన్‌ వందే గోమాతరం సంస్థ వ్యవస్థాపకుడు మద్విరాజ్‌ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గోశాలలో శనివారం పూజలు చేశారు. ఈ సందర్భంగా సుమారు 50 మంది శిష్య బృందం సమక్షంలో స్వామిజీ ఆధ్వర్యంలో గోవులకు విశేష పూజలు నిర్వహించారు. గోవు పాలు తల్లి పాలతో సమానమని, అందుకే గోవును గోమాతగా భావిస్తామని వివరించారు. గోవులను రక్షించే ఉద్దేశంతో పోరాడే వారిపై కేసులు పెట్టి వేధించే చర్యలు మానుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు.


గోమాతకు పూజలు చేస్తున్న యోగి, తదితరులు

బీజేపీ సీనియర్‌ నాయకుడు పొల్సాని సుగుణాకర్‌రావు మాట్లాడుతూ, రోజూ గోవులపై దారుణమైన అకృత్యాలు జరుగుతున్నా స్థానిక అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో మిషన్‌ వందే గోమాతరం సంస్థ సభ్యులు వేణు, వీహెచ్‌పీ జిల్లా నాయకులు ఉట్కూరి రాధాకృష్ణారెడ్డి, న్యాయవాది సుగుర్తి జగదీశ్వరాచారి, ఎడ్ల భూంరెడ్డి, మొలుగూరి కిశోర్‌, వేల్పుల ఓదయ్య, మార్క హరికృష్ణ, దుర్గుంటి శేఖర్‌రెడ్డి, సిద్ధ శ్రీనివాస్‌ తదితరులు పాల్గొన్నారు.

'శ్రావణ' ఉత్సాహం


సంప్రదాయ దుస్తుల్లో విద్యార్థినులు

పెద్దపల్లిరూరల్‌: పెద్దపల్లిలోని ట్రినిటి డిగ్రీ కాలేజీలో శనివారం విద్యార్థినులు సంప్రదాయ దుస్తులతో అలరించారు. శ్రావణ మాసంలో మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి వరలక్ష్మి, గౌరీదేవిలకు పూజలు ఎలా చేస్తారో ప్రదర్శించారు. ప్రిన్సిపాల్‌ రాజు, అధ్యాపకులు అశ్విని, సరిత, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

బస్టాండ్‌లో చోరీలకు పాల్పడుతున్న మహిళ పట్టివేత

కరీంనగర్‌ క్రైం: కరీంనగర్‌ బస్టాండ్‌లో చోరీలకు పాల్పడుతున్న ఓ మహిళను పోలీసులు పట్టుకున్నారు. వారి వివరాల ప్రకారం.. విజయవాడకు చెందిన మాధవి శనివారం కరీంనగర్‌ బస్టాండ్‌లో ప్రయాణికురాలు శృతి పర్సు, సెల్‌ఫోన్‌ దొంగతనం చేసేందుకు ప్రయత్నిస్తుండగా బస్టాండ్‌ విజిలెన్స్‌ సెక్యూరిటీ పోలీసులు పట్టుకున్నారు. ఆమె వద్ద నుంచి 3 పర్సులు, ఒక బంగారు గాజు, రూ.42 వేలు స్వాధీనం చేసుకొని, వన్‌టౌన్‌ పోలీసులకు అప్పగించారు. కార్యక్రమంలో విజిలెన్స్‌ సెక్యూరిటీ పోలీసులు లక్‌పతి, సాగర్‌, సారయ్య, మానస పాల్గొన్నారు.

మంథనిలో రేషన్‌ బియ్యం..

మంథని: మంథని మండలం సిద్దపల్లి వద్ద రేషన్‌ బియ్యం అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని పట్టుకున్నట్లు ఎస్‌ఐ రమేశ్‌ తెలిపారు. మంథని నుంచి అక్రమంగా బియ్యం రవాణా చేస్తున్నారనే సమాచారం మేరకు వాహనాన్ని తనిఖీ చేయగా ఐదు క్వింటాళ్ల బియ్యం పట్టుబడ్డాయి. గంగాపురికి చెందిన అంజి ప్రజల వద్ద తక్కువ రేటుకు బియ్యం కొని రమేశ్‌కు ఎక్కువ రేటుకు అమ్ముతూ లాభం పొందుతున్నాడని పేర్కొన్నారు. సివిల్‌ సప్లై అధికారి ఫిర్యాదు మేరకు అంజి, రమేశ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

'గ్రాస్‌ కటింగ్‌ మెషిన్‌' నమూనాకు ప్రశంస

కొత్తపల్లి(కరీంనగర్‌): కొత్తపల్లిలోని అల్ఫోర్స్‌ ఇ టెక్నో స్కూల్‌ విద్యార్థులు ఎస్‌.సాయిశిక్‌, వై.సాయి సాత్విత్‌ (7వ తరగతి) రూపొందించిన 'గ్రాస్‌ కటింగ్‌ మెషిన్‌' నమూనాకు అవార్డు వరించింది. స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కలెక్టర్‌ పమేలా సత్పతి ప్రశంసా పత్రాలు అందజేసినట్లు విద్యాసంస్థల చైర్మన్‌ డా.వి.నరేందర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా శనివారం పాఠశాలలో విద్యార్థులను అభినందించారు. విద్యార్థులు అద్భుత ఆలోచనతో గ్రాస్‌ కటింగ్‌ నమూనా తయారు చేయడం సంతోషకరమని, అనుభవజ్ఞులైన సైన్స్‌ ఉపాధ్యాయులచే శిక్షణ ఇప్పిస్తూ వివిధ స్థాయిలలో నిర్వహించే పలు పోటీల్లో ఘన విజయాలే లక్ష్యంగా ఉత్సాహపరుస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌, సైన్స్‌ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


విద్యార్థులను అభినందిస్తున్న నరేందర్‌రెడ్డి

వరదకాలువ నుంచి ట్రాక్టర్‌ వెలికితీత

మల్యాల(చొప్పదండి): జగిత్యాల జిల్లా మల్యాల మండలం రాంపూర్‌ గ్రామ శివారులోని వరద కాలువలో పడిన ట్రాక్టర్‌ను గ్రామస్తులు శనివారం జేసీబీల సాయంతో బయటకు తీశారు. గ్రామానికి చెందిన మహేశ్‌ ఈ నెల 15న మేడిపల్లి మండలం కొండయ్యపల్లి గ్రామ శివారులో తన పొలం వద్దకు వెళ్లి, తిరిగి వస్తుండగా ట్రాక్టర్‌ అదుపుతప్పి వరదకాలువలోకి దూసుకెళ్లింది. కాలువలో నీరు ఎక్కువగా ఉండడంతో ట్రాక్టర్‌ మునిగిపోయింది. ఈ ఘటనలో మహేశ్‌ స్వల్పంగా గాయపడ్డాడు. శనివారం కాలువలో నీటి మట్టం తగ్గడంతో ట్రాక్టర్‌ను బయటకు తీశారు.


ట్రాక్టర్‌ను బయటకు తీస్తున్న గ్రామస్తులు

పండుగకు పంపించకపోవడంపై ఆందోళన


రోడ్డుపై బైఠాయించిన తల్లిదండ్రులు

మెట్‌పల్లి(కోరుట్ల): తమ పిల్లలను రాఖీ పండుగకు ఇంటికి పంపించకపోవడాన్ని నిరసిస్తూ పట్టణంలో మహాత్మా జ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాల ఎదుట శనివారం తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. సోమవారం రాఖీ పండుగ ఉండడంతో పిల్లలను తీసుకెళ్లేందుకు పెద్ద సంఖ్యలో తల్లిదండ్రులు పాఠశాలకు వచ్చారు. కానీ, ప్రభుత్వం అనుమతి ఇవ్వకపోవడం వల్ల వారిని ఇంటికి పంపడానికి ప్రిన్సిపాల్‌ జుబేర్‌ నిరాకరించాడు. దీంతో తల్లిదండ్రులు పాఠశాల ఎదుట రహదారిపై బైఠాయించారు. ట్రాఫిక్‌ నిలిచిపోవడంతో పోలీసులు అక్కడకు చేరుకొని ప్రిన్సిపాల్‌తో మాట్లాడుకోవాలే తప్ప ఇలా ఆందోళనలు చేయడం సరికాదని నచ్చజెప్పారు. అనంతరం ప్రిన్సిపాల్‌ వద్దకు మరోసారి వెళ్లగా, ఆయన పరిస్థితిని వివరించి సహకరించాలని కోరారు. దీనికి కొందరు అంగీకరించి అక్కడి నుంచి వెళ్లిపోగా, మరికొందరు తల్లిదండ్రులు మాత్రం పంపించాల్సిందేనని పట్టుబట్టారు. గత్యంతరం లేక అలాంటి వారి పిల్లలను పంపించడంతో వివాదం సద్దుమణిగింది.

కట్టు కథ అల్లి.. తప్పుదారి పట్టించి

- మిస్సింగ్‌ కథ నడిపించిన యువకుడిపై కేసు


గంగరాజు అరెస్టు చూపుతున్న సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై శ్రీకాంత్‌

చందుర్తి(వేములవాడ): కట్టు కథ అల్లి పోలీసులను తప్పుదారి పట్టించిన రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం ఆశిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన ఎక్కలదేవి గంగరాజును పోలీసులు అరెస్ట్‌ చేశారు. శనివారం రాత్రి చందుర్తి పోలీస్‌స్టేషన్‌లో సీఐ వెంకటేశ్వర్లు వివరాలు వెల్లడించారు. ఈ నెల 15న తెల్లవారుజామున 4గంటల సమయంలో పొలం వద్దకు వెళ్లిన గంగరాజు అక్కడ బైక్‌ను ధ్వంసం చేసి సెల్‌ఫోన్‌, చెప్పులు చిందరవందరగా పడేసి, చేతిని రాళ్లతో గీరుకుని షర్టుకు రక్తపు మరక అంటించి పడేశాడు. దీనిని నిజమని నమ్మించేందుకు తన భార్య గంగజలతో «నా భర్త కనిపించడంలేదు» అని ఫిర్యాదు చేయించాడు. పోలీసులు మిస్సింగ్‌ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించగా దాడి చేసిన ఆనవాళ్లు తప్ప గంగరాజు ఆచూకీ డ్వాగ్‌ స్క్వాడ్‌తో వెతికినా గురువారం రాత్రి లభ్యం కాలేదు. శుక్రవారం వేకువజామున ఆశిరెడ్డిపల్లె శివారులో తాళ్లతో బంధించి ఉన్న గంగరాజును పోలీసులు గుర్తించారు. అతడిని వైద్య పరీక్షల నిమిత్తం సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. శుక్రవారం రాత్రి విచారించగా తన చిన్నాన్న ఎక్కలదేవి రాజయ్యతో ఉన్న వివాదాలతో తరుచూ గొడవలు జరుగుతున్నాయని, ఇప్పటికే రెండు కేసులు ఉండడంతో తాను ఇబ్బందులు పడుతున్నట్లుగానే, తన చిన్నాన్నతోపాటు అతడి ఇద్దరు కుమారులపై క్రిమినల్‌ కేసు నమోదు చేయించాలని తనను కిడ్నాప్‌ చేసినట్లు కట్టుకథ అల్లినట్లు గంగరాజు ఒప్పుకున్నాడు. పోలీసులను తప్పుదారి పట్టించిన గంగరాజుపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని సీఐ పేర్కొన్నారు. ఈ సమావేశంలో చందుర్తి ఎస్సై శ్రీకాంత్‌, కానిస్టేబుల్స్‌ ఉన్నారు. కాగా పోలీసులు మాత్రం శుక్రవారం రాత్రి ఈ వ్యవహారంలో సంబంధం ఉందన్న అనుమానంతో మరి కొందరిని అదుపులోకి తీసుకుని వదిలేసినట్లు తెలిసింది.


పారమిత హెరిటేజ్ స్కూల్‌లో..


సెయింట్‌జార్జ్ స్కూల్‌లో..


వివేకానంద విద్యానికేతన్ పాఠశాలలో..

విద్యా సంస్థల్లో రక్షాబంధన్ వేడుకలు

కరీంనగర్‌కల్చరల్/కొత్తపల్లి/కరీంనగర్‌రూరల్: నగరంలోని పలు విద్యాసంస్థల్లో శనివారం ముందస్తు రాఖీ పౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. విద్యార్థిని విద్యార్థులు ఒకరికొకరు రాఖీలు కట్టుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. రాఖీ ప్రాశస్త్యాన్ని తెలిపే నాటికను చిన్నారులు చూడముచ్చటగా ప్రదర్శించారు. అచీవర్స్ పాఠశాలలో పాఠశాల డైరెక్టర్ సీహెచ్. వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ పల్లవి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. వివేకానంద విద్యానికేతన్ పాఠశాలలో జరిగిన వేడుకల్లో ప్రిన్సిపాల్ మిథున్ జే మిస్త్రీ, ఏవో తుంగాని సంపత్, వైస్ ప్రిన్సిపాల్ సాగర్, ఉపాధ్యాయ తదితరులు పాల్గొన్నారు. హనుమాన్‌నగర్ బ్లూబెల్స్‌లో పాఠశాలలో జరిగిన వేడుకల్లో ప్రిన్సిపాల్ జంగ సునీత మనోహర్‌రెడ్డి. ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు. కోతిరాంపూర్ పోచమ్మవాడ అంగన్‌వాడీ సెంటర్‌లో రాఖీ వేడుకల్లో మున్సిపాలిటీ సిబ్బందికి అంగన్‌వాడీ చిన్నారులు రాఖీలు కట్టారు. కొత్తపల్లిలోని సెయింట్ జార్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ (సీబీఎస్‌ఈ)లో విద్యా సంస్థల చైర్మన్ ఫాతిమారెడ్డి రక్షాబంధన్ ప్రాముఖ్యతను వివరిస్తూ చిన్నారులను ఆశీర్వదించారు. ప్రిన్సిపాల్స్ ఎ.భార్గవ్, వి.నిరంజన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. పద్మనగర్‌లోని పారమిత హెరిటేజ్ పాఠశాలలో జరిగిన వేడుకల్లో చైర్మన్ ఈ.ప్రసాదరావు, డైరెక్టర్లు ప్రసూన, రష్మిత, అనూకర్ రావు, రాకేశ్, వీయూఎం. ప్రసాద్, రమణ, వినోద్ రావు, హన్మంతరావు, ప్రోగ్రాం హెడ్ గోపీకృష్ణ, కో ఆర్డినేటర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.కరీంనగర్ మండలం ఫకీర్‌పేటలోని అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్ నీల ఆధ్వర్యంలో చిన్నారులు ఒకరికొకరు రాఖీలు కట్టుకుని స్వీట్లు పంచుకున్నారు. అదే విధంగా బొమ్మకల్‌లో శ్రీలక్ష్మి జంతు సంరక్షణ కేంద్రం ఆధ్వర్యంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో రక్షాబంధన్ నిర్వహించారు. శ్రీలక్ష్మి జంతు సంరక్షణ కేంద్రం నిర్వాహకుడు ఆసిరి సుమన్, ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి, గీత తదితరులు పాల్గొన్నారు.


కోతిరాంపూర్‌లోని అంగన్‌వాడీ సెంటర్‌లో..


బ్లూబెల్స్ పాఠశాలలో..


అచీవర్స్ పాఠశాలలో..


ఫకీర్‌పేటలోని అంగన్‌వాడీ కేంద్రంలో..


నగరంలోని 10వ డివిజన్ కట్టరాంపూర్‌లో గల మధురవిల్లాస్ వెనుక ఖాళీ ప్రదేశంలో చెట్లు, పొదలు విపరీతంగా పెరిగిపోయి చిన్నపాటి అడవిలా మారింది. దీంతో పందులు, దోమలు స్వైర విహారం చేస్తుండటంతో ఈ ప్రాంత వాసులమంతా రోగాల బారిన పడుతున్నాం. మున్సిపల్ అధికారులు ఖాళీ స్థలంలో ఉన్న చెట్లు, పొదలు తొలగించేలా చర్యలు తీసుకోవాలి.

– పట్నం తిరుపతి, కట్టరాంపూర్, 10వ డివిజన్, కరీంనగర్

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
వై.శ్రీనివాస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఫోన్ నంబర్: 9502933311

వాట్సప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫోటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్ : 94400 77555

సమాచారం

నేడు 'భూమిక' పుస్తకావిష్కరణ

కరీంనగర్‌కల్చరల్: భవానీ సాహిత్య వేదిక ద్వారా కవి, రచయిత, విమర్శకులు వైరాగ్యం ప్రభాకర్ రచించిన భూమిక ఆధునిక సాహిత్య విమర్శ వ్యాసాల పుస్తకాన్ని ప్రముఖ కవి, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం సాహితీ పురస్కార గ్రహీత డాక్టర్ కాంచనపల్లి గోవర్ధన్ రాజు ఆదివారం నగరంలోని వాగేశ్వరీ డిగ్రీ కళాశాలలో ఆవిష్కరిస్తారని ప్రముఖ గాయకుడు కాసు మహేందర్ రాజు తెలిపారు విశిష్ట అతిథిగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల లక్సెట్టిపేట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ తన్నీరు సురేశ్, ప్రత్యేక అతిథిగా ప్రముఖ కథా రచయిత బీవీఎన్ స్వామి హాజరుకానున్నారని అన్నారు. కవులు, రచయితలు, సాహిత్యాభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు.

రైల్వే సమాచారం

కరీంనగర్–తిరుపతి రైలు వివరాలు

- కరీంనగర్ రైల్వేస్టేషన్‌లో ప్రతీ గురు, ఆదివారాల్లో రాత్రి 7.10గంటలకు రైలు బయల్దేరి మరుసటి రోజు ఉదయం 8గంటలకు తిరుపతికి చేరుకుంటుంది.
- తిరుపతి నుంచి ప్రతీ బుధ, శనివారాల్లో రాత్రి 8గంటలకు బయలు దేరి మరుసటి రోజున ఉదయం 8.20గంటలకు కరీంనగర్‌కు చేరుకుంటుంది.

కాచిగూడ–కరీంనగర్ రైలు వివరాలు

- కాచిగూడలో ప్రతిరోజూ ఉదయం 6గంటలకు రైలు బయల్దేరి కరీంనగర్‌కు మధ్యాహ్నం 1.30 గంటలకు చేరుకుంటుంది.
- కరీంనగర్ నుంచి మధ్యాహ్నం 3.30గంటలకు బయల్దేరి రాత్రి 10.45గంటలకు కాచిగూడకు చేరుకుంటుంది.

– కరీంనగర్‌రూరల్

క్లుప్తంగా

జాబ్‌మేళా పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న మేయర్ సునీల్‌రావు

కరీంనగర్‌కల్చరల్: రిలయన్స్ నిప్పాన్ లైఫ్ ఆధ్వర్యంలో ఈనెల 21న సిటీ సెంటర్ కాంప్లెక్స్ నిర్వహించే మహిళా ఉద్యోగ మేళా పోస్టర్‌ను శనివారం మేయర్ సునీల్‌రావు తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ జాబ్ మేళాలో అధిక సంఖ్యలో పాల్గొని మీ భవిష్యత్‌ను ఉజ్వలంగా మార్చుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ సీనియర్ మేనేజర్ మాకులూరి రామ్మోహన్, మేనేజర్ సిరిసిల్ల ప్రసాద్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక


కాంగ్రెస్‌లో చేరుతున్న ఎన్‌ఆర్‌ఐ నుస్రత్ హుస్సేన్

కరీంనగర్‌కార్పొరేషన్: నగరంలోని 36వ డివిజన్‌కు చెందిన మైనార్టీ నాయకుడు ఎన్‌ఆర్‌ఐ నుస్రత్ హుస్సేన్ తదితరులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. శనివారం డివిజన్ పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో నుస్రత్ హుస్సేన్‌కు పార్టీ కండువా కప్పి కాంగ్రెస్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎండీ.తాజొద్దిన్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు మహ్మద్ ఖలీమొద్దిన్, జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ కరీం, జలీల్ తదితరులు పాల్గొన్నారు.

సన్మానం


మాధవిని సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ బాధ్యులు

విద్యానగర్(కరీంనగర్): పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో ఉన్నత సేవలందించి స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు చేతుల మీదుగా మెడల్ అందుకున్న అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ మాధవిని శనివారం శ్రీనగర్ ఉమెన్స్ లయన్స్ క్లబ్ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు గడప నిరంజనీ దేవి, కార్యదర్శి కంటే గంగాభవాని, ఉపాధ్యక్షురాలు కడారి విజయ, సభ్యులు ఏ పద్మావతి, సంద స్వప్న పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్ చట్టం అమలు చేయాలి

విద్యానగర్(కరీంనగర్): జిల్లాలో మెయింటనెన్స్ అండ్ వెల్ఫేర్ అఫ్ పేరెంట్స్, సీనియర్ సిటిజన్స్ చట్టం 2007 రూల్స్ 2011ని పకడ్బందీగా అమలు చేయాలని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సముద్రాల జనార్దన్‌రావు డిమాండ్ చేశారు. శనివారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పోలీసు అధికారులకు ఈ చట్టం గురించి అవగాహన లేకపోవడం శోచనీయమన్నారు. ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పులు అమలు కావడం లేదని అనేక తీర్పులు సీనియర్ సిటిజన్‌కు వ్యతిరేకంగా వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

ఉత్తమ సేవ.. పురస్కారాల తోవ

- అవార్డులు అందుకుంటూ ఆదర్శంగా నిలుస్తున్న పలువురు ఉద్యోగులు

కరీంనగర్ అర్బన్: చేస్తున్న పనే దైవంగా భావించారు ఈ ఉద్యోగులు. విధి నిర్వహణలో తమకు ఎదురయ్యే ప్రతికూల పరిస్థితులను సమర్థవంతంగా అధిగమిస్తూ వృత్తికి వన్నెతెచ్చారు. నిబద్ధతతో వ్యవహరిస్తూ ప్రత్యేకంగా నిలిచారు. ఉన్నతాధికారులు, తోటి ఉద్యోగుల మన్ననలు పొందారు. స్వాతంత్య్ర దినోత్సవం రోజున రాష్ట్ర ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు స్వీకరించారు. నిజాయితీగా వ్యవహరిస్తూ కర్తవ్యాన్ని నిర్వర్తిస్తూ పోతే అవార్డులు వాటంతటవే దరి చేరుతాయనడానికి వీరే తార్కాణం. ఇప్పటికే పలుమార్లు ఉత్తమ ఉద్యోగులుగా ప్రశంసాపత్రాలు అందుకోవడం విశేషం. ప్రభుత్వ కార్యక్రమాలు త్వరితగతిన నిర్వహించడం, సంబంధిత విభాగాలతో సమన్వయం చేసుకోవడం, అధికారులు అప్పజెప్పిన బాధ్యతలను నిర్ణీత గడువులోగా పూర్తి చేశారు. ఈ సందర్భంగా పలువురు ఉత్తమ ఉద్యోగులు తమ అభిప్రాయాలను వెల్లడించారు.

ఆనందం మరువలేను


ఏటా ప్రభుత్వ పథకాలతో పాటు సాధారణ కార్యక్రమాలు నిర్వహించేవాడిని. స్వాతంత్య్ర, గణతంత్ర దినోత్సవ రోజున జిల్లా స్థాయిలో ప్రతిభ, ప్రశంసాపత్రాలు అందిస్తుంటారు. వారిని చూసినప్పుడల్లా నేను సైతం ఎప్పటికైనా ఉన్నతాధికారుల నుంచి ప్రశంస పొందాలనుకున్నా. అనుకున్నట్లుగానే ఈసారి అవకాశం లభించింది. మొదటిసారిగా రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు చేతుల మీదుగా అవార్డు పొందా.

– బొల్లం వెంకటరాజన్న, ధరణి జిల్లా కో ఆర్డినేటర్

బాధ్యతను మరింత పెంచింది


ఏళ్లుగా వ్యవసాయ శాఖలో విధులు నిర్వర్తిస్తున్న. వివిధ విభాగాల్లో పనిచేసినప్పుడు ఉన్నతాధికారులు గుర్తించి జాబితాలో పేరు పంపేవారు. తెల్లవారి తెలిసేసరికి సంతోషమేసేది. ఆపై బాధ్యత మరింత పెరిగిందని భయమేసేది. ఇప్పటికీ ఐదు ప్రశంసాపత్రాలు మంత్రులు, కలెక్టర్ల చేతుల మీదుగా అందుకున్నా. గతంలో రాష్ట్ర స్థాయి అవార్డులు తృటిలో తప్పినా జిల్లాస్థాయిలో అవార్డులు పొందడం ఆనందంగా ఉంది.

– మామిడి కృష్ణ, వ్యవసాయ అధికారి(టెక్నికల్)

తొలిసారి స్మితాసబర్వాల్ నుంచి..


కలెక్టరేట్‌లోని ప్రధాన విభాగాల్లో పనిచేశా. నిబద్ధతతో పనిచేసి ప్రశంసాపత్రాలు తీసుకోవాలని భావించేవాడిని. తొలిసారి స్మితాసబర్వాల్ కలెక్టర్‌గా ఉన్నప్పుడు ప్రశంసాపత్రం తీసుకున్నా. అప్పటి నుంచి నా పనితీరుతో అధికారుల మన్ననలు పొందా. రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు చేతుల మీదుగా తీసుకోవడం ఆనందంగా ఉంది. ఇప్పటికి 8సార్లు ఉత్తమ ఉద్యోగిగా గుర్తించారు.

– ఎస్.సంపత్, సీనియర్ అసిస్టెంట్, కలెక్టరేట్

ఆరుసార్లు అందుకున్న


ఉద్యోగమంటేనే ఇష్టం. అనుకున్నట్లుగానే రెవెన్యూ శాఖలో కొలువు పొందా. ప్రభుత్వ సంక్షేమ పథకాలు క్షేత్ర స్థాయికి చేర్చడంలో కృషిచేశా. తదుపరి కలెక్టరేట్‌లోని పలు విభాగాల్లో విధులు నిర్వర్తించా. పనిచేసినప్పటి నుంచి ఉత్తమ ఉద్యోగిగా ఆరు ప్రశంసాపత్రాలు తీసుకున్నా.

– బి.రాకేశ్, నాయబ్ తహసీల్దార్

సంతోషంగా ఉంది


గతంలో ఆర్డీవో, కలెక్టరేట్‌లోని పలు విభాగాల్లో పనిచేశా. చేసే పనిలో సంతృప్తి ఉండాలనేది నా కోరిక. ఈ క్రమంలోనే ఏ బాధ్యత అప్పగించినా చిత్తశుద్ధితో పనిచేసేవాన్ని. పదేళ్లుగా రెవెన్యూ శాఖలో పని చేస్తున్నా. ఇప్పటివరకు 5సార్లు ప్రశంసాపత్రాలు పొందా. చాలా సంతోషంగా ఉంది.

– కె.జమున, సీనియర్ అసిస్టెంట్, కలెక్టరేట్

నీతూప్రసాద్ నుంచి అవార్డులు..


గణతంత్ర, స్వాతంత్య్ర దినోత్సవాల రోజున ప్రశంసాపత్రాలు అందజేయడంతో ఉద్యోగుల్లో పోటీతత్వం అలవడుతోంది. నీతూప్రసాద్ కలెక్టర్‌గా పనిచేసిన సమయంలో మొదటిసారిగా అవార్డు అందుకున్న. నాటి నుంచి 8 సార్లు ఉత్తమ ఉద్యోగిగా ప్రశంసాపత్రాలు పొందా. దీనివల్ల ఉద్యోగుల్లో పనిచేయాలనే భావన కలుగుతుంది.

– పుప్పాల సాయికృష్ణ, నాయబ్ తహసీల్దార్

ప్రశంసతో పెరిగిన బాధ్యత


ఉత్తమ ఉద్యోగులను గుర్తించి ప్రశంసాపత్రాలు అందజేయడం పోటీతత్వాన్ని పెంపొందిస్తుంది. మరింత కష్టపడాలన్న కాంక్ష వృద్ధి చెందుతుంది. ఇప్పటికి పలుమార్లు ఉత్తమ ఉద్యోగి ప్రశంసా పత్రాలకు ఎంపికయ్యాను. చాలా సంతోషంతో పాటు బాధ్యత మరింత పెరిగింది.

– ఈ.వసంత్‌కుమార్, సీసీ, అదనపు కలెక్టర్(ఎల్‌బీ)

42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి


మాట్లాడుతున్న బొల్లం లింగమూర్తి

కరీంనగర్‌కల్చరల్: రాష్ట్రవ్యాప్తంగా కులగణన జరిపి, స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలుచేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొల్లం లింగమూర్తి హెచ్చరించారు. శనివారం కరీంనగర్ జిల్లా తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో మాట్లాడుతూ.. రాహుల్ గాంధీ దేశంలో కులగణన, బీసీ రిజర్వేషన్లపై పార్లమెంట్‌లో బీజేపీతో కొట్లాడుతుంటే, రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్లు కల్పించే విషయంలో ఇక్కడి ప్రభుత్వం స్పష్టత ఇవ్వకపోవడం శోచనీయం అన్నారు. కామారెడ్డి డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలన్నారు. తెలంగాణ బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దుబ్బాక రమేశ్, విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పెంట అజయ్‌పటేల్, కరీంనగర్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ కాల్వ మధుబాబు, బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గరిగె కోటేశ్వర్, విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గాండ్ల అజయ్ కుమార్, కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఉల్లంగుల ఓదేలు, జిల్లా అధికార ప్రతినిధి గుగ్గిళ్ల మహేశ్ పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి


మాట్లాడుతున్న సురేందర్‌రెడ్డి

కరీంనగర్‌రూరల్: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు సీపీఐ శ్రేణులు సిద్ధంగా ఉండాలని సీపీఐ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ కసిరెడ్డి సురేందర్‌రెడ్డి కోరారు. శనివారం బద్ధం ఎల్లారెడ్డి భవన్‌లో జరిగిన సీపీఐ కరీంనగర్ మండల శాఖ సమావేశంలో మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజా సమస్యలు పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన హామీలన్నింటినీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కొత్త రేషన్ కార్డులను వెంటనే మంజూరు చేయాలని, నిర్మాణం పూర్తయిన డబుల్‌బెడ్రూం ఇళ్లను అర్హులకు ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు కె.బుచ్చన్న, ఎస్.సదానంద, కె.శ్రీనివాస్, రాయమల్లు, కొమురయ్య, రాజేశం, కనుకయ్య, లచ్చిరెడ్డి, బాబు తదితరులు పాల్గొన్నారు.

ద్రోణాచారికి తెలంగాణ ఐకాన్ అవార్డు ప్రదానం

విద్యానగర్(కరీంనగర్): తెలంగాణ థియేటర్, మీడియా రెపర్టరీ, తెలంగాణ భాషా, సాంస్కృతిక శాఖ సంయుక్తంగా ఏటా వివిధ రంగాల్లో రాణిస్తున్న వారికి తెలంగాణ ఐకాన్ పేరిట ఇచ్చే అవార్డులో భాగంగా 2024 సంవత్సరానికి సామాజిక సేవ విభాగంలో కరీంనగర్‌కు చెందిన రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ అఫిషియల్స్, ప్రొఫెషనర్స్ అసోసియేషన్ ఫౌండర్, రాష్ట్ర కన్వీనర్ వేములవాడ ద్రోణాచారికి శనివారం అందజేశారు. హైదరాబాద్ రవీంద్ర భారతిలో జరిగిన అవార్డుల ప్రధానోత్సవంలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు, రాష్ట్ర పారిశ్రామిక సంస్థ చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి చేతులమీదుగా పురస్కారం అందుకున్నారు.ద్రోణాచారిని విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మదన్మోహనాచారి తదితరులు అభినందించారు.

బావుపేట హైస్కూల్‌లో నో బ్యాగ్ డే


టగ్ ఆఫ్ వార్‌లో తలపడుతున్న విద్యార్థులు

కొత్తపల్లి: కొత్తపల్లి మండలం ఆసిఫ్‌నగర్ (బావుపేట) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మూడో శనివారం నో బ్యాగ్ డే సందర్భంగా సబ్జెక్టుల వారీగా విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి వారిని ఆనందపర్చారు. బ్యాగులు, పుస్తకాలు తీసుకురాకుండా పాఠశాలకు హాజరైన విద్యార్థుల్లో విజ్ఞానం పెంపొందించేందుకు అక్షరాల ఆటలు, మాత్రోంకీ తాలికా, వర్డ్స్ బిల్డింగ్, రేడియో సంభాషణ, నంబర్ పజిల్స్, డిబేట్, రాఖీ పౌర్ణమి విశిష్టత, సాంప్రదాయ ఆటలు నిర్వహించారు. హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు శివకుమార్, రాజేంద్రప్రసాద్, ఏంజలీన్, గంగాచారి, ప్రతిభారాణి, నాగవేణి, హరికృష్ణ, శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

'తెలంగాణ అస్తిత్వానికి నిలువుటద్దం కేసీఆర్'


మాట్లాడుతున్న కొప్పుల ఈశ్వర్

కరీంనగర్: బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ తెలంగాణ అస్తిత్వానికి నిలువుటద్దమని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ నాయకుడు కొప్పుల ఈశ్వర్ అన్నారు, శనివారం ఆయన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీజేపీ, కాంగ్రెస్ చీకటి రాజకీయాలు చేస్తూ విషం చిమ్మే ప్రకటనలు చేస్తే తెలంగాణ ప్రజలు నమ్మరన్నారు. బీజేపీలో బీఆర్‌ఎస్ విలీనం అంటూ కాంగ్రెస్, కాంగ్రెస్‌లో బీఆర్‌ఎస్ విలీనం అంటూ బీజేపీ ఈ రెండు పార్టీలు చీకటి కుట్రలు చేస్తున్నాయని మండిపడ్డారు. తమ ఓటమికి కాంగ్రెస్ మోసపూరిత హామీలే కారణమన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో అనేక ఎత్తుపల్లాలు చూశామని, గెలుపోటములు తమ పార్టీకి కొత్త కాదని తెలిపారు.

రక్షణ కల్పించాలి


నిరసన తెలుపుతున్న వైద్యులు, సిబ్బంది

కరీంనగర్‌టౌన్: కోల్‌కతా ఘటనపై కరీంనగర్ ఐఎంఏ పిలుపుమేరకు మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో శనివారం వైద్యులు, సిబ్బంది నిరసన చేపట్టారు. మెడికవర్ ఆసుపత్రిలో 24 గంటల పాటు వైద్య సేవలు నిలిపివేశారు. ఈ సందర్భంగా అనస్తీషియా డాక్టర్ వినయ్ మాట్లాడుతూ, మహిళా వైద్యులకు రక్షణ కల్పించాలని, దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చర్యలు చేపట్టాలని కోరారు. మెడికవర్ ఆసుపత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వైద్యులు రామచందర్ తొర్రెం, దిలీప్, రవిశంకర్, భోగా వెంకటేశ్, అన్వేశ్, సత్యనారాయణ, కోట కరుణాకర్, సాయిచరణ్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

మధుర జ్ఞాపకాలను పదిలంగా ఉంచేది ఫొటోగ్రఫీ

కరీంనగర్‌కల్చరల్: పది కాలాల పాటు పదిలంగా మన కళ్ల ముందు ఉంచేదే ఫొటోగ్రఫీ అని మేయర్ సునీల్ రావు అన్నారు. శనివారం కరీంనగర్ టవర్ సర్కిల్‌లో కరీంనగర్ ఫొటో, వీడియో సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఫొటోగ్రఫీ దినోత్సవ వేడుకల్లో పాల్గొని ఫొటో కెమెరా పితామహుడు లూయిస్ డాగ్యురే చిత్రపటానికి పూల వేసి కేక్ కట్ చేశారు. అనంతరం ఫొటో, వీడియోగ్రాఫర్లతో కలిసి పండ్లు పంపిణీ చేశారు. ఆధునిక కాలంలో మానవ జీవితంతో ఫొటోగ్రఫీకి విడదీయలేని బంధం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ఫొటోగ్రాఫర్లు పాల్గొన్నారు.




నమో వేంకటేశ

నగరంలోని మార్కెట్ రోడ్డు వేంకటేశ్వరాలయంలో శ్రావణ శనివారం పురస్కరించుకొని భక్తుల సందడి నెలకొంది. భక్తిశ్రద్ధలతో స్వామి వారిని దర్శించుకొని తమ గోత్రనామాలపై అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. దీపాలు వెలిగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సుధాకర్, ధర్మకర్తలు చకిలం గంగాధర్, చకిలం శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు. – కరీంనగర్‌కల్చరల్

క్లుప్తంగా...

వైద్యుల భద్రతకు ప్రత్యేక చట్టం తేవాలి



సాక్షి, హైదరాబాద్: దేశంలో వైద్యుల భద్రత దృష్ట్యా ప్రత్యేక చట్టం తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వానికి బీజేపీ నేత, మాజీ ఎంపీ డాక్టర్ బూర నర్సయ్య గౌడ్ విజ్ఞప్తి చేశారు. దేశంలోని అన్ని ప్రధాన ప్రభుత్వ ఆసుపత్రుల పరిధిలో ఒక పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేసి వైద్యులకు భద్రత కల్పించాలని సూచించారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ చికిత్స పొందుతూ రోగులు చనిపోతే.. అందుకు వైద్యుల నిర్లక్ష్యమే కారణమని ఆసుపత్రులపై దాడులు చేయడం సబబు కాదన్నారు. కోల్‌కతా వైద్యురాలిపై హత్యాచారం కేసులో దోషులను కఠినంగా శిక్షించాలని కోరారు.

వైద్య, ఆరోగ్య శాఖలో 3 కొత్త హెచ్‌వోడీ పోస్టులు

సాక్షి, హైదరాబాద్: వైద్య, ఆరోగ్య శాఖలో ఇన్‌చార్జుల వ్యవస్థకు స్వస్తి పలుకుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ శాఖ పరిధిలో డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్, వైద్య విధాన పరిషత్ కమిషనర్, డ్రగ్ కంట్రోల్ డైరెక్టర్ పోస్టులను మంజూరు చేస్తూ ఆర్థిక శాఖ ఉత్తర్వులు జారీచేసింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక ఈ మూడు పోస్టులను మంజూరు చేయకపోవడంతో పదేళ్ల పాటు ఈ పోస్టుల్లో పనిచేసిన అధికారులు ఇన్‌చార్జులుగానే కొనసాగారు. ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా జారీ చేసిన తాజా ఉత్తర్వులతో రెగ్యులర్ హెచ్‌వోడీలు రానున్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- భట్టి, పొన్నంను కలిసిన ఆర్టీసీ జేఏసీ నేతలు

సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీ ఉద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జీతభత్యాలు అమలు చేస్తూ మాస్టర్ స్కేల్ ఇవ్వాలని, దీర్ఘకాలంగా ఉన్న పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని టీజీఎస్‌ఆర్టీసీ జేఏసీ కోరింది. ఈ మేరకు శనివారం ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను జేఏసీ నేతలు వెంకన్న, థామస్‌రెడ్డి, మౌలానా, యాదయ్య, సురేశ్, యాదిగిరి తదితరులు కలసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం తెలంగాణ సచివాలయం మీడియా పాయింట్‌లో మాట్లాడారు. ట్రేడ్ యూనియన్లను పునరుద్ధరించాలని కోరారు.



మహబూబ్‌నగర్‌లోని తెలంగాణ చౌరస్తా వద్ద యువ డాక్టర్ హత్యాచార ఘటనపై దృశ్య రూపకంలో నిరసన వ్యక్తం చేస్తున్న జూనియర్ డాక్టర్లు, వైద్య సిబ్బంది



ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షాకు రాఖీ కడుతున్న రిమ్స్ జూనియర్ వైద్యులు



వరంగల్ కాకతీయ మెడికల్ కాలేజీ ఎదుట రక్తపు చేతి మరకలు ఉన్న డాక్టర్ ఆప్రాన్‌ను చూపుతూ నిరసన తెలుపుతున్న జూనియర్ డాక్టర్లు

రాష్ట్రమంతా ఓపీ బంద్

ఐఎంఏ ఆధ్వర్యంలో ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద వైద్యుల ఆందోళన • రాష్ట్రవ్యాప్తంగా వివిధ రూపాల్లో నిరసన

సాక్షి నెట్‌వర్క్: కోల్‌కతాలో యువ డాక్టర్‌పై హత్యాచారాన్ని నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా శనివారం ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో ఓపీ వైద్య సేవలు నిలిచిపోయాయి. మెడికల్ కాలేజీలు, జిల్లా కేంద్రాల్లో పలు రూపాల్లో డాక్టర్లు, వైద్యసిబ్బంది నిరసన వ్యక్తం చేశాయి. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద ధర్నా చేశారు. పెద్దఎత్తున డాక్టర్లు, వైద్య సిబ్బంది, రాజకీయనేతలు, ప్రజాసంఘాల ప్రతినిధులు పాల్గొని సంఘీభావం వ్యక్తం చేశారు. వరంగల్ ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ తాను ఒక ఎంపీగా ఇక్కడకు రాలేదని ఓ వైద్యురాలిగా తన కుటుంబంలో ఒకరిని కోల్పోయిన బాధతో ఇక్కడకు వచ్చినట్టు తెలిపారు. రాబోయే పార్లమెంటు సమావేశాల్లో ఈ అంశాన్ని లేవనెత్తుతానని ఆమె డాక్టర్లకు హామీ ఇచ్చారు. మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ మహిళలపై అత్యాచారాలకు పాల్పడుతున్న వారిని బహిరంగంగా ఉరి తీసినా తప్పు లేదన్నారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పి.కాళీప్రసాదరావు మాట్లాడుతూ డాక్టర్లకు పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలతోపాటు భద్రత కల్పించాలన్నారు. అనేక చట్టాలు ఉన్నా, వాటి అమలు తీరు సరిగ్గా లేకపోవడంతో ఇలాంటి సంఘటనలు పునరావృతం అవుతున్నాయని చెప్పారు. చట్టాల పటిష్ట అమలుతోనే ఇలాంటి సంఘటనలు జరగకుండా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ ప్రధానకార్యదర్శి డాక్టర్ విజయ్‌రావు, ఫైనాన్స్ సెక్రటరీ ఆర్కే.యాదవ్, జాయింట్ సెక్రటరీ డాక్టర్ దయాల్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు. ఓపీ మినహా అన్ని రకాల వైద్య సేవలు నిలిచిపోవడంతో వేలాది మంది రోగులు ఇబ్బందులు పడ్డారు. అసలే రోగాల సీజన్ కావడంతో ఓపీకి వచ్చిన వారంతా డాక్టర్ల కోసం ఎదురుచూశారు.

కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట వైద్యుల ధర్నా

వైద్యులు, వైద్య విద్యార్థులు కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట భారీ ఎత్తున ఆందోళనకు దిగారు. జిల్లా వైద్యులు డాక్టర్ బీఎస్.రావు, రఘురామన్, విజయ్ మోహన్‌రెడ్డి, రమణాచారి, చల్మెడ, ప్రతిమ మెడికల్ కళాశాల డాక్టర్లు, పీజీ డాక్టర్లు పాల్గొన్నారు.

పాలమూరులో భారీ ర్యాలీ

ఐఎంఏ, ప్రభుత్వ జూనియర్ వైద్యుల ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రి నుంచి తెలంగాణ చౌరస్తా వరకు భారీర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడ నిరసన వ్యక్తం చేశారు. ఆ తర్వాత కలెక్టర్ విజయేందిర బోయికి వినతిపత్రం అందజేశారు.

ఆదిలాబాద్ కలెక్టర్‌కు రాఖీ కట్టిన రిమ్స్ జూడాలు

ఆదిలాబాద్ రిమ్స్ జూనియర్ వైద్యులు కలెక్టర్ రాజర్షి షాకు రాఖీలు కట్టి రక్షణ కల్పించాలన్నారు.

వరంగల్‌లో నిరసన వెల్లువ

వరంగల్‌లో వైద్యులు పెద్దఎత్తున నిరసన తెలిపారు. జూనియర్ వైద్యులు ఓ పక్క విధులు బహిష్కరించి నాలుగు రోజులుగా వివిధ రూపాల్లో నిరసన తెలుపుతున్న క్రమంలో వారికి ఇండియన్ మెడికల్ అసోసియేషన్, నర్సింగ్ విద్యార్థులు వివిధ పార్టీలు మద్దతు తెలిపాయి. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ నుంచి కాకతీయ మెడికల్ కళాశాల వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కేఎంసీ ప్రధాన గేటు వద్ద నిరసన తెలిపారు.

తుమ్మిడిహెట్టి వద్ద బరాజ్ సాధ్యం కాదు

- పీసీ ఘోష్ కమిషన్‌కు వి.ప్రకాశ్ వివరణ
- వెదిరె శ్రీరామ్ తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపణ



సాక్షి, హైదరాబాద్: తుమ్మిడిహెట్టి వద్ద బరాజ్ నిర్మాణం సాంకేతికంగా సాధ్యం కాదని తెలంగాణ జలవనరుల అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ వి.ప్రకాశ్ తేల్చి చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణను తుమ్మిడిహెట్టి కోణంలో కాకుండా మూడు తరాలుగా తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దడానికే ప్రాజెక్టును కేసీఆర్ రీడిజైన్ చేశారనే కోణంలో నిర్వహించాలని కోరారు. జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ ఎదుట శనివారం ఆయన స్వచ్ఛందంగా హాజరై తన వాదనలను వినిపించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. తుమ్మిడిహెట్టి వద్ద 152 మీటర్ల ఎత్తుతో బరాజ్ కడితే 5 టీఎంసీల నీళ్లు నిల్వ చేసుకోవచ్చని, అయితే మహారాష్ట్ర 148 మీటర్ల ఎత్తుతో కట్టడానికి మాత్రమే అంగీకారం తెలపడంతో 1.8 టీఎంసీలకు మించి నిల్వ చేసుకోవడానికి వీలు ఉండదని ప్రకాశ్ చెప్పారు. సీడబ్ల్యూసీ లెక్కల ప్రకారం తుమ్మిడిహెట్టి వద్ద 165 టీఎంసీల నీటి లభ్యత ఉంటే అందులో ఎగువ రాష్ట్రాలు వాడుకోని 63 టీఎంసీలూ ఉన్నాయన్నారు. ఈ విషయంలో కేంద్ర జలశక్తి శాఖ సలహాదారు వెదిరె శ్రీరామ్ కమిషన్‌ను తప్పుదోవపట్టిస్తున్నారని ఆరోపించారు.

'వీ'ఆకృతిలో బరాజ్ ఎక్కడా లేదు

తుమ్మిడిహెట్టి వద్ద నిర్మిస్తే వార్ధా–వెన్‌గంగా నదులు కలిసే చోట 'వీ'ఆకృతిలో బరాజ్ వస్తుందని, ప్రపంచంలో ఎక్కడా 'వీ'ఆకృతిలో బరాజ్ లేదని స్పష్టం చేశారు. ప్రతిపాదిత స్థలంలో చాప్రాల్ వైల్డ్ లైఫ్ ప్రాంతం ఉందని, రూ.7,500 కోట్లు వెచ్చించినా తుమ్మిడిహెట్టితో ఆశించిన ప్రయోజనం ఉండదని చెప్పారు. నిజాం హయాంలో తెలంగాణ ప్రాంతంలో 9 ప్రాజెక్టులు ప్రతిపాదించగా, అప్పటి సీఎం నీలం సంజీవరెడ్డి చొరవతో అందులో సాగర్, శ్రీరాంసాగర్‌లను మాత్రమే నిర్మాణం చేపట్టారని, అవి కూడా అసంపూర్తిగా కట్టారని తెలిపారు. 57 ఏళ్లలో తెలంగాణ నాశనం అయిందని, ఈ కారణంగానే జలయజ్ఞం ప్రాజెక్టులను రీ డిజైన్ చేసి, కాళేశ్వరం ఎత్తిపోతల పథకం చేపట్టినట్టు వివరించారు. కాగా బరాజ్ కుంగడానికి కారణాలను తెలుపుతూ ఈ నెల 26లోగా అఫిడవిట్ దాఖలు చేయాలని కమిషన్ ఆదేశించగా 28న సాక్ష్యాధారాలతో సహా నివేదిక ఇస్తానని ప్రకాశ్ వెల్లడించారు.

త్వరలో మాజీ ప్రజాప్రతినిధులకు నోటీసులు

- కాళేశ్వరం బరాజ్‌లపై తుది అంకానికి విచారణ
- ముఖ్య నేత ఇంటికి వెళ్లి విచారించే యోచన!



సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లపై విచారణ చివరి అంకానికి చేరడంతో జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలోని మాజీ ప్రజాప్రతినిధులకు త్వరలో నోటీసులు జారీ చేయనుంది. ఇప్పటికే నీటిపారుదల శాఖ ఇంజనీర్లు, కాంట్రాక్టర్లు, ఐఏఎస్ అధికారులు, మాజీ ఐఏఎస్ అధికారుల నుంచి వాంగ్మూలంతో పాటు అఫిడవిట్లను స్వీకరించి పరిశీలించింది. ఈ అఫిడవిట్లలో ఉన్న సమాచారం ఆధారంగా గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలోని ముఖ్యులకు నోటీసులు జారీ చేసి విచారించాలని కమిషన్ నిర్ణయించినట్టు తెలిసింది. గడువులోగా అఫిడవిట్ దాఖలు చేయకుండా కమిషన్ ఆదేశాలను ధిక్కరించిన ఓ మాజీ చీఫ్ సెక్రటరీ స్థాయి అధికారి విచారణకు తాజాగా సమన్లు జారీ చేయాలని కూడా నిర్ణయించింది. కాగా మాజీ ముఖ్యనేత ఒకరు అనారోగ్యంతో ఉన్నారని, విచారణకు హాజరుకాలేరని బీఆర్‌ఎస్ నేత ఒకరు కమిషన్‌కు సమాచారం ఇచ్చినట్టు తెలిసింది. అయితే ఒకవేళ సమన్లు జారీ చేసినా, విచారణకు రానిపక్షంలో కమిషన్ స్వయంగా ఆ నేత నివాసానికి వెళ్లి విచారించాలని భావిస్తున్నట్టు సమాచారం. ఇలావుండగా సాక్షుల క్రాస్ ఎగ్జామినేషన్ ప్రక్రియను వచ్చే వారం నుంచి కమిషన్ ప్రారంభించనుంది. 57 మంది సాక్షులు దాఖలు చేసిన అఫిడవిట్ల ఆధారంగా క్రాస్ ఎగ్జామినేషన్ నిర్వహించనుంది. ఈ ప్రక్రియలో కమిషన్‌కు సహకరించేందుకు తెలంగాణ, ఏపీ, పశ్చిమబెంగాల్‌తో సంబంధం లేని న్యాయవాదిని నియమించాలని కమిషన్ ఇప్పటికే ప్రభుత్వాన్ని కోరింది. క్రాస్ ఎగ్జామినేషన్ ప్రక్రియ ముగిసిన తర్వాత ఆర్థిక అవకతవకలపై కమిషన్ దృష్టి సారించనుంది.

మళ్లీ గడువు పొడిగింపు!

జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ గడువు నెలాఖరుతో ముగియనుంది. అయితే విచారణ ప్రక్రియ ఇంకా కొలిక్కిరాకపోవడంతో ప్రభుత్వం మళ్లీ రెండు నెలలు గడువు పొడిగించే అవకాశాలున్నాయి.

సింగరేణిలో కార్డియాక్ సెంటర్

- రెండు నెలల్లోగా అందుబాటులోకి వైద్యసేవలు
- రూ.13కోట్లతో ఏరియా ఆస్పత్రి ఆధునికీకరణ
- రూ.7కోట్లతో త్వరలోనే క్యాత్‌ల్యాబ్ సెంటర్ ఏర్పాటు



గోదావరిఖనిలోని సింగరేణి ఏరియా ఆస్పత్రి

గోదావరిఖని: గుండెపోటుకు గురైన కార్మికుడి ప్రాణాలు కాపాడేందుకు గోల్డెన్ అవర్(గంట) లోగా వైద్య చికిత్స అందించడం లక్ష్యంగా సింగరేణి యాజమాన్యం గోదావరిఖనిలో కార్డియాక్ సెంటర్ ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తోంది. అంతేకాదు.. మోకాలిచిప్ప మార్పిడి, బయో కెమిస్ట్రీ అనాలిసిస్, మైక్రోబయాలజీ, రక్తశుద్ధి యంత్రం.. ఇలాంటి ఆధునిక వైద్యసేవలు అందుబాటులోకి తీసుకొస్తోంది. ఇందుకోసం ఏరియా ఆస్పత్రిని సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌గా తీర్చిదిద్దుతోంది. సింగరేణిలోనే అత్యధిక శాతం కార్మిక కుటుంబాలు గోదావరిఖనిలోనే నివాసం ఉంటున్నాయి. అందుకే ఇక్కడ సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందుబాటులోకి తీసుకు రావాలని నిర్ణయించింది. ఇందుకోసం గత జూలైలో రూ.13కోట్లు మంజూరు చేసింది. ఇందులో రూ.7కోట్లతో క్యాత్‌ల్యాబ్ యంత్రం, మిగతా నిధులతో ఫర్నీచర్ కొనుగోలు, అదనపు గదుల నిర్మాణం చేపట్టనుంది.

'రెఫరల్' వ్యయం తగ్గించేందుకు..

- ఉద్యోగులకు నాణ్యమైన వైద్యం అందించేందుకు సింగరేణి యాజమాన్యం ఏటా రూ.వేల కోట్లు రెఫరల్ ఆస్పత్రులకు వెచ్చిస్తోంది.
- ఈ వ్యయం తగ్గించడం, గోల్డెన్ అవర్‌లో పేషెంట్లకు వైద్యం అందించేందుకు సింగరేణి ఏరియా ఆస్పత్రుల్లోనే ఆధునిక చికిత్సలు అందుబాటులోకి తీసుకొస్తోంది.
- ఇందుకోసం రూ.26 లక్షల వ్యయంతో బయో కెమిస్ట్రీ అనాలిసిస్, రూ.27 లక్షల వ్యయంతో మైక్రో బయోలజీ యంత్రం సమకూర్చింది.
- రూ.2 కోట్ల వ్యయంతో 50 పడకల సామర్థ్యంతో మాతాశిశు సంక్షేమ భవనం నిర్మిస్తోంది.
- కోవిడ్ గుణపాఠంతో ఆక్సిజన్ ప్లాంట్లు కూడా ఏర్పాటు చేస్తోంది.
- మరిన్ని ఔషధాలు అందుబాటులోకి తీసుకొచ్చింది.
- డాక్టర్ల కొరత తీర్చేందుకు ఇటీవల నియామకాలు చేపట్టింది.



నిర్మాణ దశలో కార్డియాక్ సెంటర్ గదులు

- డయాలిసిస్, సీటీస్కాన్ తదితర యంత్రాలను ఏరియా ఆస్పత్రుల్లో ఏర్పాటు చేసింది.

గోల్డెన్ అవర్‌లో ప్రాణాలు దక్కేలా..

కార్మికులు, వారి కుటుంబాలు గుండెపోటుకు గురైతే తొలుత సమీప డిస్పెన్సరీకి తీసుకెళ్తున్నారు. అక్కడ పరీక్షించాక వైద్యులు ఏరియా ఆస్పత్రికి రెఫర్ చేస్తున్నారు. ఇక్కడ ఈసీజీ తదితర పరీక్షలు చేశాక సుమారు 75 కి.మీ. దూరంలోని కరీంనగర్, దాదాపు 230 కి.మీ. దూరంలోని హైదరాబాద్, సికింద్రాబాద్‌లోని కార్పొరేట్ ఆస్పత్రులకు తీసుకెళ్తున్నారు. ఈప్రక్రియ పూర్తవడానికి కనీసం మూడు నుంచి నాలుగు గంటల సమయం పడుతోంది. ఈలోగా పేషెంట్ ప్రాణాలకు గ్యారంటీ లేకుండా పోతోంది. కొన్నిసార్లు ప్రాణాలు పోయిన సంఘటనలూ ఉన్నాయి. అయితే, గుండెపోటుకు గురైన గంటలోగా చికిత్స అందించడం లక్ష్యంగా గోదావరిఖని సింగరేణి ఏరియా ఆస్పత్రిలోనే కార్పొరేట్ వైద్యం అందుబాటులోకి తీసుకొస్తున్నారు.

మాతా శిశు సంక్షేమ కేంద్రం..

సింగరేణిలో యువ ఉద్యోగుల సంఖ్య పెరుగుతోంది. ఈనేపథ్యంలో ప్రసవాలు చేసేందుకు, చిన్నపిల్లల వైద్యం కోసం ప్రత్యేక వార్డులు ఏర్పాటు చేసేందుకు గోదావరిఖని సింగరేణి ఏరియా ఆస్పత్రిలో మాతా శిశుసంక్షేమ కేంద్ర భవన నిర్మాణానికి ఇటీవల భూమిపూజ చేశారు. ఇందుకోసం రూ.2 కోట్లు వెచ్చించి 50 పడకలు అందుబాటులోకి తీసుకొస్తారు. ఎంఐసీయూ, పీఐసీయూ, ఎన్‌ఐసీయూ, ఆపరేషన్ థియేటర్ తదితర సౌకర్యాలు దీనిద్వారా అందుబాటులోకి రానున్నాయి.

డయాబెటిక్ పేషెంట్ల కోసం..

డయాబెటిక్ పేషెంట్ల కోసం హెచ్‌బీఏ–1సీ యంత్రాన్ని సింగరేణి అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇందుకోసం రూ.27 లక్షలు వెచ్చించింది.

బెక్‌మాన్ బయోకెమిస్ట్రీ

పూర్తిస్థాయి ఆటోమెటిక్ అమెరికన్ టెక్నాలజీతో తయారైన బెక్‌మాన్ బయోకెమిస్ట్రీ యంత్రాన్ని రూ.26లక్షలతో కొనుగోలు చేసింది. దీనిద్వారా గంటకు 150 టెస్టులు చేసే వీలుంటుందని డాక్టర్లు చెబుతున్నారు.

మైక్రోబయోలజీ విభాగం..

రక్తం, యూరిన్ పరీక్షలు చేసే మైక్రోబయోలజీ ప్రత్యేక యూనిట్‌ను ఆస్పత్రిలో ఏర్పాటు చేశారు. దీనిద్వారా బ్యాక్టీరియాను పరీక్షించే అవకాశం ఉంటుంది. హెచ్‌ఐవీ, హైపటైటిస్, మలేరియా, వైరల్ మార్కర్స్ దీని ద్వారా పరీక్షలు నిర్వహించవచ్చని వైద్యులు పేర్కొన్నారు.

రెండు నెలల్లో అందుబాటులోకి..



గోదావరిఖని పారిశ్రామిక ప్రాంత కార్మిక కుటుంబాలకు రెండు నెలల్లో కార్డియాక్ సెంటర్‌ను అందుబాటులోకి తీసుకొస్తాం. గుండె సంబంధిత వైద్యం, మోకాలిచిప్ప మార్పిడి ఆపరేషన్, ఇంకా మెరుగైన వైద్యసేవలు సింగరేణి ఆస్పత్రుల్లోనే అందిస్తాం. కార్మికుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించాం.

– బలరాం, సీఎండీ, సింగరేణి

కారులో నుంచి అకస్మాత్తుగా పొగలు

జమ్మికుంట(హుజూరాబాద్): రన్నింగ్ కారులో నుంచి అకస్మాత్తుగా పొగలు రావడంతో వాహనదారులు, ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. స్థానికుల వివరాల ప్రకారం.. శనివారం సాయంత్రం ఓ కారు జమ్మికుంట నుంచి హుజూరాబాద్ వైపు వెళ్తోంది. జమ్మికుంట ఫ్లైఓవర్ పైకి రాగానే వాహనంలో నుంచి ఒక్కసారిగా పొగలు వచ్చాయి. లోపల ఉన్నవారు వెంటనే తేరుకొని, దిగిపోయారు. కాసేపటికి పొగలు తగ్గిపోయాయి. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. బ్లూకోల్ట్స్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని, పరిశీలించారు. ఎలాంటి ప్రమాదం జరగలేదని పేర్కొన్నారు. అనంతరం ఆ కారులో వచ్చినవారు తిరిగి అందులోనే వెళ్లిపోయినట్టు తెలిసింది.



కారులో నుంచి వస్తున్న పొగలు

ఆస్పత్రుల్లో 'సీజనల్' రద్దీ



అదనపు బెడ్లపై చికిత్స పొందుతున్న రోగులకు



పిల్లల వార్డులో జ్వరాలతో చికిత్స పొందుతున్న చిన్నారులు



రక్త పరీక్షల కేంద్రం వద బారులు తీరిన పేషెంట్లు..

నిర్మల్ జిల్లాలో డెంగీ, టైఫాయిడ్ తదితర సీజనల్ వ్యాధుల విజృంభిస్తున్నాయి. జ్వర బాధితుల సంఖ్యం రోజు రోజుకూ పెరుగుతోంది. దీంతో ఆస్పత్రులు కిటకిటలాడుతున్నాయి. ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో నిత్యం 1,500 ఓపీ నమోదవుతోంది. ఇందులో సగం జ్వరపీడితులే. ఏవిభాగం దగ్గర చూసిన పేషెంట్లతో కిక్కిరిసిపోయి కనిపిస్తుంది. రక్త పరీక్షల కోసం గంటల తరబడి క్యూలో నిలబడాల్సిన పరిస్థితి. చిన్నారులు సీజన్ వ్యాధులతో ఇబ్బంది పడుతున్నారు. పిల్లల వార్డులో బెడ్లు చాలకపోవడంతో అదనపు పడకలు ఏర్పాటుచేశారు. పెద్దలు కూడా ఒక బెడ్ ఖాళీ అయితేనే మరో పేషెంట్‌ను అడ్మిట్ చేసుకుంటున్నారు. దీంతో చాలా మంది ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్తున్నారు.

– సాక్షి ఫొటో గ్రాఫర్ నిర్మల్

ఆర్జీయూకేటీలో నీటి వనరుల నిర్వహణపై వర్క్‌సాప్

- హాజరైన ఐఐటీ మద్రాస్ అధ్యాపకుడు డాక్టర్ సుబ్బారావు

బాసర: నిర్మల్ జిల్లా బాసర ఆర్జీయూకేటీలో సివిల్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో నీటి వనరుల నిర్వహణపై శనివారం వర్క్‌సాప్ నిర్వహించారు. ఐఐటీ మద్రాస్ అధ్యాపకుడు డాక్టర్ పిచ్చుక సుబ్బారావు ముఖ్య అతిథిగా హాజరై ఇంజనీరింగ్ నాలుగో సంవత్సరం విద్యార్థులకు అవగాహన కల్పించారు. మారుతున్న వాతావరణానికి అనుగుణంగా ఎలాంటి చర్యలు తీసుకుంటే భవిష్యత్తులో నీటి సమస్య నివారించగలమో వివరించారు. వనరులపై వాతావరణ మార్పుల ప్రభావం, జలవనరుల నిర్వహణలో సవాళ్లు, నీటి లభ్యతలో అనిశ్చితి, వైవిధ్యం గురించి వివరించారు. నీటి వనరులకు పెరిగిన డిమాండ్, మౌలిక సదుపాయాలు నిర్వహణ వ్యవస్థల పనితీరును తెలియజేశారు. నీటి వనరుల నిర్వహణ కోసం అనుసరణ వ్యూహాలు అవసరమని, నీటి సంరక్షణ సమర్థత చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. వాటర్‌షెడ్ నిర్వహణ రక్షణ, వాతావరణాన్ని తట్టుకోగలిగే మౌలిక సదుపాయాల రూపకల్పనలు అవసరమని తెలిపారు. కార్యక్రమంలో సివిల్ ఇంజనీరింగ్ హెచ్‌వోడీ శాంతి జగదీశ్వరి, అధ్యాపకులు రణధీర్ సాగి, ఖలీల్, శంకర్ ల్యాబ్ స్టాఫ్ బలరాం, మోతిలాల్, రాజేందర్ విద్యార్థులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న సుబ్బారావు


రెండున్నరేళ్లకే నూరేళ్లు!

- ఎడ్లబండిపై నుంచి కిందపడిన బాలుడు..
- చక్రం పైనుంచి వెళ్లడంతో మృతి

ఖానాపూర్: మొక్కజొన్న పంటకు యూరియా వేసేందుకు వెళ్తున్న తల్లిదండ్రులతో తాము కూడా వస్తామని పిల్లలు మారాం చేశారు. కాదనలేక ఇద్దరు కుమారులను తీసుకుని పొలానికి ఎడ్లబండిలో బయల్దేరారు. కొంత దూరం వెళ్లాక పెద్ద కుమారుడు కిందపడ్డాడు. దీంతో ఎడ్లబండి చక్రం అతడి పైనుంచి వెళ్లింది. తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటన నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలం సింగాపూర్‌లో శనివారం జరిగింది. కడెం ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కడెం పోలీస్‌స్టేషన్ పరిధిలోని సింగాపూర్ గ్రామానికి చెందిన వరిగడ్డి పద్మ–గంగాధర్ దంపతులు ఇద్దరు కుమారులతో కలిసి మొక్కజొన్న పంట చేల్లో యూరియా ఎరువు మందు వేయడానికి ఎడ్లబండిపై బయల్దేరారు. చిన్న కుమారుడు తల్లి వద్ద కూర్చోగా, పెద్ద కుమారుడు ప్రణయ్ తండ్రి పక్కన కూర్చున్నాడు. మార్గమధ్యలో ఒక బండరాయిపై చక్రం ఎక్కడంతో ప్రణయ్(రెండున్నరేళ్ల వయసు) అదుపుతప్పి కింద పడ్డాడు. అతడి పైనుంచి ఎడ్లబండి చక్రం వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. రెండున్నరేళ్లకే నూరెళ్లు నిండాయా బిడ్డా అంటూ తల్లి రోదించడం అందరినీ కలచివేసింది. బాలుడి తండ్రి గంగాధర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.



బాలుడు ప్రణయ్ మృతదేహం



ఆటోలో రోదిస్తున్న తల్లి పద్మ



బహుమతులు ఆనందాన్నిస్తాయి... అయితే వస్తువుల రూపంలో కన్నా మాటల రూపంలో ప్రేమను వ్యక్తపరిస్తే ఆ ఫీలింగ్ హృదయంలో నిలిచిపోతుంది. అన్నయ్య గౌతమ్ నుంచి అలాంటి ప్రేమనే ఎక్కువగా కోరుకుంటున్నానని చిన్నారి సితార అంటోంది. సూపర్ స్టార్ మహేశ్‌బాబు, నమ్రతల కుమార్తెగా పన్నెండేళ్ల సితార పాపులర్. ఓ జ్యువెలరీ బ్రాండ్ అంబాసిడర్‌గా తనకంటూ పాపులార్టీ తెచ్చుకుంది. సోమవారం రాఖీ పండగ సందర్భంగా 'సాక్షి'కి సితార చెప్పిన ప్రత్యేకమైన ముచ్చట్లు...

బ్రదర్ అంటే బెస్ట్ ఫ్రెండ్

- సితార ఘట్టమనేని

రాఖీ పండగను ఇంట్లో చిన్న పూజతో ప్రారంభిస్తాం. ఆ తర్వాత అన్నయ్యకు రాఖీ కట్టి, ఇద్దరం బహుమతులు ఇచ్చి, పుచ్చుకుంటాం. నాకు ఎనిమిది.. తొమ్మిదేళ్లప్పుడు అనుకుంటా... రాఖీకి అసలైన అర్థం తెలిసింది. చేతికి రాఖీ కట్టడం అనేది ఓ ఆచారం కాబట్టి పాటించాలి. అంతవరకే నాకు తెలుసు. అయితే సోదరుడి అనుబంధం, రక్షణ ఎంతో అవసరమని, అది సూచించే విధంగా కట్టే రాఖీకి చాలా ప్రాధాన్యం ఉందని ఈ పండగ అసలు విషయం అర్థమైంది. ఆచారం అర్థం అయ్యాక ఈ ఫెస్టివల్‌కి ప్రాధాన్యం ఇస్తున్నాను.



గౌతమ్, సితార

రాఖీ కొనడానికి చాలా టైమ్ తీసుకుంటా

ఈ సంవత్సరం ఎప్పటికీ గుర్తుండి పోతుందని అనుకుంటున్నాను. ఎందుకంటే మా అన్నయ్య పై చదువుల కోసం విదేశాలు వెళ తున్నాడు. ఇప్పటిరకూ ఒక విధంగా ఉండేది.. ఇప్పుడు తనకు దూరంగా ఉండటం అనే మార్పు చాలా స్పష్టంగా కనబడుతుంది. రాఖీ కొనడం అనేది పెద్ద పనే. ఎందుకంటే ఒక పట్టాన సెలక్ట్ చేయలేను. చాలా టైమ్ పడుతుంది. మా అన్నయ్య మనస్తత్వానికి దగ్గరగా ఉన్న రాఖీ కొంటుంటాను.

అమ్మ గైడెన్స్‌తో పండగ చేసుకుంటాం

ఈ పండగ అనే కాదు ప్రతి పండగకీ మా అమ్మ గైడెన్స్ ఉంటుంది. అయితే అన్నయ్యకి హారతి ఇవ్వడం, స్వీటు తినిపించడం... ఇలా నేను మాత్రమే చేయాల్సినవే ఉంటాయి కాబట్టి రాఖీ పండగ అప్పుడు ఎక్కువ గైడెన్స్ ఉంటుంది. అమ్మకు సంప్రదాయాలు పాటించడం చాలా ఇష్టం. మేం కూడా పాటించాలని కోరుకుంటారు. అలాఅని ఒత్తిడి చేయరు. మా స్వేచ్ఛ మాకు ఉంటుంది.

నా ప్రేమను మెసేజ్ రూపంలో చెబుతా

ఒకవేళ వచ్చే ఏడాది మా అన్నయ్య రాఖీ పండగ సమయంలో విదేశాల్లో ఉంటే వీడియో కాల్ చేస్తాను. దాంతో పాటు తన మీద నాకు ఉన్న ప్రేమను ఒక మంచి మెసేజ్ రూపంలో చెబుతాను. ఆ మెసేజ్ హృదయ పూర్వకంగా తను నాకెంత ముఖ్యమో చెప్పేలా ఉంటుంది. దూరం అనేది విషయం కాదు అని చెప్పేలా ఉంటుంది.

నన్ను సర్‌ప్రైజ్ చేస్తే ఇష్టం

అన్నయ్య నాకు ఫలానా గిఫ్ట్ ఇవ్వాలని అనుకోను. కానీ నన్ను సర్‌ప్రైజ్ చేస్తే నాకు ఇష్టం. తను నా గురించి ఆలోచిస్తున్నాడని సూచించే ఏ గిఫ్ట్ అయినా నాకు ఓకే. పుస్తకం అయినా, ఏదైనా జ్యువెలరీ అయినా లేక తన చేతితో రాసిన లెటర్ అయినా సరే... తను నా గురించి ఆలోచిస్తున్నాడనే ఆ ఫీల్ నాకు ముఖ్యం.

నా బ్రదర్ నా ఆత్మవిశ్వాసం

బ్రదర్ ఒక బెస్ట్ ఫ్రెండ్‌లాంటి వాడు... రక్షణగా నిలబడేవాడు. ఏ విషయంలోనైనా నా బ్రదర్ మీద ఆధారపడిపోవచ్చు అనే భరోసా నాకు ఉంది. తను నా ఆత్మవిశ్వాసం... మా బాండింగ్‌ని నేను చాలా గాఢంగా ఇష్టపడతాను. ఒక బ్రదర్ ఉండటం అనేది ఎప్పుడూ అండగా నిలిచే వ్యక్తి పక్కనే ఉండటంలాంటిది.

- డి.జి. భవాని



90 ఏళ్లు... రెండు మైళ్లు

కదలిక

సొసైటీకీమె దివిటీ



పత్రికలకు, రేడియోకు దూరంగా ఉండే ఆ బామ్మ ఆగ్రహంతో రగిలిపోయింది. కోలకతాలో జూనియర్ డాక్టర్‌పై సాగిన హత్యాచారకాండను మనవరాళ్ల ద్వారా వినగానే 'సమాజం ఇలాంటి వాటిని ఎలా అంగీకరిస్తుంది? పదండి అందరం నిరసన తెలుపుదాం' అని 90 ఏళ్ల మాయా రాణి అర్ధరాత్రి కేండిల్ పట్టి రెండు మైళ్లు నడిచింది. ప్రతి అడుగు మనలో కదలిక ఆశిస్తోంది.

ఆమెను చూసిన వారందరూ ఆశ్చర్యపోయారు. నడుము ఒంగిపోయినా అడుగులు తొణకడం లేదు. శరీరం బలహీనంగా ఉన్నా మాట తీవ్రతలో వెనుకంజ లేదు. మొన్నటి బుధవారం (ఆగస్టు 14) కోల్‌కతాలో అర్ధ రాత్రి సాగిన నిరసనలో 90 ఏళ్ల ఆ బామ్మ చేతిలో క్యాండిల్ పట్టుకుని జనంతోపాటు నడుస్తూంటే అందరూ ఆమెను చూసి స్ఫూర్తి పొందారు. ఆమెతోపాటు మరింత ఉద్వేగంగా నడిచారు.

ఇంత దారుణమా...

కోల్‌కతాలోని జోకా ప్రాంతంలో నివాసం ఉండే 90 ఏళ్ల మాయారాణి చక్రవర్తికి ఆగస్టు 9న జరిగిన హత్యాచారం గురించి మనవరాళ్ల ద్వారా తెలిసింది. డ్యూటీలో ఉన్న జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం జరిపి హత్య చేశారన్న వార్త తెలియగానే ఆమె కదిలిపోయింది. తన కోల్‌కతా నగరంలో ఇంత దారుణమా అనుకుందామె. 'ఇంతటి ఘోరాన్ని నా జీవితంలో వినలేదు' అందామె వాళ్లతో. 'దీనిని సమాజం ఎలా అంగీకరిస్తుంది? మీరంతా ఏం చేస్తున్నారు?' అని మనవరాళ్లను ప్రశ్నించింది. 'మేము అర్ధరాత్రి నిరసన చేయబోతున్నాం. రాత్రిళ్లు సురక్షితంగా తిరగ్గలిగే మా హక్కు కోసం నినదించబోతున్నాం' అని వాళ్లు చెప్పారు. 'అయితే నేనూ వస్తాను' అందామె. 'రెండు మైళ్లు నడవాలి' అన్నారు వాళ్లు. 'నేను నడుస్తాను' అందామె ఖండితంగా.

క్యాండిల్ పట్టుకుని...

మోకా అనే ఏరియాలోని తన అపార్ట్‌మెంట్ నుంచి ఆ ఏరియా ఇ.ఎస్.ఐ ఆస్పత్రి వరకు మూడు కిలోమీటర్లు నడిచింది మాయారాణి చక్రవర్తి. 'బయట క్షేమంగా లేకపోతే ఇంట్లో మాత్రం క్షేమంగా ఎలా ఉండగలరు ఆడవాళ్లు. నా మనవరాళ్లు పని మీద, చదువు కోసం బయటకు వెళితే వాళ్లు వచ్చేంత వరకూ బితుకుబితుకుమంటూ ఉండాలా నేను. ఈ పరిస్థితి మారాలి. ఈ పరిస్థితిని అందరం మార్చాలి. అంతేకాదు ఇంత దారుణ నేరం చేసినవారికి శిక్ష పడాలి' అందామె. సమాజంలో ఎన్ని ఘోరాలు జరిగినా జడత్వంతో మనకెందుకులే అనుకునేవారికి ఆ బామ్మ కదలిక ఒక దివిటీ కావాలని ఆశిద్దాం.

బ్యూటిప్స్

చర్మకాంతికి ఆలివ్ .. తేనె

చర్మం జీవం కోల్పోయినట్టుగా అనిపిస్తే ఈ జాగ్రత్తలు తీసుకోవాలి...

- రోజూ రాత్రి పడుకునే ముందు ఆలివ్ ఆయిల్‌లో ముంచిన దూది ఉండతో ముఖమంతా రాయాలి. అదే ఉండతో కాస్త ఒత్తిడి చేస్తూ మసాజ్ చేయాలి. దీంతో ముఖంపైన దాగున్న దుమ్ము కణాలు, శుభ్రపరిచినా మిగిలిన మేకప్ సులువుగా వదిలిపోతుంది. తర్వాత శుభ్రపరుచుకొని మాయిశ్చరైజర్ రాసుకోవాలి.
- నీటి శాతం ఎక్కువ ఉండే పుచ్చకాయ, దోసకాయ, ఆరెంజ్, స్ట్రాబెర్రీ వంటి పండ్లను తినాలి.
- ఒంటికి చెమట పట్టేలా చేసే రన్నింగ్, జాగింగ్, వాకింగ్ వంటివి రోజులో 20 నిమిషాలైనా చేయాలి. చెమట ద్వారా స్వేదరంధ్రాలలో చేరిన మురికి విడుదల అవుతుంది. చర్మకాంతి పెరుగుతుంది
- చర్మం పొడిబారుతోంది అంటే సరైన నిద్రకు దూరంగా ఉన్నారని అర్థం చేసుకోవాలి. రోజూ సరైన నిద్ర లేకపోతే కళ్ల కింద వలయాలు ఏర్పడతాయి. ఉదయం, రాత్రి పడుకునే ముందు వేలి కొసలతో తేనె అద్దుకొని కళ్ల కింద ఉబ్బుగా ఉన్న చోట రాయాలి. అలాగే ముఖమంతా తేనె రాసి, మృదువుగా రుద్దాలి. తర్వాత చల్లటి నీళ్లతో కడిగేయాలి. ఇలా వారంలో మూడుసార్లు చేస్తే చర్మకాంతి పెరుగుతుంది.
- చర్మం జీవం లేనట్టుగా కనిపిస్తే రోజూ తగినన్ని నీళ్లు తాగడం లేదని అర్థం. అందుకని రోజూ ఎనిమిది గ్లాసుల నీళ్లు తప్పనిసరిగా తాగాలనే నియమం పెట్టుకోవాలి. అలాగే, రోజులో మూడు సార్లు సబ్బు లేకుండా కేవలం మంచినీళ్లతో ముఖాన్ని శుభ్రపరిచి, మాయిశ్చరైజర్ రాయాలి. ఈ జాగ్రత్తలు పాటిస్తే చర్మం సహజకాంతితో కళకళలాడుతుంది.



హెల్త్

- జువెనైల్ ఆర్థరైటిస్

ఎదిగే వయసులో... ఎముకలకు ఇబ్బంది



సాధారణంగా ఒకటి లేదా అంత కంటే ఎక్కువ కీళ్ల దగ్గర నొప్పి, వాపు వచ్చి, అవి గట్టిగా మారడాన్ని 'ఆర్థరైటిస్'గా వ్యవహరిస్తుంటారు. మామూలుగానైతే పెద్దల్లోనే ఎక్కువగా కనిపించే ఈ సమస్య, పిల్లల్లోనూ కనిపిస్తుంది. ఇటీవల ఈ ధోరణి కాస్త ఎక్కువగానే ఉంది. పదహారేళ్ల లోపు పిల్లల్లో కారణమేమిటో తెలియకుండా వచ్చి, ఎదిగే ఎముకల్ని ప్రభావితం చేసే ఈ ఆర్థరైటిస్‌ను 'జువెనైల్ ఇడియోపథిక్ ఆర్థరైటిస్' అనీ, 'పీడియాట్రిక్ రుమాటిక్ డిసీజ్' అని కూడా అంటారు. ఈ సమస్యపై అవగాహన కోసం...

చిన్నారుల వ్యాధినిరోధక వ్యవస్థ తమ సొంత ఎముకల కీళ్ల కణాలను దెబ్బతీయడంతో వస్తుంది కాబట్టి ఇది ఆటో ఇమ్యూన్ వ్యాధి. జువెనైల్ ఇడియోపథిక్ ఆర్థరైటిస్ (జేఐఏ)లో అనేక రకాలు ఉండటంవల్ల లక్షణాలూ వేర్వేరుగా ఉంటాయి.

జేఐఏలోని రకాలు:

- **సిస్టమిక్ ఆన్‌సెట్ జేఐఏ :** ఇది ఒకటి లేదా అంతకంటే ఎక్కువ కీళ్లను ప్రభావితం చేస్తుంది. తీవ్రమైన జ్వరం, ఒంటి మీద ర్యాష్‌తో కొన్నిసార్లు గుండె, కాలేయం, స్ప్లీన్, లింఫ్‌నోడ్స్‌ను ప్రభావితం చేయవచ్చు.
- **ఆలిగో ఆర్టిక్యులార్ జేఐఏ :** మొదటి ఆరు నెలల్లో ఇది ఒకటి నుంచి నాలుగు రకాల కీళ్లను ప్రభావితం చేస్తుంది. ఆర్నెల్లు దాటాక ఇంక ఏ కీలునూ ప్రభావితం చేయకపోతే దీన్ని 'పర్‌సిస్టెంట్' రకంగా పిలుస్తారు. ఒకవేళ ఆర్నెల్ల తర్వాత మరిన్ని కీళ్లను ప్రభావితం చేస్తే దీన్ని 'ఎక్స్‌టెండెడ్' రకంగా చెబుతారు.



డాక్టర్ విజయ ప్రసన్న పరిమి
సీనియర్ రుమటాలజిస్ట్

- **పాలీ ఆర్టిక్యులార్ జేఐఏ :** మొదటి ఆర్నెల్లలో ఇది 5 లేదా అంతకంటే ఎక్కువ కీళ్లను ప్రభావితం చేస్తుంది. రుమటాయిడ్ ఫ్యాక్టర్ (ఆర్.ఎఫ్.) అనే రక్తపరీక్ష రిజల్ట్‌లో ఇది ఆర్ఎఫ్ పాజిటివ్‌గా లేదా ఆర్ఎఫ్ నెగెటివ్‌గా ఇలా ఎలాగైనా కనిపించవచ్చు.
- **ఎంథసైటిస్ జేఐఏ :** ఇందులో చిన్నారికి ఆర్థరైటిస్‌తో పాటు ఎంథసైటిస్ సమస్య కూడా ఉంటుంది. అంటే టెండన్ లేదా లిగమెంట్‌తో ఎముక కలిసే చోట వాపు కనిపిస్తుంది.
- **సోరియాటిక్ ఆర్థరైటిస్ :** ఇందులో ఆర్థరైటిస్‌తో పాటు చర్మవ్యాధి అయిన సోరియాసిస్ కూడా కనిపిస్తుంది లేదా ఆర్థరైటిస్‌తో పాటు చేతి వేలు / కాలి బొటనవేలి ఇన్‌ఫ్లమేసన్ లేదా ఆర్థరైటిస్‌తో పాటు చేతి గోళ్ల మీద చిన్న చిన్న గుంటల్లా / గ్రూవ్స్‌లా రావచ్చు.

లక్షణాలు : • మోకాలు, చేతి / పాదాల, మడమ, భుజాలు, మోచేయి లేదా ఏ ప్రదేశంలోని కీళ్లలో వాపు కనిపిస్తుంది. ముఖ్యంగా ఉదయం వేళ లేదా నిద్రలేవగానే ఈ కీళ్లవాపు కనిపించవచ్చు • కళ్లు ఎర్రబారడం, మంట, వాపు • కీళ్ల ఎర్రబారడంతో పాటు వేడిగా అనిపించడం • కదలికలకు కీళ్లు సహకరించకపోవడం • తీవ్రమైన అలసట, నీరసం, నిస్సత్తువ • ఆకలి మందగించడం, బరువు అలాగే ఎత్తు వయసుకు తగినట్లుగా పెరగకపోవడం • లింఫ్‌నోడ్స్ వాపు.

నిర్ధారణ : • యాంటీ న్యూక్లియర్ యాంటీ బాడీ (ఏఎన్ఏ) పరీక్షతో పాటు ఇతర యాంటీ బాడీ పరీక్షలు • కంప్లీట్ బ్లడ్ కౌంట్ • ఎరిత్రోసైటిస్ సెడిమెంటేషన్ రేట్ (ఈఎస్ఆర్) పరీక్ష • సీ రియాక్టివ్ ప్రోటీన్ (సీఆర్‌పీ) పరీక్ష • క్రియాటినిన్ (కిడ్నీలు సరిగా పనిచేస్తున్నాయా అని తెలిపే పరీక్ష) • హిమాటోక్రిట్ (రక్తంలో ఎర్రరక్తకణాల సంఖ్యను తెలిపే పరీక్ష. ఎందుకంటే ఈ వ్యాధి ఉన్నవారు రక్తహీనతతో బాధపడటం ఎక్కువ) • రుమటాయిడ్ ఫ్యాక్టర్ పరీక్ష • అలాగే ఎక్స్-రే, సీటీ స్కాన్, ఎమ్మారై, బోన్ స్కాన్ వంటి కొన్ని ఇమేజింగ్ పరీక్షలతో పాటు మూత్ర పరీక్ష, కీళ్లలోని కందెన వంటి ద్రవాన్ని పరీక్షించే 'ఆర్థ్రోసెంటెసిస్ పరీక్ష... ఇంకా పూర్తిస్థాయి కంటి పరీక్షలు అవసరం.

చికిత్స: పిల్లల్లో సగం మందికి చికిత్స తర్వాత దాదాపుగా పూర్తిగా కోలుకునే అవకాశాలుంటాయి అయితే రుమటాలజిస్ట్ ఆధ్వర్యంలో నిశితమైన చికిత్స అందించాలి. చికిత్సలో భాగంగా...

- నొప్పులూ, వాపు, మంట తగ్గించడానికి నాన్‌స్టెరాయిడల్ యాంటీ-ఇన్‌ఫ్లమేటరీ డ్రగ్స్ (ఎన్ఎస్ఏఐడీ)
- జేఐఏను అదుపులో పెట్టడానికి డిసీజ్ మాడిఫైయింగ్ యాంటీ రుమాటిక్ మెడిసిన్స్ (డిఎమ్ఏఆర్‌డీ)
- డాక్టర్ నిర్ణయించిన మోతాదులో కార్టికోస్టెరాయిడ్స్
- మిగతా మందులు అంతగా ప్రభావం చూపనప్పుడు 'బయాలజిక్స్' అనే పేరున్న అధునాతన మందులు.

మందులతో పాటు కండరాలు, కీళ్లను సక్రమంగా పనిచేయించడం కోసం ఫిజియోథెరపీ, మంచి ఆహారం కోసం న్యూట్రిషనల్ కౌన్సెలింగ్, క్రమం తప్పని వ్యాయామాలు, కంటి పరీక్షలు కూడా అవసరమవుతాయి.

- అర్లీ మెనోపాజ్

ముందే రుతుక్రమం ఆగిందా?



బాలికకు యుక్తవయసు నాటి నుంచి ప్రతి నెలా వస్తుండే రుతుక్రమం ఒక వయసులో ఆగిపోతుంది. అలా ఆగిపోవడాన్ని 'మెనోపాజ్' అంటారు. మామూలుగా వచ్చే నెలసరి కనీసం ఏడాది పాటు ఏ నెలలోనూ కనిపించకుండా పూర్తిగా ఆగిపోతే అప్పుడే దాన్ని 'మెనోపాజ్'గా చెప్పవచ్చు. సాధారణంగా ఇది మహిళల్లో 45 నుంచి 55 ఏళ్ల మధ్య జరుగుతుంది. అంటే సగటున 51వ ఏట ఇది సంభవిస్తుంది. కానీ కొందరిలో మామూలుగా ఆగిపోయే సమయం కంటే చాలా ముందుగానే ఆగితే దాన్ని 'అర్లీ మెనోపాజ్'గా చెబుతారు. ఇలా జరిగినప్పుడు మహిళలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలుసుకుందాం.

కొందరు మహిళల్లో 45 నుంచి 55 ఏళ్ల మధ్య రుతుక్రమం ఆగిపోవడానికి బదులు 40 ఏళ్ల లోపు కూడా రుతుక్రమం ఆగిపోవచ్చు. ఇలా జరగడాన్ని అర్లీ మెనోపాజ్ లేదా ప్రి-మెచ్యూర్ ఒవేరియన్ ఇన్‌సఫిషియెన్సీ అని కూడా అంటారు. దీనికి నిర్దిష్టంగా కారణం ఏమిటో స్పష్టంగా తెలియదు. అయితే... కొందరిలో శస్త్రచికిత్స చేసి అండాశయాలు (ఓవరీలు) తొలగించాల్సి రావడం. • కొన్ని కుటుంబాల్లో జన్యుపరంగా త్వరగా రుతుస్రావం ఆగిపోతుండవచ్చు • కొందరిలో క్రోమోజోముల సమస్య కారణంగా... అంటే టర్నర్ సిండ్రోమ్ వంటివాటితో • మానసిక ఒత్తిడి, మంచి ఆహారం తీసుకోకపోవడం, ఏదైనా దెబ్బతగలడం • కీమోథెరపీ, రేడియోథెరపీ ఇవ్వాల్సి రావడం (ముఖ్యంగా నడుము దగ్గర) • అండాశయాలను తొలగించడం • పళ్లు, కూరగాయలపై ఉండే రసాయనాలు • పొగ, మద్యం అలవాట్లు (విదేశాల్లో ఎక్కువ) • థైరాయిడ్ గ్రంథి సరిగా పనిచేయకపోవడం • ప్రోలాక్టిన్ అనే హార్మోన్ ఎక్కువగా స్రవించడం • కుటుంబ నియంత్రణ కోసం వాడే మందులు డాక్టర్ సలహా లేకుండా విచక్షణరహితంగా వాడటం • పాలీసిస్టిక్ ఓవేరియన్ సిండ్రోమ్ (పీసీఓఎస్) • స్థూలకాయం.

త్వరగా రుతుక్రమం ఆగడం ప్రమాదమా?

- మెనోపాజ్ రాబోతున్న సూచనగా కొందరు మహిళల ఒంట్లో నుంచి వేడి సెగలు వస్తున్నట్లు అనిపించడం (హాట్ ఫ్లషెస్), భావోద్వేగాలు వెంట వెంటనే మారడం (మూడ్ స్వింగ్స్) వంటి లక్షణాలు కనిపిస్తాయి
- కొందరిలో ఎముకలు పెళుసుబారి తేలిగ్గా విరిగిపోయేలా చేసే 'ఆస్టియోపోరోసిస్' ముప్పు
- నెలసరి ఆగిపోవడంతోనే ఈస్ట్రోజెన్ తగ్గడం వల్ల కొందరిలో గుండెపోటు, గుండెజబ్బుల ముప్పు
- మూత్ర సంబంధమైన వ్యాధులు (యూరిన్ ఇన్ఫెక్షన్స్)
- బరువు పెరగడం
- కొందరిలో డిప్రెషన్, అయోమయం, త్వరగా కోపగించుకోవడం, అలసట వంటి మానసికమైన సమస్యలూ కనిపిస్తాయి.



డాక్టర్ క్రాంతి శిల్ప
కన్సల్టెంట్ గైనకాలజిస్ట్ & అబ్‌స్ట్రెట్రీషియన్

అర్లీ మెనోపాజ్‌కు తర్వాతి పరిణామాలకు చికిత్స?

- ఒకసారి మెనోపాజ్ ఆగిపోయాక దాన్ని పునరుద్ధరించడానికి ఏ చికిత్సతోనూ అవకాశముండదు. కాకపోతే మెనోపాజ్ తర్వాతి పరిణామంతో మహిళల్లో కొన్ని ఇబ్బందులు కనిపించవచ్చు. వీటికే చికిత్స అవసరం
- ఒంట్లోంచి వేడి సెగలు (హాట్‌ఫ్లషెస్) వస్తుండటం వల్ల బాధపడేవారికి హార్మోన్లను భర్తీ చేసేందుకు వచ్చే హార్మోన్ రీప్లేస్‌మెంట్ థెరపీ (హెచ్ఆర్‌టీ) ఇవ్వాల్సి రావచ్చు. ఈ మందుల వల్ల ఒంట్లోంచి సెగలు రావడం ఆగడంతో పాటు ఎముకలూ బలంగా మారతాయి. అర్లీ మెనోపాజ్ లక్షణాలు కనిపిస్తుండగా మొదలయ్యే ఈ చికిత్సను స్వాభావికంగా మెనోపాజ్ వచ్చే వయసు వరకు కొనసాగించాలి. హెచ్ఆర్‌టీలో ఇచ్చేవి ప్రత్యేకమైన మందులేమీ కావు. శరీరంలోనే స్రవించాల్సిన హార్మోన్లు కొన్ని కారణాల వల్ల స్రవించకపోవడంతో వాటిని డాక్టర్లు మాత్రలు, ఇంజెక్షన్ల రూపంలో ఇస్తారు. కాబట్టి వీటితో ముప్పు ఏదీ ఉండదు.

ప్రిమెచ్యూర్ మెనోపాజ్‌తో వచ్చే సమస్యలు, వాటి నివారణ కోసం...

- ఆకుకూరలు, పళ్లు సరిగ్గా కడిగి తీసుకోవాలి
- క్యాల్షియమ్ ఎక్కువగా ఉండే ఆహారం
- ఆరోగ్యకరమైన జీవనశైలి అనుసరించాలి. అంటే... పొట్టుతో ఉండే గింజధాన్యాలు ఎక్కువగా తీసుకోవడం, వేళకు నిద్రపోవడం, శరీరానికి తగినంత వ్యాయామాన్ని ఇవ్వడం, ప్రశాంతంగా ఉండటం.

అపోహ | వాస్తవం

సిజేరియన్ తర్వాత బరువు పెరుగుతారా?



సాధారణంగా సిజేరియన్ తర్వాత మహిళలు బరువు పెరుగుతారనే అపోహ చాలామందిలో ఉంటుంది. సిజేరియన్ తర్వాత కొందరు కాస్తంత బరువు పెరిగినప్పటికీ అందుకు కారణం సిజేరియన్ మాత్రం కాదు. దేహానికి తగినంత శారీరక శ్రమలేకపోవడం వల్ల లేదా మరికొన్ని వేర్వేరు అంశాల వల్ల అలా జరిగినప్పుడు దాన్ని సిజేరియన్‌కు ఆపాదించడం జరుగుతుంది. బరువు పెరగకుండా ఉండేందుకు సిజేరియన్ అయిన పదిహేను రోజుల తర్వాత నుంచే నడక లేదా శరీరంపై భారం పడకుండా తేలిక పాటి వ్యాయామాలు మొదలుపెట్టవచ్చు. అయితే ఏవైనా ఇతరత్రా కారణాలతో కొందరు మహిళలను డాక్టర్లు ప్రత్యేకంగా విశ్రాంతి తీసుకోవాలని సూచించిన వారు తప్ప అందరూ తమకు తగిన వ్యాయామాలను చేయవచ్చు.

బరువు పెరగకుండా ఉండేందుకు సూచనలు :

చిన్నారులకు తల్లిపాలు పట్టించడం వల్ల మహిళలు బరువు పెరగకుండా ఉంటారు. దీనివల్ల తల్లికీ, బిడ్డకూ ఇరువురికీ లాభమే. నడక వ్యాయామం అందరికీ ప్రయోజనకరం. మహిళలు నడక మొదలుపెట్టినప్పుడు రోజుకు కేవలం పది నిమిషాలు మాత్రమే నడుస్తూ కాలవ్యవధిని క్రమంగా పెంచుకుంటూ పోవాలి. ఇలా చేస్తూ పోతే మూడు నెలల నుంచి మహిళలు తమ అదనపు కొవ్వు కోల్పోతారు. పొట్ట కూడా మామూలు స్థితికి వచ్చి సెంట్రల్ ఒబేసిటీ కూడా తగ్గుతుంది.

ముక్కు బెదరడం మామూలే!



చిన్నారుల్లో అందునా మూడు నుంచి పదేళ్ల పిల్లల్లో ముక్కు నుంచి రక్తస్రావం అవుతుండటం తరచూ కనిపిస్తుంది. ఈ కండిషన్‌ను 'ఎపిస్టాక్సిస్' అంటారు. చూడ్డానికి తీవ్రంగా అనిపించినా ఇది చాలా మామూలు సమస్య.

ఇదీ ప్రథమ చికిత్స : • పిల్లల్లో ముక్కు నుంచి రక్తస్రావం అవుతున్నప్పుడు ఆందోళన చెందకూడదు • పిల్లలకు ధైర్యం చెప్పి, సౌకర్యంగా ఉండేలా వాళ్లను కూర్చోబెట్టాలి • ముందుకు ఒంగేలా చూసి, నోటితో గాలిపీల్చుకొమ్మని చెప్పాలి • పిల్లల శ్వాసక్రియకు అంతరాయం కలిగించని విధంగా... ముక్కుచివరి భాగాన్ని (ముక్కు రంధ్రాలపైన) బొటన వేలు, చూపుడువేలు సాయంతో కాసేపు నొక్కి పట్టి ఉంచాలి • ముక్కుపైన ఐస్‌ప్యాక్ ఉంచాలి.

పైన చెప్పిన చిన్నపాటి చర్యలతో రక్తస్రావం ఆగిపోతుంది.

కొన్నిసార్లు కాస్తంత తీవ్రమైన కండిషన్‌లలో.. అంటే ఎటోపిక్ రైనైటిస్, అడినాయిడ్స్, నేసల్ డిప్తీరియా, ఫారిన్‌బాడీ ఇన్ నోస్, ముక్కుకు దెబ్బతగలడం, రక్తం గడ్డకట్టడంలో సమస్యల వంటి అనేక సందర్భాల్లోనూ రక్తస్రావం అవుతుంది. జాగ్రత్తలు తీసుకున్న తర్వాత కూడా ఆగకుండా రక్తస్రావం అవుతుంటే వెంటనే ఈఎన్‌టీ నిపుణులను కలవడం తప్పనిసరి.



బ్లిట్జ్‌లోనూ ఆఖరి స్థానమే!

సెయింట్ లూయిస్ (అమెరికా): భారత గ్రాండ్‌మాస్టర్ ఆర్. ప్రజ్ఞానందకు 'గ్రాండ్ చెస్ టూర్'లో సెయింట్ లూయిస్ అంచె పోటీలు ఏమాత్రం కలిసిరాలేదు. బ్లిట్జ్ ఈవెంట్‌లోనూ అతను ఆఖరి స్థానంలో నిలిచాడు. ఇంతకుముందు ర్యాపిడ్ కేటగిరీలో నాలుగు పాయింట్లతో చివరి స్థానంలో నిలిచాడు. అయితే శనివారం ముగిసిన బ్లిట్జ్ కేటగిరీలో కాస్త మెరుగైన ప్రదర్శన కనబరిచి 8 పాయింట్లు సాధించినా చివరకు ఆఖరి స్థానమైతే తప్పలేదు. మొత్తానికి గ్రాండ్ చెస్ టూర్ ఈవెంట్‌లో అతని ఖాతాలో 12 పాయింట్లు (4+8) ఉన్నాయి. ఈ టోర్నీకి ముందు మూడో ర్యాంకులో ఉన్న ప్రజ్ఞానంద... తాజా నిరాశాజనక ఫలితాలతో ఐదో స్థానానికి పడిపోయాడు. ఫ్రాన్స్ గ్రాండ్‌మాస్టర్ అలిరెజా ఫిరోజా 23 పాయింట్లతో సెయింట్ లూయిస్ అంచె ఈవెంట్‌లో విజేతగా నిలిచాడు. అతను ర్యాపిడ్‌లో 11, బ్లిట్జ్‌లో 12 పాయింట్లు గెలుపొందాడు. అమెరికా ఆటగాళ్లు వెస్లీ సో (20 పాయింట్లు), హికరు నకమురు (19.5), లెవాన్ అరోనియన్ (19) వరుసగా 2, 3, 4 స్థానాల్లో నిలిచారు. తర్వాతి టోర్నీ సింక్యూఫీల్డ్ కప్‌లో ప్రజ్ఞానందతో పాటు భారత్ నుంచి డి.గుకేశ్ బరిలో ఉన్నాడు.

వినేశ్‌కు అపూర్వ స్వాగతం

- భావోద్వేగానికి గురై కన్నీళ్లు పెట్టుకున్న రెజ్లర్
- ఢిల్లీ నుంచి బలాలి వరకు భారీ ఊరేగింపు

న్యూఢిల్లీ: భారత స్టార్ మహిళా రెజ్లర్ వినేశ్ ఫొగాట్ శనివారం స్వదేశానికి చేరుకుంది. స్వర్ణపతక పోరుకు ముందు అనర్హతకు గురై అప్పీల్‌కు వెళ్లిన ఆమె ఇన్నాళ్లూ పారిస్‌లోనే ఉండిపోయింది. ఫైనల్ రోజు కేవలం 100 గ్రాముల అధిక బరువు కారణంగా ఆమె అనర్హతకు గురైంది. ఫైనల్లో ఓడినా కనీసం రజతం ఖాయం అనుకోగా, అదీ చేజారిపోయింది. సంయుక్త రజతం కోసం కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్ ఫర్ స్పోర్ట్స్ (సీఏఎస్)లో వినేశ్ అప్పీలు చేసింది. భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) మద్దతుతో నిష్ణాతులైన లాయర్ల బృందం ఆమె కేసును వాదించింది. విచారణ తదుపరి వాయిదాల అనంతరం చివరకు భారత రెజ్లర్‌కు అక్కడ కూడా నిరాశే ఎదురైంది. దీంతో భారత్‌కు పయనమైన వినేశ్ ఢిల్లీ అంతర్జాతీయ విమానాశ్రయంలో దిగగానే క్రీడాభిమానులు అపూర్వ స్వాగతం పలికారు. డోలు బాజాలు, భాంగ్రా నృత్యాల మధ్య ఆమె బయటకు వచ్చింది. వినేశ్ భర్త సోమ్‌వీర్ రాఠీ కూడా ఆమె వెంట ఉన్నాడు. ఒలింపిక్ పతక విజేతలైన స్టార్ రెజ్లర్లు సాక్షి మాలిక్, బజరంగ్ పూనియాలతో పాటు, కాంగ్రెస్ ఎంపీ దీపేందర్ హుడా, పోటెత్తిన అభిమానులు ఆమెకు ఘన స్వాగతం పలికారు. వెల్లువెత్తిన అభిమానం చూసి ఒక్కసారిగా భావోద్వేగానికి గురైన ఫొగాట్ కన్నీళ్లు పెట్టుకుంది. ఇది గమనించిన సాక్షి, బజరంగ్ ఆమెను దగ్గరికి తీసుకొని ఓదార్చారు. అనంతరం తేరుకొని వినమ్రంగా చేతులు జోడించి 'యావత్ దేశానికి నేను కృతజ్ఞతలు తెలుపుతున్నాను' అని చెప్పింది. పెద్ద సంఖ్యలో అభిమానులంతా తమ వాహనాల్లో వినేశ్‌ను ఆమె స్వగ్రామం బలాలి (హరియాణా) చేరే వరకు అనుసరించారు. దీంతో ఈ 135 కిలో మీటర్ల మార్గమంతా వీవీఐపీ కాన్వాయ్‌ని తలపించింది. పారిస్ ఒలింపిక్స్‌లో భారత బృందానికి చెఫ్ డి మిషన్‌గా వ్యవహరించిన మాజీ షూటర్ గగన్ నారంగ్ కూడా శనివారం ఆమెతో పాటు స్వదేశం చేరుకున్నారు. ఆమెతో పారిస్‌లో దిగిన ఫొటోని 'ఎక్స్'లో షేర్ చేస్తూ వినేశ్ నిజమైన చాంపియన్‌గా అభివర్ణించారు. 'క్రీడా గ్రామంలో తొలి రోజే ఆమె చాంపియన్‌గా అడుగుపెట్టింది. అనర్హతకు గురైనా ఇప్పటికీ ఆమెనే చాంపియన్. పతకాలు, విజయాలే కాదు... కొన్నిసార్లు పోరాటం కూడా స్ఫూర్తిదాయకంగా నిలుస్తుంది. వినేశ్ కనబరిచింది కూడా అదే! యువతరానికి ప్రేరణగా నిలిచిన ఆమెకు నా సెల్యూట్' అని నారంగ్ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. వినేశ్ కోసం ఢిల్లీలో, తమ స్వగ్రామంలో ఎదురు చూసిన అభిమానులు ఆమెకు బ్రహ్మరథం పట్టారని సోదరుడు హర్విందర్ ఫొగాట్ చెప్పాడు. 'ఒలింపిక్స్ నిర్వాహకులు నాకు పతకం ఇవ్వకపోతే నేమి. ఇక్కడి ప్రజలంత ఎంతో ప్రేమ, గౌరవం అందించారు. నాకు ఇది 1000 ఒలింపిక్ పతకాలతో సమానం' అని వినేశ్ వ్యాఖ్యానించింది.





వినేశ్‌పై పూల వర్షం

'25 పతకాలు పక్కా'

భారత పారాలింపిక్ కమిటీ అధ్యక్షుడు ఝఝారియా



న్యూఢిల్లీ: పారా షట్లర్ ప్రమోద్ భగత్‌పై సస్పెన్షన్ వేటు పడడం పారిస్ పారాలింపిక్స్‌లో మన అథ్లెట్ల ప్రదర్శనపై ప్రభావం చూపదని భారత పారాలింపిక్ కమిటీ (పీసీఐ) అధ్యక్షుడు దేవేంద్ర ఝఝారియా అన్నాడు. పారిస్ పారాలింపిక్స్‌లో భారత్ 25 పతకాలు సాధించగలదని ఝఝారియా ఆశాభావం వ్యక్తం చేశాడు. కాగా, యాంటీ డోపింగ్ నియమావళిని ఉల్లంఘించినందుకు గానూ గత ఒలింపిక్స్ స్వర్ణపతక విజేత ప్రమోద్‌పై బీడబ్ల్యూఎఫ్ 18 నెలల నిషేధం విధించింది. 'పారాలింపిక్స్‌లో పతకం తెచ్చేవారి జాబితాలో ప్రమోద్ భగత్ పేరు ముందుండాల్సింది. కానీ అతడిపై నిషేధం పడింది. అయినా విశ్వ క్రీడల్లో మన అథ్లెట్లు 25 పతకాలు సాధించగలరు. పారాలింపిక్స్ చరిత్రలోనే ఈసారి భారత్ నుంచి అత్యధిక మంది అథ్లెట్లు పాల్గొంటున్నారు. 2020 టోక్యో పారాలింపిక్స్‌లో మనవాళ్లు 19 పతకాలు సాధించారు. ఇప్పుడు ఆ మార్క్ దాటడంతో పాటు.. పతకాల జాబితాలో టాప్-20లో నిలుస్తాం' అని ఝఝారియా అన్నాడు. ఈ నెల 28 నుంచి సెప్టెంబర్ 8 వరకు జరగనున్న 'పారిస్' పారా క్రీడల్లో భారత్ నుంచి 84 మంది అథ్లెట్లు 12 క్రీడాంశాల్లో పోటీపడుతున్నారు. ఇప్పటికే భారత అథ్లెట్ల బృందం క్రీడా గ్రామంలో అడుగుపెట్టింది.

అల్‌కరాజ్ అనూహ్య పరాజయం



సిన్సినాటి: నాలుగు గ్రాండ్‌స్లామ్ టైటిళ్లతో స్పెయిన్ సంచలనంగా మారిన కార్లోస్ అల్‌కరాజ్ సిన్సినాటి ఓపెన్‌లో ఓడిపోవడాన్ని ఏమాత్రం జీర్ణించుకోలేకపోయాడు. దీంతో కోర్టులోనే ఈ ప్రొఫెషనల్ టెన్నిస్ ప్లేయర్ తన రాకెట్‌ను విరగ్గొట్టేశాడు. పురుషుల సింగిల్స్ రెండో రౌండ్లో రెండో సీడ్ అల్‌కరాజ్ 6-4, 6-7 (5/7), 4-6తో గేల్ మోన్‌ఫిల్స్ (ఫ్రాన్స్) చేతిలో పరాజయం చవిచూశాడు. గురువారం అర్ధరాత్రి జరగాల్సిన ఈ మ్యాచ్ వర్షం వల్ల ఆగిపోయింది. తొలి సెట్ గెలుపొందగా, రెండో సెట్ టైబ్రేక్‌కు దారితీసింది. ఈ దశలో మ్యాచ్ ఆగిపోగా మరుసటి రోజు టైబ్రేక్‌లో పుంజుకొని మ్యాచ్‌ను వరుస సెట్లలోనే ముగించవచ్చని అల్‌కరాజ్ భావించాడు. కానీ 37 ఏళ్ల వెటరన్ మోన్‌ఫిల్స్ పట్టుదలగా ఆడటంతో రెండో సెట్ అతని వశమైంది. అదే జోరుతో ఆఖరి సెట్‌నూ నెగ్గిన మోన్‌ఫిల్స్ మ్యాచ్ గెలుపొందాడు. దీంతో తన ప్రదర్శన, మ్యాచ్ ఫలితంతో నిరాశచెందిన స్పెయిన్ స్టార్ రాకెట్ బద్దలుకొట్టాడు. తన కెరీర్‌లోనే ఇదో చెత్తమ్యాచ్ అని, దీన్ని త్వరగా మర్చిపోయి యూఎస్ ఓపెన్‌పై దృష్టిపెట్టాలనుకుంటున్నట్లు చెప్పాడు. న్యూయార్క్‌లో ఈ నెల 26 నుంచి యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ జరుగుతుంది.

'నదీమ్ రికార్డును బ్రేక్ చేస్తాననుకున్నా'

స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా



న్యూఢిల్లీ: పాకిస్తాన్ అథ్లెట్ అర్షద్ నదీమ్ రికార్డు బ్రేక్ చేయడం పెద్ద కష్టం కాదనుకున్నానని భారత స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా పేర్కొన్నాడు. జావెలిన్ పట్టుకుంటే వంద శాతం ప్రదర్శన ఇవ్వడంపైనే దృష్టి పెడతానని.. అది ఎంత దూరం వెళ్తుందనే దాన్ని పట్టించుకోనని నీరజ్ అన్నాడు. పారిస్ ఒలింపిక్స్‌లో రజత పతకం నెగ్గిన నీరజ్.. 90 మీటర్ల మార్కు అందుకోవడం గురించి ఎక్కువ ఆలోచించడం లేదని.. అది ఎప్పుడు జరగాలని రాసిపెట్టి ఉందో అప్పుడే జరుగుతుందని పేర్కొన్నాడు. 2020 టోక్యో ఒలింపిక్స్ స్వర్ణం గెలిచి.. అథ్లెటిక్స్‌లో భారత్ తరఫున తొలి పసిడి గెలిచిన ప్లేయర్‌గా రికార్డుల్లోకెక్కిన నీరజ్.. తాజాగా 'పారిస్' క్రీడల్లో గాయంతోనే రజతం గెలిచి అదుర్స్ అనిపించుకున్నాడు. విశ్వ క్రీడల అనంతరం స్విట్జర్లాండ్‌లో శిక్షణ తీసుకుంటున్న నీరజ్‌చోప్రా.. శనివారం ఓ ప్రత్యేక కార్యక్రమంలో పలు అంశాలపై మాట్లాడాడు. 'మెరుగైన ప్రదర్శన చేసే విధంగా సిద్ధం కావడమే నా చేతిలో ఉంది. 90 మీటర్ల మార్కు అందుకోవడం గురించి ఇప్పటికే ఎక్కువ చర్చ జరిగింది. ఇకపై దాని గురించి ఆలోచించొద్దని అనుకుంటున్నా. రాబోయే రెండు మూడు టోర్నీల్లో వంద శాతం ప్రయత్నిస్తా.. ఫలితం ఎలా వస్తుందో చూస్తా. పారిస్ పోటీల్లో నదీమ్ విసిరిన దూరాన్ని అందుకోలేనని ఒక్క శాతం కూడా అనిపించలేదు' అని 26 ఏళ్ల నీరజ్ అన్నాడు. గత ఏడాది ప్రపంచ చాంపియన్‌షిప్ నుంచి గజ్జల్లో గాయంతో ఇబ్బంది పడుతున్న నీరజ్.. వచ్చే నెల బ్రస్సెల్స్ డైమండ్ లీగ్ అనంతరం చికిత్స చేయించుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. తాజాగా పారిస్ క్రీడల్లో గాయంతోనే బరిలోకి దిగిన నీరజ్.. ఆ ప్రభావం కూడా తన ప్రదర్శనపై పడిందని అన్నాడు. 'జావెలిన్‌ను మరింత దూరం విసరగలనని అనుకున్నా. పారిస్ ఒలింపిక్స్ క్వాలిఫికేషన్, ఫైనల్లో నేను వేసిన రెండు త్రోలు నా కెరీర్‌లో రెండో, మూడో అత్యుత్తమ త్రోలు. అందులో ఒకటి సీజన్ బెస్ట్ కూడా. వంద శాతం కష్టపడితే మెరుగైన ఫలితాలు వస్తాయి. అయితే గాయం భయంతో పూర్తి ఎఫర్ట్ పెట్టనట్లు అనిపించింది. త్రో చేయడానికి ముందు జావెలిన్‌తో పరిగెడుతున్నప్పుడు గజ్జల్లో ఇబ్బందిగా ఉంది. దీంతో పాటు జావెలిన్ వదిలే కోణంపై కూడా దృష్టి పెట్టాల్సిన అవసరముంది. దేశంలో క్రీడల ప్రాముఖ్యత పెరగాలి. ప్రత్యేకంగా ఒక ఆట అని కాకుండా.. అన్నింటిలో ఎదిగితేనే స్పోర్ట్స్ పవర్ హౌస్‌గా మారగలం. క్రికెట్‌లో మెరుగైన స్థితిలో ఉన్నాం. వచ్చే ఒలింపిక్స్‌లో ఎక్కువ పతకాలు సాధించడంతో పాటు.. ఫిఫా ప్రపంచకప్‌నకు అర్హత సాధించే దిశగా అడుగులు వేయాలి' అని నీరజ్ వివరించాడు.

లుసానే డైమండ్ లీగ్‌లో నీరజ్

ఈ నెల 22 నుంచి లుసానే వేదికగా జరగనున్న డైమండ్ లీగ్‌లో బరిలోకి దిగనున్నట్లు నీరజ్ చోప్రా ప్రకటించాడు. సెప్టెంబర్‌లో జరగనున్న బ్రస్సెల్స్ డైమండ్ లీగ్‌తో సీజన్ ముగియనుండగా.. ఆ తర్వాతే గాయానికి చికిత్స తీసుకోవాలని నీరజ్ భావిస్తున్నాడు. 'లుసానే లీగ్‌లో పోటీపడాలని నిర్ణయించుకున్నా. మరో నెల రోజుల్లో సీజన్ ముగుస్తుంది. ఆ తర్వాతే చికిత్సపై దృష్టి పెడతా. డైమండ్ లీగ్‌కు ముందు శిక్షణ కోసం స్విట్జర్లాండ్‌కు వచ్చా. వైద్యుల పర్యవేక్షణలో ట్రెనింగ్ సాగుతుంది. ఒకసారి పోటీలు ముగిసిన తర్వాత గాయం గురించి ఆలోచిస్తా' అని నీరజ్ అన్నాడు.

వెస్టిండీస్ విజయ లక్ష్యం 263



జేడెన్ సీల్స్

ప్రొవిడెన్స్: రెండో టెస్టు మ్యాచ్‌లో వెస్టిండీస్‌కు దక్షిణాఫ్రికా 263 పరుగుల విజయలక్ష్యాన్ని నిర్దేశించింది. ఛేదనలో 25 ఓవర్లు ముగిసే సరికి విండీస్ 3 వికెట్లు కోల్పోయి 70 పరుగులు చేసింది. అంతకు ముందు దక్షిణాఫ్రికా తమ రెండో ఇన్నింగ్స్‌లో 246 పరుగులకు ఆలౌటైంది. కైల్ వెరీన్ (59), ఎయిడెన్ మార్క్‌రమ్ (51), టోనీ జోర్జీ (39), వియాన్ ముల్డర్ (34) కీలక పరుగులు సాధించారు. విండీస్ బౌలర్లలో జేడెన్ సీల్స్ (6/61) ఆరు వికెట్లతో ప్రత్యర్థిని దెబ్బ తీయగా...వారికాన్, గుడకేశ్ మోతీ చెరో 2 వికెట్లు పడగొట్టారు.

సినిమా



● వై. రవిశంకర్, హను రాఘవపూడి, ఇమాన్వి, ప్రభాస్, నవీన్ ఎర్నేని

పవర్‌ఫుల్ వారియర్

ప్రభాస్ హీరోగా హను రాఘవపూడి దర్శకత్వంలో హిస్టారికల్ వార్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కనున్న చిత్రం శనివారం ప్రారంభమైంది. ఈ చిత్రంలో ఇమాన్వి హీరోయిన్‌గా నటించనున్నారు. గుల్షన్ కుమార్, భూషణ్‌కుమార్, టీ సిరీస్ ఫిల్మ్స్ సమర్పణలో మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ ఎర్నేని, వై. రవి శంకర్ ఈ సినిమాను నిర్మించనున్నారు. ''ఆధిపత్యం కోసం యుద్ధాలు జరుగుతున్నప్పుడు ఓ వారియర్ మాత్రం వారి పోరాటం దేని కోసమో నిర్వచించగలిగాడు'' అంటూ ఈ సినిమాని ఉద్దేశించి 'ఎక్స్'లో పేర్కొన్నారు హను రాఘవపూడి. ''1940 నేపథ్యంలో సాగే ఈ సినిమాకు హను పవర్‌ఫుల్ వారియర్ స్క్రిప్ట్‌ని సిద్ధం చేశారు. త్వరలోనే చిత్రీకరణ ప్రారంభిస్తాం'' అని చిత్రబృందం పేర్కొంది. మిథున్ చక్రవర్తి, జయప్రద కీలక పాత్రల్లో నటించనున్న ఈ చిత్రానికి సంగీతం: విశాల్ చంద్రశేఖర్, కెమెరా: సుదీప్ ఛటర్జీ ఐఎస్‌సీ.

ఆయ్‌కి ఎన్టీఆర్ అభినందనలు

ఎన్టీఆర్ బావమరిది, 'మ్యాడ్' ఫేమ్ నార్నే నితిన్, నయన్ సారిక హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'ఆయ్'. అంజి కె. మణిపుత్ర దర్శకత్వంలో అల్లు అరవింద్ సమర్పణలో 'బన్నీ' వాసు, విద్యా కొప్పినీడి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 15న విడుదలైంది. తమ సినిమాకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభిస్తోందని చిత్రబృందం పేర్కొంది. తాజాగా 'ఆయ్' యూనిట్ ఎన్టీఆర్‌ను కలిసింది. సినిమా విజయం సాధించినందుకు యూనిట్ సభ్యులను ఎన్టీఆర్ అభినందించారు. ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.



● ఎన్టీఆర్, నార్నే నితిన్



శనివారం (ఆగస్టు 17) హీరోయిన్ నిధీ అగర్వాల్ బర్త్ డే. ఈ సందర్భంగా 'హరి హర వీర మల్లు' సినిమా నుంచి నిధీ అగర్వాల్ కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. పంచమి పాత్రలో నిధీ అగర్వాల్ కనిపిస్తారు. రెండు భాగాలుగా విడుదల కానున్న ఈ సినిమాలో పవన్ కల్యాణ్ హీరోగా నటిస్తుండగా, జ్యోతికృష్ణ దర్శకత్వం వహిస్తున్నారు. ఏఎం రత్నం సమర్పణలో ఎ. దయాకర్ రావు నిర్మిస్తున్నారు. తొలి భాగం 'హరి హర వీర మల్లు పార్ట్-1: స్వోర్డ్ వర్సెస్ స్పిరిట్' త్వరలో రిలీజ్ కానుంది. అలాగే ప్రభాస్ హీరోగా నటిస్తున్న 'రాజా సాబ్'లో నిధి ఓ హీరోయిన్‌గా నటిస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు. మారుతి దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రం వచ్చే ఏడాది ఏప్రిల్ 10న విడుదల కానుంది.

● నిధీ అగర్వాల్



● సుధీర్‌బాబు

మహాశివరాత్రికి జటాధర

సుధీర్‌బాబు హీరోగా నటించనున్న ద్విభాషా (తెలుగు, హిందీ) చిత్రం 'జటాధర'. సూపర్ నేచురల్ ఫ్యాంటసీ అంశాలతో వెంకట్ కల్యాణ్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించనున్నారు. హిందీలో 'రుస్తుమ్, టాయ్‌లెట్: ఏక్ ప్రేమ్‌కథ, ప్యాడ్‌మ్యాన్, పరి'లాంటి చిత్రాలను నిర్మించిన ప్రేరణ అరోరాతో కలిసి శివిన్ నారంగ్, నిఖిల్ నందా, ఉజ్వల్ ఆనంద్‌లు ఈ సినిమాను నిర్మించనున్నారు. 'జటాధర'ను శనివారం ప్రకటించి, ఫస్ట్ లుక్‌ను విడుదల చేయడంతో పాటు ఈ సినిమాను వచ్చే ఏడాది మహాశివరాత్రి సందర్భంగా విడుదల చేయనున్నట్లు వెల్లడించారు మేకర్స్. ''ఈ చిత్రంలో సుధీర్‌బాబు ఓ పవర్‌ఫుల్ రోల్‌లో కనిపిస్తారు. త్వరలోనే షూటింగ్ ఆరంభిస్తాం'' అని చిత్రబృందం పేర్కొంది.

ఓటీటీ ఇది చూడొచ్చు

ఓటీటీలో 'ఇది చూడొచ్చు' అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో మలయాళ చిత్రం 'టర్బో' ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.

సీరియస్ రోడ్.... కామెడీ జర్నీ



ప్రముఖ మలయాళ నటుడు మమ్ముట్టి నటించిన చిత్రం 'టర్బో'. ఇదో సీరియస్ యాక్షన్ కామెడీ ఎంటర్‌టైనర్. దీనికి దర్శకులు వైశాఖ్. డెబ్బై ఏళ్ళ పైబడి వయసులో ఉన్న మమ్ముట్టి ఈ సినిమాలో నలభై ఏళ్ల వ్యక్తిలా యంగ్ అండ్ ఎనర్జిటిక్‌గా కనిపించారు. టర్బో జోస్ (మమ్ముట్టి) తనకు సంబంధం లేని తగాదాల్లో తల దూరుస్తుంటాడు. అతనిది ఎవ్వరికీ భయపడని మనస్తత్వం... ఒక్క వాళ్లమ్మకు తప్ప. జోస్‌కి మంచి ఆప్తుడు జెర్రీ. జెర్రీకి సంబంధించిన ఓ సమస్యను పరిష్కరించడంలో జెర్రీని ప్రేమించిన నిరంజనకు జోస్ తారసపడి, అదే సందర్భంలో తన ఆప్తుడైన జెర్రీని పోగొట్టుకుంటాడు. అలాగే జెర్రీ సమస్య నగరంలో అసామాన్యుడి నుండి సామాన్యుడి వరకు ప్రతి ఒక్కరూ భయపడే వెట్రివేల్ షణ్ముగంతో ముడిపడి ఉంటుంది. దీంతో వెట్రివేల్‌తో టర్బో జోస్ పోరాడవలసి వస్తుంది. అసలు జెర్రీకి వచ్చిన సీరియస్ సమస్య ఏంటి ? జెర్రీ ఎలా చనిపోయాడు? వెట్రివేల్‌ను జోస్ ఎలా ఎదుర్కొన్నాడు? అన్నది మాత్రం సోనీ లివ్ ఓటీటీ తెరమీదే చూడాలి. టర్బో అంటే అదనపు శక్తి అన్నమాట. టైటిల్‌కి తగ్గట్టే సినిమాలో ఎలిమెంట్స్ అన్నీ అదనపు శక్తితో నడుస్తాయి. మమ్ముట్టి మంచి ఈజ్‌తో జోస్ పాత్రను రక్తి కట్టించారు. ఆ తరువాత చెప్పుకోవలసిన పాత్ర రాజ్ బి. శెట్టిది. ఇతనే వెట్రివేల్ షణ్ముగం. ఈ సినిమాలో ప్రతినాయకుడు. విలన్ పాత్రలో రాజ్ బి. శెట్టి చాలా విలక్షణంగా చేశారు. ఈ పాత్రలతో పాటు సినిమా మొత్తం యాక్షన్, కామెడీ సన్నివేశాలతో సీరియస్ కథను సరదా స్క్రీన్‌ప్లేతో తెరకెక్కించిన విధానం అద్భుతం. వీకెండ్‌కి ఓ మంచి సినిమా ఈ 'టర్బో'.

- ఇంటూరి హరికృష్ణ

మాస్... క్లాస్ అని ఆలోచించను

- సంగీత దర్శకుడు మిక్కీ జె. మేయర్



''ఏ సినిమాలో అయినా కథని బట్టే పాటలు ఉంటాయి. ప్రత్యేకించి మాస్, క్లాస్ అని నేను ఆలోచించను. 'మిస్టర్ బచ్చన్'లో మాస్ సాంగ్స్ చేసే చాన్స్ దక్కింది. ఈ పాటలివ్వడం నాకేం షాకింగ్‌గా లేదు. ఎందుకంటే నేను మాస్ సాంగ్స్ చేయగలనని నాకు తెలుసు. 'మిస్టర్ బచ్చన్' సంగీతానికి మంచి స్పందన రావడం చాలా హ్యాపీగా ఉంది'' అని సంగీత దర్శకుడు మిక్కీ జె. మేయర్ అన్నారు. రవితేజ హీరోగా హరీష్ శంకర్ దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్ నిర్మించిన 'మిస్టర్ బచ్చన్' ఈ నెల 15న విడుదలైంది. ఈ సందర్భంగా చిత్ర సంగీత దర్శకుడు మిక్కీ జె. మేయర్ మాట్లాడుతూ- ''నా భార్య, పిల్లలతో కలిసి అమెరికాలో ఉంటాను. డైరెక్టర్స్ కథని ఫోన్‌లో లేదా జూమ్ కాల్స్‌లో వినిపిస్తారు. కథ విని ట్యూన్స్ ఇస్తాను. అయితే నేపథ్య సంగీతం మాత్రం ఇండియాకి వచ్చి చేస్తాను. నేనెప్పుడూ డైరెక్టర్‌తో మ్యూజిక్ సిట్టింగ్స్‌లో కూర్చోలేదు. కానీ, 'మిస్టర్ బచ్చన్' కోసం హరీష్‌గారు సియాటిల్ వచ్చారు. కేవలం నాలుగు రోజుల్లో ఈ సినిమా ట్యూన్స్ పూర్తి చేశాం. నేను అమెరికాలో కాకుండా ఇండియాలో ఉంటే మరిన్ని సినిమాలు చేసే చాన్స్ ఉండేది. కానీ, ఫ్యామిలీకి కూడా ప్రాధాన్యత ఇస్తాను.. అందుకే అమెరికాలో ఉంటున్నాను. ప్రస్తుతం మూడు ప్రాజెక్టులు చర్చల్లో ఉన్నాయి'' అన్నారు.

రేవు కాన్సెప్ట్ బాగుంది - 'దిల్' రాజు



● రాంబాబు, ప్రభు, 'దిల్' రాజు, మురళి

వంశీ రామ్ పెండ్యాల, అజయ్ స్వాతి భీమిరెడ్డి, ఏపూరి హరి ప్రధాన పాత్రల్లో నటించిన సినిమా 'రేవు'. హరినాథ్ పులి దర్శకత్వంలో డా. మురళీ గింజుపల్లి, నవీన్ పారుపల్లి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 23న రిలీజ్ కానుంది. ఈ సినిమా ట్రైలర్ లాంచ్‌కి దర్శకుడు కోదండ రామిరెడ్డి, నిర్మాత 'దిల్' రాజు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ''రేవు' పెద్ద విజయం సాధించాలని కోరుకుంటున్నాను'' అన్నారు కోదండ రామిరెడ్డి. ''ఈ సినిమా కాన్సెప్ట్ బాగుంది. నాకు స్నేహితులైన ప్రభు, రాంబాబులు ఈ సినిమా తీశారు. కాబట్టి నేను ముందుండి నడిపించాలనుకున్నాను. ఇంతవరకు వీళ్లు సినిమాని చూసి రివ్యూ రాశారు. 'రేవు' చూసి నేను రివ్యూ రాస్తా'' అన్నారు 'దిల్' రాజు. ''రేవు'లోని ప్రతి పాత్రతో ప్రేక్షకులు కనెక్ట్ అవుతారు'' అన్నారు మురళి. ఈ చిత్రానికి నిర్మాణ సూపర్‌విజన్‌ని జర్నలిస్ట్ ప్రభు నిర్వర్తించ గా, ఎగ్జిక్యూటివ్ నిర్మాతగా జర్నలిస్ట్ పి. రాంబాబు వ్యవహరించారు.

ఫుల్లుగా నవ్వుతారు

- డైరెక్టర్ లక్ష్మణ్ కార్య



''మారుతినగర్ సుబ్రమణ్యం' సినిమాని సుకుమార్‌గారి వైఫ్ తబితగారికి, మైత్రీ మూవీస్ శశిగారికి ప్రివ్యూ వేశాం. వారికి బాగా నచ్చింది. ఆ తర్వాత సుకుమార్‌గారు చూసి, నాకు ఫోన్ చేసి, 'బాగా తీశావు.. రావు రమేశ్‌గారు అద్భుతంగా చేశారు' అని చెప్పారు. ఆయన మాటలతో సినిమాపై మరింత నమ్మకం పెరిగింది. ఈ సినిమా చూసిన తర్వాత ప్రేక్షకులు ఫుల్లుగా నవ్వుతారు'' అని దర్శకుడు లక్ష్మణ్ కార్య అన్నారు. రావు రమేశ్, ఇంద్రజ జంటగా నటించిన చిత్రం 'మారుతినగర్ సుబ్రమణ్యం'. తబితా సుకుమార్ సమర్పణలో బుజ్జి రాయుడు పెంట్యాల, మోహన్ కార్య నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 23న విడుదల కానుంది. ఈ సందర్భంగా లక్ష్మణ్ కార్య మాట్లాడుతూ- ''ఓంకార్‌గారి 'జీనియస్' షోకి, సినిమాటోగ్రాఫర్ శ్రీకాంత్ నరోజ్ వద్ద అసిస్టెంట్‌గా చేశా. డైరెక్టర్ దేవా కట్టగారి 'ఆటో నగర్ సూర్య' సినిమాకు దర్శకత్వ శాఖలో చేశాను. సుమంత్ అశ్విన్‌తో తీసిన 'ఎందుకిలా' వెబ్ సిరీస్‌తో దర్శకుడినయ్యాను. ఆ తర్వాత ఆయన, నిహారిక జంటగా 'హ్యాపీ వెడ్డింగ్' సినిమా చేశాను. దర్శకుడిగా 'మారుతి నగర్ సుబ్రమణ్యం' నా రెండో సినిమా. టైటిల్ రోల్‌కి రావు రమేశ్‌గారిని తప్ప ఎవర్నీ ఊహించుకోలేదు. అంతలా ఆయన నటన ఉంటుంది. ఆయన భార్య కళామణి పాత్రలో ఇంద్రజగారు బాగా నటించారు. ఇటీవల వచ్చిన సినిమాల్లో బెస్ట్ ఫాదర్ అండ్ సన్ రిలేషన్‌ని ఈ సినిమాలో చూస్తారు'' అని తెలిపారు.

కాలనీలో థ్రిల్




● అరుళ్ నిధి

అరుళ్ నిధి, ప్రియా భవానీ శంకర్ జంటగా నటించిన చిత్రం 'డీమాంటీ కాలనీ 2'. అజయ్ ఆర్. జ్ఞానముత్తు దర్శకత్వంలో విజయ సుబ్రహ్మణ్యన్, ఆర్‌సీ రాజ్‌కుమార్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 15న తమిళంలో రిలీజైంది. ఈ సినిమాని రాజ్ వర్మ ఎంటర్‌టైన్‌మెంట్-శ్రీ బాలాజీ ఫిలింస్ తెలుగులో ఈ నెల 23న విడుదల చేస్తున్నాయి. ''హారర్ థ్రిల్లర్‌గా 'డీమాంటీ కాలనీ 2' చిత్రం రూపొందింది. 'తంగలాన్' వంటి పెద్ద సినిమాతో పాటు విడుదలైన మా 'డీమాంటీ కాలనీ 2' కూడా ప్రేక్షకాదరణ పొందుతోంది. తెలుగులోనూ విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది'' అన్నారు మేకర్స్.

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. **బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు.** కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

వధువు కావలెను



రజక/కట్నం ప్రసక్తిలేదు/M.Tech, IIT/C. Govt. టెక్నికల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్ /DRDO/ 1 Lakh. PM/6' ఎత్తు/29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 9618007652 [HA-16344]

ముదిరాజ్/కట్నం ప్రసక్తిలేదు/M.Sc/Govt. బిల్ కలెక్టర్/మున్సిపల్ Dept/65000/- PM/ 5'11" ఎత్తు/28 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 9618008271 [HA-16344]

బెస్త, గంగపుత్ర, అగ్నికుల క్షత్రియ/ M.Sc Agri/Govt.AO/అగ్రికల్చర్ Dept/ 80,000/-PM/6'ఎత్తు/29 సం॥ల వరునికి వధువు కావలెను. Ph: 9966760501 [HA-16344]

క్రిస్టియన్ మాదిగ / కట్నం ప్రసక్తి లేదు/ B.Tech, IIT/MBA, IIM/ SWE/ 38 Lakhs. PA/6' ఎత్తు/29 సం॥ల అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 6305007091 [HA-16344]

37 సం॥ గల బిజినెస్ చేసే వరునికి 1వ లేదా 2వ సంబంధం వధువు కావలెను. పిల్లలు ఉన్నా పర్వాలేదు. కుల ప్రసక్తి లేదు. నో డౌరీ. Ph: 9866724586, 6301943220 [H-782767]

2వ పెళ్లి /5,00,000 PM/కుల ప్రసక్తి లేదు, కోట్ల ప్రాపర్టీ కల్గిన అబ్బాయికి అందమైన అమ్మాయి కావలెను. మంచి ఫ్యామిలీ నుండి అమ్మాయి కావలెను (Kids లేరు) Ph: 9381696641 [H-796624]

SC మాల/B.Tech/C.Govt. గ్రూప్-II ఆఫీసర్/ACTO / 90,000/-PM / 5'10" ఎత్తు/29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 8341650195 [HA-16345]

రజక/కట్నప్రసక్తి లేదు/ M.Tech / C. Govt. కస్టమ్స్ ఆఫీసర్/80,000/-PM/ 5'10"ఎత్తు/29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 8341650195 [HA-16345]

యాదవ/కట్నప్రసక్తి లేదు / M.Tech (IT)/ Govt. A.E.E./ ఇరిగేషన్ Dept/14 Lakhs. P.A/5'8" ఎత్తు/29 సం॥ల వరుడికి వధువు కావలెను. Ph: 9515755529 [HA-16345]

క్రిస్టియన్ మాల/ కట్నప్రసక్తి లేదు / 28/ 5'9"/ B.Tech/C.Govt. రిసెర్చ్ ఆఫీసర్/ DRDO/1 Lakh. PM/ అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 6309258463 [HA-16345]

వెలమ/ B.Tech, IIT, M.Tech,IIM / C. Govt.సైంటిస్ట్/ ఇస్రో /1,30,000/-PM/ 6'ఎత్తు/29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 8297439565 [HA-16345]

రజక/కట్నం ప్రసక్తిలేదు/B.Tech, సివిల్ ఇంజనీరింగ్/ Asst. గెజిటెడ్ ఆఫీసర్/ 90,000/- PM/ 5'10" ఎత్తు/ 29 సం॥ల వరుడికి వధువు కావలెను. Ph: 7075953400 [HA-16350]

2వ పెళ్లి/ క్రిస్టియన్/కుల ప్రసక్తిలేదు/ B.Tech, సివిల్ ఇంజనీర్/ 1 Lakh PM/ 5'8" ఎత్తు/ 36 సం॥ల పిల్లలు లేని వరుడికి వధువు కావలెను. Ph: 9550650024 [HA-16350]

రెడ్డి: హ్యాండ్సమ్/కట్నప్రసక్తి లేదు/29/ 5'10"/B.Tech, IIT/ సాఫ్ట్ వేర్ ఇంజనీర్/ 3Lakhs pm/కోట్ల ఆస్తి గల వరునికి వధువు కావలెను. Ph: 8367619529 [H-16346]

కుల పట్టింపు లేదు: Age: 35 లోపు విడో డాక్టర్ అమ్మాయి కావాలి. ఆసక్తి కలిగినవారు సంప్రదించండి. డైరెక్ట్ పేరెంట్ ✆ : 9705135074. [Z-1080808]

★

SC/32/5'8"/ BE(EEE) / Govt. Employee / Electricity Dept/ Hyderabad / 2 Lakhs PM వెల్ సెటిల్డ్ వరుడికి తగిన వధువు కావలెను. Ph: 9949919285 [HA-14506]

డైరెక్ట్, కుల పట్టింపులేదు, 48Y, Pvt. జాబ్ & బిజినెస్ చేస్తున్న వరుడికి లేటు, డైవర్సీ, విడో, అత్యున్నత కుటుంబపు వధువు కావలెను. సంప్ర: 9391728497 [HA-16349]

వరుడు కావలెను



రెడ్డి/2nd, కుల, మత, ఆస్తి పట్టింపు లేదు/Q: డిగ్రీ, ఎత్తు5'4", బిజినెస్‌లు గల అందమైన వధువుకి వరుడు కావలెను. 1st/2nd (ఇల్లరికం OK.) అన్ని కులాల వారికి సంబంధాలకై. Ph: 9032596676 [H-796624]

కాపు: 38yr కులపట్టింపు లేదు/ఫెయిర్/ Govt ఎంప్లాయ్ 2,50,000/- (PM), వెల్ సెటిల్డ్ & 3సొంత ఇల్లులు కలిగిన వధువుకి వరుడు కావలెను. (1st, 2nd మ్యారేజ్ & ఇల్లరికం Ok) సంప్ర: 8374802603 [H-796681]

కుల పట్టింపు లేదు: డైవర్సీ 38 yrs Govt ఎంప్లాయ్ 2,00,000/- (PM), వెల్ సెటిల్డ్ బాగా స్థిరపడిన అందమైన వధువుకి తగిన వరుడు కావలెను. (పిల్లలు ఉన్న Ok) సంప్ర: 8332006483 [H-796681]

Reddy: కుల పట్టింపు లేదు/ Age 58yrs/2nd & లేట్ మ్యారేజ్ అయిన ఓకే/ 5'4"/ఫెయిర్ /Govt జాబ్ 95K(PM)/ ప్రాపర్టీస్ కలవు/ No Children/ ఇల్లరికం కావలెను. Ph: 9581120134 [H-796681]

రెడ్డి: 32yr/5'5"/ ఫెయిర్/కులపట్టింపు లేదు/ M.Com/ Govt ఎంప్లాయ్ 50k (PM) వెల్ సెటిల్డ్ బిజినెస్ & సొంత ఇల్లు కలిగిన వధువుకి వరుడు కావలెను. (ఇల్లరికం ఓకె) సంప్ర: 9133672661 [H-796681]

కాపు: 43yr/కులపట్టింపు లేదు/ Govt ఎంప్లాయ్ 70k (PM) వెల్ సెటిల్డ్ ఫ్యామిలీ 4 సొంత ఇల్లులు & బిజినెస్ కలిగిన వధువుకి వరుడు కావలెను. (1st & 2nd మ్యారేజ్ ఓకె ఇల్లరికం ఓకె) సంప్ర: 9640133485 [H-796681]

ద్ధాత్రి మ్యారేజి బ్యూరో

Something Special ద్ధాత్రి మ్యారేజి బ్యూరో All Communities H.O : Vijayawada, B.O. : Hyderabad అన్ని కులముల వారికి వివాహ సంబంధములు అతి త్వరగా కుదర్చబడును. సంబంధములు కుదుర్చుట మా ప్రత్యేకత. రెండవ వివాహ సంబంధములు కూడా కుదుర్చుట మా ప్రత్యేకత. Ph: 96422 15777, 96429 57888

వధువు కావలెను

కమ్మ * 29, 5.10', DM Nephorology, CMC, 200CR, * 30, 5.11' DM Nephorology, ,50CR * 30, 6', MCH, Surgical Ancology, 50CR * 32, 5.10' MCH, Neuro Surgeon 60CR ✆ 96429 57888

పద్మశాలి * 30, 5.8', DM Nephorology, 20 CR, * 32, 6' DM Cardialogy, 50CR * 32, 5.7', MCH, Neuro Surgeon, 30CR * 30, 5.11' MCH, Plastic Surgeon 25CR ✆ 96429 57888

కాపు * 30, 5.9', MDGM 100 CR, * 30, 5.10' MDGM, 10 CR * 30, 5.9', MSGS, 20 CR * 30, 5.6' MD, Dermatology, 30 LPA, 30 CR ✆ 96429 57888

కాపు * 29, 5.7', MCH Surgical Gastro, 50 CR, * 30, 5.9' MDGM, 30 CR * 30, 5.10', MSGS, 25 CR * 31, 5.9' MS Ortho, 20 CR ✆ 96429 57888

రెడ్డి * 31, 6', MCH Surgical Ancology, 100 CR, * 32, 5.11' MDGM, 50 CR * 33, 5.10', MSGS, 40 LPA, 25 CR * 34, 5.10' MD Dermatology, 36 LPA, 15 CR ✆ 96429 57888

కాపు * 30, 5.7', MS, 160KS 15 CR, * 31, 5.9' MS, 160KS 20 CR * 30, 5.8', MS, 140KS, 10CR * 32, 5.10' MS 160KS, 20CR ✆ 96429 57888

రెడ్డి * 30, 5.11', B.Tech, MBA, 45LPA, 30 CR * 31, 5.11' B.Tech, MBA, 45LPA, 25 CR * 30, 5.10', B.Tech, MBA, 40 LPA, 20 CR * 30, 6' B.Tech, MBA, 36 LPA, 20 CR ✆ 96429 57888

SC కొండదొర * 30, 5.11', IIT, KGP, MBA, IIM, CAL, 60 LPA, 20 CR * 31, 5.11' IIT Gowhathi, 72 LPA, 10 CR * 32, 5.9', IIT Mumbai, 50 LPA, 10 CR ✆ 96429 57888

పద్మనాయక వెలమ * 29, 5.11', B.Tech, MBA, 45 LPA, 12 CR * 33, 5.10' B.Tech MBA, 30 LPA, 10 CR * 30, 5.8', B.Tech MBA, 36 LPA, 15 CR * 32, 6', B.Tech MBA, 50 LPA, 20 CR ✆ 96429 57888

కాపు : CNB * 32, 5.9', M.Tech,1 CR PA, 200 CR Property కలిగి బిజినెస్ చేసి ఉన్న అందమైన వరుడికి డాక్టర్ చదివిన అందమైన వధువు కావలెను ✆ 96429 57888

వరుడు కావలెను

కమ్మ * 28, 5.6', MS OBG, IVF, 100 CR, * 30, 5.4' MS OBG, 36 LPA, 50 CR, * 28, 5.7', MS OBG, 40CR, * 27, 5.5' MD RADIALOGY, 50CR ✆ 96422 15777

రెడ్డి * 30, 5.5', MDGM, 30 CR, * 34, 5.6' MS ENT, 35 CR, * 27, 5.2', MSGS, 20CR, * 32, 5.4' MDGM, 10CR ✆ 96422 15777

కాపు * 28, 5.6', MD OBG, 20 CR, * 31, 5.6' MD RADIALOGY, 30 CR, * 29, 5.2', MD, DERMATOLOGY, 15 CR * 27, 5.4' MDGM, 10CR ✆ 96422 15777

కాపు * 30, 5.4', MS OBG, 10 CR, * 30, 5.4' MD PEDIATICS, 20 CR, * 29, 5.3', MS OBG, 15 CR * 33, 5.6' MD RADIALOGY, 25CR ✆ 96422 15777

పద్మశాలి * 28, 5.2', MDGM, 10 CR, * 30, 5.3' MS OBG, 15 CR, * 28, 5.6', MS OBG, IVF, 50 CR * 26, 5.5' MBBS, 15CR ✆ 96422 15777

పద్మనాయక వెలమ * 28, 5.6', MD RADIALOGY, 20 CR, * 29, 5.6' MDGM, * 34, 5.3', MCH, SURGICAL, ANCOLOGY, 50 CR, 45 LPA * 34, 5.7' DM NEUROLOGY, 50LPA, 25CR ✆ 96422 15777

గౌడ * 31, 5.3', MS OBG, 20 CR, * 29, 5.5' MD RADIALOGY, 10 CR, * 32, 5.2', MS PULMONOLOGY, 15 CR * 28, 5.5' MS OBG, 10CR ✆ 96422 15777

కాపు * 28, 5.5', B.Tech, 25 LPA, 10CR, * 30, 5.3' B.Tech, 16 LPA, 5CR, * 30, 5.2', B.Tech, 9LPA, 8CR * 33, 5.5' B.Tech, 12 LPA, 5CR ✆ 96422 15777

రెడ్డి * 32, 5.4', MS, 270KS, 15CR, * 31, 5.6' MS 160KS, 10CR, * 34, 5.6', MS, 200KS 15CR * 32, 5.7' MS 180KS, 10CR ✆ 96422 15777

కమ్మ Divorce : * 29, 5.7', MDGM, 36 LPA, 50CR * 32, 5.5' MD RADIALOGY 36LPA, 60CR * 32, 5.7', MD RADIALOGY, 40LPA, 20CR * 36, 5.4' MS OBG, IVF, 40LPA 30CR ✆ 96422 15777

[B-190510]

రెండో పెళ్ళి/విడో/50y/Fair/ వైజాగ్/ కాలేజీ జాబ్/వెల్ సెటిల్ పిల్లలు లేని ఏ బాదరబందీలేని అందమైన ఏకైక వధువుకు FC/BC వరుడు కావలెను. Ph: 8519803423 [H-782767]

కుల, ఆస్తి పట్టింపు లేదు/విడో/45y/DMHO / మంచి జీతం/Own Hospitals/ సొంత విల్లా/18 ఎ॥ ల్యాండ్స్/కోట్ల ప్రాపర్టీ గల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9573960642 [H-782767]

రెడ్డి/2nd, విడో (కుల/మత/ఆస్తి) ప్రసక్తి లేదు/ 30Y/ డిగ్రీ/సొంత ఇల్లు & ప్రాపర్టీలు/వెల్ సెటిల్డ్ అందమైన వధువుకి 1వ/2వ వరుడు కా. ఇల్లరికం OK. అన్ని వయస్సుల వారి సంబంధాలకై. 9392332143 [H-796624]

2వ పెళ్లి /Govt.Emp/3,00,000PM/బాగా స్థిరపడిన కోట్ల ప్రాపర్టీ కల్గిన అందమైన వధువుకి అందమైన అబ్బాయి కావలెను. కుల ప్రసక్తి లేదు. Kids ఉన్నా OK. Ph: 9381696641 [H-796624]

అవినాష్ రెడ్డి మ్యారేజెస్ (D.V. కోటి రెడ్డి)

రెడ్డిలకు మాత్రమే. D.V. కోటిరెడ్డి, 690, Road No:-3, Banjara Hills (TV-9, Opp: Colony) (IOC Petrol Bunk Side Road) Hyd. +91 9848011818 / +91 9393311818 (Tuesday Holiday) Timings : 10 am - 6 pm. www.avinashreddy.com, e-mail: avinash11818@gmail.com

వధువు కావలెను

రెడ్డి Business, BE, 26, 6' 1", Very Rich Family, Hyderabad, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MBA, 30, 5' 8", Analyst, 61 L P/A, Hyderabad, Handsome. Avinash Reddy Marriages, 690, Road No. 3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 24, 5' 7", SWE, 30 Crores, USA, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Business, MBA, 29, 5' 11", Hyderabad, Handsome, Rich. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

వరుడు కావలెను

రెడ్డి Citizen, BS, MS, 28, 5' 2", 100 Crores, USA, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MBA, 25, 5' 5", Wipro, 25 Crores, Hyderabad, Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE (NIT), MS, 26, 5' 6", SWE, Amazon, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MBA (IIM), 27, 5' 7", Sr. Associate, 30 L P/A, Hyd, Fair & Slim Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.



రెడ్డి BE, ME, MS, 27, 5' 10", Developer, H1, USA, Rich. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Business, BE, 28, 6' 1", Hyderabad, Very Rich Family. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, MBA (IIM), MD, 27, 5' 7", PG Doctor, 30 Crores, Hyd. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 28, 5' 9", SWE, Apple, 50 Crores, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE (NIT), MBA, 27, 5' 5", L & T, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 26, 5' 5", SWE, 126 K, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, MD, 25, 5' 5", PG Doctor, 25 Crores, Hyderabad. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, 24, 5' 4", SWE, 11 L P/A, Hyderabad, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

LETTER

వడ్డెర/50 లక్షల ఆస్తి/M.Sc/ C.Govt. Jr.అకౌంటెంట్/48000/-PM/5'5" ఎత్తు /25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9618008271 [HA-16344]

హిందూ మాదిగ/50 లక్షల ఆస్తి/ B.Tech / Govt. Asst. ఇంజినీర్ / ఇరిగేషన్ Dept/ 75000/-PM / 5'4"ఎత్తు/25సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 6305007091 [HA-16344]

యాదవ/ఏకైక కుమార్తె/M.Tech/C.Govt. డిజైన్ & వెరిఫికేషన్ ఇంజినీర్/VLSI ఇస్రో/8 Lakhs.PA/5'6"ఎత్తు/26 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9966760501 [HA-16344]

పద్మశాలి/CA/చార్టెడ్ అకౌంటెంట్/9 Lakhs PA/5'5"ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు తగిన వరుడు కావలెను. Ph: 8297439565 [HA-16344]

గౌడ/1 కోటి ఆస్తి /M.Sc / Govt. Jr. Asst./రెవెన్యూ Dept./45000/-PM/ 5'5" ఎత్తు/24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. 9550572571 [HA-16344]

విశ్వబ్రాహ్మణ/ఏకైక కుమార్తె/B.Tech/ C.Govt. P.O/SBI బ్యాంక్/50,000/-PM/ 5'4"ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9618007652 [HA-16344]

SC మాల & క్రిస్టియన్/M.Tech (EEE)/ C.Govt. డిప్యూటీ మేనేజర్/ 65000/-PM/ 5'4"ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9676995093 [HA-16345]

వడ్డెర/B.Tech/C.Govt.Asst.మేనేజర్ /ఆంధ్రాబ్యాంక్/60,000/-PM/5'4" ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 8341650195 [HA-16345]

రజక/B.Tech/C.Govt.బ్యాంక్ క్యాషియర్ / ఇండియన్ బ్యాంక్/ 32,000/-PM/5'4" ఎత్తు /24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9515942275 [HA-16345]

మాదిగ/B.Tech/C.Govt.స్టెనోగ్రాఫర్/ రైల్వే / 42000/-PM / 5'4"ఎత్తు/24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 8985557129 [HA-16345]

క్రిస్టియన్ మాల/25/5'4"/B.Tech/ C. Govt.Asst. మేనేజర్/కెనరా బ్యాంక్ / 60,000/-PM / అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 6309258463 [HA-16345]

కమ్మనాయుడు/ విడో/ 50Y/ ప్రభుత్వ జాబ్/సొంత ఇల్లు గల వెల్ సెటిల్డ్ వధువుకు కుల ప్రసక్తి లేని వరుడు కావలెను. Ph: 9705889182 [H-796337]

నాయుడు/50Y/విడో / 5'4"/ Govt.Job/ 80K/ PM/2 సొంత ఇల్లులు/Rents: 1L/ PM/ పిల్లలులేని వధువుకి వరుడు కావలెను. కుల ప్రసక్తి లేదు. Ph: 7702278724 [H-796337]

వైశ్య/45Y/విడో/5'5"/V.Fair/Govt.Teacher సొంత ఇల్లు & రెంట్స్/28 ఎకరాల మాగాణి/ బిజినెస్/3L/PM ఏ బాదరబందీలేని వధువుకి వరుడు కావలెను. కుల, ఆస్తి ప్రసక్తి లేదు. Ph: 9492718486 [H-796337]

FC/విడో/Degree / State Government Job/ 5'3"/ Fair/ ఆంధ్రాలో తోటలు గల వధువుకి మధ్య తరగతి వరుడు కావలెను. Ph: 9391272485 [H-796337]

రెడ్డి, Kaapu/విడో/48/49y/Nelloreలో సొంత ఫ్లాట్లు/Hyd లో సొంత బిజినెస్, రెంట్స్/మంచి ఆస్తి గల వధువుకి కుల, ఆస్తి ప్రసక్తి లేని వరుడు కావలెను (అర్జెంట్) (ఇల్లరికం OK) (నో బ్రోకర్స్) 7799083500, 7386660643 [H-796624]

యాదవ/ఎర్రకాఖ/అప్పర్ మిడిల్ క్లాస్/ 37Y/ 5'4"ఎత్తు/M.ఫార్మసీ వధువుకి Hydలో జాబ్ కలిగిన లక్ష రూ॥PM ఆపై ఆదాయం కలిగిన యాదవ వరుడు మాత్రమే కావలెను. డైరెక్ట్ Father నెంబర్: 9989597799 [H-796337]

ఆస్తి, కుల పట్టింపులేదు, రెడ్డి, విడో, 35y/ 5'3"/ డిగ్రీ/ 3 కోట్ల ప్రాపర్టీ కలిగి పిల్లలు లేని వధువుకు వరుడు కావలెను. మీ ఫోటోలు వాట్సప్‌లో సెండ్ చేయండి. Ph: 9133640971 [HA-16350]

యాదవ/ CA / Govt. అకౌంటెంట్/ 40,000/- pm/ 5'4" ఎత్తు/ 25 సం॥ల అందమైన వధువుకు తగిన వరుడు కావలెను. Ph: 7075953400 [HA-16350]

వాల్మీకి బోయ: మొదటి పెళ్లి/గుడ్ లుకింగ్/ 37/5'3"/ డిగ్రీ గుడ్ జాబ్. వెల్ సెటిల్ ఫ్యామిలీ గల వధువుకి వరుడు కావలెను. మొదటి లేదా రెండవ పెళ్లి అయినా ఓకే. Ph: 8367619529 [H-16346]

ముదిరాజ్: చాలా అందమైన/ 27/5'4"/ M.Tech/ సాఫ్ట్ వేర్ ఇంజనీర్/ వెల్ సెటిల్డ్ వధువుకి వరుడు కావలెను. Ph: 8367619529 [H-16346]

కాపు: కుల పట్టింపు లేదు/ అందమైన/ 27/5'5"/B.Tech/ సాఫ్ట్ వేర్ ఇంజనీర్/ కోట్ల ఆస్తి/ గుడ్ ఫ్యామిలీ గల వధువుకి వరుడు కావలెను. US అయినా OK Ph: 8367619529 [H-16346]

కుల పట్టింపు లేదు: 2వ పెళ్ళి/గుడ్ లుకింగ్ /పిల్లలు లేరు/40/5'4"/ డిగ్రీ/ గుడ్ ఫ్యామిలీ/ వెల్ సెటిల్డ్ వధువుకి వరుడు కావలెను. పిల్లలు ఉన్నా ఓకె. Ph: 8367619529 [H-16346]

బ్రాహ్మణ/ 24/5'3"/ B.Sc *27/5'4" / MBA *30/ 5'3"/B.Sc*27/5'2"/ఇంటర్/32/5'2"/ఇంటర్ వధువులకు వరులు కావలెను. జాబ్/బిజినెస్/ పురోహితులకు త్వరగా కుదర్చబడును. Ph: 7842635086 [HA-16313]

కమ్మ, క్రిస్టియన్, B.Tech, 24Y, 5'.4", VJA లో 2 ఇళ్ళు, 1 సైట్ ఉన్న ఓన్లీ డాటర్‌కు ఎలాంటి వ్యసనాలు లేని Govt. గెజిటెడ్ ఎంప్లాయి కమ్మ క్రిస్టియన్ వరుడు కావలెను. ✆ 63098 77141 [B-190539]

వేదికలు



కావ్య మ్యారేజ్ లింక్స్! 1వ, 2వ లేట్ మ్యారేజెస్, డైవర్సీ, విడోస్, విడోయర్స్, పెన్షనర్లకు అన్ని కులాల వారికి ఫాస్ట్ సెటిల్‌మెంట్ స్త్రీలకు ఫ్రీ. Ph: 7702526428 [H-782767]

V.F మ్యారేజ్ బ్యూరో : ఓన్లీ దూదేకుల ముస్లీం (నూర్ బాషా) 1వ, సాఫ్ట్‌వేర్, డాక్టర్స్, సెంట్రల్ బ్యాంకింగ్, Govt.C.Govt. రేట్, విదేశాలలో జాబ్ చేయు 25 సం॥ -35 సం॥ వయస్సు గల వధూవరుల సంబంధాలకై సంప్ర : 9948820402, 9640999003 [H-782767]

మాల మాదిగ స్పెషల్ IAS, IPS, IFS, IRS, గ్రూప్-I, II, PG, డాక్టర్స్, బ్యాంక్ PO, Govt. ఆఫీసర్స్, USA, UK. Ph:7396915712 [HA-16350]

శుభమస్తు మ్యారేజ్ బ్యూరో TM Est : 1995, గౌడ, ఈడిగ, శెట్టి బలిజ, 1st/ 2nd లేట్/విడో సంబంధాలకై సం॥ S.రాములు గౌడ్, లింగాల కాంప్లెక్స్, DSNR, Hyd. వ్యవస్థాపకులు: స్వర్గీయ S.శారదాగౌడ్, Ph: 8790690809 [H-796337]

మాల, మాదిగ, హిందూ, క్రిస్టియన్/ Govt. సాఫ్ట్‌వేర్ /గెజిటెడ్/MBBS/PG/ NRI/PVT/ బిజినెస్/1వ/2వ/లేట్/ AP/ TS/ 15 సం॥ Exp. Ph: 8790555273 [HA-32610]

ధ్రువ మ్యారేజెస్. అన్ని కులాల వారికి 1వ, 2వ, లేటు, విడో, డైవర్సీ వారికి తగిన సంబంధాలు చూపబడును. Age: 18-70 సం.లు. Ph: 7702955854 [HA-15785]

Doctors, Software, NRI, Rich Persons కు Late Matches కు, అన్ని ప్రాంతాల వార్కి వ్యక్తిగత శ్రద్ధతో Fast గా సెటిల్‌మెంట్ చేయబడును. పూర్ణమ్యాట్రిమోని, తిరుపతి ✆ 7093722724 [T-2957]

పెళ్లి ప్రయత్నాలు చేస్తున్నారా! Software, డాక్టర్స్, NRI, Govt., అన్ని ప్రాంతాల వార్కి ప్రత్యేక శ్రద్ధతో పెళ్లి సంబంధాలు చూడబడును. పూర్ణమ్యాట్రిమోని, తిరుపతి ✆ 7093722724 [T-3486]

★

Free Registration బ్రాహ్మణ మరియు అన్ని కులాల SWE, Govt. Doctors, MNC Matches, Late & 2nd Matches కై సంప్రదించండి. 9704656103, 9494809254 (Whatsapp) [HA-986]

చెన్నై వీఐటీలో స్నాతకోత్సవం

సాక్షి, హైదరాబాద్: వెల్లూరు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (వీఐటీ) చెన్నైలో శనివారం స్నాతకోత్సవం, నూతన భవనాల ప్రారంభం వీఐటీ వ్యవస్థాపకుడు, చాన్స్‌లర్ జీ.విశ్వనాథన్ చేతుల మీదుగా జరిగింది. వీఐటీ వీసీ కంచన భాస్కరన్ ప్రారంభోపన్యాసం చేశారు. ఈ స్నాత కోత్సవంలో 3 వేల మంది విద్యార్థులు గ్రాడ్యుయేట్లు పొందగా.. 38 మంది గోల్డ్ మెడల్స్ సాధించారు. ఈ సందర్భంగా చాన్స్‌లర్ విశ్వనాథన్ మాట్లాడుతూ 145 కోట్ల దేశ జనాభాలో 10 శాతం మంది జనాభా మాత్రమే డిగ్రీ పొందుతున్నారన్నారు. ఉపాధి అవకాశాలు పెరగాలంటే వ్యవసాయం, తయారీ రంగాల్లో నైపుణ్య శిక్షణపెంపొందించాల్సిన అవసరముందని చెప్పారు. వీఐ టీకి గతేడాది 947 కంపెనీలు క్యాంపస్ సెలక్షన్స్ కోసం వచ్చినట్లు తెలిపారు. వీఐటీ వైస్ ప్రెసిడెంట్స్ శంకర్ విశ్వనాథన్, శేఖర్ విశ్వనాథన్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంధ్య పెంటరెడ్డి, అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ కాదంబరి విశ్వనాథన్, వీఐటీ చెన్నై ప్రో వీసీ త్యాగరాజన్, చాన్స్‌లర్ సలహాదారు ఎస్పీ త్యాగ రాజన్ పాల్గొన్నారు.

జీఆర్‌టీ జ్యువెల్లర్స్ రూ.1.5 కోట్ల స్కాలర్‌షిప్స్

సాక్షి, హైదరాబాద్: ప్రముఖ ఆభరణాల సంస్థ జీఆర్‌టీ జ్యువెల్లర్స్ ఎండోమెంట్ ద్వారా స్కాలర్‌షిప్‌లను పంపిణీ చేస్తూ విద్య పట్ల దాని సామాజిక బాధ్యతను చాటుతోంది. ఈ ఏడాది విద్యా స్కాలర్‌షిప్‌ల కోసం రూ.1.50 కోట్ల బడ్జెట్‌ను కేటాయించినట్లు ఒక ప్రకటనలో తెలిపింది. కాలేజీల్లో చదువుతున్న అర్హులైన విద్యార్థులకు ఇప్పటికే మొదటి దశలో రూ.80.96 లక్షలు అందించినట్లు వెల్లడించింది. చెన్నైలోని అశోక్‌నగర్‌లో జీఆర్‌టీ మహాలక్ష్మి విద్యాలయంలో స్కాలర్‌షిప్ అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను సత్కరించింది. ఆ సంస్థ ప్రతినిధి మాట్లాడుతూ 'విద్య పురోగతికి నాంది. జీఆర్‌టీ జ్యువెల్లర్స్ ప్రతిభా వంతులైన విద్యార్థుల జీవితాల్లో అర్థవంతమైన మార్పును తీసుకురావడంలో మద్దతు అందించడం గర్వంగా ఉందన్నారు.

సీతారాం ఏచూరి, డి.రాజాకు శాంతి అవార్డులు

సాక్షి, న్యూఢిల్లీ: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, మాజీ ఎమ్మెల్సీ యాదవరెడ్డిలకు అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం (ఏఐపీఎస్‌వో) శాంతి అవార్డులు అందజేసింది. వరల్డ్ పీస్ కౌన్సిల్ (డబ్ల్యూపీసీ) 75వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని కమ్యూనిస్ట్ నేత రమేశ్ చంద్ర పేరు మీద వారికి ఈ అవార్డులు అందజేసినట్లు డబ్ల్యూపీసీ అధ్యక్షుడు పి.గుప్తా, దిడ్డి సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు.

పెట్టుబడులు రాత్రికి రాత్రే వచ్చి పడవ్

- ఎంవోయూలపై నిరంతరం శ్రమించాలి
- వేలకోట్ల పెట్టుబడులు వస్తాయని అమెరికా, దక్షిణ కొరియా వెళ్లలేదు
- ప్రభుత్వ ఆలోచనలు, లక్ష్యాలను దిగ్గజ కంపెనీలకు వివరించాం
- మంత్రి శ్రీధర్‌బాబు వ్యాఖ్యలు



మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు చిత్రంలో జయేశ్ రంజన్

సాక్షి, హైదరాబాద్: విదేశాల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, తాను, తమ అధికారులు చేసుకున్న అవగాహన ఒప్పందాల (ఎంవోయూ)తో రాత్రికి రాత్రే వేలకోట్ల పెట్టుబడులు వచ్చిపడవని పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. ఆ ఎంవోయూలపై నిరంతరం శ్రమిస్తేనే అవి పెట్టుబడుల రూపంలో వస్తాయని, లక్షలాది మందికి ఉపాధి లభిస్తుందని స్పష్టం చేశారు. అయినా వేలకోట్ల పెట్టుబడులు వస్తాయని తాము అమెరికా, దక్షిణ కొరియా వెళ్లలేదని వ్యాఖ్యానించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆలోచనలు, లక్ష్యాలను ప్రముఖ పరిశ్రమల యాజమాన్యాలతో పంచుకున్నామని తెలిపారు. పలు కంపెనీలు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చాయని చెప్పారు. శనివారం సచివాలయంలో పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, సీఎంవో అధికారి శ్రీనివాస్, ప్రజా సంబంధాల కమిషనర్ హనుమంతరావుతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు.

ఫ్యూచర్ స్టేట్‌గా తెలంగాణ

అభివృద్ధిలో రాష్ట్రాన్ని మొదటి స్థానంలో నిలపడమే లక్ష్యంగా తమ పర్యటన సాగిందని శ్రీధర్‌బాబు చెప్పారు. తెలంగాణను ఫ్యూచర్ స్టేట్ (భవిష్యత్ రాష్ట్రం)గా దిగ్గజ కంపెనీల ముందు ఆవిష్కరించామన్నారు. పలు సంస్థలు అంతర్జాతీయ సామర్థ్య కేంద్రాలు (జీసీసీ) ఏర్పాటు చేయడానికి ముందుకు వచ్చాయని, 11 రోజుల పర్యటనలో మొత్తం 19 ఒప్పందాలు, 50 మందితో వ్యాపార సమావేశాలు జరిపామని తెలిపారు. మొత్తం రూ. 31,500 కోట్ల పెట్టుబడులతో 30,750 మందికి ఉపాధి కల్పించడానికి ఆయా సంస్థలు అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నాయన్నారు. వీటిల్లో ముఖ్యంగా కాగ్నిజెంట్, చార్లెస్ స్క్వాబ్, ఆర్సీయం ఆర్, ట్రైనెట్, ట్రిజిన్, కార్నింగ్, ఆమ్‌జెన్, జోయ్‌టిస్, థెర్మో ఫిషర్ సైంటిఫిక్, మోనార్క్ ట్రాక్టర్స్, స్వచ్ఛ్‌బయో, వాల్ష్ కర్ర హోల్డింగ్స్ లాంటి సంస్థలు ఉన్నాయని వెల్లడించారు. ఇవి కాకుండా హ్యుందాయ్ మోటార్స్ ఆర్ అండ్ డీ కేంద్రం ఏర్పాటు చేస్తోందని, దుస్తులు, ఫ్యాషన్, కాస్మోటిక్స్ సంస్థలు కూడా పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వచ్చాయని తెలిపారు. గతంలో దావోస్‌లో రూ.40,230 కోట్ల పెట్టుబడులకు తమ ప్రభుత్వం ఎంవోయూలు కుదుర్చుకుందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత ఇటీవలి కాలం వరకు ముఖ్యమంత్రి స్థాయిలో పెట్టుబడులను ఆహ్వానించడానికి, ప్రభుత్వ ఆలోచనలు పంచుకోవడానికి ఎలాంటి ప్రయత్నం జరగలేదనే అభిప్రాయం ప్రవాస భారతీయులు, పలు పరిశ్రమల యజమానుల్లో వ్యక్తమైందని మంత్రి చెప్పారు.

సీఎం సోదరుడు అయితే ఒప్పందం కుదుర్చుకోకూడదా?

సీఎం సోదరుడి కంపెనీతో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నంత మాత్రాన వారికి రాయితీల కల్పన, భూముల ధారాదత్తం లాంటివి చేయలేదు కదా అని శ్రీధర్‌బాబు అన్నారు. 30 సంవత్సరాలుగా అమెరికాలో ఉండి కొత్త సాంకేతిక పరిజ్ఞానంతో పరిశ్రమ పెట్టడానికి వస్తామంటే ఎందుకు వద్దనాలని ప్రశ్నించారు. ప్రతిపక్ష నాయకుల బంధువులు పెట్టుబడులు పెడతామన్నా తాము స్వాగతిస్తామన్నారు. గత ప్రభుత్వం కుదుర్చుకున్న అవగాహన ఒప్పందాల్లో కేవలం 30 నుంచి 35 శాతం పరిశ్రమలు మాత్రమే ఏర్పాటయ్యాయని, వారు పాస్ అయ్యారో, ఫెయిల్ అయ్యారో ప్రజలే చెప్పాలని అన్నారు. తాము మాత్రం సంవత్సర కాలంలో ఈ ఎంవోయూలను పెట్టుబడుల రూపంలోకి మార్చడానికి ప్రయత్నిస్తామని చెప్పారు. త్వరలోనే తమ ప్రభుత్వం కొత్త పారిశ్రామిక పాలసీ తీసుకుని వస్తుందని తెలిపారు.

'పోడు' సమస్యకు శాశ్వత పరిష్కారం కనుక్కోవాలి

- రాష్ట్ర అటవీ, పర్యావరణశాఖ మంత్రి కొండా సురేఖ
- పెండింగ్ పోడు దరఖాస్తులు క్లియర్ చేసేలా విధివిధానాల ఖరారు



వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రులు సీతక్క, సురేఖ

సాక్షి, హైదరాబాద్ : పోడు భూములపై సమగ్ర అధ్యయనం చేసి ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని రాష్ట్ర అటవీ, పర్యావరణశాఖ మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. సమస్యకు ముగింపు పలికేలా మార్గదర్శకాలు రూపొందించాలని, వీటికి ఆమోదం లభించేలా కార్యాచరణ ప్రణాళిక ఉండాలన్నారు.ఆదర్శవంతమైన విధివిధానాలు రూపొందించిన తర్వాత సీఎం రేవంత్‌రెడ్డితో సమావేశమవుతామని చెప్పారు. శనివారం సచివాలయంలో మరో మంత్రి సీతక్కతో కలిసిపోడు భూముల సమస్యలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. పెండింగ్ పోడు దరఖాస్తులు క్లియర్ చేసేలా విధివిధానాలు ఖ రారు చేశారు. కలెక్టర్ నేతృత్వంలో అటవీ, గిరిజన శాఖలు స్థానిక ప్రజల తో అటవీ హక్కుల కమిటీలను (ఎఫ్ఆర్‌సీ) ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ కమిటీల ద్వారా పెండింగ్ దరఖాస్తులను క్లియర్ చేస్తారు. కమిటీల సిఫార్సులకు అనుగుణంగా కొత్తగా పోడు పట్టాలు మంజూరు చేయనున్నట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడు తూ పోడు భూములు ఎన్ని ఎకరాల్లో విస్తరించి ఉన్నాయి? ఎంతమందికి పట్టాలిచ్చారు? వీటిని పొందిన వారిలో అనర్హులెవరైనా ఉన్నారా ? స్వీకరించిన దరఖాస్తులు ఎన్ని? అన్న దానిపై ఆయా జిల్లాల కలెక్టర్లు సునిశిత పరిశీలన చేపట్టి నివేదిక రూపొందించాలన్నారు. పోడు భూముల హక్కుల కోసం వచ్చిన ప్రతి దరఖాస్తు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని మంత్రి సూ చించారు.

20న క్రెడాయ్ స్టేట్‌కాన్ : మురళీకృష్ణారెడ్డి

- 'తెలంగాణ గోయింగ్ గ్లోబల్' థీమ్‌పై సదస్సు



సమావేశంలో మురళీకృష్ణారెడ్డి తదితరులు

సాక్షి, హైదరాబాద్: 'తెలంగాణ గోయింగ్ గ్లోబల్'థీమ్ తో ఈనెల 20న మాదాపూర్ హెచ్ఐసీసీలోని నోవాటెల్‌లో భారత స్థిరాస్తి డెవలపర్ల సమాఖ్య (క్రెడాయ్) స్టేట్ కాన్ జరగనుంది. రాష్ట్రంలో కొత్త ప్రాంతాల్లో అభివృద్ధి, అవకాశాలపై ఈ సదస్సులో చర్చించనున్నారు. ఈమేరకు ఆయా వివరాలను నగరంలోని ఓ హోటల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో క్రెడాయ్ తెలంగాణ చైర్మన్ మురళీ కృష్ణారెడ్డి వెల్లడించారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న అవకాశాలను వివరించడం, స్థిరాస్తి రంగ వృద్ధికి అవసరమైన బ్లూప్రింట్ ను రూపొందించడం, యువతలో నైపుణ్యాన్ని పెంపొందించే రోడ్‌మ్యాప్ ను అభివృద్ధి చేయడం, పర్యావరణ అనుకూల అభివృద్ధి, సవాళ్ల తదితర అంశాలపై సదస్సులో చర్చించనున్నట్లు తెలిపారు. ఈ సదస్సుకు సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యే అవకాశం ఉందని చెప్పారు. రాష్ట్రంలోని 900లకు పైగా డెవలపర్లు పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ ప్రేమ్‌సాగర్‌రెడ్డి, ప్రెసిడెంట్-ఎలెక్ట్ ఇంద్రసేనారెడ్డి, సెక్రటరీ అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

లాకప్ హింసలకు పాల్పడే వారిపై చర్యలు తీసుకోవాలి: జస్టిస్ చంద్రకుమార్



సుందరయ్య విజ్ఞానకేంద్రంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న జస్టిస్ చంద్రకుమార్

సుందరయ్య విజ్ఞానకేంద్రం(హైదరాబాద్): అకారణంగా ఎస్సీ, ఎస్టీలపై లాకప్ హింసలకు పాల్పడుతున్న పోలీసులపై చర్యలు తీసుకోవాలని జస్టిస్ చంద్రకుమార్ డిమాండ్ చేశారు. దొంగతనాల నెపంతో ఎస్సీ, ఎస్టీ మహిళలు, వారి పిల్లలపై హింసకు పాల్పడడం హేయమైన చర్య అన్నారు. శనివారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో డీబీఎఫ్, డీఎల్ఎఫ్‌ల ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా చంద్రకుమార్ మాట్లాడుతూ ఇటీవల ఎస్సీ మహిళలపై జరిగిన హింసపై సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. డీబీఎఫ్ జాతీయకార్యదర్శి శంకర్ మాట్లాడుతూ దళిత, గిరిజనులపై లాకప్ హింసలకు పాల్పడిన రామడుగు, బషీరాబాద్ పోలీసులపై కేసులు నమోదు చేయాలని, షాద్‌నగర్ సంఘటనలో పోలీసులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి టి.స్కైలాబ్‌బాబు, డీఎల్ఎఫ్ నేత మార్వాడి సుదర్శన్, ప్రొఫెసర్ లక్ష్మణ్, బాలయ్య, కల్పన, శివలింగం ప్రసంగించారు.

సాక్షి ఫొటో జర్నలిస్ట్‌కు జాతీయ అవార్డులు



ఆంధ్రప్రదేశ్ ఫొటో జర్నలిస్ట్స్ అసోసియేషన్ అవార్డు పొందిన చిత్రం

నల్లగొండ టూటౌన్: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన జాతీయ స్థాయి పోటీ లలో సాక్షి సీనియర్ ఫొటో జర్నలిస్ట్ కంది భజ రంగ్‌ప్రసాద్ 2 అవార్డులను గెలు పొందారు. ఆంధ్రప్ర దేశ్ ఫొటో జర్నలిస్ట్స్ అసో సియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ ఫొటో పోటీల్లో గెలుపొందారు. చీరాల కెమెరా క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ ఫొటో పోటీల్లో మరో అవార్డును గెలుపొందారు. ఈ అవార్డులను ప్రపంచ ఫొ టోగ్రఫీ డే వేడుకల సందర్భంగా అందుకుంటారు.

ప్రముఖ గాయని పి.సుశీలకు అస్వస్థత



తమిళ సినిమా: ప్రఖ్యాత గాయని పి.సుశీల శనివారం అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఆమెను చెన్నై మైలాపూర్‌లోని కావేరి ఆస్పత్రిలో చేర్చారు. ఆమె పరిస్థితి విషమంగా ఉందనే వార్తలు వెలువడుతున్నాయి. పి.సుశీల కడుపునొప్పి కారణంగా ఆస్పత్రిలో చేరారని ఆస్పత్రి వైద్యసిబ్బంది తెలిపారు. అది సాధారణ కడుపునొప్పేనని, ఆమె ఆరోగ్యంగానే ఉన్నారని పేర్కొన్నారు. పి.సుశీల ఆరోగ్య విషయమై సినీవర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

మంత్రిగా ఎదిగినా కించపరుస్తూనే ఉన్నారు

మంత్రి సీతక్క ఆవేదన

సాక్షి, హైదరాబాద్: తన వ్యక్తిత్వాన్ని కించపరుస్తూ కొందరు సామాజిక మాధ్యమాల్లో వేధింపులకు గురిచేస్తున్నా.. వాటిని పట్టించుకోకుండా సమ సమాజం కోసం ప్రయత్నాలు కొనసాగిస్తూనే ఉంటానని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. శనివారం జరిగిన ఓ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పేదరికం నుంచి వచ్చిన తాను స్వయంకృషితో మంత్రి పదవిని చేపట్టినా కూడా తనను కించపరుస్తూనే ఉన్నారని ఆవేదన వ్యక్తంచేశారు. మహిళలంటే కొందరికి చిన్న చూపు అని, అందులో భాగంగానే తనను వేధిస్తూనే ఉన్నారన్నారు. వాటిని పట్టించుకుంటే ముందడుగు వేయలేమని, అందుకే అలాంటివాటికి దూరంగా ఉంటూ ధైర్యంగా ముందుకు సాగుతున్నానని సీతక్క చెప్పారు. సోషల్ మీడియాలో మంత్రి సీతక్క, రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారదకు వేధింపులు కొనసాగుతున్నాయి. వీరిద్దరినీ టార్గెట్ చేస్తూ అసభ్య పదజాలంతో దూషణలు, అభ్యంతరకర వ్యాఖ్యలు కొనసాగడంపై మహిళా సంఘాలు, పౌర సమాజం ఆగ్రహం వ్యక్తంచేశాయి. అసభ్యకరంగా దూషిస్తున్న ట్రోలర్స్‌పై సీసీఎస్‌లో పౌర సమాజ ప్రతినిధులు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన పోలీసులు కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు.

'లా' పరీక్ష రాసిన సీతక్క



ఎల్‌ఎల్‌ఎం పరీక్ష రాసి బయటకు వస్తున్న సీతక్క

ఉస్మానియా యూనివర్సిటీ (హైదరాబాద్): మంత్రి సీతక్క ఎల్‌ఎల్‌ఎం ఫైనల్ ఇయర్ పరీక్ష శనివారం రాశారు. రెండేళ్ల కిందట ఎల్‌ఎల్‌ఎం కోర్సులో ప్రవేశం పొందిన సీతక్క గత అసెంబ్లీ ఎన్నికల కారణంగా చివరి సంవత్సరం పరీక్షలకు హాజరు కాలేకపోయారు. పొలిటికల్ సైన్స్‌లో పీహెచ్‌డీ చేసిన ఆమె ఎల్‌ఎల్‌ఎం పూర్తి చేయాలనే పట్టుదలతో ఉన్నారు. రాజకీయాల్లో బిజీగా ఉన్నా ఉన్నత చదువులపై ఆమెకు శ్రద్ధ తగ్గలేదు.

వారి సేవలు అమోఘం

'సాక్షి' కథనాన్ని 'ఎక్స్'లో పోస్ట్ చేసిన సజ్జనార్



ఖమ్మం మయూరిసెంటర్: తలసేమియా చిన్నారుల కోసం కార్యక్రమాలు చేపడుతున్న సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ వివరాలతో 'సాక్షి' ప్రధాన సంచికలో శనివారం ప్రచురితమైన కథనాన్ని ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. ఖమ్మంలో ఆర్టీసీ కండక్టర్‌గా పని చేస్తున్న అనిత, పోలీసు కమిషనర్ కార్యాలయం హోంగార్డుగా పనిచేస్తున్న రవిచందర్ దంపతులు తలసేమియా చిన్నారులకు సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా సేవలందిస్తున్నారు. ఈ అంశంపై 'బతుకు బండికి భరోసా' శీర్షికన ఫ్యామిలీ పేజీలో కథనం ప్రచురితమైంది. దానిపై 'ఖమ్మంలో తలసేమియా చిన్నారులకు అండగా నిలుస్తున్న ఈ దంపతుల సేవలు అమోఘం. ఒక వైపు తమ ఉద్యోగాలు చేస్తూనే మరోవైపు సామాజిక బాధ్యతగా ఆపదలో ఉన్న వారికి వీరు ఆపన్నహస్తం అందించడం స్ఫూర్తిదాయకం' అని పేర్కొన్నారు.

చెరువులో నీరు లేక.. పొలాల్లో నెర్రెలు



నీరులేక నెర్రెలు బారిన పొలం



వర్షాలు లేక నాట్లు వేయని పొలం

చెన్నారావుపేట: సాగుకు రైతులు సన్నద్ధమై నార్లు పోశారు. తేలికపాటి వర్షాలు పడటంతో నాట్లు వేశారు. అయితే చెరువు నిండక ఆ పొలాలు ఎండిపోతున్నాయి. వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండల కేంద్రంలోని కోపాకుల చెరువు కింద 490 ఎకరాల ఆయకట్టు ఉంది. 11 అడుగుల వరకు వరద వస్తేనే చెరువు మత్తడి పోస్తుంది. 8 అడుగుల వరకు నీరు ఉంటే పంటలు పండుతాయి. అయితే ఇప్పటివరకు ఆ చెరువులో నాలుగడుగుల వరకే నీరు చేరింది. దీంతో నాట్లు వేసిన 450 ఎకరాలకు ఇప్పుడు నీటి సమస్య వచ్చిపడింది. అయితే పాకాల వాగుపై ఉన్న లిఫ్టును నిరంతరాయంగా నడిపిస్తే 200 ఎకరాల వరకు వరి పంట కాపాడుకోవచ్చని రైతులు చెబుతున్నారు. నీరు విడుదల చేస్తే కొన్ని తడులతోనైనా వరికి జీవం పోయవచ్చని, మళ్లీ వర్షాలు కురిస్తేనే పంట పూర్తిగా పండుతుందని రైతులు చెబుతున్నారు.

నీరు అందకపోతే పంట చేతికి రాదు



చెరువులో ఉన్న నీటిని దఫాలుగా విడుదల చేసి పంటలకు జీవం పోయాలి. దేవుడి దయ వల్ల వర్షం కురిస్తే ఇబ్బందులు ఉండవు. పంట ఎండిపోయిన తర్వాత వర్షాలు పడితే..అప్పుడు నీటిని విడుదల చేస్తామంటే కుదరదు. అధికారులు ఆలోచన చేసి నీటిని విడుదల చేసి పంటలను కాపాడాలి.

– హంస వీరస్వామి, రైతు

కాలేజీల్లో డ్రగ్స్ కట్టడికి క్లబ్‌లు

- ఫిర్యాదుకు త్వరలో 24/7 టోల్‌ఫ్రీ నంబర్
- ర్యాగింగ్ నియంత్రణకు కూడా..
- ఉన్నత విద్యామండలి సరికొత్త ప్రయోగం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని విద్యాసంస్థల్లో ర్యాగింగ్ రక్కసిని అరికట్టడం, డ్రగ్స్ ముప్పును నివారించేందుకు తెలంగాణ ఉన్నత విద్యామండలి సరికొత్త ప్రయోగానికి శ్రీకారం చుట్టనుంది. ఈ రెండు సమస్యలను పరిష్కరించేందుకు 24/7 పనిచేసే టోల్‌ఫ్రీ నంబర్‌ను అందుబాటులోకి తేనుంది. వారం పది రోజుల్లో ఈ టోల్‌ఫ్రీ నంబర్‌ను అందుబాటులోకి తెస్తామని విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం శనివారం ప్రకటించారు. ఎక్కడ ఇలాంటి తప్పులు జరిగినా విద్యార్థులు నిర్భయంగా ఈ నంబర్‌కు ఫిర్యాదు చేయొచ్చన్నారు. తెలంగాణ ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో శనివారం మాసాబ్‌ట్యాంక్‌లోని జేఎన్‌ఏఎఫ్‌ఏయూ ఆడిటోరియంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రగ్స్ వినియోగం వారి వారి జీవితాలతోపాటు దేశాన్ని సైతం నాశనం చేస్తుందన్నారు. పాఠశాల స్థాయిలో డ్రగ్స్‌ను అరికట్టేందుకు ప్రహరీ క్లబ్‌లను ఏర్పాటుచేశామని, కాలేజీల్లో సైతం ఇలాంటి క్లబ్‌లను ఏర్పాటు చేస్తామని చెప్పారు.

పటిష్టమైన వ్యవస్థ: డీజీపీ జితేందర్

తెలంగాణను డ్రగ్‌ఫ్రీ రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు పటిష్టమైన వ్యవస్థను ఏర్పాటు చేశామని డీజీపీ డాక్టర్ జితేందర్ అన్నారు. రాష్ట్రంలో ర్యాగింగ్‌ను ఇప్పటికే నిషేధించామని, ర్యాగింగ్‌కు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి మాట్లాడుతూ.. విద్యార్థుల్లో నైపుణ్యాలు తగ్గుతున్నాయని అన్నారు. దీనికి పరిష్కారంగానే ప్రభుత్వం స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటుచేసి, స్కిల్స్ కోర్సులను ప్రవేశపెట్టిందని గుర్తుచేశారు. నగరాల్లోని వర్సిటీలు, కాలేజీలే కాకుండా మారుమూల ప్రాంతాల్లోని చిన్న కాలేజీల వరకు డ్రగ్స్ చేరాయంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చని చెప్పారు. డ్రగ్స్‌తో కుటుంబాలు సైతం ఆర్థికంగా చితికిపోతున్నాయని పేర్కొన్నారు. కళాశాల, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన మాట్లాడుతూ.. యాంటీనార్కోటిక్స్ బ్యూరో తెలంగాణలో తప్ప దేశంలో మరెక్కడా లేదన్నారు. మన యువతను నాశనం చేయాలని కొంతమంది దుష్టులు కంకణం కట్టుకున్నారని, డ్రగ్స్ అనే యాసిడ్‌ను పిల్లలపై ప్రయోగిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. యాంటీనార్కోటిక్స్ బ్యూరో డైరెక్టర్ సందీప్ శాండిల్య మాట్లాడుతూ డ్రగ్స్ సంబంధిత సమాచారాన్ని 87126 71111 నంబర్‌కు ఫిర్యాదు చేయొచ్చన్నారు. ర్యాగింగ్‌కు సంబంధించి ఇటీవల ఉస్మానియా ఆసుపత్రిలో ఆరుగురు వైద్యులపై కేసులు నమోదు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి, ఉన్నత విద్యామండలి వైస్‌చైర్మన్లు ప్రొఫెసర్ వెంకటరమణ, ప్రొఫెసర్ ఎస్‌కే మహమూద్, కార్యదర్శి శ్రీరాం వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

నేనూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థినే: డీజీపీ

సాక్షి హైదరాబాద్: విద్య అనేది జీవితాల్లో వెలుగు నింపుతుందని డీజీపీ జితేందర్ అన్నారు. గురుకుల విద్యాలయాల్లో ప్రవేశం పొందిన 68 మంది నిరుపేద విద్యార్థులు, వారి తల్లులను డీజీపీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డీజీపీ జితేందర్ సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తాను కూడా ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థిగా తన అనుభవాలను గుర్తు చేసుకున్నారు. నిరుపేద పిల్లల జీవితాల్లో మెరుగుదల కోసం కృషి చేస్తున్న అక్షయవిద్య సంస్థను డీజీపీ ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఐఏఎస్, ఫౌండేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ సంస్థ స్థాపకుడు డాక్టర్ జయప్రకాశ్ నారాయణ్, అక్షయవిద్య ఫౌండేషన్ స్థాపకుడు వరప్రసాద్, అక్షయవిద్య ఫౌండేషన్ సలహాదారు, ఐజీ ఎం.రమేశ్ పాల్గొన్నారు.



సదస్సులో పాల్గొన్న డీజీపీ జితేందర్, జయప్రకాశ్ తదితరులు

వానాకాలంలోనూ ఎండాకాలం కష్టాలు



నాగినేనిపల్లిలో నీళ్ల ట్యాంకర్‌తో వరి చేనుకు నీరు పెడుతున్న రైతు

బొమ్మలరామారం: యాదాద్రి భువనగిరి జిల్లాలో సరైన వర్షాలు లేకపోవడంతో భూగర్భజలాలు అడుగంటాయి. మూసీ పరీవాహకంలో మినహా.. మిగతా చోట్ల చెరువులు, కుంటల్లోనూ చుక్క నీరు లేదు. దీంతో బొమ్మలరామారం మండలం నాగినేనిపల్లి, మైసిరెడ్డిపల్లి గ్రామ శివారులో పలువురు రైతులు ఎండిపోతున్న వరిచేలను కాపాడుకునేందుకు నీళ్ల ట్యాంకర్‌లతో నీరందిస్తున్నారు. చాలామంది రైతులు వర్షాలు పడతాయని నార్లు సిద్ధం చేసుకున్నా.. అదును దాటుతుండడంతో ఆశలు వదులుకొని పశువులకు మేతగా వేస్తున్నారు.

కక్షలెందుకు తమ్ముడూ.. కలిసి ఉందాం ఎప్పుడూ..



పోలీస్‌స్టేషన్‌లో తమ్ముడికి రాఖీ కడుతున్న అక్క కోటమ్మ

ఖిలా వరంగల్: ఇంటిస్థలం విషయమై అక్కాతమ్ముడి మధ్య తలెత్తిన వివాదానికి పోలీసులు ప్రేమపూర్వక పరిష్కారం చూపించారు. తమ్ముడికి అక్కతో రాఖీ కట్టించి ఇద్దరినీ ఏకం చేశారు. ఉర్సు కరీమాబాద్ కోయవాడకు చెందిన పస్తం కోటమ్మ, ఆమె తమ్ముడు కొత్తూరు ఏడుకొండలు మధ్య వారసత్వ ఇంటిస్థలంకోసం గొడవ జరుగుతోంది. చివరికి కోటమ్మ.. తమ్ముడిపై మిల్స్‌కాలనీ పీఎస్‌లో శనివారం ఫిర్యాదు చేసింది. దీంతో ఎస్‌ఐ సురేశ్ అక్కాతమ్ముడిని స్టేషన్‌కు పిలిపించారు. వారసత్వ ఇంటిస్థలం, తోబుట్టువుల అనుబంధంపై అవగాహన కల్పించి.. స్థల వివాదాన్ని పరిష్కరించారు. అనంతరం అక్కతో తమ్ముడికి రాఖీ కట్టించారు. సుహృద్భావ పరిష్కారానికి కృషి చేసిన ఎస్‌ఐ సురేశ్‌ను ఇన్‌స్పెక్టర్ మల్లయ్య అభినందించారు.

ట్రేడింగ్‌లో పెట్టుబడి రూ. 5.4 కోట్లు..

లాభం రూ. 15.58 కోట్లు



- విత్ డ్రాకు అవకాశం లేకపోవడంతో మోసపోయానని గుర్తించిన బాధితుడు
- ఇద్దరు కీలక నిందితులను విజయవాడలో అరెస్టు చేసిన టీజీ సీఎస్‌బీ అధికారులు

సాక్షి, హైదరాబాద్: ట్రేడింగ్‌లో పెట్టుబడులతో అధిక లాభాలంటూ ఆశ చూపించి ఒకరి నుంచి రూ.5.4 కోట్లు కొల్లగొట్టిన ఇద్దరిని విజయవాడలో టీజీ సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు అరెస్టు చేశారు. ఆ వివరాలను టీజీ సీఎస్‌బీ డైరెక్టర్ శిఖాగోయల్ శనివారం మీడియాకు తెలిపారు. హైదరాబాద్ చిక్కడపల్లికి చెందిన ఓ వ్యక్తి వాట్సాప్‌నకు సైబర్ నేరగాళ్లు జూన్ 8న ఇన్వెస్టిమెంట్ లింకు పంపారు. దీంతో లింక్ ఓపెన్ చేసి ఆ వ్యక్తి గ్రూపులో చేరాడు. 'బీ6/ స్టాక్ విజనరీస్' పేరుతో ఉన్న గ్రూప్‌లో లైదియశర్మ గోల్డ్‌మెన్ స్కీం గురించి వివరించింది. త్వరలో రాబోతున్న మరిన్ని ఐపీఓల గురించి తెలుసుకొని ట్రేడింగ్‌లో పెట్టుబడులు పెట్టి లాభాలు ఆర్జించాలంటే రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించింది. పాన్‌కార్డు, ఆధార్‌కార్డుతోపాటు ఇతర వివరాలతో ఆమె చెప్పిన వెబ్‌సైట్‌లో లాగిన్ అయ్యాడు. ఆపై ట్రేడింగ్ మొదలుపెట్టాడు. ప్రముఖ సంస్థలకు సంబంధించిన ట్రేడింగ్ ఆప్షన్స్ వెబ్‌సైట్‌లో పొందుపర్చగా, బాధితుడు సులువుగా నమ్మాడు. జూలై 10 నుంచి పలు దఫాలుగా నెలరోజుల్లోనే రూ.5.4 కోట్లు పెట్టుబడిగా పెట్టాడు. ఇలా వెబ్‌సైట్‌లో బాధితుడికి రూ.15.58 కోట్లు లాభం వచ్చినట్టు చూపించింది. దీంతో ఆ అమౌంట్ విత్ డ్రా చేసుకునేందుకు ప్రయత్నించగా వీలు కాలేదు. విత్‌డ్రా సదుపాయం కల్పించాలంటే మరికొంత చెల్లించాలని సైబర్ నేరగాళ్లు బాధితుడ్ని డిమాండ్ చేశారు. దీంతో తాను మోసపోయానని గుర్తించిన బాధితుడు సైబర్ సెక్యూరిటీ బ్యూరోలోని సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు ముమ్మరం చేసిన సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు రాంపల్లి కొండల్‌రావు, అతని సోదరుడు చంద్రశేఖర్‌ఆజాద్‌లను విజయవాడలో అరెస్ట్ చేశారు. వీరిద్దరూ రిక్కి సాఫ్ట్‌వేర్ టెక్ ప్రైవేట్ లిమిటెడ్‌కు డైరెక్టర్లుగా కొనసాగుతున్నారు. నిందితులు ఈ తరహా మోసాలకు ఉపయోగించిన బ్యాంకు ఖాతాలపై దేశవ్యాప్తంగా 26 ఫిర్యాదులు ఉన్నట్టు ప్రాథమిక విచారణలో వెల్లడైంది. సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని శిఖాగోయల్ ప్రజలకు సూచించారు.

పంటలకు 'రక్షణ' కవచం

సోలార్‌తో సెన్సర్ విధానం ద్వారా పనిచేసే పరికరాన్ని సృష్టించిన యువరైతు ప్రవీణ్

చౌటుప్పల్: పంటను కాపాడుకునేందుకు యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ తాళ్లసింగారానికి చెందిన తోటకూర ప్రవీణ్‌యాదవ్ ఓ పరికరాన్ని సృష్టించాడు. దానికి రైతుభరోసా సెక్యూరిటీ (ఆర్‌బీఎస్)గా నామకరణం చేశాడు. కేవలం రూ.10 వేల ఖర్చుతో దీనిని రూపొందించి ఈనెల 15న భువనగిరిలో జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో ప్రదర్శించాడు. ప్రవీణ్ ప్రయోగాన్ని మెచ్చిన అధికారులు అతనికి సర్టిఫికెట్ అందజేశారు. గతంలోనూ ఐదు రకాల పరికరాలు రూపొందించాడు.

పరికరం తయారీ ఇలా..

ఆర్‌బీఎస్ పరికరాన్ని అందరికీ అందుబాటులో ఉండే సామగ్రితోనే తయారు చేశాడు. 12 వాల్ట్ సోలార్ ప్యానెల్, 12 వాల్ట్ బ్యాటరీ, సిమ్ కలిగిన సాధారణ సెల్‌ఫోన్, రెండు చిన్నసైజు అద్దాలు (మొహం చూసుకునేవి), లేజర్‌లెన్స్ సెన్సర్లు ఏర్పాటు చేయడానికి రెండురాడ్లు, సౌండ్ చేసేందుకు అలారం బాక్స్ ఉంటుంది. ఇది పూర్తిగా సోలార్‌తో పనిచేస్తుంది. అందులో వినియోగించే సెల్‌ఫోన్ సైతం ఆటోమెటిక్‌గా సోలార్‌తోనే చార్జింగ్ అవుతుంది. ఇందులోని సెల్‌ఫోన్‌కు ముందుగానే సంబంధిత వ్యక్తుల సెల్‌ఫోన్ నంబర్లు ఫీడ్ చేయాల్సి ఉంటుంది. పరికరం ఏర్పాటు చేసిన పరిసర ప్రాంతాల్లోకి ఒకవేళ జంతువులు, పశువులు వస్తే సెన్సర్లు (ముందుగా పెట్టుకున్న మ్యూజిక్‌తో) సౌండ్ చేస్తాయి. వెంటనే ఆయా నంబర్లకు ఆటోమెటిక్‌గా కాల్ వెళుతుంది. ఈ పరికరం కేవలం రాత్రి సమయంలో (సూర్యాస్తమయం నుంచి సూర్యోదయం వరకు) పనిచేస్తుంది. పరికరం ఏదేని కారణంతో పనిచేయకపోయినా ముందస్తుగానే సెల్‌ఫోన్‌కు మెసేజ్ వస్తుంది. దీంతో వెంటనే మరమ్మతులు చేసి తిరిగి ఉపయోగించవచ్చు. ఆర్‌బీఎస్ పరికరం ఎటూ కిలో మీటర్ దూరం వరకు పనిచేస్తుంది. పంటలు, పౌల్ట్రీ, మేకలు, గొర్రెల మందలకు రక్షణ కల్పించడంతోపాటు ఇళ్లు, ఆలయాల్లో చోరీలను నివారించేందుకు కూడా ఈ పరికరం దోహదం చేస్తుందని ప్రవీణ్ చెప్పాడు.



పౌల్ట్రీఫాం వద్ద ఏర్పాటు చేసిన ఆర్బీఎస్ పరికరం

బైక్‌పై వచ్చి ... క్యాష్ బ్యాగ్ ఎత్తుకెళ్లారు

- టిఫిన్ చేసేందుకు కారును పార్క్ చేసి వెళ్లిన బాధితులు
- రూ.28 లక్షల నగదు బ్యాగ్‌ను కారులోనే ఉంచిన వైనం.. బైక్‌పై వచ్చి బ్యాగ్ ఎత్తుకెళ్లిపోయిన ఆగంతకులు
- మంచిర్యాల జిల్లాలో ఘటన

బెల్లంపల్లి: మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో గుర్తు తెలియని వ్యక్తులు సినీ ఫక్కీలో శనివారం పట్టపగలు చోరీకి పాల్పడ్డారు. పార్కింగ్ చేసి ఉన్న కారులో నుంచి రూ.28లక్షల నగదు ఉన్న బ్యాగ్‌ను ఎత్తుకెళ్లిపోయారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. హైదరాబాద్ తనిష్క్ ఫైవుడ్ కంపెనీలో మార్కెటింగ్, కలెక్షన్ బాయ్‌లుగా పనిచేసే గిరిధర్, లింగరాజు శుక్రవారం కలెక్షన్ కోసం బయల్దేరారు. కోరుట్ల, మెట్‌పల్లి, జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి, గోదావరిఖని, మంచిర్యాలలో డబ్బులు కలెక్షన్ చేసుకుని శనివారం ఉదయం బెల్లంపల్లికి వచ్చారు. పాతబస్టాండ్ ఏరియాలో కారు పార్కింగ్ చేసి వీరిద్దరూ ఓ టిఫిన్ సెంటర్ వద్దకు వెళ్లి అల్పాహారం తీసుకుంటున్నారు. అదేసమయంలో ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు కారు వద్దకు వెళ్లి నగదు ఉన్న బ్యాగ్‌ను దొంగిలించి బైక్‌పై ఉడాయించారు. గిరిధర్, లింగరాజు టిఫిన్ చేసి కారు వద్దకు వచ్చి చూసేసరికి బ్యాగ్ కనిపించలేదు. దీంతో వీరిద్దరూ మంచిర్యాల పోలీసులకు సమాచారం అందించగా...డీసీపీ భాస్కర్, ఏసీపీ రవికుమార్, వన్‌టౌన్ ఎస్‌హెచ్‌ఓ దేవయ్యలతో కలసి ఘటనాస్థలిని పరిశీలించారు. బాధితుల నుంచి వివరాలు సేకరించారు. సీసీ కెమెరాలను పరిశీలించిన పోలీసులు ఆగంతకులు బ్యాగుతో బైక్‌పై వెళ్తున్న ఫుటేజీని గుర్తించారు. ఏసీపీ కార్యాలయం వద్ద కూడా నిందితుల బైక్ సీసీ కెమెరాలో నమోదైంది. ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపి నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.



బైక్‌పై క్యాష్ బ్యాగ్‌తో వెళ్తున్న ఆగంతకులు

ఊడిన ఆర్టీసీ బస్సు టైర్లు

100 మంది ప్రయాణికులకు తప్పిన ముప్పు





ఊడిన టైర్లు

జగిత్యాల క్రైం: వందమందితో ప్రయాణిస్తున్న ఆర్టీసీ బస్సు వెనుక టైర్లు ఉన్నట్టుండీ ఊడిపోయిన సంఘటనలో ప్రయాణికులకు తృటిలో ప్రమాదం తప్పింది. జగిత్యాల జిల్లా రాయికల్ ప్రధాన రహదారిపై శనివారం జరిగిన ఈ సంఘటన వివరాలివి. సామర్థ్యానికి మించి ప్రయాణికులు బస్సు ఎక్కడంతో.. ఒకేసారి రెండు వెనుక టైర్లు ఊడిపోయాయి. నిర్మల్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు జగిత్యాల నుంచి ఖానాపూర్ వెళ్తోంది. సుమారు 100 మంది ప్రయాణికులున్న బస్సు జగిత్యాల రూరల్ మండలం చల్‌గల్–మోరపల్లి శివారు చేరగానే.. బస్సు వెనుక కుడివైపు రెండు టైర్లు ఊడిపోయాయి. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో పెను ప్రమాదం తప్పింది. ఒక్కసారిగా బస్సు కుదుపునకు గురికావడంతో ప్రయాణికులు భయభ్రాంతులయ్యారు. ఎవరికేమీ కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. మరో బస్సును రప్పించి ప్రయాణికులను అక్కడి నుంచి తరలించారు.

ఉసురు తీసిన కుటుంబ కలహాలు

- కూతురికి కేన్సర్.. చికిత్స విషయంలో భర్తతో గొడవలు
- మనస్తాపంతో ఇద్దరు పిల్లలతో కలిసి అదృశ్యమైన భార్య
- శామీర్‌పేట చెరువులో శవాలై తేలిన తల్లి కూతురు.. ఆచూకీ లభించని బాలుడు



కొడుకు, కూతురితో తల్లి భానుప్రియ (ఫైల్)

శామీర్‌పేట్: కన్న కూతురికి చికిత్స చేయించడంలో భర్త సహకరించకపోడవంతో ఓ తల్లి పిల్లలతో ఇంట్లో నుండి బయటకు వెళ్లి..చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్న హృదయ విదారక సంఘటన శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం సాయంత్రం వెలుగులోకి వచ్చింది. పోలీసులు, బాధిత కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం... సిద్దిపేట జిల్లా ములుగు మండల కేంద్రానికి చెందిన మర్కంటి స్వామి, భానుప్రియ దంపతులకు కుమారుడు వేదాన్ష్ (5), కూతురు దీక్షిత (4) ఉన్నారు. దీక్షితకు బోన్ కేన్సర్ సోకింది. చిన్నారికి చికిత్స చేయించే విషయంలో దంపతుల మధ్య గొడవలయ్యాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం భానుప్రియపై స్వామి చేయిచేసుకున్నాడు. దీంతో ఆమె పిల్లలను తీసుకుని ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. కాగా శనివారం సాయంత్రం శామీర్‌పేట పెద్ద చెరువులో రెండు మృతదేహాలు తేలి ఉండటాన్ని గమనించిన స్థానికులు శామీర్‌పేట పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు తల్లి, కూతురు మృతదేహాలను వెలికి తీశారు. వీరి ఆచూకీ తెలుసుకుని కుటుంబీకులకు తెలియజేశారు.

కాగా ఆత్మహత్య చేసుకున్న భానుప్రియతో పాటు బోన్‌కేన్సర్‌తో బాధపడుతున్న కూతురు దీక్షిత మృతదేహాలు మాత్రమే లభ్యమయ్యాయి. కుమారుడి ఆచూకీ లభ్యం కాలేదు. దీనిపై పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఆరోగ్యంగా ఉన్న కొడుకును తల్లి భానుప్రియ ఎక్కడైనా వదిలేసి ఉండొచ్చని బంధువులు అభిప్రాయపడుతున్నారు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G.,
Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.